# రామోపాఖ్యానము—తద్విమర్శనము.

(ఎఱ్ఱాప్రగ్గడ రామోపాఖ్యాన సహితము.)

కర్త:

పెండ్యాల వేంకటసుబ్రహ్మణ్యశాస్త్రి.

పిఠాపురము.

[తూ॥ గోదావరి జిల్లా.]

శ్రీ విద్వజ్జన మనోరంజనీ ముద్రాక్షరశాలయందు

ముద్రింపఁబడియె.

పిఠాపురము.

సర్వసామ్య సంకలితము

1938

వెల: రు 1-4-0

# ఉపోద్ఘాతము.

—:o:—

మా తండ్రి, పినతండ్రి, మేనమామ పౌరాణికు లగుట చేతను, నాకుఁ జిన్నతనముననె యాంధ్రభారతాదులను జదువుట యలవడినది. యౌవనమున నేనును పౌరాణికుఁడను గానె కొంతకాలము జీవించితిని. పైకారణములచే నాంధ్రభారతమును బెక్కుసారు లావృత్తిఁ జేసితిని గాని, కవిత్రయముయొక్క భేదాభేదములు నా కంతగాఁ గాన్పింపలేదు. నన్నయ 'నల, దుష్యంత' చరిత్ర లెట్లు హృదయంగమములో, తిక్కన 'సంజయ, శ్రీకృష్ణ' రాయబారములు, ఎఱ్ఱన 'రామోపాఖ్యాన, సావిత్రి' చరిత్రలును నట్లే హృదయంగమము లగుచుండెడివి.

ఇటీవల, పెక్కండ్రు విమర్శకులు బయలువెడలి నన్నయాదుల కవిత్వమును విమర్శించుచుండుటచే, విమర్శనదృష్టితో భారతమును నేఁ జదివి నాకు గల యభిప్రాయములను గ్రంథరూపకముగా వ్రాయఁగలిగితిని. ఈరామోపాఖ్యానమున, 'ఎఱ్ఱనామాత్యుఁడు కావ్యకలను బోషించి రచించుట నింతకుఁబూర్వము మూఁడేండ్లనాఁడె సంస్కృతభారతములోని రామోపాఖ్యానముతో నాంధ్రభారతమునఁ గల రామోపాఖ్యానముఁ జదువఁగా గోచరించినది. దాని నప్పుడె సవిమర్శకముగాఁ బ్రకటింపఁ దలఁచి, ఆంధ్రభారతమునఁ గల యాభాగము వేఱుగ ముద్రిం

పించియు, కార్యాంతరమగ్నుఁడ నగుటచే విమర్శనమును వ్రాయలేకుంటిని.

తొలుత నీ విమర్శనము నలువది యేఁబదిపుటలలోఁ బూర్తియగు ననుకొంటిని గాని, వ్రాయ నారంభింప, నది నూట నలువదిపుటలకు మించినది. ఇంకను దృప్తి కలుగలేదు. ఎన్నియో యంశములను విమర్శింపవలసియున్నది. ఒక్కదానిఁ జూడుఁడు.

నన్నయకథను జరుపుటయే ప్రధానముగాఁ బెట్టుకొని కావ్యత్వము నంతగాఁ బరిగణింపలేదని కొంద అందురు. కాని, యది సరికాదు. మూలభారతగాథానుక్రమణిక, సంస్కృతభారతమున, నలువదొక్కటవ (61) యధ్యాయమునఁ జెప్పఁబడెను. దానికి నన్నయ, ఆదిపర్వము మూఁడవయాశ్వాసమున 'పాండవధార్తరాష్ట్ర విభేదకారణము' గాఁ జెప్పియున్నాఁడు. అందు, సభాపర్వాంతమువఱకుఁ గల గాథలు, తు. చ. తప్పకుండఁగఁ జెప్పఁ దగినవిగా నుండును. పిమ్మటి పదునాఱుపర్వములలోని గాథలు నంతముఖ్యములుగాఁ గాన్పింపవు. అందువలననె నన్నయ యవసరముగు కథను నడపుచు సమయము వచ్చినపుడు మూలములోని యనవసరపువర్ణనములను వదలి స్వేచ్ఛగ, కావ్యత్వమును దనయాంధ్రీకరణమునఁ జూపించి యున్నాఁడు. ఎట్టిన తిక్కనల కట్టి కథల యాతంకములేదు. కథను నామమాత్రముగ నుంచి కొని కావ్యత్వనిరూపణముకై స్వేచ్ఛగ వ్రాయ వీలు కలిగెను. ఇందు నన్నయ లోప మేమి?

తిక్కనన్నాక్షేపించు వారాతఁడు విదురనీత్యాదులలో మూలమునందలి దానికి భిన్నముగ సంస్కృతము రాక తెనిఁగించుటలోఁ దప్పులువ్రాసె నందురు. తిక్కనయే కాఁడు, నన్నయ, యెఱ్ఱనలును, మూలము ననుసరించియే యాంధ్రీకరింప లేదు. ప్రధానాంశము పోకుండఁగ, దేశకాల పరిస్థితులకుఁ దగినయంశములనె యాంధ్రీకరించిరి.

వాఙ్మయసృష్టిలో ముగ్గురుకవులు, మూర్తిత్రయమునఁ దగియున్నారు.

—♦ స్వవిషయము ♦—

నా కలువదేండ్లు పూర్తి యగునాఁటికి నేత్రరోగినైనను నాకు గ్రంథమును వ్రాయుశక్తిఁ బ్రసాదించిన పరమేశ్వరునకు వందనశతములఁ జేయుచున్నాను. నా గ్రంథముద్రణమున, పూఫ్రుపులతప్పులు దిద్ది తోడ్పడిన మిత్రులగు బ్ర. శ్రీ. శతావధాని ఓలేటి వేంకటరామశాస్త్రి గారికిఁ గృతజ్ఞుఁడను.

ఇట్లు,

గ్రంథకర్త.

# విషయానుక్రమణిక.

—:♦:—


| అంశము. | పుట. |
|---|---|
| రామోపాఖ్యానము తద్విమర్శనము. | 1 |
| రామోపాఖ్యానాంధ్రకరణము | 30 |
| ఆంధ్రులు_వారిభాష | 51 |
| మాధవవర్మ, ఇంద్రవర్మాదుల శాసనములు | 64 |
| నన్నయభట్టుమహాకవి | 82 |
| తిక్కనసోమయాజి | 96 |
| తిక్కనమహాకవి కవిత్వము | 108 |
| ఎఱ్ఱాప్రగ్గడకవిత | 122 |
| నేమాని భైరవావధాని హరివంశము. | 141 |

ఓమ్ !

# రామోపాఖ్యానము — తద్విమర్శనము.

——— :o: ———

ఇంపును సొంపును గుల్కుచు నీతియుక్తమై పవిత్రమై రసవంతమై యొప్పు భారతీయులగాథలలో రామాయణ మహాభారతగాథలే యగ్రగణ్యములైనవి. అవి మతోద్బోధకములు గూడ నై యుండుట మఱియొక విశేషము.

అందు రామునిగాథలు బహుభంగుల నాబాలవృద్ధవిదితములై యుండుటచేతను, రాముని వేత్తలు పరతత్త్వముగా భావించుటచేతను, ఆసేతుహిమాచలవ్యాపకములై కందరముల, మందిరముల, గహనసీమలఁ, బర్వతదేశములఁ గూడ యోగులచేతను, భోగులచేతను, రోగులచేతను, బాలురచేతను, పెద్దలచేతను, స్త్రీలచేతను, బహువిధముల గానము చేయఁబడుచున్నవి.

భరతఖండమునందలి మూలమూలల నున్న పల్లెలకుఁ బోయినను నేదియో యొకవిధమగు రామాలయము సామాన్యముగ నుండకపోదు.

మహంమదీయమతస్థుఁడై యోగి యగు కబీరుదాసు కూడ రాముని బరమేశ్వరునిగాఁ బొగడెననుటలోన రామచరిత్రమున విశేషము కలదని తెలంపవలసి యున్నది. వాల్మీకి రామాయణమును, పాశ్చాత్యులును దమభాషలోని కనువదించుటచేఁ

పాశ్చాత్యలోకమునకును నా శుభచరితము వెల్లడియైనది. అందు వలన శ్రీరామచరిత్ర జగద్విఖ్యాతమనుట స్పష్టము.

కాని, ఈకాలము పరిశోధనాకాలమగుటచే శ్రీరాముని యొక్క చరిత్రమును, కొంత పరిశోధింపఁదగి యున్నది.

శ్రీరాముని చరిత్రలోఁ గూడ నాతని ప్రత్యర్థియగు దశవదనుఁ డనఁబడు రావణుని చరిత్రమును బరిశోధింపవలసి యున్నది.

రామరావణుల యస్తిత్వము కల్పితము కాక సత్యమే యనుటకు 'ఋగ్వేదము'నని క్రిందిరీతిని సూచింపఁబడియుండెను.

* "ఏదేవతలైదువందల రథముల నశ్వములతోఁ గూర్చికొని, మాయందుఁ బ్రేమకలవారై యజ్ఞమార్గముచే వచ్చుచున్నారో, ఆస్తోత్రము 'పృథవానునియందును, వేనుని యందును, అసురుఁడు బలవంతుఁడగుచుండఁగా రామునియం దును, ధనవంతులయందును' చెప్పుచున్నాము."

ఇట 'అసురుఁడు బలవంతుఁడగుచుండఁగా రాముని యందు' అనుటచే రాముఁడును నాతని విరోధియగు రావణుఁ డును ద్యోతకమగుచున్నారు.

---

* ప్రతద్దుశ్శీమే పృథవానే వేనే ప్రరామే వోచ
మసురే మఘవత్సు యే యుక్త్వాయ పంచశతాస్మయు
పథా విశ్రావ్యేషాం॥ ఋగ్వేద. 10-93-14.

సంస్కృతవాఙ్మయమునకు వాల్మీకియె ప్రథమకవి యనియు, రామాయణమె ప్రథమకావ్యమనియుఁ బండితుల యభిప్రాయము. అయినను దృశ్యమానరామాయణ మంతయు వాల్మీకికృత మని చెప్ప వీలులేదు. అందిటీవలఁ బెక్కులు నవీనాంశములు చేర్పఁబడినవి. 'బౌద్ధ జైన' వాది మతములు విజృంభించు కాలమున నానా మతోన్మత్తులగు పండితులు తత్పూర్వము నందుండిన విశేషములగు గ్రంథములలోఁ దమతమ మతాంశములఁ జొప్పించి యవి ప్రాచీనతమములె యని లోకము తెలఁచునట్లు చేసిరి. వేయునేల? ప్రత్యేకగ్రంథములనే వ్రాసి యవి వ్యాసాది మహర్షి ప్రోక్తములె యనిపించిరి.

దృశ్యమానములగు 'శివ, లింగ, భవిష్యోత్తర, మార్కండేయోత్తర' పురాణాదులు ప్రతిని గల్పింపఁబడినవియే.

'శివ, లింగ' పురాణములను, ప్రసిద్ధికెక్కిన భోజమహారాజు (క్రీ.శ 1050) కాలమున నిరువురు పండితులు రచించి యవి వ్యాసప్రోక్తము లని వ్రాయ నామహారాజు పండితులను శిక్షించె నని యాతని దినచర్య పుస్తకము చెప్పుచున్నది. * ఆదినచర్య పుస్తకము గ్వాలియర్ మహారాజుగారి పుస్తకాగారమున నిక్షిప్తమై యున్నది. అట్లు రామాయణములోఁ బ్రక్షిప్తములు

* చూ॥ సత్యార్థప్రకాశిక. పెందముద్రణము.

కొన్ని కలవు. అవి పరిశోధనావిశేషములచేఁ దెలిసికొన వీలగుచున్నవి.

ప్రస్తుత పరిస్థితియం దున్న వాల్మీకిరామాయణమున బౌద్ధాది విమతస్థ ధర్మములును, రామాయణకాలమున లేని కొన్ని దేశవర్ణనాదికములును, నిమడ్పఁబడి యుండుటచే దృశ్యమానరూపముగల వాల్మీకిరామాయణము క్రైస్తవశకారంభముననె సమగ్రరూపము నొందినదని కొందఱు తలంచుచున్నారు. పిమ్మటను, మఱికొన్ని మార్పులుం జేయఁబడెను.

భవభూతికాలమునకు రామాయణమున సర్గములకు మాఱుగ 'అధ్యాయము'తో యుండిన ట్లాతని యుత్తరరామచరిత్రలోని క్రిందివాక్యములవలనఁ దెలియనగుచుండుట యిందులకు నొక చిన్న నిదర్శనము.

ఈక్రింది సంభాషణవాక్యములు, అశ్వమేధాశ్వమును 'లవుఁడు' బంధింప నపుట 'లవ, చంద్రకేతువు' లకు యుద్ధము జరుగుసమయమున 'కుశ, శ్రీరాము' లేతేర లవకుశులకును, శ్రీరామునకును జరిగిన సంభాషణములోనివి.

రాముఁడు:—వత్సలారా! పూజ్యుఁడగు వాల్మీకి మహర్షియొక్క వాఙ్నిస్సృతి యైనట్టిదియు, ప్రసిద్ధమగు సూర్య

రామః—వత్సౌ! రామాయణ మితి శ్రూయతే. భగవతో వాల్మీకేస్సరస్వతీనిష్యందః ప్రశస్తిరాదిత్యవంశస్య తత్ర కించి త్కౌతూహలేన శ్రోతు మిచ్ఛామి.

వంశప్రశస్తియుఁ గల 'రామాయణ' మనునది మీనుండి వినఁ బడుచున్నది. దానిని గొంచెము వినఁ గుతూహలపడుచున్నాను.

కుశుఁడు:— సంపూర్ణముగానే మాచే రామాయణ మావృత్తి చేయఁబడెను. ఇపుడు జ్ఞాపకమునందున్న యీ రెండు శ్లోకములును 'బాలచరితము (బాలకాండము) యొక్క అంత్యమగు నధ్యాయమునందలి శ్లోకములు—

కుశుఁడు పఠించితినని చదివిన రెండు శ్లోకములలో నొక శ్లోకము సంపూర్ణముగా నిపుడు ముద్రితమగు వాల్మీకిరామాయణములోని బాలకాండముయొక్క డెబ్బదవసర్గమునఁ గలదు. ఇపుడు రామాయణమునం దధ్యాయసంజ్ఞ లేదు. సర్గసంజ్ఞ కలదు. ఇది భవభూతికిఁ బిమ్మట నితిహాసమైన రామాయణమును 'కావ్యము'గా మార్పఁదలఁచి కొందఱు ప్రముఖు లట్లు చేసియుందురు.

దృశ్యమానమహాభారతముయొక్క సంపూర్ణస్వరూపము మాత్రము (లక్షశ్లోకపరిమితి) క్రీస్తుశకమునకుఁ బూర్వమైదువందల (500) సంవత్సరములనాఁడె యేర్పడెనని 'లోకమాన్య బాలగంగాధరతిలకు' మొదలగు పండితులు నిదర్శనములతో వ్రాసియున్నారు. అయినను నందును నిటీవలఁ గొన్ని

---

కుశః— సకృత్స్న ఏవ సందర్భో౽స్మాభిరావృత్తః స్మృత్యుపస్థితౌ తావిదమౌ బాలచరితస్యాంత్యే౽ధ్యాయే శ్లోకౌ.

యంశములు లుప్తములై కొన్ని నవీనముగఁ జేర్పఁబడియున్నవి.*

రామాయణకథ మహాభారతములోని 'వన'పర్వమునఁ బ్రాచీనకాలముననె చేర్పఁబడియున్నది. ఆది భారతమును బంచమవేదముగా మార్పఁదలఁచిన 'సౌతి' వేదాంతర్గతములైన యితిహాసములవలె 'సుపర్ణ, యయాతి, దుష్యంత, నలా' ద్యుపాఖ్యానములతోఁగూడఁ బుణ్యచరితమగు రామోపాఖ్యానమును జేర్చియుండెను. ఆరామోపాఖ్యానము సౌతికాలమున నెట్లు లోకమునఁ బ్రచారమై యుండెనో యట్లే యాతనిచే మహాభారతమున వనపర్వాంతర్గతమై పదునెనిమిది (18) అధ్యాయములు, ఏడువందలయిరువదిమూఁడు (723) శ్లోకములు కలదిగాఁ గూర్పఁబడెను. ఆగాథ వాల్మీకిరామాయణమునకును, తెనుఁగున రచింపఁబడిన 'భాస్కర, రంగనాథ' రామాయణముల గాథలకును గొన్నియెడల భిన్నరీతుల నున్నది.♦

సంస్కృతభారతము నాంధ్రీకరించిన కవిత్రయములో నొకఁడును, ప్రబంధ పరమేశ్వర బిరుదాంచితుఁడు నగు

---

* మహాభారతములోని ప్రక్షిప్తములఁ గూర్చి నామహాభారతచరిత్రము (ద్వితీయముద్రణము), రాజసూయరహస్యము, అనుగ్రంథములలో విమర్శించి యున్నాను.

♦ 'భాస్కర, రంగనాథ' కవులు తెనుఁగుదేశమునఁ దమకాలమున వాడుకలోనుండిన గాథలఁగూడఁ దమతమగ్రంథములలోఁ జేర్చిరి.

ఎఱ్ఱాప్రగ్గడమహాకవి మూలగాథను దప్పక యాంధ్రీకరించుచు, రామాయణము మహాకావ్య మనుమాటను సార్థకపఱచుటకో యనునట్లు తనప్రబంధనిర్మాణచాతురిని సొంపుగ నాగాథలోఁ జొప్పించుచు సంస్కృతమున నేడువందలయిరువదియేడు (727) శ్లోకసంఖ్య కలదాని నింపుగ మూఁడువందలపదునాఱు (316) పద్యగద్యములుగా రచించియున్నాఁడు.

ఆ వనపర్వాంతర్గత 'రామాయణగాథ' లను, తొలుత వ్రాసి పిమ్మటఁ బ్రబంధపరమేశ్వరుని కవిత్వవిశేషములను వివరింతును.

## రామోపాఖ్యానము.

ఇక్ష్వాకువంశమునం బుట్టిన 'అజమహారాజు' నకు దశరథుఁడు జన్మించి 'కౌసల్యా, కైకేయీ, సుమిత్ర'లను ముప్వురు వనితలఁ బెండ్లియాడెను. వారిలో, కౌసల్యకు శ్రీరాముఁడు, కైకేయికి భరతుఁడు, సుమిత్రకు లక్ష్మణశత్రుఘ్నులు, జన్మించిరి. అందు రామునకు విదేహరాజతనయ యగుసీత భార్య యయ్యె.

## రావణుని చరిత్రము.

బ్రహ్మకు 'పులస్త్యుఁడు' పుట్టెను. ఆపులస్త్యునకు వైశ్రవణుఁడు పుట్టి పెరిగి తండ్రియగు పులస్త్యుని విడిచి తాతయగు బ్రహ్మఁగూర్చి తపస్సుఁ జేసి 'నలకూబరుఁ' డను పుత్రుని,

లోకపాలకత్వమును, లంకారాజ్యమును, ధనేశ్వరత్వమును, శివునితో సఖ్యమును, వరములుగాఁ బొందఁ జూచి, పులస్త్యుఁడలిగి, తనశరీరములో నర్ధభాగమును, విశ్రవసునిగాఁ జేసి, వైశ్రవణునకపకృతిఁ జేయుమని యాజ్ఞాపింప నావృత్తాంతమును వైశ్రవణుఁడు (కుబేరుఁడు) తెలిసికొని విశ్రవసుకడకు వచ్చి, నేను నీకుఁ బుత్రుఁడ నయ్యెద ననుగ్రహింపు మని యాతనిఁ బ్రసన్నుఁ జేసి, నృత్తగీతాదుల విశారదలగు 'పుష్పోత్కట, మాలిని, పాక' యను మువ్వురు రాక్షసస్త్రీలను విశ్రవసునకుఁ బరిచారికలనుగా నేర్పఱుప, వారలా విశ్రవసుఁ బరితృప్తుఁ జేయ నాతఁడు వారల ననుగ్రహించి పుత్రదానముఁ జేసెను. పుష్పోత్కటకు రావణ కుంభకర్ణులును, మాలినికి విభీషణుఁడును, పాకకు ఖర శూర్పణఖలును, బుట్టిరి.* అందు 'రావణ, కుంభకర్ణ

---

* రామాయణోత్తరకాండములోని గాథలకీ గాథలు వ్యతిరేకములు. అందు, పులస్త్యునకు విశ్రవసుఁడును, ఆతనికి భరద్వాజునిపుత్రికయగు 'దేవవర్ణిని' అనుభార్యయందు వైశ్రవణుఁడును (కుబేరుఁడు) పుట్టెనని గలదు 'సుమాలి' యనునసురునకు 'కైకసి, పుష్పోత్కట, పాక' యను కుమార్తెలు గలరు. ఆసుమాలి తనకుమార్తె యగు కైకసిని విశ్రవసుని వరింపుమని పంప నామె విశ్రవసు నాశ్రమముఁ జేరి యాతనికిఁ దనయభిమత మెఱిఁగింప నాతఁ డంగీకరించి పరిగ్రహింప నామె కావిశ్రవసువలన 'రావణ, కుంభకర్ణ, విభీషణు, లనియెడు మువ్వురుపుత్రులును 'శూర్పణఖ' యనుపుత్రికయుఁ గలిగినని కలదు.

'ఖరుఁడు' రావణుని పినతల్లి పుత్రుఁడని కలదు.

ఖరులును, శూర్పణఖయుఁ' గ్రూరులును, దుర్మార్గులు నైరి. 'విభీషణుఁడు' పుణ్యాత్ముఁడును, యోగ్యుఁడు నయ్యె.*

ఆరాక్షసకుమారులు తండ్రివలన వేదవేదాంగాది విద్యలు నేర్చి సుఖముగ నుండ నొకప్పుడు కుబేరుఁడు తండ్రియగు విశ్రవసునకు మ్రొక్క రాఁగా నాతని వైభవముఁ జూచి రావణుఁడు జాత మత్సరుఁడై కుబేరుని మహిమము తపోలబ్ధ మగుటఁ దెలిసికొని తానును దపంబు సేయ నారంభించెను.

వారిలో రావణ కుంభకర్ణులు తమోగుణప్రధానమగు తపస్సును, విభీషణుఁడు సాత్త్వికగుణప్రధానమగుతపస్సును జేసిరి. ఖరశూర్పణఖలు తపస్సుఁజేయు సోదరుల కుపచారములఁ జేయుచుండిరి.

వేయి సంవత్సరములు తపస్సుఁ జేసినపిమ్మట రావణుఁడు తనశిరస్సు నొకదానిని గోసి యగ్నిలో వేల్చెను. ఇట్లు తొమ్మిది తలలను వేయివత్సరముల కొకటిచొప్పున వేల్చి పదియవదానినిగూడఁ దెగవేసి హోమ మొనర్పఁదలఁచునంతలో బ్రహ్మ ప్రత్యక్షమై యాకర్మమునుండి వారించి యాతనిశిరము లెప్పటియట్లు కలుగ ననుగ్రహించి యాతనికోర్కెల నిచ్చెను. కుంభకర్ణుఁడు దేవోపహతుఁడై యత్యంతమగు నిద్రయే వరముగా నొందెను. విభీషణుఁడు తనమన స్సెప్పుడును ధర్మమునుండి తిరు

*'రావణ, కుంభకర్ణులు' దుష్టు లగుటకును, విభీషణుఁడు సత్త్వశాలి యగుటకును వేఱుకారణము లందు నిరూపింపఁబడి యున్నవి.

గఱుండునట్లును బ్రహ్మాస్త్రప్రాప్తి కలుగునట్లును వరముల నొందఁగోర, బ్రహ్మ మెచ్చి యాతనికి నమరత్వమునుగూడ నొసఁగెను.

ఇమ్మాట వరగర్వోన్నతుఁ డగురావణుఁడు సవతియన్న యగు కుబేరునిపై దండెత్తి లంకాపట్టణమును గ్రవసము చేసి కొనెను. అంతమాత్రమె కాక కుబేరు నవమానించి యాతని పుష్పకమును గూడ నపహరింపఁ గుబేరుఁ డలిగి యీపుష్పకము నీపగతుఁ జేరుఁగాక యని శపించెను.

తరువాత దశగ్రీవుఁ డింద్రాదులతోఁగూడఁ బోరి వారి నోడించి జగద్రావణముఁ (జగత్క్షోభము) జేయుటచే రావణుఁ డనుబిరుదము నొందెను.*

రావణబాధితులగు దేవర్షులు, రాజర్షులును, అగ్నిదేవుని బురస్కరించుకొని బ్రహ్మసాలి కేఁగి రావణునిచేఁ దాము పొందుచున్న బాధలఁ జెప్పుకొన నాతఁడు తా నింతకుఁ బూర్వమె రావణు వధింప నారాయణుని బ్రార్థించితి ననియు, దేవతలు ఋక్షవానరులై పుట్టఁగలరనియు, మీరు భయపడవల దనియుఁ జెప్పి ♦ 'దుందుభి' యను గంధర్వస్త్రీని బిలిచి, నీవు కుబ్జవై

---

*ఇట సంస్కృతభాగవతమున విభీషణుని యోగ్యతకు మెచ్చి కుబేరుఁడు విభీషణునకు యక్షరాక్షసస్వామ్యాధిపత్య మిచ్చెనని కలదు.

♦దుందుభి యను గంధర్వవనిత 'మంథర' గాఁ బుట్టెనను నంశము రామాయణమునఁ గానిపింపదు. బ్రహ్మాదులు విష్ణువుఁ బ్రార్థింప నాతఁడు ప్రత్యక్షమై రావణవధఁ గూర్చి సంభాషించినట్లు గలదు.

‘ మంథర ’ నామమును వహించి, భూలోకమునం దుద్భవించి దేవకార్యము నిర్వహింపుమని పనిచి వారిని పురికొలిపెను.

దేవతల యంశములఁ జేసి మహాబలవంతులగు ఋక్ష వానరవీరు లుద్భవించిరి.

## రామ చరితము

దశరథునకు రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్ను లను నల్వురు పుత్రు లుద్భవించిరి. వారు పెరిఁగి విద్యావంతులు వివాహితులు నైరి. అపుడు దశరథుఁడు, యుక్తవయస్కుఁడు, బలవంతుఁడు, ప్రజారంజకుఁడు, యోగ్యుఁడు నగు రామునకు యౌవరాజ్యాభిషేక మొనర్పఁ దలఁప భరతుని దాసి యగు మంథర కైకేయికి దుర్బోధలఁ జేసి కైకచే వరముల నెపమున దశరథునివలన భరతుఁడు రాజ్యముఁ బొందునట్లును, రాముఁడు పదునాలుగేండ్లు వనమున నుండునట్లును చేయించెను. ఆ కారణమున సీతారామలక్ష్మణులు వనమున కేఁగిరి. దశరథుఁడు రామవిశ్లేష శోకముచే స్వర్గతి నొందెను. పిమ్మట కైకేయి తన పుత్రుఁడగు భరతుని రావించి* రాజ్యమును గైకొనుమని చెప్ప భరతుఁడు తల్లిని నిందించి, సపరివారుఁడై రాముఁ డుండిన

*భరతుఁడు, రాముఁడు వనమున కేఁగుటయు, దశరథుఁడు మృతి నొందుటయుఁ, దన మేనమామ యింట నుండుటచేఁ దెలియఁడనియే వాల్మీకిరామాయణమునఁ గలదు. అదియే యిటఁగూడ నూహింపనగుచున్నది.

చిత్రకూట పర్వతమునకేఁగి రాముని దిరిగి యయోధ్యకు వచ్చి రాజ్యభారమును వహింపుమని ప్రార్థింప, రాముఁడు నియమము నతిక్రమించి రానని నిరాకరించెను. భరతుఁడు రామునిపాదు కలఁ గొని 'నందిగ్రామమున' నివసించి రాజ్య మేలుచుండెను.

రాముఁడు సీతాలక్ష్మణసమేతుఁడై చిత్రకూటమును విడిచి 'శరభంగమహర్షి' యాశ్రమముఁ జేరి వానిచే సత్కృతి నొంది పిమ్మట దండకారణ్యమునకేఁగి * గోదావరీతీరమునఁ బర్ణశాలను నిర్మించుకొని యుండెను. అపుడు రావణుని చెల్లెలగు శూర్పణఖ వారికడకు వచ్చి వారిని జిక్కులు పెట్ట రామలక్ష్మణు లామె ముక్కును, చెవులను గోసి వికృతరూపఁ జేసిరి. ఆకారణ మున 'ఖరదూషణాది' రాక్షసులు పదునాల్గువేలమంది రాముని తోఁ బోరి యాతనిచేఁ జచ్చిరి.

ఖరాదులు మృతినొందుటఁ గని శూర్పణఖ, రావణు పాలికిఁ జని, తనపరాభవాదికములఁ జెప్ప రావణుఁ డాక్ష ణముననె బయలుదేఱి తనకుఁ బూర్వపుమంత్రియై రామునిచే నొకప్పుడు పరాభవింపఁబడి♦ సముద్రతీరమునందలి 'గోకర్ణము'

*వాల్మీకిరామాయణమునఁ గల 'గుహ, విరాధ, అత్రి, సుతీక్ష్ణ, మాండకర్ణి, అగస్త్యాదుల' గాథాప్రశంసలు దీనిలో సూచింపఁబడ లేదు.

♦రామునిచే మారీచుఁడు విశ్వామిత్రయాగకాలమునఁ బరాభూతుఁ డైనట్లు 'వాల్మీకము' నఁ గలదు. ఆగాథ లింతకుఁ బూర్వ మీగ్రంథమున సూచింపఁబడకపోయినను 'రామునిచే మారీచుఁ డింతకుఁబూర్వమె పరా

అను క్షేత్రమునఁ దపముచేయుచున్న 'మారీచు' కడకు వచ్చి రాముని వంచించు కార్యమునఁ దనకుఁ దోడ్పడు మని యాతని గోరెను. మారీచుఁ డాపనినుండి మాన్ప నెంతగాఁ జెప్పినను రావణుఁడు వినక మూర్ఖపు పట్టుతో మారీచుఁ బోఁడ్కొని చనె. మారీచుఁడు రావణునాజ్ఞ ననుసరించి బంగరులేడి యాకృతిఁ బూని సీతను భ్రమపెట్టె, నామెచేఁ జోదితుఁ డగు రాముఁడు సీతకుఁ గాఁపుగా లక్ష్మణు నునిచి యాలేడిని వెంటాడి దూర మేఁగి దానిని శరముతోఁ గొట్టె నది చచ్చుచు రాముని కంఠ స్వరముఁబోలె 'హా! లక్ష్మణా! సీతా!' యని యఱచెను. ఆ ధ్వనిని విని సీత భయముతో లక్ష్మణు నటు కేఁగి రామునకు సహాయపడు మన, నాతఁడు సీత కుపద్రవము కలుగునని తలఁచి, రామునకు భయములే దని చెప్ప, నామె యాతనిని నిష్ఠురోక్తులాడ లక్ష్మణుఁడు రాము నన్వేషింపుచుఁ బోయెను.

అంత రావణుఁడు సన్యాసివేషమును ధరించి సీతయున్నెడకు వచ్చి యామె యాతిథ్య మీయఁబోఁగాఁ దాను రావణుఁడ నని చెప్పి తన్ను వరించి తనతో రమ్మన నామె నయు నిష్ఠురోక్తులాడుచుఁ దొలఁగుచుండ రావణుఁడు సీతను జంకింపుచు నామె నెత్తికొని లంకాపురాభిముఖుఁడై పోయెను.

రావణాపహృతయై పోవుచు సీత, రావణుఁడపహరించి

---

భూతుఁ డయ్యో' ననుటచే విశ్వామిత్రయాగరక్షణాదిగాథలు జరిగె నని స్పష్టమగుచున్నది.

కొని పోవుచున్నాఁడని యెలుఁగెత్తి యేడ్వ జటాయు వడ్డువచ్చి రావణుతోఁ బోరి యాతనిచేఁ గొట్టఁబడెను. పిమ్మట రావణుఁడు సీతనెత్తికొని యనర్గళుఁడై పోవుచుండ, ఋశ్యమూక పర్వతమున నల్వురు వానరులుండ సీత చూచి తన భూషలఁ గొన్నిటిని వారియెదుట విడిచెను. రావణుఁడు సీతను లంకకుఁ జేర్చి రాక్షసాంగనాపాలితగా నశోకవనమున నునిచెను.

అట రాముఁడు మాయామృగమును వధించి వచ్చుచు మధ్యమార్గమున లక్ష్మణుని జూచి, యాతఁడు వచ్చిన కారణమును దెలిసికొని సీత యేమగునో యను భీతితో విచారింపుచుఁ బర్ణశాలకు రాఁగా శూన్యకుటీరము కాన్పింప దుఃఖితుఁడయ్యె. అంత నన్నదమ్ములు వనమున సీతను వెదకుచుఁ బోవుచుండ రెక్కలుతెగి మృతినొందుటకు సిద్ధముగానుండిన జటాయువు కాన్పించెను. * ఆజటాయువువలన సీతాపహరణ వృత్తాంతముఁ దెలిసికొని దుఃఖింపుచు రామలక్ష్మణులు మృతుఁడగు జటాయువున కగ్ని సంస్కారముఁ జేసియరణ్యమునఁ బోవుచుండ నొక్కెడ వికృతరూపుఁడును, నరభక్షకుఁడు నగు కబంధుఁడు తారసి లక్ష్మణునిభక్షింపఁ బట్టుకొన రాముఁడు లక్ష్మణుని

---

*సంస్కృతభారతమున రామలక్ష్మణులు పర్ణశాలకు వచ్చుచుండఁగ నడుమనే జటాయువు కనుపించి సీతాపహరణవృత్తాంతముఁ జెప్పి మృతినొందినట్లును పిమ్మట రామలక్ష్మణులు పర్ణశాలకు వచ్చి శూన్యకుటీరముఁ జూచినట్లును గలదు.

గ్రహించిన కబంధునిచేతిని ఖండింప లక్ష్మణుఁడు విడివడి తాను రెండవచేతిని ఖండించి యాకబంధుని మృతప్రాయుఁ జేయ వాఁడు దివ్యరూపధరుఁడై రామలక్ష్మణులతోఁ దానొక గంధర్వుఁడనని తనకుఁ గల శాపవృత్తాంతముఁ జెప్పి వారలు సుగ్రీవుతో సఖ్యమొనర్ప బోధించి తనదారిఁ బోయెను.

రామలక్ష్మణులు పంపాసరోవరముఁ జేరి, పిమ్మట ఋశ్యమూకమున కేఁగిరి. అట రామునకును సుగ్రీవునకును హనుమంతునివలన నన్యోన్యము సహాయపడుటకు సంధికుదిరెను. సుగ్రీవుఁడు సీతాపరిత్యక్త భూషలను రామునకు సమర్పించెను.

పిమ్మట రామ సుగ్రీవాదులు వాలిద్వారముకడ కేఁగ సుగ్రీవుఁడు వాలిని యుద్ధమున కాహ్వానించెను. వాలి సుగ్రీవుపైఁ బోఁ బోవుచుండ, 'తార' సుగ్రీవుపైఁ బోవల దనియు, రాముఁడను నాతఁడు సుగ్రీవునకు సహాయము వచ్చియున్నాఁడనియు, హితోపదేశ మొనర్చెను. కాని, వాలి యామెవాక్యములు సుగ్రీవుపైఁ బక్షపాతమునఁ జెప్పఁబడుచున్నవని, వినిపించుకొనక సుగ్రీవుపైకిఁ బోయి ఘోరయుద్ధ మొనర్చెను. రామునకు వాలి సుగ్రీవులలో భేదము తెలియకుండుటఁ జూచి హనుమంతుఁ డొకపల్లవదామమును, సుగ్రీవుని కంఠమున నైప

నది గుర్తుగ రాముఁ డొక యమోఘ బాణముచే వాలిని ద్రెళ్లనేసెను. ♦

సుగ్రీవుఁడు కిష్కింధకుఁ బట్టాభిషిక్తుఁడై 'తార'ను గూడ వరించెను. రామలక్ష్మణులను మాల్యవంతమున నివసింపఁ జేయుచు 'గ్రీష్మ, వర్షఋతువులు' కడచిన పిమ్మట సీతాన్వేషణమునకుఁ బ్రయత్నించుద మని చెప్పి తాను కిష్కింధలో సుఖముగా నుండెను.

అట లంకలో సీత రాక్షసాంగనా పరివృతయై పలుబాధలఁ బడుచుండ సీతకుఁ గాఁపుండిన రాక్షసస్త్రీలలో 'త్రిజట' యను ధర్మచారిణియగు రక్కసి యొక్క సమయమున సీతఁ జేరి తల్లీ! 'అవింధ్యుఁ' డను పేరుగల యోగ్యుఁడగు నొకదైత్యుఁడు నీకాశ్వాస మొసర్ప నన్నంపియున్నాఁడు. వినుము.

"నీభర్తయగు రాముఁడు నిన్ను విడిచినపిదప లక్ష్మణుని తోఁ గూడి వానరేశుఁడైన సుగ్రీవుతోఁ జెలిమిఁజేసి వేగముగా నిన్ను విడిపించుటకై యిపుడు ప్రయత్నించుచున్నాఁడఁట! రావణునకు రంభానిమిత్తకమైన శాపముండుటవలన నిన్ను రావణుఁడు బలాత్కరింపలేఁడు గాన నీవు వీనినుండి భయపడవలదు." అని చెప్పుమనినాఁడు—

మఱియు నాకు దుర్మార్గుఁ డగు రావణుఁడు నశించున

---

♦ రాముఁడు చెట్టుచాటుననుండి వాలిని గొట్టెనని దీనియందు లేదు. ఉపవనమున నీయుద్ధము జరిగెనని సంస్కృతభారతమునఁ గలదు.

ట్టిదియు, నీకును నీభర్తకును మేలుకల్గునట్టిదియు నగు స్వప్న ము కలిగెననికూడఁ దనకుఁగల్గిన కలఁజెప్పి సీత నూరడించెను.*

ఒకప్పుడు రావణుఁడు సీత తన్ను వలచునని సింగారించుకొని సీతకడకు వచ్చి వలపుఁ గులుకు పలుకులు పలుక నాపె నయనిష్ఠురోక్తు లాడి, కరుణపుట్ట నేడ్వ రావణుఁడు వెడలి పోవ, ఎప్పటియట్ల యామె రాక్షసాంగనా పరివృత యయ్యె.

మాల్యవంతమున రాముఁడు వర్షర్తువును విరహార్తితోఁ గడపి, శరదృతువు వచ్చిన కొన్నినాళ్లకుఁగూడ సుగ్రీవుఁ డని నట్లు తనకుఁ దోడ్పడ లేదని క్రోధోద్రిక్తుఁడై లక్ష్మణుని సుగ్రీవు కడ కంపెను. లక్ష్మణుఁడు రాముని సందేశమును సుగ్రీవున కెఱిఁగింప నాతఁడు తా నంతకుఁ బూర్వమె సీతాన్వేషణమునకై వనచరవీరుల నలుదిక్కుల కంపితి ననియు, వారి కిచ్చినగడు విం కైదుదినములుమాత్రమె కలదనియు,నప్పుడు రామసందర్శనమునకు రాఁదలఁచితి ననియుఁ జెప్ప లక్ష్మణుఁడు సంతసించి సుగ్రీవుఁ దోడ్కొని రాముకడకు వచ్చి సుగ్రీవునికార్యతత్పరతఁ జెప్ప రాముఁడు సంతసిల్లియుండెను.

అంతఁ గొలఁదిదినములలోనె 'ప్రాక్పశ్చిమోత్తర' దిక్కులకు సీతాన్వేషణమునకై సుగ్రీవుచే నంపఁబడిన వాన

---

* ఇందు త్రిజటా వృత్తాంతాదికము రామాయణ గాథలోని దానికంటె వేఱు స్థలములోఁ జూపఁబడెను. 'అగ్నిస్యని' వృత్తాంతము రామాయణమున లేదు.

రులు వచ్చి సీతఁ బొడఁగానకుంటి మని రామునితోఁ జెప్పిరి. రాముఁడు దక్షిణపుదిక్కున కేఁగినవానరులచేతనే సీతావృత్తాంతమును వినఁగలనని యాశతోనుండ మఱియొక నెలదినములకు దక్షిణపుదిక్కున కేఁగినహనుమదాది వానరులు వచ్చి రామునకు మ్రొక్కిరి. వారిలో హనుమంతుఁడు తాను సీతఁ జూచితి ననియుఁ దమమార్గమున 'మయ' కృతమై 'ప్రభావతి' యనుతపస్వినీ నివాసమైన గుహను జూచి దక్షిణసముద్రపు తీరముఁ జేరితి మనియు, నట 'సంపాతి' యను జటాయువు సోదరుని వాక్యములచేఁ దానె సముద్రముఁ దాఁటి లంకఁ బ్రవేశించి సీతఁ గాంచితి ననియు* లంకలో సీత విశేషదుఃఖితయై యుండె ననియు సీతకుఁ దన్నెఱిఁగించికొని రామసుగ్రీవుల సఖ్యాదికముఁ జెప్ప నామె తా నంతకుఁ బూర్వమె యవింధ్యుఁ డనువానివలన రామసుగ్రీవుల సంగతి వినుటచేఁ దన మాటలను నమ్మి,పిమ్మట నానవాలుగ శిరోభూషణము నిచ్చుచుఁ జిత్రకూటపర్వతమున నొక కృతకకాకముతో సంబంధించినగాథను జెప్పిన దనియుఁ దాను లంకాపురిని దహించి వచ్చి

*రామాయణమునఁగల 'మైనాక, సురసా, సింహికా, లంకా' యను వారలతో హనుమంతునకు లంకలోఁ బ్రవేశించులోపల సంభవించిన గాథలిందుఁ గానరావు. సంస్కృతమున హనుమంతుఁడు సముద్రము దాఁటు నపుడు జలగ్రహమును వధించెనని మాత్రముకలదు. తెనుఁగున నదియును మృగ్యమె.

తిననియుఁ * జెప్పి సీత తనకిచ్చిన శిరోభూషణము నీయ, రాముఁడు శోకించి లంకా విజయమునకై సుగ్రీవుఁ ద్వరపెట్టెను.

సుగ్రీవుఁడును నానాదేశములఁగల ఋక్ష వానర వీరులఁ బిలువఁ బంపిన జాంబవదాదులు కోటుల సంఖ్యలుగల ఋక్ష వానర సైన్యంబులఁ గూర్చుకొని రామ సుగ్రీవులకడకు వచ్చిరి.

రాముఁడు శుభలగ్నంబున లక్ష్మణసుగ్రీవాదులఁగూడి లంకపై దండయాత్రకుఁ దరలెను. ఇట్లు ససైన్యుఁడై కతిపయ పయనంబులు సేసి రాఘవుఁడు దక్షిణసముద్రతీరమున విడిసి సుగ్రీవాదులతో సముద్రతరణోపాయముఁ జింతించి సముద్రుఁడు తాను బ్రార్థింప దారి యిచ్చిన యుక్తమే. లేకుండిన శరములచే సముద్రు నింకించి కార్యసాధనముఁ జేయుదమని నిశ్చయించుకొనెను. పిమ్మట లక్ష్మణునితోఁ గూడ నుపవసించి సముద్రుఁ బ్రార్థింప సముద్రుఁడు ప్రత్యక్షమై ♦ 'రామా!

* హనుమంతుఁడు 'వనభంగము చేయుట, 'అక్ష'కుమారు వధించుట, ఇంద్రజిత్తాతని బంధించుట, రావణునితో నతఁడు సంభాషించుట, లంకఁ గాల్చుట' మొదలగు నంశము లిందు సూచనగానైనఁ జెప్పఁబడ లేదు.

♦ సముద్రుఁడు రామునకు స్వప్నమునఁ గాన్పించెనని భారతమున నిట్లు కలదు.

శ్లో. సాగరస్తు తత స్స్వప్నే దర్శయామాస రాఘవం......

వనపర్వ-282 అధ్యా.

రామాయణమున, రాముఁడు సముద్రుని బ్రార్థించినను నాతఁడు ప్రత్యక్షము కాకుండుటను జూచి శరములచే సముద్రుని శోషింపఁ జేయుచుండ సముద్రుఁడు ప్రత్యక్షమైనట్లు కలదు.

నీకేమి కావలయు ' నన, రాముఁడు ' నేను లంక కేఁగవలయును, దారి నిమ్ము ; లేకుండిన నిన్ను నా బాణములచే నింకింతు ' నన, సముద్రుఁడు, ' నలుఁడు ' అను వానరునిచే సముద్రమును బంధింపఁజేసి లంక కరుగు ' మని యుపదేశించి చనెను.

సాగరోపదేశముచే రాముఁడు నలునిచే సేతువుఁ గట్టించెను.

ఆసమయమున 'విభీషణుఁడు' అన్నయగు రావణుతో విరోధపడి రాముకడకు వచ్చి [illegible] శరణు వేఁడ రాముఁ డాతని [illegible] చేసిన విభీషణుఁడు యోగ్యుఁడని యాతనిఁ బరిగ్రహించెను

విభీషణునివలన లంకా లంకాధిపుల వృత్తాంతముఁ దెలిసిన రాముఁడు వారిఁ బురస్కరించుకొని వార్ధిని దాఁటి ' త్రికూట ' పర్వత మెక్కి లంకాపురికిఁ జుట్టును సైన్యశిబిరములను నిర్మింపఁజేసి వానరసైన్యముల నందు విడియించెను.

అపుడు రావణుచారులైన 'శుక, సారణు'లను రాక్షసులు వానరాకారములను ధరించి వానరసైన్యముయొక్క రహ

---

♦విభీషణుఁడు సేతునిర్మాణమునకుఁ బూర్వమె రాముకడకువచ్చి శరణుఁ జొచ్చినట్లు రామాయణమునఁ గలదు. సేతుబంధన విషయమున విభీషణుఁడును మంత్రాలోచనమునఁ బాల్గొనినట్లుకూడ నందుగలదు. విభీషణునకు శరణు నిచ్చుటలో సుగ్రీవుఁడు చాల ననుమానించినట్లు రామాయణమునను, సంస్కృతభారతమునను గూడఁ గలదు.

న్యములఁ గనుచుండ విభీషణుఁ డెఱిఁగి వారిని వానరులచేఁ బట్టించి రాముకడకుఁ దేఁగా రాముఁడు శుకసారణులను స్వేచ్ఛగా వానరసైన్యముఁ జూచి వెళ్లవచ్చు ననెను. వారట్లు చేసి రావణుకడకుఁ బోయి వానరసైన్యము దుర్జేయమనియు, రామలక్ష్మణు లజేయు లనియుఁ జెప్పిరి. *

రావణుఁడును, రామునియత్నములను లెక్కింపక లంకాపురికి గట్టిగాఁ గాఁపుపెట్టి, యుద్ధమునకు సిద్ధముగ నుండెను.

శ్రీరాముఁడు 'అంగదుని' రావణుకడకు రాయబారిగ నంపెను. అంగదుఁడు రావణుకొలువుకూటముఁ జేరి రావణుతో శ్రీరాముఁడు చెప్పినరీతిని కఠినోక్తులతో 'సీతను రామునకిచ్చి శరణుఁజొచ్చిన శరణు చొరుము; లేకుండిన యుద్ధమునకు రమ్ము; నిన్ను హతమార్పక మాననను.' అని రామువాక్యములుగాఁ జెప్పఁ గినిసి రావణుఁడు, నల్వురురాక్షసుల నంగదుఁ బట్టఁ బనుప, నంగదుఁడు తన్నుఁ బట్టిననల్వురను జంపి మగిడి రాముకడకు వచ్చి తాఁ బోయివచ్చినవిధముఁ జెప్పెను.

పిమ్మట రామునాజ్ఞచేఁ గపిసైన్యము లంకామార్గముపైఁ గవిసి యటఁ గాపున్నరాక్షసులఁ దోలి, కోట నాక్రమింప

---

* విభీషణుఁడు శరణుసొరకపూర్వమె రాముఁడు సాగరతీరముఁ జేరినపుడు రావణుని వేగులవాఁడగు 'శార్దూలుఁ' డనువాఁడును, విభీషణుఁడు శరణుపొందిన పిమ్మట 'శుకుఁడు' అను వేగులవాఁడును వానరసైన్యముఁ జూచి పోయి రావణునకు రామునివృత్తాంతముఁ జెప్పినట్లు రామాయణమునఁ గలదు.

రావణుఁడు కొందఱు వీరరాక్షసుల నంప వారు వానరులఁ దోలి తిరిగి కోటను గైవసము చేసికొనిరి. దానిఁ జూచి రామలక్ష్మణులు వానరులఁ బురికొల్ప వారు తిరిగి లంకాప్రాకారముపైఁ కేఁగిరి. అపుడు రావణునిచే నంపఁబడిన (1) పర్వతుఁడు (2) ప్రిధనుఁడు (3) ఖరుఁడు (4) క్రోధనుఁడు (5) ప్రిరుజుఁడు, అను రాక్షసవీరులు మాయం గావింపుచు వానరులను బీడించుచుండ విభీషణుఁడు చూచి, వారిఁ దలపడి వారిమాయతోఁ గూడఁ బ్రధనాదులసంహరించి రాక్షససైన్యమును బాఱఁదోలెను. రావణుఁ డావృత్తాంతముఁ దెలిసి, మంత్రియుక్తుఁడై యుద్ధమునకు వచ్చెను. రావణుఁడు 'ఔశనస' [శుక్రునిచేఁ జెప్పఁబడిన] వ్యూహముఁ బన్న, శ్రీరాముఁడు 'బార్హస్పత్య' [బృహస్పతిచేఁ జెప్పఁబడిన] వ్యూహముతోఁ నెదుర్కొన నిరుపక్షములకును ఘోరసమర మయ్యెను. అందు 'రామ రావణు' లెదురై పోరిరి. రామునిబాణహతిని సహింపలేక రావణుఁడు పరువిడి లంకం జొచ్చెను. అది చూచి రాక్షససేన చెల్లాచెదరుకాఁగా* 'ప్రహస్తుఁడు' రాక్షససేనఁ బురికొల్పి వానరులను హింసింప విభీషణుఁడు ప్రహస్తు నెదుర్కొని శక్తిచే వానిని జంపెను.

పిమ్మట 'ధూమ్రాక్షుఁడు' రాక్షససేనఁ బురికొలిపి

---

* ప్రహస్తుఁడు చచ్చినతరువాతనె తొలిసారి రావణుఁడు యుద్ధమునకు వచ్చి రామున కోడెనని రామాయణమునఁ గలదు. మఱియుఁ బ్రహస్తుని 'నీలుఁడు' వధించె ననియు నందుఁ గలదు.

ఘోరసమరము చేయ, హనుమంతుఁడు వానిని సంహరింప, రాక్షససేన లంకకుఁ బరువిడెను.

రావణుఁడు తనముఖ్యసేనానాయకులు హాలియుటఁ జేసి విచారించి, గాఢసుషుప్తిలో నుండిన కుంభకర్ణుని లేపించి సీతాపహరణాదివృత్తాంతమును, రాముఁడు సేతుబంధన మొనర్చి లంకపై విడిసి రాక్షసవీరులఁ జంపుటయుఁ జెప్పి యుద్ధమున కాతనిఁ బురికొల్పెను. *

కుంభకర్ణుఁడును, దనకుఁ దోడుగ రావణుఁ డంపిన 'వజ్రవేగ, ప్రమాథు'లను రాక్షసవీరులఁ గూడి, వానరసైన్యముం గవిసి వానరు లొనర్చు ప్రహారణములచే నిద్రయొక్కమత్తును విడిచి కినిసి యెదురఁబడిన 'బల, చండబల, వజ్రబాహులు'లోనుగాఁగల వానరవీరులను నమలెను. ఆదారుణకర్మముఁ జూచి తక్కినవానరులు పరువిడ సుగ్రీవుఁడు కుంభకర్ణు నెదుర్కొని యుద్ధముఁ జేసెను. కుంభకర్ణుఁ డాసుగ్రీవుఁ బట్టుకొన, లక్ష్మణస్వామి కుంభకర్ణు నెదుర్కొని బాణముచే కుంభకర్ణుహృదయమును భేదింపఁ గుంభకర్ణుఁడు సుగ్రీవుని విడిచి యొకమహాశిలఁ గైకొని లక్ష్మణునిపైకి వచ్చెను. లక్ష్మణుఁడు వాని హస్తములను ఛేదింపఁ గుంభకర్ణుఁడు మాయచేఁ జతుర్బాహుఁ

* రాముఁడు సేతుబంధన మొనర్పక పూర్వమె రావణుఁడు మంత్రాలోచనముఁ జేయుసమయమున 'కుంభకర్ణుఁ' డాసభలోనుండి రావణునకు హితోపదేశము చేసినట్లును, అప్పుడె విభీషణుఁడుకూడ రావణునకు హితోపదేశము చేసినట్లును రామాయణమునఁ గలదు.

డు, బహురూపుఁడు, నై లక్ష్మణునితోఁ దలపడ నాతఁడు బ్రహ్మాస్త్రముచేఁ గుంభకర్ణుని జంపెను. *

కుంభకర్ణునితో యుద్ధభూమికివచ్చిన 'వజ్రవేగుని' హనుమంతుఁడును, 'ప్రమాథిని' నీలుఁడును వధించిరి.

కుంభకర్ణాదుల చావును విని రావణుఁడు శోకింప 'ఇంద్రజిత్తు' తండ్రి నోదార్చి తాను ససైన్యులగు రామలక్ష్మణులను జయింతు నని రావణు ననుమతిచే యుద్ధభూమికి వచ్చి లక్ష్మణునితోఁ గొంతసేపు పోరి నడుమను వచ్చిన 'అంగదునిచే' విరథుఁడై, యదృశ్యుఁడై, మాయాయుద్ధమున వానరులను బడలువఱచి రామలక్ష్మణులను నాగపాశబద్ధులను జేసి పడనైచెను. సుగ్రీవాదు లదిచూచి విచారింపుచుండ విభీషణుఁడు బ్రహ్మాస్త్రమును బ్రయోగించి రాఘవుల బంధమోక్షితులఁ జేయ సుగ్రీవుఁడు 'విశల్యకరణి' యను నౌషధమున వారలను విశల్యదేహులను జేసెను. ♦

---

* రామాయణమునందుఁ గాని, రామునిచరితముఁ జెప్పెడి యే యితరగ్రంథములందుఁ గాని కుంభకర్ణుని లక్ష్మణుఁడు వధించినట్లు లేదు. మహాభారతము రచింపఁబడునాఁటికి లోకమునందు కుంభకర్ణుని లక్ష్మణుఁడే వధించినట్లుప్రచారముండుటచే 'వ్యాసు'చే నట్లే యందుఁ జేర్పఁబడియుండును. 'జయ, విజయు' లను విష్ణుసేవకులు 'హిరణ్యాక్ష, హిరణ్యకశిపు' లై, పిమ్మట 'రావణ, కుంభకర్ణు' లై రనుపురాణగాథలు పుట్టినపిమ్మటనే విష్ణుని యవతారరూపుఁ డగు రాముఁడే కుంభకర్ణుంగూడఁ దెగటార్చె నని రామాయణాదులలోఁ జేర్పఁబడియుండెనేమో ?

♦ రామాయణమున నింద్రజిత్తుమాయచే రామలక్ష్మణులను రెండు

బంధముక్తులైన రాఘవులకు ♦ కుబేరుచే నంపఁబడిన దివ్యజలముఁ గొని యొకకిన్నరుఁడు రాఁగా విభీషణుఁ డాయంశము నెఱింగింప రాఘవు లాజలముచేఁ గన్నులఁ దుడిచికొన నాకాశమున మాయారూపుఁ డగు నింద్రజిత్తు కాన్పించెను. అపుడు వానితో రాఘవులు యుద్ధమునకుఁ దలపడిరి. అది మాని యింద్రజిత్తు విస్మితుఁడై హోమమొనర్చి తిరిగి రాఘవుల జయింపఁ దలఁచి యుద్ధభూమిని విడిచి పోవుచుండ విభీషణుఁ డది తెలిసి లక్ష్మణుని బురికొల్పెను. లక్ష్మణుఁ డింద్రజిత్తును వెన్నంటి వానితో ఘోరయుద్ధ మొనర్చి యాతనిని వధించెను.

---

సాములు మూర్ఛితులుగఁ జేసినట్లును, తొలిసారి నాగపాశబద్ధులఁ జేయ నది తెలిసి గరుత్మంతుఁడు వచ్చి నాగపాశములఁ బోఁగొట్టినట్లును రెండవ పర్యాయము, ఇంద్రజిత్తు సర్వసైన్యములను మూర్ఛనొందింప హనుమంతుఁడు జాంబవదుపదేశముచే సంజీవిపర్వతముఁ దెచ్చి యందఱను బ్రబోధితులఁ జేసినట్లును, మూఁడవతూఱి యింద్రజిత్తు 'కృత్య' యను శక్తి సహాయముచే మాయాయుద్ధముఁ జేయ నాగ్నేయాస్త్రముఁ బ్రయోగించి రాఘవుఁ డా'కృత్య'ను దహింప నింద్రజిత్తు కృతకృత్యుఁడు కాక లంక కేఁగినట్లును గలదు.

భాస్కర రామాయణమునఁ దొలిసారి యింద్రజిత్తుచే రామలక్ష్మణులు నాగపాశబద్ధులు కాఁగా నారదుఁడు వచ్చి రాముని నీవు విష్ణుఁడవని తెలిపి యాతనిచే గరుత్మంతుని దలంపంజేయ గరుత్మంతుఁడు వచ్చి రామలక్ష్మణులను నాగపాశములనుండి విముక్తులఁ జేసినట్లున్నది.

♦ ఈదివ్యోదక ప్రశంస రామాయణమునఁ గాన్పింపదు.

పుత్రశోకమగ్నుఁ డగు రావణుఁ డాక్రోధముతో సీతను జంప ఖడ్గముఁ గైకొని యశోకవని కేఁగ రామపక్షపాతియగు 'అవింధ్యుఁడు' * రావణునకు సయుక్తికముగా సీతను వధింప రాదని బోధించి వెనుకకు మళ్లించెను. పిమ్మట రావణుఁడు ససైన్యుఁడై రాము మీఁదకు వచ్చి మాయాయుద్ధముఁ జేయ నమ్మాయను రాముఁడు దివ్యాస్త్రములచే నివారించెను. అంతలో దేవేంద్రునిచే నంపఁబడిన రథముఁ గొని 'మాతలి' రాముకడకు వచ్చి దాని నధిరోహించిన జయము లభించునని యింద్ర సందేశముఁ జెప్పెను. ♦ రాముఁ డారథము నారోహించి రావణుతో ఘోరరణ మొనర్చి బ్రహ్మాస్త్రముచే నాతని వధించి లోకముల కానంద మొనగూర్చెను. †

---

* 'సుపార్శ్వుఁడు' అనుమంత్రి రావణుఁడు సీతను జంపకుండఁగఁ జేసెనని వాల్మీకమునఁ గలదు.

♦ రాముఁడు మాతలిప్రయుక్తరథము నెక్కుటకు నది శత్రుకృత మాయారథ మని సందేహింపుచుండ, విభీషణుఁ డా సందియముఁ బాపె ననియుఁ బిమ్మట రాముఁ డారథము నెక్కెననియు సంస్కృతమునఁ గలదు.

† రామాయణమున వర్ణింపఁబడిన రావణప్రయుక్త మయశక్తిచే లక్ష్మణుఁడు మూర్ఛిల్లుటయు, హనుమంతుఁడు సంజీవి పర్వతముఁ దెచ్చుటయు, రాముఁడు రావణుని శిరస్సులను నూఱు నొక్కసారి ఖండింప నవి తిరిగి యుద్భవించుచుండుటయు, మాతలిబోధచేతనె రాముఁడు బ్రహ్మాస్త్రముఁ బ్రయోగించి రావణుఁ జంపుటయు మొదలగున విందుఁ గానరావు. భాస్కర రంగనాథ రామాయణమ్ములలో నింకను బెక్కులు 'కాలనేమి'

పిమ్మట రాముఁడు విభీషణుని లంకకుఁ బట్టాభిషిక్తుం జేసెను. 'అవింధ్యుఁడు' విభీషణుఁ బురస్కరించుకొని సీతను రాముకడకుఁ గొనివచ్చి యామెను సమర్పింప, దీనురాలగు సీతను రాముఁ డాదరింపక రావణ గృహీతవు గాన నిన్నుఁ బరిగ్రహింప ననెను. ఆమె మిగుల శోకించి రామునితో, ''ప్రభువా! నీకుఁ గీడు రాకుండుటకును, నాసత్యము లోకమునకు వెల్లడి యగుటకును నే నగ్నిఁ జొచ్చెదను. నీ విందుల కనుమతింపుము'' అనునంతలో 'పృథివ్యాది భూతములు' సీత నిర్దోషురాలు, మే మామె పవిత్రత నెఱుఁగుదుము' అనుచుండ సురలతోఁ గూడి 'బ్రహ్మ' వచ్చి సీత నిర్దోషత్వమును వెల్లడించి • రాము నయోధ్య కరుగఁ బ్రోత్సహించెను. పిమ్మట రాముఁడు 'పుష్పక' విమానారూఢుఁడై యయోధ్య కరిగి పట్టాభిషిక్తుఁడై ప్రజాభీష్టప్రదుఁడై చిరకాలము రాజ్యము నేలెను—

---

పాతాళహోమము, రావణుని పొట్టనమృతకలశముండుట, దానిని విభీషణుఁ డెఱిగించి రాముచే నది యింకునట్లు చేయించినగాని రావణుఁడు మృతి నొందకుండుట మొదలగునవి పెక్కు వాల్మీకిరామాయణమునకు భిన్నమైన 'గాసట బీసట' గాథలు కలవు

• సీత యగ్నిలోఁ బ్రవేశించినట్లును అగ్ని రాముకడకు సీతఁ గొని తెచ్చి యీమె నిర్దోషయని యొప్పగించినట్లును గల రామాయణగాథ యిందు స్పృశింపఁ బడలేదు.

## రామోపాఖ్యాన విమర్శనము

పై భారతాంతర్గతమగు 'రామోపాఖ్యానము' వలన మహాభారతము రచింపఁబడు నాఁటికిని వాల్మీకి రామాయణము స్థూలరూపము నొందునాఁటికిని రామునిగాథ లెట్లు మార్పునొందెనో తెలియఁగలవు. మఱియు, క్రైస్తవ శకము పదుమూఁడు పదునాల్గు శతాబ్దములలోఁ బైరెండు గ్రంథములకును భిన్నముగా నాంధ్రదేశమున రామాయణ కథలు వాల్మీకి రామాయణాదులకు విరుద్ధమై యెట్లు వ్యాప్తమైనవియుఁగూడఁ దెలియఁబఱచితిని. ఆ భాస్కర రామాయణాదులలోను నన్యోన్య విరుద్ధ గాథలు చేరియున్నవి. క్రింది గాథ యందుల కొక నిదర్శనము కాఁగలదు.

## ధాన్యమాలిని

ఈమె రావణుని పుత్రులలో మహాబలవంతుఁడును, నీతిమంతుఁడు నగు 'అతికాయుని' తల్లి. అప్సరోవనిత; హనుమంతుఁడు సీతను వెదకుచు నశోకవనముఁ జేరినప్పుడె, రావణుఁడు సీతను దలఁచి యామెయం దనురక్తుఁడై నారీజనపరివృతుఁడై సీతకడకు వచ్చి తన్ను వరింపుమనెను. సీత కఠినోక్తులచే రావణుని దూషింప రావణుఁడు కినిసి సీతను దండింపఁబోఁగా, రావణునితో నటకు వచ్చిన ధాన్యమాలిని రావణున కడ్డమువచ్చి సీతపైఁబోకుండ నివారించెను. ఈ గాథ రామాయణము యొక్క సుందరకాండమునఁ గలదు.

హనుమంతుఁడు రెండవసారి సంజీవి పర్వతముఁ దెచ్చుట కేఁగునప్పుడు రావణ చోదితుఁడై 'కాలనేమి' హనుమంతుఁడు పోవు మార్గమునం దొక మాయాశ్రమమును నిర్మించి తాను కృత్రిమ మునియై హనుమంతుని భ్రమపెట్టి యాతని నచట నుండిన కొలనికి నీరు త్రాగుటకు పంపెను. హనుమంతుఁడు నీరికై సరోవరమున దిగ నందొక మొసలి హనుమంతుని గబళించెను. హనుమ దాని గర్భముఁ జొచ్చి దానిని జంపునంతలో నది యొక స్త్రీయై తాను ధాన్యమాలి యను నప్సరస స్త్రీ ననియు రావణుఁడు తన్ను బలాత్కరించి తనయందు 'అతికాయుఁడ'ను పుత్రుఁ గనె ననియు, అంతకుముందుఁ దన్నుఁ గామించిన 'శాండిల్యుఁడు' అను ఋషి తన్ను మొసలినిగా శపించి హనుమంతునిచే నిను శాపముక్తి గలుగఁగలదని శాపమోక్షమును జెప్పెననియు భాస్కరరామాయణమునని యుద్ధకాండమున వ్రాయఁబడెను. హనుమంతుఁడు మొసలికినైన గాథ జరుగునాఁటికి, అతికాయుఁడు పెరిఁగి పెద్దయై లక్ష్మణునితో ఘోర సమర మొనర్చి చచ్చెను. అంతకుముందు కొలది దినములనాఁడె సీతను రావణుఁడు దండింపఁబోఁగా పై ధాన్యమాలినియే రావణు నడ్డుకొనినది. ఇది యసందర్భపు గాథ కాదా?

ఇట్టిగాథలు పెక్కులు మహాభారత సంబంధమైనవియు నాంధ్రదేశమున వ్యాప్తములు కాఁగా 'నన్నయ, తిక్కన' మహాకవులు గాథలను సవరించి నిజమగు నంశములతోఁ దమ

గ్రంథములను రచించి రనియే యెఱ్ఱాప్రగడ మహాకవి నన్నయ తిక్కనలఁగూర్చి యిట్లు వ్రాసియున్నాఁడు.

ఉ. భాసురభారతార్థముల - భంగుల నిక్క మెఱుంగ నేరమిన్
గాసటబీసటే చదివి - గాథలఁ ద్రవ్వు తెనుంగువారికిన్
వ్యాసముని ప్రణీతపర-మార్థము తెల్లఁగఁ జేసినట్టి య
బ్జాసన కల్పులం దలఁతు-నార్యుల నన్నయ తిక్కనార్యులన్.

నరసింహపురాణము ఆ 1

ఎఱ్ఱాప్రగ్గడ మహాకవినిగూర్చియు, నాతని కవిత్వ విశేషములఁ గూర్చియు, రామోపాఖ్యానములో నెఱ్ఱనామాత్యునిచేఁ గూర్పఁబడిన కావ్య ఫక్కికఁ గూర్చియు నిఁక విచారింతము.

## రామోపాఖ్యానాంధ్రీకరణము

భారతాంతర్గతమగు రామోపాఖ్యానము 'ప్రబంధపరమేశ్వర, శంభుదాస' బిరుదములు గల 'ఎఱ్ఱాప్రగడ' మహాకవిచే నాంధ్రీకరింపఁబడిన భారతారణ్య పర్వశేషములోని దని యింతకుఁ బూర్వమె వ్రాసితిని. ఎఱ్ఱాప్రగడ మహాకవి క్రైస్తవశకము పదుమూఁడు వందల యిరువదవ సంవత్సరము (1320) మొదలు పదమూఁడు వందల నలువది తొమ్మిదవ సంవత్సరము (1349) వఱకు గుంటూరు మండలములోని 'అద్దంకి' రాజధానిగా నాంధ్రదేశములోఁ గొంతభాగముఁ బరిపాలించిన 'పోలయ

వేమారెడ్డి' యాస్థానకవియై యాతనికి హరివంశమును నాతని తమ్ముఁడగు మల్లారెడ్డికి రామాయణమును కృతినిచ్చుటచే నీతఁడును బదునాలుగవ శతాబ్ద మధ్యమున నుండినవాఁడని స్పష్టమగుచున్నది.

ఈతని నివాసస్థలము నెల్లూరుజిల్లా కందుకూరు తాలూకాలోని గుడ్లూరు. శ్రీవత్సస గోత్రము. గృహ నామము 'చెదలువాడవారు' తండ్రి సూరన్న, తల్లి పోతమ్మ, 'ప్రగడ' యనుశబ్దము పేరునకుఁ బిమ్మటఁ జేర్పఁబడుటచే నాంధ్ర బ్రాహ్మణులలో నియోగి శాఖలోనివాఁడు. శంకరయతి శిష్యుఁడు. సంస్కృతాంధ్రభాషలలోఁ బండితుఁడై యారెండు భాషలలోను ననర్గళధారగాఁ గవిత్వముఁ జెప్పిన మహాకవి.

ఈతఁడు (1) భారతారణ్యపర్వశేషమును (2) రామాయణమును (3) హరివంశమును (4) లక్ష్మీనృసింహపురాణమును, రచించెను. మొదటి మూఁడుగ్రంథములు నాంధ్రీకరణములు. కడపటిది 'స్థలమాహాత్మ్యము' (అహోబలక్షేత్రముఁ గూర్చి యచట వ్యాపించిన గాథల ననుసరించి వ్రాయఁబడిన ప్రబంధము.)

పై యంశముల నీక్రింది పద్యములు స్పష్టపఱచుచున్నవి.

సీ. ప్రజ్ఞా పవిత్రుఁ డా • పస్తంబ సూత్రుండు
శ్రీవత్స గోత్రుఁ డూ • ర్జితచరిత్రుఁ
డగు బొల్లనకుఁ బ్రోల • మాంబకుఁ బుత్రుండు
వెలనాటి చోడుని • వలన మిగుల

మన్ననఁ గన్న భీ♦మనమంత్రి పౌత్రుండు
పేరింకమాంబా మనః♦ప్రియుఁడు పోత
మాంబికావిభు సూర♦నార్యు మజ్జనకుని
బొల్లధీనిధికిని ♦ ప్రోలనకును
గీ. జన్ననకు ననుజన్ముఁడ ♦ గన్న తండ్రి
వేఁగినాట గరాపర్తి ♦ వృత్తిమంతుఁ
డనఘుఁ డెఱపోతసూరి కం♦సారి చరణ
కమల మధుకరపతి సార ♦ విమలయశుఁడు.

నరసింహ పురాణము.

పై పద్యము ననుసరించి 'ఎఱ్ఱాప్రగడ' వంశ వృక్ష మిట్లుండెను.

భీమన
|
బొల్లన
|
ఎఱపోతన
|
బొల్లన — ప్రోలన — జన్నన — సూరన
సూరన
|
♦ ఎఱ్ఱాప్రగడ.

ఎఱ్ఱాప్రెగడకు 'ప్రబంధ పరమేశ్వర, శంభుదాస' బిరుదములు వచ్చిన కారణము లిట్లు చెప్పఁబడెను.

ఉ. ఉన్నత సంస్కృతాది చతు • రోక్తి పదంబులఁ గావ్యకర్త వై
యెన్నికమైఁ బ్రబంధపర • మేశుఁ డనంగ నరణ్య పర్వశే
షోన్నయ మంధ్రభాష సుజ • నోత్సవమొప్పఁగ నిర్వహించితౌ
నన్నయభట్ట తిక్కకవి • నాథుల కెక్కినభక్తి పెంపునన్.

క. గిరిశ పద భక్తిరత
త్పరభావముకలిమి శంభు • దాసుఁ డనంగాఁ
బరఁగిన గోవిందగుణా
దర సంభృత సౌమనస్య • ధన్యుఁడ వెందున్.

నరసింహ పురాణము.

---

'ఎఱ్ఱన' పేరుగలవారు మఱియిరువురు కాన్పించుచున్నారు. భాగవతము షష్ఠస్కంధము నాంధ్రీకరించిన 'ఏర్చూరి' సింగన్నకు నాలుగు తరములు పూర్వమున నొక 'ఎఱ్ఱన' యనువాతఁ డుండినట్లు భాగవతషష్ఠస్కంధము చెప్పుచున్నది.

మఱియు 'కొక్కోకము' అను 'రతిశాస్త్రగ్రంధమును' రచించిన మఱియొక యెఱ్ఱన కలఁడు. వా రిద్దఱును శ్రీవత్ససగోత్రికులును, ఆపస్తంబ సూత్రికులును, శివభక్తులు నయియుండిరి. కాని, సింగనార్యుని పూర్వీకుఁడగు నెఱ్ఱన, కవిగా వర్ణింపఁ బడకపోవుటచేతను, మన యెఱ్ఱన తరువాత రమారమి నూరేండ్ల నాఁటివాఁడుగాఁ గాన్పించుటచేతను నాతఁడీతఁడు కాఁడు. కొక్కోకకర్త తలిదండ్రుల పేరులు, కాలము, వేఱగుటచేతను, మనయెఱ్ఱన వానికి వేఱై యున్నాఁడు.

పై యంశముల నెఱ్ఱాప్రగ్గడ తాతయగు 'పోతన' యెఱ్ఱన మహాకవియొక్క స్వప్నమునఁ గాన్పించి చెప్పిన ట్లామహాకవియే తన 'నరసింహ పురాణమున' వ్రాసికొని యున్నాఁడు.

ఎఱ్ఱనకవి 'రామాయణమును' రచించిన యంశమును, హరివంశమును గృతి నిమ్మని చెప్పుచు, 'ప్రోలయ వేమారెడ్డి' యిట్లు చెప్పినాఁడు.

శా. నాతమ్ముండు ఘనుండు మల్లరథినీ • నాథుండు నిన్నాతత
శ్రీక్రోడన్ సముపేతుఁ జేసి యెలమిం • జేపట్టి మాకిచ్చుటం
జేతోమోద మెలర్ప రామకథ మున్ • జెప్పించి యత్యుత్తమ
ఖ్యాతిం బొందితి నింకనుం దనియ నేఁ • గావ్యామృతాస్వా
దనన్.

పై కారణములచే నెఱ్ఱాప్రగ్గడ మహాకవి (1) భారతారణ్యపర్వశేషమును (2) రామాయణమును (3) హరివంశమును (4) నరసింహ పురాణమును రచించి యున్నాఁడని స్పష్టమగుచున్నది.

కవి యింటిపేరు 'చెదలవాడవారు' అని ఎఱ్ఱాప్రగ్గడ వంశస్థుఁడై 'విప్రనారాయణ' చరిత్రవ్రాసిన 'మల్లన' తన గ్రంథమున నిట్లు చెప్పి యున్నాఁడు.

సీ. ప్రతిభతో నారణ్య • పర్వశేషముఁ జెప్పెఁ
గవులకుఁ జెవుల పం • డువులుగాఁగ
వల్మీకభవు వచో • వైఖరి రామాయ

ణంబు నాంధ్ర ప్రబం◆ధంబుఁ జేసె
నారసింహుని పురా◆ణ మొనర్చి హరి మెచ్చి
నన్ను నెన్నఁడు చూచి◆నాఁడ వనఁగఁ
బ్రౌఢిమై హరివంశ ◆ భాగముల్ రెండును
రచియించె సభలందుఁ ◆ బ్రాజ్ఞు లెన్న

ఆ. వె. దురితహరుఁ బ్రబంధ ◆ పరమేశ్వరునిఁ జెద
ల్వాడ నిలయు నాదు ◆ వంశకర్త
ధన్యమూర్తి శంభు ◆ దాసు నెఱ్ఱాప్రగ్గ
డను నుతింప బ్రహ్మ◆కును దరంబె ?

విప్రనారాయణ చరిత్ర. 1 ఆశ్వా.

మఱియు భారతారణ్య పర్వశేషమున నాలవ యాశ్వాసమున నూట నల్వదిరెండు (142) పద్యము లైనతరువాతను 'ఇక్కడనుండి చెదలువాడ యెఱ్ఱాప్రగ్గడ కవిత్వము' అని పెక్కు ప్రాచీన తాళపత్ర గ్రంథములలోఁ గూడఁ గలదు. అదియును గవి యింటిపేరు చెదలవాడవారనుటకు మఱియొక నిదర్శనము.

ఎఱ్ఱాప్రగ్గడ మహాకవి తొలుత నన్నయభట్ట మహాకవి 'ఆది, సభా' పర్వములను రచించి, యరణ్యపర్వమున నాలుగవ యాశ్వాసమున నూట నల్వది రెండు (142) పద్యముల నాంధ్రీకరించి యేకారణముననో, నిలిపివేయఁగాఁ బిమ్మటఁ 'దిక్కన' మహాకవి యరణ్య పర్వశేషమును వదలి, 'విరాటపర్వము'నుండియే, తక్కిన మహాభారత భాగము నాంధ్రీకరింప, నడుమ

నాంధ్రీకరింపఁబడక శేషించిన యరణ్యపర్వ భాగము నాంధ్రీకరించి 'ప్రబంధ పరమేశ్వర' బిరుదము నొందిన ఎఱ్ఱామహాకవి రచించిన 'నరసింహపురాణము' లోని—

ఉ. ఉన్నత సంస్కృతాది చతురోక్తి పదంబులఁ గావ్యకర్తవై
యెన్నికమైఁ బ్రబంధ పరమేశుఁ డనంగ నరణ్య పర్వశే
షోన్నయ మాంధ్రభాష సుజనోత్సవ మొప్పఁగ నిర్వహించి
తౌ। నన్నయభట్ట తిక్కకవి నాథుల కెక్కినభక్తి పెంపు
నన్.

అను పద్యముచేతనే స్పష్టమైనది. కాని, యిప్పటి పరిశోధకులలోఁ గొందఱు నన్నయభట్టు, 'అరణ్యపర్వాంతము' భారతము నాంధ్రీకరించె ననియు, అందు వనపర్వములో నాలవ యాశ్వాసమున నూటనలువది మూఁడవ (143) పద్యమునుండి క్రిమిదష్టాది కారణములచేఁ గొన్నిపట్టులు లోపింపఁగా నెఱ్ఱన మహాకవి లుప్త భాగములను బూరించె ననియుఁ జెప్పుదురు.

ఇందులకు 'తిక్కన మహాకవి' విరాటపర్వారంభమునఁ జెప్పిన యీక్రిందిపద్యమె వారికి ముఖ్యసాక్ష్యము.

ఉ. ఆదరణీయ సారవివిధార్థగతి స్ఫురణంబు గల్గి య
ష్టాదశపర్వనిర్వహణ సంభృతమై పెనుపొందియుండ నం
దాది దొడంగి మూఁడుకృతులాంధ్రకవిత్వ విశారదుండువి

ద్యాకయితుం డొనర్చె మహి • తాత్ముఁడు నన్నయ
భట్టు దక్షతన్.

అనుపద్యమున, నన్నయభట్ట మహాకవి, మూఁడుకృతులు
అనఁగా మూఁడు పర్వములఁ జేసెనని యర్థమగుచున్నదందురు.
మఱియుఁ దిక్కనసోమయాజికి శిష్యుఁడును, మార్కండేయపు
రాణము నాంధ్రీకరించిన మహాకవియు నగు 'మారనకవి' తన
గ్రంథమునఁ గ్రిందిరీతిఁ జెప్పుటకూడ వారికి మఱియొక సాక్ష్య
మగుచున్నది. చూడుఁడు.

ఉ. సారకథా సుధారసము • జనప్రియ నాగళపూరితంబుగా
నారఁగఁ గ్రోలుచు న్జనులు • హర్షరసాంబుధిఁ దేలునట్లుగా
భారత సంహిత న్మును ద్రి • పర్వము లెవ్వఁడొనర్చెనట్టి వి
ద్యారమణీయు నాంధ్రకవి • తాగురు నన్నయభట్టుఁ గొల్చె
దన్.

మార్కండేయ పురాణము.

పై పద్యమునను, మారనకవి తనగురువగు తిక్కన మ
హాకవి వలెనే నన్నయభట్టు మూఁడు పర్వముల నాంధ్రీకరించె
నని చెప్పియున్నాఁడు.

ఇంతమాత్రమె కాదు, ఆంధ్ర లక్షణవేత్తలలో మిగులఁ
బ్రసిద్ధిగన్న 'అప్పకవి'యు నిట్లు చెప్పియున్నాఁడు.

ఉ. ఆదిని శబ్దశాసన మ • హాకవి చెప్పిన భారతంబులో
నేదివచింపఁగాఁ బడియె • నెంచును దానినె కాని సూత్రసం

పాదన లేమిచేఁ దెలుఁగుఁ ♦ బల్కు మఱొక్కటి కూర్చి చె
ప్పఁగా। రా దని దాక్షవాటికవి ♦ రాక్షసుఁడే నియమంబుఁ
జేసినన్.

క. ఆమూఁడు పర్వములలో
నామాన్యుఁడు నుడువు తెనుఁగు ♦ లరసికొని కృతుల్
తాము రచించిరి తిక్కను
ధీమణి మొదలైన త్రొంటి ♦ తెలుఁగు కవీంద్రుల్.

అని చెప్పుటకూడఁ బ్రబలసాక్ష్యమై యున్నది. మఱియు 'ఎఱ్ఱన' తాను రచించిన యరణ్యపర్వ శేషమునందలి యాశ్వాసముల యాద్యంతములలోను, నన్నయ రచించినట్లు రాజరాజనరేంద్రునకుఁ గృతిగా రచించుటచేతను, అరణ్యపర్వాంతమందు___

సీ. భవ్యచరిత్రుఁడా ♦ పస్తంబ సూత్రుండు
శ్రీవత్స గోత్రుండు ♦ శివపదాబ్జ
సంతతధ్యాన సం♦సక్త చిత్తుఁడు సూర
నార్యునకును బోత♦మాంబికకును
నందనుం డిలఁ బాక♦నాటిలో నీల కం
ఠేశ్వరస్థానమై ♦ యెసక మెసఁగు
గుడ్లూరు నెలవుగ ♦ గుణగరిష్ఠత నొప్పు
ధన్యుఁడు ధర్మైక ♦ తత్పరాత్ముఁ

గీ. డెఱ్ఱనార్యుఁడు సకలలో♦కైకవిదితుఁ
డయిన నన్నయభట్టు మ♦హాకవీంద్రు
సరస సారస్వతాంశ ప్ర♦శస్తి దన్నుఁ
జెందుటయు సాధుజన హర్ష ♦ సిద్ధిఁగోరి.

క. ధీరవిచారుఁడు తత్కవి
తారీతియుఁ గొంతదోఁచఁ ♦ దద్రచనయు గా
నారణ్య పర్వశేషము
పూరించెఁ గవీంద్ర కర్ణ♦పుటపేయముగాన్.

పై పద్యములలో

"తత్కవితారీతియుఁ గొంతదోఁచఁ దద్రచనయ గా
నారణ్య పర్వశేషము పూరించెన్"

అను వాక్యముచే 'ఎఱ్ఱనార్యునకు నన్నయ రచించి క్రిమిదష్టమైపోయిన భాగములోఁ గొంతదోఁప (అనగాఁ గొంతభాగము కాన్పింపఁగా) ఆ నన్నయపేరితోనె పూరించెను (పూర్తి చేసెను) అని యర్థ మగుచున్నది గాన నెఱ్ఱన స్వంతకవిత్వముఁ జెప్పక నడిమిభాగములనే పూర్తిఁజేసె నందురు.

ఇట్టి విపరీతవాదముఁ జేయువారు 'ఆరణ్యపర్వశేషము' అనువాక్యములోని శేషశబ్దమున కర్థమును విచారించి యుండరు. శేషమును బూర్తి చేసెనన లుప్త భాగములను బూర్తి చేసెనని యెట్లర్థమగును? మఱియు నరణ్యపర్వశేషముఁ జెప్పుటచే తన యాతనికి 'ప్రబంధ పరమేశ్వర' బిరుదము లభించినట్లాతఁ

డె నరసింహాపురాణమునఁ జెప్పికొనియున్నాఁడు. గ్రంథములోఁ గొన్ని కొన్ని పద్యములయొక్కయు, వచనముల యొక్కయు భాగములను మాత్రము పూర్తి చేసినంతమాత్రముననె యట్టి ప్రసిద్ధమగు బిరుదు లభించునా? నన్నయయొక్క 'సరససారస్వత ప్రశస్తి' తన్నుఁ జెందుట, తత్కవితారీతి తనకుఁ దోఁచుట,యనుదాని వలన నన్నయయొక్క వాఙ్మయాంశములు, ఆతని కవిత్వపద్ధతియుఁ దనకు నలవడె నని యర్థముకాని చెడిపోయిన కొన్నిపద్యములుగల తాటాకులని యెచటను నర్థముకాదు.

మఱియు నెఱ్ఱన యరణ్యపర్వభాగములోని కవిత్వశైలికిని 'నన్నయ, తిక్కనల' కవిత్వశైలికిని భేదము స్పష్టమగుచుండును. కొన్నియెడల నన్నయ యొక్కయు, మఱికొన్ని యెడల తిక్కనయొక్కయు, శైలి ననుకరించియు, విపులీకరించియు, నెఱ్ఱన రచించియున్నాఁడు. ఆయంశము ముందు వ్రాయఁబడును. మఱియు భారతారణ్య పర్వశేషములోని యెఱ్ఱన శైలి యాతని 'హరివంశ, నరసింహాపురాణములలోఁ' గూడఁ బ్రతిఫలించుచుండును. వాని నట్టిదృష్టితోఁ జదివినవారికి విశదముకాఁగలవు.

మఱికొందఱు 'ఎఱ్ఱన' తానురచించిన యరణ్యపర్వభాగమును, నన్నయపేరితోనె, రాజనరేంద్రున కంకితము గానె రచించుట యొప్పిదందురు. ఎఱ్ఱనకుఁ దత్కాలమున — ఆకాలముననేకాదు — నేఁడును నన్నయభట్టు వనపర్వశేషము నాంధ్రీకరించుచుండ బెడిసికొట్టి మతిపోయి మృతినొందె నను ప్రవాద

ము లోకమున నుండుటచేఁ దా నాంధ్రీకరించినను, తనపేరితో నుండకుండిన నాకీడు తనకు సంభవింపక పోవచ్చు నని యెట్లు సాహసము చేసియున్నాఁడని తలంపవలసి యున్నది. ఇందు 'తిక్కన మహాకవి' కంటె నీతఁడె చౌరవచేసి యరణ్యపర్వశేషము నాంధ్రీకరించి ఖ్యాతినొందె నని చెప్పవలెను. లోకప్రివాద మెంతటి ధీరున్నైన భీరువుఁ జేయుఁగదా! అంతియెకాని నన్నయపేరితో నెఱ్ఱనయాంధ్రీకరించుటకు వేఱుకారణములేదు.

ఈనడుమ నొకరు తిక్కన కాలమునకు నన్నయకృతమైన యరణ్యపర్వము సంపూర్ణముగా నుండుటచేతనే యాతఁడు విరాటపర్వము మొదలుకొని యాంధ్రీకరించెనుగాని, లేకుండిన నరణ్యపర్వశేషముఁ బూరించుటలో జడియువాఁడుకాఁడని వ్రాసియున్నారు.

కాని, తిక్కనమహాకవియు సాంఘికప్రవాదమునకు సందేహించువాఁడె యనుటకు నాతఁడు రచించిన 'నిర్వచనోత్తరరామాయణము' లోని రామనిర్యాణఘట్టము నాంధ్రీకరింపక విడుచుటయే మఱియొక నిదర్శనము. శ్రీరామనిర్యాణముఁ జెప్పిన, నేదేనికీడు మూఁడు ననియే యట్లు చేసియున్నాఁడు. *

ఇంతమాత్రమె కాదు, తిక్కనమహాకవి తత్కాలమున స్వదేశమునందు విజృంభించియున్న జైనమతమునకు వ్యతిరేక

* తిక్కనకవి విడిచిన రామనిర్యాణఘట్టగాథను 'జయంతి రామభట్టు' అను నొకకవి యిటీవల నాంధ్రీకరించియున్నాఁడు.

ముగా నుండిన మహాభారతములోని కొన్నియంశములను విడిచియుఁ గొన్నిటిని 'తాఱుమాఱు' చేసియుఁ గొన్నిటిని పెంచియు నాంధ్రీకరించియున్నాఁడు. *

తిక్కనసోమయాజియె కాఁడు, ఆతనికి 'దశకుమారచరిత్ర'ను గృతినిచ్చిన 'కేతనమహాకవి' యుఁ దా నాంధ్రీకరించిన 'విజ్ఞానేశ్వరీయము' లోఁ దత్కాలాచారములకు వ్యతిరేకముగా నుండినయంశములఁ ద్యజించియున్నాఁడు. ♦

గృహస్థులగు 'తిక్కన, కేతన' మహాకవులె కారు—వారి కాలముననె యుండినసన్యాసి యగు 'మధ్వాచారి'యు (ఆనందతీర్థులు) తానువ్రాసిన 'బ్రహ్మసూత్రభాష్యాంశము'నకు వ్యతిరేకముగానె తా నుండినప్రదేశమునఁ గల జైనమతమునకుఁ బుయిలోడి కర్మములఁ జేయించియున్నాఁడు. ‡

---

*తిక్కనమహాకవి భారతము నాంధ్రీకరించుటలో నేయంశములఁ ద్యజించెనో, వేనిని 'దాఱుమాఱు' చేసెనో, వేనిఁ బెంచెనో ముందు వ్రాయఁబడును.

♦ కేతన "విజ్ఞానేశ్వరీయము" నాంధ్రీకరించుటలో, సర్వశ్రుతిసమ్మతమగు 'గోమధుపర్క' విషయికాంశములఁ జెప్పు 'మహోక్షం వా, మహాజం వా, శ్రోత్రియాయ ప్రకల్పయేత్" మొదలగుశ్లోకములకు నాఁడు నెల్లూరు, ప్రాంతమున విజృంభించిన జైనమతమునకు వ్యతిరేకమని సంకోచించియే తెలిఁగింపక విడిచియున్నాఁడు. 31—1—25.

‡ మధ్వాచారి తనబ్రహ్మసూత్రభాష్యమున 'శంకర, రామానుజ' భాష్యములను మించుటకో యన, యజ్ఞపశువిశసనమును విధించుచు—

సూ॥ అశుద్ధమితి చేన్న శబ్దాత్॥ 3-1-25

ఏమహాకవియైనను_ఏమహాయోగియైనను_తత్తద్దేశకాల పరిస్థితులను దాఁటుటకు సంకోచించినవాఁ డనిన, దానిని వారి లోప మన రాదు. అది లోకస్వభావమే.

అగుఁగాని, 'తిక్కన, మారన, అప్పకవ్యా'దులు నన్నయ మూఁడుపర్వములఁ దెనిఁగించెనని చెప్పెడి యంశమునకు గతి యేమందురు?

ఆయంశము నిట్లు సమన్వయించుకొనవలసి యుండును.

నన్నయమహాకవి సంస్కృతభారతములోని 'వన' పర్వము యొక్క మూఁడువందల పదునాలుగధ్యాయములలోను(314) నూఁట యెనుబదాఱధ్యాయములను(186) పదమూఁడువందల (1300) పద్యగద్యములనుగా నాంధ్రీకరించెను. శేషించిన నూఁట యిరువదెనిమిది యధ్యాయములను(128) ఎఱ్ఱాప్రగ్గడ మహాకవి పదునాఱువందల(1600) పద్యగద్యములనుగా నాంధ్రీకరించి యున్నాఁడు. ఇందు నన్నయయాంధ్రీకరణభాగము, సంస్కృతభా

---

అను సూత్రమునకు భాష్యమును పురాణము చేఁ గూడ యజ్ఞమునఁ బసుహింస చేయవలసినదే యని సోదాహరణముగా దృఢపఱచియు, స్వస్థల మగు 'ఉడిపి' ప్రాంతమునఁ దనయాజమాన్యమునఁ జేయఁబడిన యజ్ఞముఁ బసువును విశసింపక, 'పిష్ట' పసువు నుపయోగించియే చేయించియున్నాఁడు. అది యే నాఁటినుండి నేఁటివఱకు మధ్వమతస్థుల కాచారమైనది. మధ్వాచారి తత్ప్రదేశమునఁ దత్కాలమునఁ బ్రబలముగా నుండిన జైనమతమునకు లోఁగియే యట్లు చేసె నవలసియున్నది. ఆతఁడు బ్రహ్మసూత్రభాష్యము నార్యాశర్తమున రచించెను.

రతముయొక్క వనపర్వములో సగముకంటె నెక్కువయై, తెనుఁగున నాతని సభాపర్వముకంటె రెట్టింపై, తిక్కనమహాకవియొక్క 'భీష్మ, కర్ణ, శల్య, సౌప్తిక, స్త్రీ, అశ్వమేధ, ఆశ్రమవాస, మౌసల, మహాప్రస్థానిక, స్వర్గారోహణ' పర్వభాగములకంటెను పెద్ద దగుటచేతను, తిక్కనాదిమహాకవు లద్దాని నొకపర్వముగానె పరిగణించిరి.

ఎఱ్ఱాప్రగ్గడకవి రచించిన వనపర్వశేష మన్ననో, సంస్కృత వనపర్వమున నూఁటయిరువదెనిమిది (128) యధ్యాయములుమాత్రమె కల్గియున్నను, తెనుఁగున నన్నయ రచించిన యరణ్యపర్వభాగముకంటె నెక్కు డగుటయె కాక, తిక్కన రచించిన భారతభాగములో 'ద్రోణ, శాంతి, అనుశాసనిక' పర్వములు కాక తక్కిన పర్వములకంటెఁ బెద్దదై పదునాఱువందల(1600) పద్యగద్యములు కలదిగా నున్నది. వనపర్వాంధ్రీకరణములో నన్నయమూలమును సంక్షేపించి యాంధ్రీకరించినట్లును, ఎఱ్ఱన, విపులీకరించి ప్రబంధధోరణి నాంధ్రీకరించినట్లును తోఁచెడిని. దాని నింకను బరిశోధింపవలయును.

కాన నెఱ్ఱనామాత్యుని వనపర్వాంధ్రీకరణభాగము స్వల్పముకాక, యాతఁడు ప్రబంధపరమేశ్వరబిరుద మొందుటకుఁ దగిన పెద్దదగుగ్రంథముగానె పరిగణింపఁ దగియున్నది. *

---

* చదువరుల యుపయోగముకై భారతపర్వములలోని పద్యగద్య సంఖ్యక్రింద వ్రాయఁబడెను.

ప్రసిద్ధి కెక్కిన మను, వసుచరిత్రలకంటెను ఎఱ్ఱన యరణ్యపర్వము పెద్దది.

అందువలననె ప్రాచీనమహాకవులు 'ఎఱ్ఱాప్రగ్గడ' మహాకవిని భారతాంధ్రీకర్తలలో నొకనిగాను, మహాకవినిగాను పరిగణించిరి. ఇంతమాత్రమె కాదు, ఆంధ్రవాఙ్మయసృష్టిలోఁ బ్రధానులగు 'నన్నయ, తిక్కన' మహాకవులతోఁ గలిపి నుతించిరి.

అట్లు నుతించినమహాకవుల కొందఱి వాక్యములఁ జూడుఁడు.

శ్రీ నా థ మ హా క వి.

సీ. వచియింతు వేములవాడ భీమన భంగి
నుద్దండలీల నొక్కొక్కమాటు
భాషింతు నన్నయభట్టుమార్గంబున
నుభయవాక్ప్రౌఢి నొక్కొక్కమాటు

| పర్వములు—పద్యగద్యసంఖ్య. | | పర్వములు—పద్యగద్యసంఖ్య. | |
|---|---|---|---|
| (1) ఆదిపర్వము— | 2091 | (9) శల్యపర్వము- | 829 |
| (2) సభాపర్వము— | 618 | (10) సౌప్తికపర్వము- | 376 |
| (3) అరణ్యపర్వము | | (11) స్త్రీపర్వము- | 377 |
| (A) నన్నయ | 1300 | (12) శాంతిపర్వము- | 3099 |
| (B) ఎఱ్ఱన | 1600 | (13) ఆనుశాసనికపర్వము- | 2148 |
| (4) విరాటపర్వము- | 1428 | (14) అశ్వమేధపర్వము- | 980 |
| (5) ఉద్యోగపర్వము- | 1564 | (15) ఆశ్రమవాసపర్వము- | 364 |
| (6) భీష్మపర్వము- | 1173 | (16) మౌసలపర్వము- | 227 |
| (7) ద్రోణపర్వము- | 1865 | (17) మహాప్రస్థానికపర్వము- | 80 |
| (8) కర్ణపర్వము- | 1124 | (18) స్వర్గారోహణపర్వము- | 98 |

వాక్రుత్కు తిక్కయజ్వప్రకారము రసా
భ్యుచితబంధముగ నొక్కొక్కమాటు
పరిఢవింతు ప్రబంధ పరమేశ్వరుని దేవ
సూక్తివైచిత్రి నొక్కొక్కమాటు ...

కాశీఖండము.

తే. కాళిదాసు మనంబులోఁ గాంచి మ్రొక్కి
రాజశేఖరుఁ గవిరాజుఁ బ్రస్తుతించి
ధీరమతి నన్నపార్యుని దిక్కయజ్వ
శంభుదాసుని గర మర్థి సన్నుతించి.

శృంగారనైషధము.

2. అల్లసాని పెద్దన.

ఆ. వె. వ్యాసరచిత భారతామ్నాయమాంధ్రభా
షఁగ నొనర్చి జగతిఁ బొగడుఁ గనిన
నన్నపార్యుఁ దిక్కనను గృతక్రతు శంభు
దాసు నెఱ్ఱసుకవిఁ దలఁతు భక్తి.

మనుచరిత్ర.

3. పింగళి సూరన్న.

ఉ. ఏయెడ నర్థగౌరవ సమృద్ధియు శబ్దవిశుద్ధియుం దిరం
బై యనవద్యతం బఱగు నంధ్రవచస్థితి భారతంబు రా
మాయణమున్ వచించిన మహాత్ముల నాత్మఁదలంచెదంజగ
ద్గేయుల నన్నపార్యుని దిక్కసుధీమణి నెఱ్ఱ సత్కవిన్.

రాఘవపాండవీయము.

చ. పలుకఁ దలంప దవ్వులగు ♦ భారత రామ కథార్థము ల్విభా
సిలఁగ నరంటిపండ్లొలిచి ♦ చేతికి నిచ్చినరీతి నాంధ్ర వా
క్సులలితశక్తి నందఱకు ♦ సుప్రథితంబులు చేసినట్టి ధ
న్యుల నుతియింతు నన్నయము♦స్తోత్రముఁ దిక్కన నెఱ్ఱనత్క
విన్. కళాపూర్ణోదయము.

4. మా ద య్య గా రి మ ల్ల న.

తే. సరస సంస్కృత పుష్పగు♦చ్ఛప్రభూత
మగు తెనుంగను నెత్తావి ♦ కఖిలదిశలఁ
దరుణ పవమానమగు కవి♦త్రయ విశేష
చతురవాచానిరూఢి కం♦జలి యొనర్తు.

రాజశేఖరచరిత్ర.

5. నంది మల్లయ్య—ఘంట సింగయ్య.

తే. నన్నపాచార్యునకు వంద♦నంబు చేసి
తిక్కయజ్వకు మ్రొక్కి కీ♦ర్తితము లైన
శంభుదాసుని వాగ్విలా♦సములు నెమ్మ
నంబులోపల నిలిపి శ్రీ♦నాథుఁ బొగడి.

వరాహపురాణము.

6. జ క్క న క వి.

ఉ. ఈత్రయిఁ దాఁ బ్రబంధపర♦మేశ్వరుఁడై విరచించె శబ్దవై
చిత్రి నరణ్యపర్వము న♦శేషము శ్రీనరసింహ రామ చా

రిత్రములున్ బుధవ్రజగ♦రిష్ఠత నొందియ శంభుదాసుఁ డా
చిత్రకవిత్వ వాగ్విభవ♦జృంభితుఁ గొల్చెదభక్తియుక్తితోన్

విక్రమార్కచరిత్ర.

## * 7. కుమారధూర్జటి.

సీ. తనరు వాగనుశాస♦న నితాంతవిభవంబు
ధరణి సురశ్రేష్ఠు ♦ సరణిఁ దెల్ప
తనమఘవత్ప్రౌఢి ♦ ఘనపుణ్యజనదాన
కృతి నిరంతరసుఖ♦స్థితి నెసంగ
తనప్రబంధాను బం♦ధనిరూఢి సతతంబు
నార్యాభిమత సువా♦క్యములు నెఱప
తనదు శ్రీనాథత్వ♦మనుపమ నృపసభాం
తర చిత్రరచనబం♦ధురత మెఱయ
తే. నలరు నన్నపఁ దిక్క♦నార్యాంధ్రకవిని
నెఱనామాత్య నిషధరా♦జేంద్ర సుచరి
తాంధ్రకవన నవీనవా♦గమృతలీల
నతిశయించిన నెఱజాణ ♦ నభినుతింతు.

ఇందుమతీపరిణయము.

---

* శైవకవులైన 'పాల్కురికి సోమనాథుఁడు, పిడుపర్తి బసవన్న, ధూర్జటి' మొదలగువారు 'స్మార్తు' లగుటచే నన్నయాదులను నుతింపలేదు. కాని కుమారధూర్జటి నేలకో నియమోల్లంఘన మొనర్చెను. అట్లే రాజకవులైన 'నన్నెచోడుఁడు, రంగనాథుఁడు, శ్రీకృష్ణదేవరాయలు' మొదలగువారును నితరకవులకు నమస్కరింపలేదు. అందు సాధారణప్రభువు

## 8 రఘునాథ భూపాలుఁడు.

ఉ. లక్షణలక్ష్యకోటి పది ♦ లంబుగ మేటికవుల్ నుతింపక్షో
దక్షమ సంస్కృతాంధ్ర కవి♦తాపదవిన్ మహికెక్కె శబ్దవై
చక్షణి మించు నన్నని వి♦శారదుఁడై తగు తిక్కయజ్వ ఫా
లేక్షణ భక్తిశీలుఁడగు ♦ నెఱ్ఱయప్రగ్గడనేఁ దలంచెదన్.

వాల్మీకి చరిత్ర.

పై మహాకవులవలెనె (1) హరిభట్ట (ఉత్తరనరసింహ పురాణము) (2) శేషము వేంకటపతి (తారాశశాంకవిజయము) (3) తరిగొండమల్లన (చంద్రభానుచరిత్ర) (4) కామేశ్వరకవి (సత్యభామాసాంత్వనము) మొదలగు మహాకవులెందరో, ఎఱ్ఱన మహాకవిని నుతించియున్నారు. ఆ నుతించుటలోఁ బెద్దనాది కవులు భారతాంధ్రీకర్తనుగానె చెప్పియున్నారు. ఇట్లుండ నిప్పటివారిలోని కొందఱు 'ఎఱ్ఱన' భారతాంధ్రీకరణమునఁ బూర్తి కవి కాఁడనుట విచిత్రము—

ఇంతమాత్రమె కాదు. ఇప్పటివారిలోనె మఱికొందఱు ఎఱ్ఱనామాత్యునికిఁ బ్రతిస్పర్ధినిగా నిలువఁ బెట్టిన 'నాచన సోముని' పై నుడువఁబడిన మహాకవు లెవ్వరును స్మరింపకపోవుట మఱియొకవింత. 'నాచనసోముఁడు' విజయనగరసామ్రాజ్య

---

లగుటచేఁ గాఁబోలు. కట్టా వరదరాజా, రఘునాథ భూపాలుఁడు మాత్రము దారిఁ దప్పిరి. శైవులవలెనె వైష్ణవము పుచ్చుకొనిన 'చిన్నన్న' మొదలగువారును వారి గురువులఁ దలఁచిరె కాని 'స్మార్త' కవులగు నన్నయాదులకు వందనముఁ జేయలేదు.

స్థాపకుఁడైన 'బుక్కభూపతి' చే గౌరవింపఁ బడిన మహాకవియైనను విజయనగరసామ్రాజ్యమునఁ బేరుఁగన్న, పెద్దనాదులే యేల తలంపలేదో? విజయనగరకవులలో నొక్క పిల్లలమఱ్ఱి పినవీరభద్రుఁడు మాత్రము ఎఱ్ఱనతో నాచనసోముని గలిపి యిట్లు నుతించియున్నాఁడు.

మ. కవులం బంకజగర్భసన్నిభుల వ▴కాక్కొంతు వల్మీకసం
భవునిన్ వ్యాసుని గాళిదాసుబిలహుణున్♦బాణున్ మయూరు
న్మురారిన్భవభూతిన్ శివభద్రు మల్లణునిఘుం♦టామాఘునింరు
భారవిమాన్నన్నయభట్టుఁదిక్కకవినెఱ్ఱాప్రగ్గడన్సోమునిన్ జో

జైమినిభారతము.

రామరాజ భూషణుఁడు, వసుచరిత్రమున నెఱ్ఱాప్రగ్గడను విడిచి 'నన్నయ, తిక్కన, శ్రీనాథ, సోమన, భాస్కరుల' నే స్మరించెను. ఆస్మరించుట యాతని కిష్టమగు శ్లేషాలంకారపోషణమునకే యైనట్లు కాన్పించును.

ఎల్లైన సోమునికంటె నెఱ్ఱన్ననే మహాకవులు స్మరించుట యాతని భారతాంధ్రీకరణము నందలి గౌరవము చేతనె.

ఇఁక 'ఎఱ్ఱనమహాకవి' కవిత్వమును విమర్శించుటకుఁ బూర్వము ప్రాచీనాంధ్రభాషాపరిస్థితిని, ఎఱ్ఱన్నకు గురుస్థానమైన 'నన్నయ, తిక్కన్నల' కవిత్వ రీతిని గొంత ముచ్చటింపవలసియున్నది. దానిఁ జూతము.

# ఆంధ్రులు - వారి భాష

ఆంధ్రులనువారు 'విశ్వామిత్ర' శాపహతులైన యాతని సంతతివారెయని 'ఐతరేయబ్రాహ్మణము' చెప్పుచున్నది. ఆవిశ్వామిత్రుఁ డట్లు తన సంతతివారిని శపించుటకు హేతువు 'హరిశ్చంద్రుని' రాజసూయయాగమునఁ బశువుగా బంధింపఁబడిన 'శునశ్శేపుఁడు' అను ఋషిపుత్రుని విశ్వామిత్రుఁడు రక్షించుసందర్భమునఁ గలెనని యైతరేయ బ్రాహ్మణమునను స్పష్టముగా నున్నది. ♦ ఆగాథ నేఁటి 'అయోధ్యాపురి' పరిసరమునఁగాని, దానికి సమీపమునఁగాని జరిగినదని చెప్పవలయును. ఆయాంధ్రు లప్పటినుండి నీచవృత్తుల నవలంబించి, నానాదిశలకుఁ బోయి యుందురు. రామాయణములోని 'శునశ్శేపుని' గాథఁజూడ నది యయోధ్యకుఁ బశ్చిమభాగమున నొకయెడ నైనట్లు కాన్పించును.

'తైత్తిరీయబ్రాహ్మణము' నందు * 'ఆంధ్రుఁడు, అను నొక జాతివాఁడు చెప్పఁబడియున్నాఁడు. ఆంధ్రుఁడన, రేవులయందు, ఒకవిధమగు బల్లెము నుపయోగించి మత్స్యములఁ బట్టువాఁడని యర్థము కలదు. తైత్తిరీయబ్రాహ్మణము, ఉత్తరహిందూస్థానముననే యొక్కయెడ 'తిత్తిరి' యను ఋషిచే

---

♦ ఐతరేయబ్రాహ్మణము —7-3-4.

* తైత్తిరీయబ్రాహ్మణము —3-4.

ద్రష్టమైనది. కాన నాందుఁడును ఉత్తర భారతములోనివాఁడే. తైత్తిరీయబ్రాహ్మణమునఁ జెప్పఁబడిన యాందుడేఁ యైతరేయ బ్రాహ్మణమున నాంధ్రుఁడుగా నుచ్చరింపఁ బడియున్నాఁడేమొ?

మనుస్మృతియందు 'ఆంధ్రుఁడు' అనువాఁడు 'అరణ్యమున' జంతువులఁ జంపి జీవించువాఁడని కలదు. * మనుస్మృతిని బరిశోధించిన వా రాగ్రంథము 'గంగా, యమునా' నదుల నడుమ విరచింపఁబడెనందురు. కాన, మనువునకుఁ దెలిసిన యాంధ్రుఁడును, ఉత్తరభారతదేశవాసియే.

ఆంధ్రబ్రాహ్మణులలో నూటి కెనుబది మందివఱకు 'ఆపస్తంబసూత్రికులై' యుండుటచే నాంధ్రబ్రాహ్మణుల మూలపురుషుఁడు 'ఆపస్తంబ మహర్షి' యే యని చారిత్రకులు చెప్పుదురు. ఆపస్తంబుఁ డాంధ్రదేశీయుఁ డని కొందఱు తలఁచిరిగాని, యది సరికాదు. 'యమునానది' నంటియున్న 'సాల్వ' దేశమే

---

• వేదవాఙ్మయమున దేశకాలముల ననుసరించి శబ్దములయుచ్చారణములలో భేదములుకలిగినవి 'అథర్వవేదము' నఁగల 'కుంతాపసూక్తము' నందు 'కారవ్యుఁడు' అని చెప్పఁబడినవాఁడు. ఐతరేయబ్రాహ్మణమున 'కారవ్యుఁడు' అని చెప్పఁబడుట యిందులకొక చిన్న నిదర్శనము.

* శ్లో. మత్స్యఘాతో నిషాదానాం, త్వష్టిస్త్వా యోగవస్యచ,
మేదాంధ్రచుంచు మద్గూనా, మారణ్య పశుహింసనం॥

మనుస్మృతి.

యాతని నివాసమై యున్నదని తెలియవచ్చుచున్నది. § ఇది కూడ నాంధ్రుఁ డుత్తరభారతీయుఁడే యనుటను ధ్రువపఱచు చున్నది.

పై కారణములచే నాంధ్రు లుత్తర భారతమునుండి యెప్పుడో యెట్లో భిన్న భిన్న సంఘములుగా నేఁటి యాంధ్రావనిఁ జేరియుందురని తెలియనగుచున్నది. ఆంధ్రజాతి యీప్రదేశము నకుఁ జేరకపూర్వము కూడ నొక 'కిరాతక' జాతియిట నివసించియు న్నది. అది యెదన,

ఇక్ష్వాకు వంశజుఁడైన 'దండుఁడు' అనువాఁ డొక కార ణముచేఁ దండ్రివలన వెడలఁగొట్టఁబడి, వింధ్యపర్వతపు దక్షి ణభాగమునఁ జేరి, యచటనుండిన కిరాతులను వశపఱచుకొని, 'మధుమంతము' అను పట్టణమును నిర్మించి పరిపాలింపుచు, గురు వగు 'శుక్రుని' కుమార్తె 'నరజ' యను నామెను గా మించి బలాత్కరించె ననియు, శుక్రుఁడందులకుఁ గోపించి, దం డుఁడు నాతని యనుయాయులు నశించునట్లు శపింప, ధూళివ

§ 'ఆపస్తంబుఁడు' తన గృహ్యా సూత్రములయందు 'సీమంత' కర్మ విధిఁ జెప్పుచు, నితర గృహ్యా సూత్రకర్తలు విధింపని యొక మంత్రమును విధించియున్నాడు. అది, యమునానది నఁటియుండిన 'సాల్వ' దేశమును దానికిఁబ్రభువైన 'యౌగంధరి' యను రాజును గూర్చియునై యున్నది. కాన నాపస్తంబుఁడు 'సాల్వ' దేశీయుఁడనియే స్పష్టమగుచున్నది.
చూ. ఆపస్తంబ గృహ్యా సూత్ర భాష్యము. చౌకాంబాసంస్కృతసీరీసు.

ర్షము కురిసి దండుఁడు నాతని సంబంధులగు కిరాతులు నశించిరనియు, కొందఱుమాత్ర మొక 'సరోవర'తీరముఁ జేరి బ్రతికి రనియు,పిమ్మట రావణుఁడు శూర్పణఖకుఁ బదునాల్గువేలమంది రాక్షసులతో ఖరాసురుఁ దోడిచ్చి యీదండకారణ్యము నాక్రమింపఁ బంచెననియు రామాయణోత్తర కాండమునఁగలదు. శ్రీరాముఁడా దండకారణ్యముఁ జేరునప్పటికి 'ఆర్యర్షులు, ఖరాదిరాక్షసులు, కబంధాది గంధర్వులు, వాలిసుగ్రీవాది వానరులు' నేఁడేది యాంధ్రదేశమనుకొను చుందుమో యట్టిదండకారణ్యమున నుండిరి.

మఱియు భారతయుద్ధానంతరమైన 'యాదవ' నాశనమున మిగిలినవారిలో 'కృతవర్మ'పుత్రుని యర్జునుఁడు దక్షిణాపథమున నుండిన 'మృత్తికావత' పురి కధిపతిఁ జేసినట్లు భారతమునఁ గలదు. ఆమృత్తికావతము నేఁటి 'ఓరుగల్లు' నఁటియున్న 'మట్టెవాడ' యేమొ? కృతవర్మ భోజకులజుఁడు. భోజుల శాసనము లీయాంధ్రావనిఁ గొన్ని కలవు. అందు, కర్నూలుజిల్లాలో 'మద్దకరి'అనుచోట భోజులశాసనము లున్నవి. తద్వంశజులమని చెప్పుకొనువారును. నట నేఁడుకూడఁ గలరు.

'కాకతీయులు' భారతయుద్ధములోఁ బ్రసిద్ధి నొందిన 'త్రిగర్తలు' అనువారితోఁ జేరిన 'ఆయుధజీవికగణము'. * వారెపుడో, యెట్లో, యీయాంధ్రావనిఁ జేరిరి.

ఇట్లప్పుడప్పు డనేకరీతుల నీ యవనిం జేరినవారిలో

* చూ. పాణిన్యష్టాధ్యాయి—దామన్యాదిగణము—

ఆంధ్రులు, అను సంఘమువారు ప్రబలులగుటచే వారి యేలుఁబడిలోఁ జేరినవా రందఱికి నాంధ్రసంజ్ఞ కలిగినది.

అట్టి యాంధ్రదేశమును, ఆంధ్రుల ప్రభుత్వమును, క్రీ.పూ. నాల్గవశతాబ్దమునకే యుండినట్లు 'మెగస్తనీసు' అను గ్రీసుదేశీయుఁడు, నాఁటికాలమున మౌర్యచంద్రగుప్తునికడ రాయబారిగ నుండినపుడు వ్రాసిన యంశములవలనఁ దెలియనగుచున్నది. పిమ్మట 'అశోకుఁడు' కళింగాంధ్రముపై దండెత్తుటయు, మఱికొంతకాలమునకు 'సుశర్మ' యను నాంధ్రప్రభువు 'మగధదేశ'మును గూడ స్వాధీనపఱచుకొని యేలుటయుఁ గలిగెనని, పురాణాదులవలనను, చరిత్రలవలనను దెలియనగుచున్నది.

పైరీతి నార్యావర్తమునుండి యపుడపుడు చేరిన యార్యుల యొక్క సంస్కృతము, దంపాదులయొక్క ప్రాకృతము 'భోజ, కాకతీయా'దుల శౌరసేని, ఖరాదుల 'పైశాచి' (ప్రాచీనద్రావిడము) కాలాంతరముల మిళితమై, ఈ యాంధ్రావనిఁ జేరినవారిభాష ఆంధ్రమనియు, 'తెలుఁగు, లేక తెనుఁగు' అనియు పేరులు కలదైనది. 'తెనుఁగు, తెలుఁగు' అనుపేరులు 'త్రినగ, త్రిలింగ' శబ్దభవములని చెప్పుదురుగాని యింకను నది స్థిరమైన వ్యుత్పత్తి కలదిగాఁ గాన్పింపదు.

ఆంధ్రులు పశ్చిమభారతదేశమునుండియే, బయలు వెడలి గోదావరీ నది పుట్టినచోటునుండి, క్రమముగాఁ దూర్పుదిశకుఁ బ్రసరించిరి. అందువలననే ఆంధ్రప్రభువులకుఁ దొలుత గోదావరీ

తీరమునందలి 'ప్రతిష్ఠాన' పురము రాజధానియగుట కూడఁ గలిగినది. ఆయాంధ్రుల భాష 'ప్రాకృతము' ♦ ఆ ప్రాచీనప్రాకృతభాషయందే శాలివాహనుఁడు 'సప్తశతి' అను గ్రంథమును వ్రాసియున్నాఁడు. ఆసప్తశతి పుట్టకముందే నాఁటి యాంధ్రదేశమున వ్యాప్తమైన 'పైశాచి' భాషలో 'గుణాఢ్యుఁడు' అనునాతఁడు 'కథాసరిత్సాగర' మను గ్రంథమును వ్రాసెను.

మహారాష్ట్రదేశభాష ప్రాకృత మని 'దండి మహాకవి' చెప్పియున్నాఁడు. * ఆప్రాకృతమును, అశోకుని పరిపాలనాకాలమున, 'కళింగాంధ్రమునఁ' బ్రవేశించిన 'మాగధి'యు, తత్పూర్వముననే దేశమున నుండిన పైశాచియును, కాకతీయాదులతోఁ వచ్చిన శౌరసేనియు, నాంధ్రదేశమున సమ్మిళిత మగుటచే 'అపభ్రంశ' మనుపేరితోఁ బ్రాచీనులచేఁ బిలువఁబడెను. అందువలననే 'ఎలుకూచిబాలసరస్వతి' తన 'షడ్భాషావివరణము'

---

♦ పశ్చిమపు టిండియానుండి 'ఆంధ్రుల'ను వారు వచ్చునపుడు కొందఱట నిలిచి పోయి యుందురు. ఆజాతివారే 'బెలూచి' స్థానమునకును, భారతదేశమునకును నడుమ స్థిరపడియుందురు. వారిభాష 'బ్రాహూయి' అను పేరు గలదై యాంధ్రభాషకు సన్నిహితమగుచున్నది. ఈయంశము చేతనె 'గ్రియర్సన్' దొరగారు తమ 'లింగ్విస్టిక్ సర్వే ఆఫ్ ఇండియా' అను పుస్తకమున, ద్రావిడ భాషా వంశ వృక్షముఁ జూపుచు 'ఆంధ్రము'నకు 'బ్రాహూయి' సోదరి భాషగా నిరూపించుట కల్గినది.

* శ్లో. మహారాష్ట్రాశ్రయాంభాషాం। ప్రకృష్టాం ప్రాకృతం విదుః_

దండి.

నందు * 'ఆభీర, ఆంధ్ర'దేశములలోఁ బుట్టిన భాష 'అపభ్రంశము' అని చెప్పియున్నాఁడు.

అపభ్రంశ శబ్దమునకు, 'అపశబ్దము' అని యర్థము. ఏ నియమములకును లోఁబడక నానాభాషల సాంకర్యముగల యాంధ్రమును.'అపభ్రంశము' అనియే ప్రాచీనులు తలఁచి యుందురు. పై వేర్వేఱు ప్రాకృతభాషలకు 'శాతవాహన' చక్రవర్తుల కాలమున 'వాల్మీకి' అనుఋషిచే నొకవ్యాకరణము వ్రాయఁబడెను. అదియే ప్రాకృత వ్యాకరణములకు మొదటిది.♦

పై 'యపభ్రంశ' భాషలో వ్రాయఁబడిన గ్రంథము లేవియుఁ గాన్పింపవు. గాని, ఆభాషకును నొకవిధమగు నియమమును 'వాల్మీకి' చూపియున్నాఁడు.†

మఱియు 'హేమచంద్రుఁడు, త్రివిక్రముఁడు' మొదలగు వారును, ప్రాకృతభాషపై వ్యాకరణములను రచించి యున్నారని 'విన్నకోట పెద్దన్న' చెప్పియున్నాఁడు. చూడుఁడు.

---

* శ్లో. ఆభీరాంధ్రాది జాంభాషా మపభ్రంశం విదుర్బుధాః ॥

షడ్భాషావివరణము.

♦ వాల్మీకి యొక్క ప్రాకృత సూత్రములలో 'శాతవాహన' శబ్దముఁ గూర్చి చర్చ యుండుటచేతను, 'సప్తశతి' యీవ్యాకరణమునకు లక్ష్యముగా నుండుట చేతను, అది శాలివాహనుని కాలముననే రచింపఁబడెనని, తలఁపఁ బడుచున్నది.

† వాల్మీకి సూత్రములపై నాంధ్రదేశపు పండితులగు (1) చెరుకూరి లక్ష్మీధరుఁడు 'షడ్భాషా చంద్రిక' (2) అప్పయ్యదీక్షితులు 'ప్రాకృతమణి

గీ. విశ్రుతులు హేమచంద్ర త్రి • విక్రమాదు
లొనరఁ జూపిరి ప్రాకృతం • బునకుఁ ద్రోవ
నంధ్రభాషయుఁ బ్రాకృ తా • హ్వయమ కాన
వలయుఁ దల్లక్షణంబులు • వలయుఁ దెలియ.

కావ్యాలంకార చూడామణి.

ఇపుడు 'హేమచంద్రుని' దేశీయనామావళియు, 'త్రివి క్రముని' వాల్మీకి సూత్రవృత్తియుఁ బ్రచారమునఁ గలవు. కొందఱు హేమచంద్రాదులు తెనుఁగునకు 'లక్షణము' వ్రాసియున్నారని చెప్పు వాక్యమునకు, పెద్దన్న పద్యము 'అపవాదమై' యున్నది.

ప్రాకృతభాషలోను, దానితో సంబంధించిన 'పాలి' భాషలోను, బౌద్ధమతగ్రంథములు పెక్కులు వ్రాయఁబడి యున్నవి. 'అశోకుని' యొక్కయు, వానివెనుక చక్రవర్తులైన 'ఆంధ్ర చక్రవర్తుల యొక్కయు శాసనములు ప్రాకృతభాషలోనె వ్రాయఁబడియుండెను. ఆంధ్రదేశమున నాంధ్రచక్రవర్తుల పరిపాలనానంతరము తెనుఁగుదేశమునకు 'పల్లవు' లొకవైపునను, 'శాలంకాయనులు' వేఱొకవైపునను బరిపాలకులైరి. వారును, ప్రాకృతభాషలోనె వ్రాయించిన శాసనావళి కాన్పించును. శాలంకాయనులలో 'విజయదేవవర్మ' అనువాని పరిపాలనమువఱకు

---

దీపము' (3) ఎలకూచి బాలసరస్వతి 'షడ్భాషా వివరణము' అను వ్యాఖ్యానములను రచించి యున్నారు.

(క్రీ. శ 375) ప్రాకృతభాషలో వ్రాయఁబడిన శాసనములు లభించుచున్నవి.

రాజుల మతము ననుసరించి మతగ్రంథములు, రాజశాసనములు, మాఱుచుండును ' అశోకుఁడు, ఆంధ్రచక్రవర్తులు ' బౌద్ధులగుటచే, బౌద్ధమతగ్రంథములుగల 'ప్రాకృతమే' శాసనములకును నెక్కినది. వైదికమతముఁ బ్రోత్సహించిన 'గుప్త' రాజుల పరిపాలనమున సంస్కృత మభివృద్ధి కాఁజొచ్చినది. సముద్రగుప్తుని యాంధ్రదేశదండయాత్రచే నాంధ్రావనిలోని ప్రభువులును సంస్కృతమును బోషింపుచు నాభాషనే రాజభాషగా నంగీకరించి, దానియందే శాసనములను వ్రాయించినట్లు కాన్పించును. ఆకాల మించుమించు క్రీ. శ. నాలవశతాబ్దమధ్యమునుండి యైయున్నది.

ఆంధ్రదేశమును, శాలంకాయనరాజులకుఁ బిమ్మట బ్రాగ్భాగము నేలిన 'విష్ణుకుండినులు' కేవల వైదికమతపోషకులె కాక, తాము వేదముఁ జదివి* యశ్వమేధాది మహాయజ్ఞములఁ జేసియున్నారు. అందు 'మాధవవర్మ' పదునొకండశ్వమేధయాగములను, నరమేధయాగముఁగూడఁ జేసియున్నాఁడు. అందువలననే వారిశాసనములు వైదికమత నిదానమగు సంస్కృత

* మాధవవర్మ 'పొలమూరు' శాసనమున ప్రతిగ్రహీతయగు 'శివశర్మ'ను గూర్చి చెప్పుచు నాతఁడు మాధవవర్మకు 'తైత్తిరికసబ్రహ్మచారి' అనఁగా-'కృష్ణయజుర్వేదము'ను దనతోఁ జదివినవాఁడు, అని చెప్పెను.

భాషలోనె రచింపఁబడినవి. విష్ణుకుండినవంశజుల వేఁగీరాజ్య మంతరించినపిమ్మట వచ్చిన 'చాళుక్యులును' దమకూటస్థుఁడగు 'పులికేశి' అశ్వమేధయాగముఁ జేసెనని చెప్పుకొనుటచే వారును, వైదికమతచిహ్నముగ సంస్కృతభాషలోనె, శాసనములను వ్రాయించిరి. పిమ్మట ఆంధ్రచోళులు, కాకతీయులు, రెడ్లు, విజయనగరసమ్రాట్టులునుకూడ, వైదికమతావలంబకులగుటచే సంస్కృతభాషలోనె శాసనములఁ జేసిరి. కృష్ణదేవరాయలు మాత్రము వివిధభాషలలోను శాసనములఁ జేసియున్నాఁడు.

కాని, చాళుక్యుల కాలములో రాజులు సంస్కృతభాషలో శాసనములను వ్రాయించినను, వారి 'మాండలికులు, దండనాయకులు, కొందఱు స్త్రీలు' స్వకాలమునందుండిన యాంధ్రభాషలోనె శాసనములను వ్రాయించుచుండిరి. ఇందులకు 'జయసింహుని' సేనానియగు 'ఎఱుంబోది' యనువాని 'విప్పర్ల' శాసనము, చాళుక్యభీముని సేనానియగు 'పాండురంగని' ధర్మపురి శాసనము, రాజరాజనరేంద్రుని పుత్రిక నని చెప్పుకొనిన సోమలయొక్క దాక్షారామశాసనము నిదర్శనములు.

ఇది సంస్కృతనాటకములలోని 'ఉత్తమపాత్రలు' సంస్కృతమును వాడినట్లును, స్త్రీ, సేవ కాదిపాత్రలు ప్రాకృతభాషను వాడినట్లును నాఁటివారు శాసనములను వ్రాయించుటలోను బ్రవర్తించి రని తలంపవలసి యున్నది. నాఁటికాలపు తెలుఁగైనను, 'ద్రావిడ, కర్ణాటక, మహారాష్ట్రాది' దేశముల

నంటిన యాంధ్రమండలములలో నాయాప్రాంత భాషల సంపర్కముచేఁ, బెక్కుమార్పుల నొందియున్నది. ప్రాకృతభాష లనఁబడు నవియుఁ దాము ప్రవేశించినదేశములవారి యుచ్చారణాపరిస్థితుల ననుసరించి పెక్కురూపములతో 'తత్సమ. తద్భవ, దేశ్య, గ్రామ్య' రూపముల నొందినవి. అందువలన, నేది యే భాషాజన్యమో తెలియకుండఁగఁ బోయినది. ఇందులకుఁ జిన్ని నిదర్శనముగా 'శూరసేని' భాషనుండి తెనుఁగునఁ గలిసి, యవి 'వైకృతా'దులఁగా నిఘంటుకారులచే గ్రహింపఁబడిన కొన్నిపదములఁ జూపుచున్నాను.

| * శూరసేని | తెనుఁగు | శబ్దరత్నాకరకర్తయభిప్రాయము |
|---|---|---|
| తరగ | తరగ | వైకృతము |
| మిస | మిస | ... |
| దుంగ | దుంగ | ... |
| అయ్యా,అంయు | అయ్యా | ... |
| వేసం | వేసము | ... |
| అంతియ | అంతియ, (అంతమాత్రము) | ... |
| దువారం | దువారము | ... |
| సుంణ | సున్న, (శూన్యము) | ... |
| దీవ | దివ్వె | ... |

* శూరసేనీపదములను జయదేవునియొక్క 'శూరసేని' ద్వితీయభాషగాఁ గల ప్రసన్నరాఘవ నాటకమునుండియు, లక్ష్మీధరుని 'షడ్భాషాచంద్రిక' నుండియు సేకరించితిని.

| | | |
|---|---|---|
| మది | మది | తద్భవము |
| సంతి | సత్తి, (శక్తి) | సంస్కృతభవము |
| తావ | తావు | దేశ్యము |
| పుణం | పున్నెము | వైకృతము |
| బళా | బళా(ఆనందసూచకము) | హిందీ |
| ఠాణా | ఠాణా(అధికారిస్థానము) | హిందీ |
| మోడి | మోడి(పని) | దేశ్యము |

పై శౌరసేనీశబ్దములను శబ్దరత్నాకరకర్త, 'వైకృత, తద్భవ, తత్సమ, హిందీ' పదములనుగాఁ దలంచియున్నాఁడు. ఇట్లే మనకుఁ దెలియని ప్రాకృత షట్కము లోని పదము లెన్నియో యాంధ్రమునఁ జేరియున్నవి.

ఇప్పటివారు కొందఱు ఆర్యభాషలకును, ప్రాకృతభాషలకును భిన్నమైన ద్రావిడభాష యొకటి కల దని చెప్పుదురు. కాని, ఏది ద్రావిడభాషాకుటుంబమని చెప్పుదురో, అట్టి 'ద్రవి, డాంధ్ర, కర్ణాట, మళయాళాది భాషలు ప్రాకృతషట్కములోనివె యని ప్రాచీనులు చెప్పియున్నారు. 'దండి' పండితుని వాక్యములఁ జూడుఁడు.

*మహారాష్ట్రము నాశ్రయించిన భాష శుద్ధమగు 'ప్రాకృతము' మగధదేశమునఁ బుట్టినది. 'మాగధి' శౌరసేని దేశమున

* శ్లో. మహారాష్ట్రాశ్రయాంభాషాం ప్రకృష్టం ప్రాకృతం విదుః
శూరసేనోద్భవాభాషా శౌరసేనీతిగీయతే

జన్మించినది 'శూరసేని' పిశాచదేశములఁ బుట్టినది. 'పైశాచీ ద్వితయము' (పైశాచి, పైశాచికమాళిక) ఆభీరాదుల * వాక్యములు 'అపభ్రంశము.' పిశాచదేశములను బెద్ద లిట్లు నిర్దేశించినారు. "పాండ్య, కేకయ, బాహ్లీక, సింహ, నేపాళ, కుంతల, సుధేష్ణ,♦చోట, గాంధార, హైవకన్న దేశములు" పిశాచదేశములు.

ద్రావిడము లనుకొను 'ఆంధ్ర,ద్రావిడ, చోళ,కుంతలాది' దేశములలోని ప్రాచీనభాషను, అపభ్రంశ మనియు, పైశాచీ ద్వితయ మనియుఁ బ్రాచీనుల తలంపు. ఎక్కడనో 'కేకయ, బాహ్లీక' దేశములలోని 'బ్రాహుయీ' భాషకును మనయాంధ్రమునకును సంబంధము కలదని 'గ్రియర్సన్'దొరగారు తలఁచిన దానిని మనప్రాచీనులు పైశాచీద్వితయము లోనిదిగాఁ జెప్పినట్లు కాన్పించును. దాని నటుండనిచ్చి చాళుక్యులకాలమునం

---

మగధోత్పన్నభాషాం తాం మాగధీం సంప్రచక్షతే
పిశాచదేశనియతం పైశాచీద్వితయం భవేత్
పిశాచ దేశాస్తు వృద్ధై రుక్తాః
"పాండ్య కేకయ బాహ్లీక సింహ నేపాళకుంతలాః
సుధేష్ణ చోట గాంధార హైవకన్నా జనాస్తథా,
ఏతే పిశాచదేశాస్యుః".........

* 'ఆభీరాంధ్రి' అని పాఠాంతరము.

♦ 'చోళ' యని పాఠాంతరము.

దాంధ్రభాష యెట్లు పరిణతి నొందెనో, రెండుమూఁడు నిద ర్శనములఁ జూపుదును.

ప్రాచీనకాలమునం దుండిన 'అపభ్రంశ' భాషలోనె యప్పటియాంధ్రులు "నదులకు, గ్రామములకు, గ్రామసీమలకు, కొన్నివృత్తులకు, కొందఱు మనుష్యులకు" దేశకాలానుసారము లగు పేరులఁ బెట్టుకొనియున్నారు.

ఇందులకు 'విష్ణుకుండిన మాధవవర్మ' యొక్క 'పొల మూరు' శాసనములోని కొన్నియంశములఁ జూపెదను.

## మాధవవర్మపొలమూరుశాసనము.

* "స్వస్తి భగవచ్ఛ్రీ పర్వతస్వామిపాదానుధ్యాతస్య. 'విష్ణుకుండినస్య'.... శ్రీవిక్రమహర్షస్యసూనోః ...శ్రీగోవిందవర్మణః ప్రియతనయః ....క్రతుసహస్రయాజీ .... ఏకాదశాశ్వమేధావభృథస్నానవిగతజగదేనస్కః ....విద్వద్ద్విజ గురువృద్ధ తపస్వి జనాశ్రయః మహారాజః శ్రీమాధవవర్మా ... పరమబ్రహ్మణ్యో మాతాపితృ పదానుధ్యాతః * 'జనాశ్రయమహారాజః' గుద్దవాడివిషయే విషయమహత్తరా నధికారపురుషాంశ్చ ఇమమిత్థ మాజ్ఞాపయతి.

* 'జనాశ్రయమహారాజ' బిరుదము నొందిన యీ 'మాధవ'వర్మకును 'మధురాపురి' నాకాలమున నేలు 'సుందరపాండ్య'నకును నేదియొ సంబంధము కలదని, 'సుందరపాండ్య' కృతమగు 'నీతిద్విషష్టిక' యను గ్రంథముఁ బ్రకటించిన బ్ర. శ్రీ. వేటూరి ప్రభాకరశాస్త్రి గారు పుస్తక పీఠికలోఁ జర్చించియున్నారు.

అస్తి విదిత మస్తు వో యోఽస్మాభిః గుద్దవాడివిషయే 'దట్టాయ వారితీర' 'పులిబూంరు' నామగ్రామం 'మయేందవాటకీ' దక్షిణతః సీమాంత చతుర్భిర్త్తనంచ .... 'ఫూంగ్దిజిగీషయా' ప్రస్థితః గోదావరీ మతీతరన్ వేద వేదాంగ విదో 'రుద్రశర్మణో' నప్త్రే దామశర్మణః పుత్రాయ శివశర్మణే గౌతమసగోత్రాయ, కమ్మరాష్ట్రికుండుక వాస్తవ్యాయ తైత్తిరికసబ్రహ్మచారిణే వేదచతుష్టయ సమామ్నాతావదాతాననాయ; ........ఫాల్గునపౌర్ణమాస్యాం సోమ రాహుగ్రస్తనిమిత్తే జనాశ్రయః దత్వా సర్వకరపరిహారే ణాగ్ర హారీకృత్య సంప్రదత్తః. తదత్ర భవద్భి రన్యైశ్చ ధర్మాధి గతబుద్ధి భిః పరిపాలనీయః.... ఆజ్ఞప్తి రత్ర హస్తికేశ,వీరకేశౌ మహాం శ్చ....ఇత్యేవ ముభయగణో స్వీకృత్య పరిపాలయేత్॥........

పై శాసనములో మాధవవర్మ 'ఫూంగిది' గ్విజిగీషచే గోదావరిని దాఁటి ఫాల్గునపూర్ణిమనాఁడు రాహుగ్రస్తమగు చంద్రగ్రహణ సమయమున 'గుద్దవాడి' విషయమున 'మయేందవాటకి' కి దక్షిణమున 'దట్టాయవారి'తీరమునందలి 'పులిబూంరు' గ్రామమును అన్నివిధములగు పన్నులను దీసివేసి, 'కమ్మరాష్ట్రము'లోని 'కుండక' వాస్తవ్యుఁడును, దనతో తైత్తిరీయ సబ్రహ్మచారియు, నగు శివశర్మకు దానమిచ్చి, విషయమునందలి మహాత్తరులగువారిని 'హస్తికేశ, వీరకేశు'లను, దానమును నెరవేర్ప నాజ్ఞ నిచ్చెను.

ఇందు నాఁటి దేశీయపదము లెట్లుండెనో చూడుఁడు.

'ఫూంగిదిక్కు' అనఁగా ప్రాగ్దిక్కు అని యర్థమగుచున్నది. ఫూంగి, ప్రాక్ శబ్దభవము 'గుద్దవాడివిషయము' అన నేఁటి తూర్పుగోదావరి జిల్లాలోని తూర్పుడెల్టా ప్రదేశము. 'గుద్ద వాడి' గోదావరి శబ్దమునకు పైశాచి రూపమో, అపభ్రంశ రూపమో యైయున్నది. 'గో', గు, గాను 'రి' డి,గాను మాఱి యపభ్రంశమైనట్లు కాన్పించుచున్నది. ఈ 'గుద్దవాడి విషయ ము' మనకుఁ దెలిసినంతవఱకు మాధవవర్మ శాసనము మొద లు, క్రీ. శ. 1202 సంవత్సరమున నిచ్చిన 'మల్లవిష్ణువర్ధను'ని 'ఎఱుపల్లి' (రామచంద్రపురము తాలూకాలోని ఏరువల్లి) శా సనకాలమువఱకుఁ గాన్పించుచున్నది. అది రెడ్డపరిపాలనమున, ఇంచుమించు క్రీ. శ. పదునాల్గవ శతాబ్దమధ్యమునుండి 'భీమ మండల' సంజ్ఞతో మాఱినది. ఈగుద్దవాడివిషయమునే శ్రీనాథ మహాకవి 'భీమఖండ' మని ప్రసిద్ధమగు భీమేశ్వరపురాణమును వ్రాసియున్నాఁడు. దానికి సంస్కృతగ్రంథమును గలదు. అది స్కాందపురాణాంతర్గతమఁట ! ముద్రితమగు స్కాందపురాణ మున 'భీమఖండ' గాథలు లేవు.

ఇఁక దక్షారామవారి'తీర మనునది ఇటీవల 'తుల్యా' తీర మైనది. అది గోదావరినదియొక్క శాఖానదిగాఁ బ్రవహించుచు నిపుడు 'కాకినాడకాలువ'గాఁ ద్రవ్వఁబడియున్నది. ఈతుల్యానదీ మహాత్మ్యమునుగూర్చి పెక్కుగ్రంథములను రచించిన 'ఏనుఁగులక్ష్మ ణకవి'తుల్యామాహాత్మ్యము' అను నాలాశ్వాసముల గ్రంథమును

జేసియున్నాఁడు. 'పులిబూంరు' నేఁడు 'పొలమూరు' అనుపేరు కలదై నది. పులిబూంరుకు సరిహద్దు గ్రామమగు 'మయేంద వాటకి' నేఁడు 'మహేంద్రవాడ' అనుపేరుగల గ్రామ మైనది. 'కమ్మరాష్ట్రము' గుంటూరుజిల్లాలోని 'కమ్మనాఁడు' అనుపేరు గలది. 'కుండక' మెద్దియో తెలియదు.

ఇవన్నియుఁ గాలాంతరమునఁ బొందిన జనుల యుచ్చారణభేదములచేతను, స్థలాభిమానమున జనులు వానిని మహత్తు కలవానినిగా భావించుటచేతను గలిగిన మార్పులు

ఈశాసనమున_'హస్తికోశ, వీరకోశ' గణములు విషయ పరిపాలక సంఘములుగాఁ గాన్పించును. ఆసంఘములు నేఁటి 'రివిన్యూ, పోలీసు' డిపార్టుమెంటులవంటివై యుండును.

ఈమాధవవర్మశాసనములోనె లభించిన 'జయసింహ వల్లభుని' మఱియొక 'పొలుమూరు' శాసనమును గలదు. అది మాధవవర్మశాసనమునఁ బ్రతిగ్రహీత యగు 'శివశర్మ' యొక్క పుత్రుఁడగు 'రుద్రశర్మ'కు, పొలమూరునే మరల నగ్రహారముగా స్థిరపఱచిన యంశము లున్నవి. మాధవవర్మకును 'జయసింహావల్లభు'నకును 30, 40 సం॥ రములు మాత్రమె కాలభేద ముండును.

జయసింహావల్లభుని శాసనములో, మాధవవర్మశాసనములోని 'పూంగిదిక్కు' అనుశబ్దము లేదుగాని 'కుండక' శబ్ద

మునకు మాఱు 'అననపుర' వాస్తవ్యుఁడు రుద్రవర్మయనికలదు. తక్కిన దేశీయ పదములన్నియు సమానములే.

జయసింహావల్లభుని యనంతరమున వేఁగీదేశపరిపాలకుఁడై 'ఆఱు' మాసములె పాలించి మృతినొందె ననఁబడు జయసింహా వల్లభుని సోదరుఁడు 'ఇంద్రవర్మ' యొక్క 'క్లొణ్ణనూగూరు' శాసనమున దేశీయపదము లెట్లుండెనో చూడుఁడు.

## * ఇంద్రవర్మశాసనము

స్వస్తిశ్రీమతాం సకల భువనసంస్తూయమాన మానవ్యసగోత్రాణాం, హారీతీపుత్రాణాం, స్వామిమహాసేనపదానుధ్యాతానాం కౌశికీవరప్రసాదలబ్ధరాజ్యానాం, భగవన్నారాయణపరప్రసాద లబ్ధవరాహలాంఛ నేక్షణ క్షణ వశీకృతాశేష మహీభృతాం, అశ్వమేధావభృథస్నాన పవిత్రీకృతమానస శరీరాణాం, స్వయశో విషయీకృతత్రైలోక్యానాం, చళుక్యానాం, కులమలంకృత్య, నిజజన్మనా విరాజమానః. శ్రీ 'కీర్తివర్మ' మహారాజస్య నప్తా, శ్రీవిష్ణువర్ధన మహారాజః, రణముఖగతరిపువిజయసముపలబ్ధ శ్రీవధూనివాసాయమాన విపులవక్షస్థలస్య పుత్రః, శక్తిత్రయసమధిగత మహాఖ్యాతివిభూతి త్రివర్గసేవానిపుణః, పురాణపురుషఇవ బహులోకస్తుతః, పురారాతి

* ఈశాసన మిదివఱకెచ్చటను ప్రకటింపఁబడలేదు. దీని నొకమిత్రుఁడు గుంటూరు మండలమున సంపాదించి నాకిచ్చియున్నాఁడు. మద్రాసుమ్యూజియమునకు దీని నిచ్చితిని ఇది యపూర్వమైన శాసనముని శోధకులు తలంచుచున్నారు.

రివ భూతగణప్రియః, ద్వితీయఇవ మకరధ్వజః, పంచమ ఇవ లోక పాలః, పృథాగ్రసుతఇవ సత్యసంధః, శరత్కాలఇవ కృతబంధుజీవో త్సవః, పూర్వాచలేంద్రఇవ మిత్రోదయానుకూలమహిమా, మహీ పతి మకుటతటఘటిత మహారత్నమరీచి మంజరీరంజిత చరణార వింద యుగళః, శ్రీంద్రవర్మమహారాజః. త్యాగధేన్వపరనామధేయః ఉదకపూర్వకం సర్వాకర పరిహారోపేతం బ్రహ్మదాయీకృత్య, 'కొ ణ్డనూగూరు' నామగ్రామం ప్రాదాత్. తస్యగ్రామస్య దిగ్విభాగాః. ఉ త్తరతః 'ముజుణూరు' నామ గ్రామః, పూర్వతః 'పగునూరు' నామ గ్రామః, దక్షిణవిభాగవస్థితః 'చెఱుపూరు' నామగ్రామః, పశ్చిమతః 'ఇర్చులి' నామగ్రామః, ఏతేషాంగ్రామాణాంమధ్యే నివసీకృతవాజ సనేయచరణస్య 'దుగ్గశర్మణః' బ్రహ్మవిహితకర్మనిరతస్య, ఇఙ్జ శూరోచ్ఛయనామధేయస్య పౌత్రాయ, అభిజనవిద్యావృత్తవతః, భార ద్వాజ సగోత్రస్య విష్ణుశర్మణః పుత్రాయ వేదవిద్వత్ప్రసంస్తూయ మానచరితాయ, 'చణ్డిశర్మణే' మాతాపిత్రో రాత్మనశ్చపుణ్యావాప్త యే, ఇతిచ భావినో రాజర్షీన్ యథోపచార పురస్సరం సమ్మానయతి. ఆర్య '(హూం)? పళగగనతిలకభూత 'కొణ్డివర్మణా' మహారాజస్య సుత ఇంద్రవర్మణో నామధేయ విజ్ఞాపనయా, తస్యాజ్ఞప్తి రేవం "ఆలపాకబోళ్, నెప్పిలాళ్, సోమయాజులవెళ్లెక్కిబోళ్, మారట

బోళ్" అపిచ మోహాల్లోభా ద్వా యః కశ్చి ద్విఘ్నకర్తాస పంచమ హాపాతకయుక్తో భవిష్యతి. ఇతిచ. వేదవ్యాసస్యశ్లోకశ్చాత్ర(నిఘ్న తో) భవతి. గోవిప్రబాలయోషిత్తపస్వినః యా గతి స్సా భవే ద్వృ త్తిం హరతి శాసనాంకితాం. 'షష్టిం వర్షసహస్రాణి స్వర్గే తిష్ఠతి భూ

మిపః, ఆక్షేప్తా చానుమంతా చ తాన్యేవ నరకే వసేత్. బహుభి ర్వసుధా దత్తా బహుభిశ్చానుపాలితా. యస్యయస్య యదా భూమి స్తస్య తస్య తదా ఫలం. ఇతి కనకరామలిఖితే శాసనే చతుష్షష్ట్యంశః. ఏతేషాం ప్రాల్గాం కుళ్లేకాంశః. చోడబోళ్ తృతీయాంశః*.

శైశాసనమునందలి సంస్కృతవాఙ్మయము సాలంకృతమును దీర్ఘసమాసయుక్తమును, ఇంచుమించుగ నాకాలమున నే వ్రాయఁబడుచుండిన బాణమహాకవియొక్క 'కాదంబరి' కావ్య సంబంధమగుగాలి, సోఁకినదానివలెఁ గాన్పించుచున్నది.

ఇందుండిన నాఁటిదేశీయపదములగు "(1) ఆలపాకబోళ్, (3) నెప్పిలాళ్, (3) సోమయాజుల వెళ్లెక్కి-బోళ్, (4) మారటబోళ్, (5) ప్రాల్మాంకుళ్, (6) చోడబోళ్." అను పదములు, కురవగాహముగా నున్నవి.

కాని పదాంతములందలి 'ళ' కారము కాలాంతరమున 'ప్రథమాబహువచన' రూపప్రత్యయము మగు లు వర్ణక మైనట్లు శాసనశోధకులకుఁ దెలియునగును. 'బోళ్' పదము' పోలును అను పదముయొక్క ప్రాచీనరూపముగాఁ గాన్పించుచున్నది. ఆ పదజాలము శాసనస్థధర్మమును వ్యర్థముచేసినవారికిఁ గలుగు పాపమును, దానిని స్థిరపఱచువారికిఁ గల్గుపుణ్యమును దెలుపు

* ఈశాసనము నిచట వ్రాయుటలో మూలమునందలి వర్ణరీతిని వ్రాయక, ఇపుడు మన ముచ్చరించుపద్ధతినే వ్రాసితిని. క్రిందగీఁతలు పెట్టినభాగములను మాత్రము యథామాతృకగానె వ్రాసితిని.

నవిగా నున్నవి. 'సెప్పిలాళ్' అనునది 'నెరపినవారు' అని మాఱి నట్లు 'మల్లవిష్ణువర్ధనాదుల' శాసనములలోఁ గాన్పించును.

ఇందు దానప్రతిగ్రహీత యగు 'చండిశర్మ' యొక్క పితామహుఁడు 'దుర్గశర్మ' యనియు నాతఁడు 'ఇజ్జభూరోబ్బ యఁడు' అను నామధేయము కలవాఁ డనియుఁ జెప్పఁబడెను. నిఘంటువులలో 'బోయ' శబ్దమునకు 'కిరాతుఁడు, పాలకిమోయువాఁడు' అని యర్థములు కలవు. ఈశాసనమునందలి 'ఇజ్జభూరోబ్బయఁడు' వాజసనేయచరణుఁడు. అనఁగా, 'శుక్లయజుర్వేదముఁ' జదివినవాఁడు. భారద్వాజసగోత్రికుఁడునై యుండుటచే నీతఁడు 'ప్రథమశాఖాబ్రాహ్మణుఁ' డగుట నిశ్చయము. మఱియు 'ఇజ్జభూరోబ్బయఁడు' బ్రహ్మవిహితకర్ముఁ డని చెప్పఁబడినది ఇందువలన నాతఁడు బ్రాహ్మణుఁడే కాని 'బోయ, జాతివాఁడును, పాలకి మోయువాఁడు' ను గాఁ డని స్పష్టమగుచున్నది.

బోయశబ్దము 'గ్రామపురోహితుఁడు' అను నర్థమున హైదరాబాదు రాజ్యములోని కొన్నిపల్లెలలో వాడుకొనఁబడుట కలదు. తూర్పుగోదావరీమండలమున నేఁడును పల్లెలయందు శూద్రులయిండ్లలో నగు 'పితృ' కర్మమునందు గ్రామపురోహితున కిచ్చు 'ఆమదానము' ను 'బోజి' యని చెప్పఁబడుచున్నది. 'బోయి' కి (గ్రామపురోహితునకు) ఇచ్చు 'ఆమద్రవ్యము' బోజిగా మాఱియుండును. శాసనమునందలి 'ఇజ్జభూ

ర్బోయఁడు' ఇఱ్ఱఖా రను నొకగ్రామమునకుఁ బురోహితుఁడని తోఁచెడిని. *

శాసనపుతుదిని 'ఇతికనక రామలిఖితే శాసనే చతుష్షష్ట్యం శః' అని కలదు. శాసనలేఖకుని నామములు శాసనాంతమున లిఖింపఁబడుట కిదియే ప్రారంభ మని తోఁచుచున్నది. ఇందరివర్మశాసనమునకుఁ బూర్వమున నుండిన 'శాలంకాయన, విష్ణుకుండిన' రాజుల శాసనములలోఁ గాని, ఇంద్రవర్మయొక్క 'పెద్దతండ్రి, తండ్రి, అన్న' యగు 'రెండవపులికేసి, కుబ్జ, విష్ణువర్ధన, జయసింహవల్లభు'ల శాసనములలోఁ గాని యీ సాంప్రదాయము కాన్పింపదు. పిమ్మట 'చాళుక్య, కాకతీయ, రెడ్డి'రాజుల శాసనములలో నీసాంప్రదాయ ముండుటయేగాక, నేఁడును, 'దస్తావేజు,నోటు' వ్రాయువారియొక్క పేరును 'దస్తావేజు, నోటు'లఁ దప్పక యుండవలయు ననునిధి యేర్పడినది.

శాసనములలోఁ గొంతభాగము కాక, ఇంచుమించిశాసనమున కేఁబదియాఱువరేండ్లకుఁ బిమ్మట నుద్భవించిన యొకసంపూర్ణమగు చిన్నతెనుఁగుశాసనమును, నాఁటి వాఙ్మయభాషాస్వరూపముఁ జూపుటకు వ్రాయుచున్నాను.

---

* పై 'బోయ' శబ్దము, దానప్రతిగ్రహీతలలో 'సర్వలో కాశ్రయుని' 'చందలూరు' శాసనమునను గలదు. ఇంద్రకీలపర్వతశాసనమున 'త్రికోటిబోయ' శబ్దము కాన్పించుచున్నది. ఆశాసనములలో 'బోయ' శబ్దములకుఁ బూర్వముననున్న 'సంక్రి, త్రికోటి' మొదలగుశబ్దము లానాఁటి గ్రామనామములని తలంపవలసియున్నది.

## * పొట్లదుర్తి—మాలెపాడుశాసనము

(1) స్వస్తి(—) శ్రీ శోజ్షమహారాజు ల్లొళన ఇన్పృజ్షొలి
(2) అణపోతులు రేవణకాలు పుర్దణకాలు ఇచ్చిన వ
(3) న్నసపెన్నాఅ ఇశతేనికిన్(—) తేని జ్షచ్చినవాణ్డు(ప)
(4) (ఞ్చ) మహాపా(త)కుణ్డకున్(—)
(5) అని వెరువులికితమ్. (—)

ఈశాసనమునందలి భాష కర్థము సులభసాధ్యము కాదు. ఇంకను నిట్టిశాసనములు పెక్కు లిపు డిపుడు లభించి, ప్రకటింపఁబడుచున్నవి. వానియందు మనయాంధ్రముయొక్క పరిణామము తెల్లముకాఁగలదు.

ఇట్లు నియమహీనమైన భాషనన్నయకుఁబూర్వమునూఱు నూట యేబదియేండ్లనాఁడు 'కర్ణాట' దేశీయుల సంపర్కముచే గేయములకు నుపయోగపడు 'ద్విపద, అక్కఱ, మధ్యాక్కఱ, సీసము, గీతము' మొదలగు ఛందోబద్ధరచనలుకలదై తెనుఁగుదేశమునఁ బ్రసరించి 'రాజసేనానులయొక్కయు, మాండలికుల యొక్కయు' శాసనములలో మహారాజులయొక్క శాసనముల

---

*ఈశాసనమును బహుశాసనశోధకులు, నాకు మిత్రులునగు శ్రీమల్లంపల్లి సోమశేఖరశర్మ గారు ప్రకటించియున్నారు. ఈశాసన కాలము క్రీ.శ ఏడవ శతాబ్దమని వారితలంపు. ఎనిమిదవశతాబ్దమని కొందఱితలంపఁట! ఇంతకుముందు వ్రాయఁబడిన 'ఇంద్రవర్మ' శాసనములోని దేశభాషకంటె నిది కొంచెము తేటగ నున్నదనుకొనుచున్నారు.

లోని సంస్కృతశ్లోకములకుఁ బ్రతిగా వ్రాయనారంభింపఁబడి నది.

నాఁటిపదములలో గ్రామపురోహితుఁ డనునర్థముగల 'బోయ' వంటి పదము లంతరించినవి. 'పులిబూంరు, మైందవాటకి' మొదలగుపదములు రూపాంతరము నొందినవి. ఇట్టి యాంధ్రభాషకు వ్యవస్థ యొకటి యవసర మయ్యె. ఇట్లుండ, క్రీస్తునకుఁ బిమ్మట పదునొకండవశతాబ్దారంభమున నాంధ్రుల పుణ్యవిశేషమున శ్రీశైలాది మహేంద్రగిరిపర్యంతముఁగల త్రిలింగదేశమును రాజమహేంద్రపురాధీశుఁడై రాజరాజ నరేంద్రుఁడు పరిపాలించుట కలిగెను.

రాజరాజనరేంద్రునకుఁ బూర్వ మీయాంధ్రావని, పర రాజులదాడులచేతను, చాళుక్యుల యన్యోన్యకలహములచేతను క్షోభించెను. రాజనరేంద్రుని తండ్రియగు 'విమలాదిత్యుఁడు' బలవంతులగు చోళులతో సంబంధ బాంధవ్యములు కలుపుటచే నాంధ్రావనికి 'స్వచక్ర పరచక్ర' భీతులు పోయినవి. పదునొకండవ శతాబ్దారంభమున, భరతఖండోత్తరభాగమునందు 'గజనీమహాం మదు' వలన నుపద్రవములు సంభవించినను, నాఁటిభారతవీరులా మ్లేచ్ఛులను భరతఖండమునం దొక్క యంగుళముమేరనైనను దక్కనీయ రైరి. యావద్భరతఖండమునందును విజ్ఞానవాయువులు వీచెను. 'భోజ, కైయట, మమ్మట, క్షేమేంద్ర, బిల్హణ, హరదత్త, విజ్ఞానేశ్వర, హేమచంద్ర, సోమదేవ' ప్రముఖులగు మహా

కవులు సంస్కృతభాషయందీ పదునొకండవ శతాబ్దమధ్యముననే యమూల్యగ్రంథములను రచించిరి. అందు భోజుఁడు, క్షేమేంద్రుఁడు, మమ్మటుఁడు' కావ్యవ్యవస్థఁగూర్చిన యైదలంకార గ్రంథములనురచించిరి. *క్షేమేంద్రుని 'ఔచిత్యవిచారచర్చ' అనుగ్రంథము అలంకారశాస్త్రవిదులకమూల్యమైనది. భోజుని సంస్కృతభాషాపోషణము జగద్విదితము. అందుకై క్రింది రెండు చిన్నకథలుదాహరింపఁ దగియున్నవి.

భోజుఁ డిట్లు శాసించెనఁట !

•బ్రాహ్మణుఁడైనను విద్యనేర్వనివాఁడైనచో, నాపట్టణమునకు వెలుపలనుండవలయును. కుమ్మరి యైనను విద్వాంసుఁడైనవాఁడు నాపట్టణమున నివసింపవచ్చును." అని.

(1) ఇట్లుండ నొకప్పుడు అపరాధశోధకులు, 'సాలె'వాని నొకనిని, నీవు మూఢుఁడవుగాన నగరమున నుండరాదని నిర్బంధింప, వాఁడు రాజసన్నిధికి వచ్చి ప్రభువా ! నాకు విద్యలేదని నన్న న్యాయముగా మీభటులు వెడలఁగొట్టుచున్నారన, భోజుఁడది విని నీకు విద్య కలదా? యన, వాఁడిట్లనెను.

---

*భోజుఁడు (1)సరస్వతీకంఠాభరణము (2)శృంగారప్రకాశము అనువానిని రచించెను. క్షేమేంద్రుఁడు (1)ఔచిత్య విచారచర్చ (2)కవికంఠాభరణము(3)సువృత్తతిలకము అనువానినిఁ జేసెను, మమ్మటుఁడు కావ్యప్రకాశముఁజేసెను.

•శ్లో. విప్రోఽపియోభవే న్మూర్ఖః స పురాద్బహిరస్తు మే
కుంభకారోఽపి యో విద్వాన్ సతిష్ఠతు పురే మమ॥

శ్లో. కావ్యంకరోమి నహి చారుతరంకరోమి
యత్నాత్కరోమి యది చారుతరంకరోమి
భూపాలకాళి మణి మండితపాదపీఠ !
భోసాహసాంక ! కవయామి వయామి యామి ! ॥

తా॥ రాజులయొక్క కిరీటములయందలి మణులచేఁ బ్రకాశించు పాదపీఠముగల మహారాజా ! ఓ సాహసాంక ! నేను కావ్యముఁ జేయఁగలను. కాని యది యంతగా బాగుండదు. ప్రయత్నించి చేసితినేని బాగుగఁ జేయఁగలను. నేను, కవిత్వమును జెప్పఁగలను. నేయఁగలను. (నీకిష్టములేనియెడల) వెడలిపోవుచున్నాను.

అనియత్యద్భుతరీతిని సాలెవాఁడు శ్లోకరూపకముగాఁ బ్రత్యుత్తరమీయ భోజుఁ డానందించి వానిని బహూకరించి పంపెనఁట !

(2)మఱియొకప్పుడు భోజమహారాజు వేఁటకువెళ్లి వచ్చుచుండ పాలకిమోయు బోయివాఁడు భుజము పైనుండిన బొంగు నేదియొ బాధచే హెచ్చు తగ్గుగఁ బట్టుచుండెను. భోజుఁ డదిచూచి సంస్కృతభాషలోనె

*శ్లో. అయ మాందోళికాదండో తవబాధతి కిం భుజే
(ఈపాలకిబొంగు నీభుజమును బాధించుచున్నదా ?)
అనఁగా బోయివాఁడు—

*ఈశ్లోకము కొంచెము భేదముతో 'ప్రకాశవస్తుని రసార్ణవాలంకారము' అను గ్రంథమున నపశబ్దప్రయోగమున కుదాహరణముగాఁ జూపఁబడెను, దీని నట భోజుని సంబంధమైనదిగానె సూచింపఁబడెను,

శ్లో. నాయ మాందోళికాదండో తవ బాధతి బాధతే॥
)ఈపాలకిబొంగు బాధించుట లేదుగాని నీ 'బాధతి' యను తప్పు ప్రయోగమే నన్ను బాధించుచున్నది.)

అని శ్లోకమును బూర్తిచేయుచు 'ఆత్మనేపదముగా బాధతే' అని ప్రయోగింపఁదగిన క్రియను 'బాధతి' అని పరస్మైపదముగాఁ బ్రయోగించుటను తప్పుగాఁ జూపి యున్నాఁడఁట !

పైయంశములు నాఁటి సంస్కృత వాఙ్మయ మెట్లు మిన్నుముట్టెనో చూపుటకై యుదాహరింపఁబడెను. ఆకాలముననే 'నన్నయ' భారతమునాంధ్రీకరించుచుండుటచే నా సంస్కృతపు గాలి నన్నయకవితకును దగిలినది.

మన రాజరాజనరేంద్రుని యాస్థానమునందును సంస్కృతపండితులు తక్కువగా లేరు.

♦"అపారశబ్దపారగులైన వైయాకరుణులును, భారతరామాయణాద్యనేకపురాణప్రవీణులైన పౌరాణికులును, మృదుమధురరసభావ భాసుర నవార్థవచన రచనా విశారదులైన మహాకవులును, వివిధ తర్కవిగాహిత సమస్తశాస్త్రసాగర గరీయఃప్రతిభులైన తార్కికులును, నాదిగాఁగలుగు విద్వజ్జనంబులు పరివేష్టించి కొలువ"

ఇట్టి సమయమున రాజరాజనరేంద్రుఁడు దేశకాలపరిస్థితులఁ జూచెను. తన మాతామహుని దేశమగు ద్రవిడదేశ

♦ భా॥ ఆ. 1—8.

మున——ద్రవిడ వాఙ్మయమున, భక్తిజ్ఞాన వైరాగ్యాది బోధకములును, రసపోషకములు నగు పెక్కుగ్రంథము లదివఱకె యుద్భవించి వృద్ధినందుచుండుటఁ బరికించినాఁడు. జ్ఞాతులుగల కర్ణాటకదేశమున జైనమతోద్బోధకములై, రసవంతములగు 'విక్రమార్జునవిజయము' మొదలగు కావ్యములాదేశభాషలోఁ బుట్టుచుండుటఁ దెలిసికొనినాఁడు. కర్ణాటకుల సంపర్కముచే జైనమతము తెలుఁగుదేశమున వైదికమతమును తలక్రిందు చేయునట్లు కాన్పించెను.

ఇట్లుండఁ దన యాంధ్రదేశమేల తోడిదేశములకుఁ దీసిపోవలయును? విమతమున కేల చోటీయవలెను? ఇందులకు నార్యమతబోధకమై, కావ్యరస స్ఫూర్తి కలదై, ధర్మాదులను బోధించునదియై, హృదయంగమ కథాసంవిధానముకలదై యొప్పు గ్రంథము నాంధ్రభాషలో నేల వెలయింపరాదు? అని రాజరాజు తలఁచెను. అందుల కనుకూలుఁడగు కవి కావలెను.

ఆలోచింపఁగా, తన కులక్రమాగత పురోహితుఁడు, బ్రహ్మాండాది పురాణవేత్త, విపుల శబ్దశాసనుఁడు, సంస్కృతాంధ్ర కావ్యరచనాపారీణుఁడు, బుద్ధివిశారదుఁడు, మంచి ప్రతిభగలవాఁడు, అవిరళ జపహోమతత్పరుఁడు నగు నన్నయభట్టే యట్టి గ్రంథముఁ జేయఁదగినవాఁడుగఁ గాన్పించెను. దాని కనుకూలముగా 'సంస్కృత, ప్రాకృత, కర్ణాట, పైశాచి' భాషలఁ బండితుఁడై, కవియై, పశ్చిమ చాళుక్యులకడఁ

గొంతకాలము మంత్రియైన 'నారాయణభట్టు' అను మేధాశాలి యేకారణముననో రాజనరేంద్రు నాస్థానమునకు రాఁగా, రాజనరేంద్రుఁ డాతని నాదరించి 'నందమపూఁడి' యను నగ్రహారము నిచ్చెను. పై విధమగు సద్గ్రంథమును జేయింపు తలంపును నన్నయాదులతోఁ జెప్పి యట్టి గ్రంథమేదని తర్కింప నట్టిది భారతమే యని పండితులచే నిర్ణయింపఁబడెను. కారణ మేమన—

సీ. ధర్మతత్త్వజ్ఞులు ♦ ధర్మశాస్త్రంబని
యధ్యాత్మవిదులు వే♦దాంత మనియు
నీతి విచక్షణుల్ ♦ నీతిశాస్త్రంబని
కవి వృషభులు మహా♦ కావ్య మనియు
లాక్షణికులు సర్వ ♦ లక్ష్యసంగ్రహ మని
యైతిహాసికు లితి♦హాస మనియుఁ
బరమ పౌరాణికుల్ ♦ బహుపురాణసముచ్చ
యం బని మహిఁగొని ♦ యాడుచుండ॥...

... ... ...

వ్యాసమహర్షిచే రచియింపఁబడుటయేగాక,

చ. హిమకరు దొట్టిపూరు భర♦తేశ కురుప్రభు పాండుభూపతుల్
క్రమమున వంశకర్తలనఁ♦గా మహి నొప్పిన యస్మదీయవం
శమునఁ బ్రసిద్ధులై విమల♦ సద్గుణశోభితులైన పాండవో
త్తములచరిత్ర నాకు సత♦తంబు వినంగ నభీష్ట మెంతయున్.

అనెడి మహారాజుయొక్క యభీష్టముకూడ దాని కను కూలమగుటచేతను, సంస్కృతభారతమునందలి కథను 'ధర్మ, వేదాంత, నీతి, కావ్య, ఇతిహాసా'ద్యంశములు స్ఫుటమగు చుండ నారాయణభట్టు సహాయముతో నన్నయభట్టు దాని నాంధ్రీకరింప సిద్ధపడెను. కాని యాంధ్రమున కప్పటికొక వ్యాకరణముగాని, లక్షణగ్రంథముగాని లేనందున ప్రాకృత వ్యాకరణముల ననుసరించి, దేశమున వాడుకలోనుండిన యుక్తములగు పదములను సమకూర్చి, ద్రావిడభాషలోని సాంప్రదాయములను వీలుకొలఁది చేర్చి, కర్ణాటకభాషలోని ఛందమును జాల స్వీకరించి, నాఁడు మిగుల వ్యాప్తిలోనుండిన సంస్కృతభాషాసంబంధమునే విశేషముగఁ జేర్చి, నన్నయమహాకవి భారతము నాంధ్రీకరించెను.

నన్నయకుఁ బూర్వమునఁ దెనుఁగునఁ దప్పులతోఁగూడిన శాసన పద్యావళివంటి స్వల్పగ్రంథములేకాని, మంచిగ్రంథము లేమియు లేనందునను, 'నన్నయ' గ్రంథరచనము 'సంస్కృత, ద్రవిడ, కర్ణాటక' కవిత్వములకు భిన్నమగురీతిని రచించుటచేతను నాతనిగ్రంథముపైఁ బెక్కుపెద్దవిమర్శనములు బయలుదేఱ, నా వివాదములలో నారాయణభట్టుతోడై నన్నయపక్షముననుండి సమర్థించుట చేతనె నన్నయమహాకవి తనభారతములో, 'నారాయణభట్టు' భారతఘోరరణమున నారాయణుఁ డర్జునకుఁదోడ్ప

డినట్లు తనకు భారతాంధ్రీకరణములోఁ దోడ్పడె నని చెప్పియు న్నాఁడు.

ఏదేని యొకక్రొత్త పద్ధతిని గ్రంథము వ్రాసిన నది పూర్వ పద్ధతికి వ్యతిరేకమని, తెలిసిన వారును, తెలియనివారును గూడ నవీనఫక్కిక, గల గ్రంథమునుదానినివ్రాసినవానిని ధిక్కరించుచుఁ దిరుగఁబాటుచేయుట లోకసామాన్యముగ నేఁటికిని గలదు.

నన్నయమహాకవి లోకజ్ఞుఁడు కావున, కర్ణాటకాదిభాషలలోవలెఁ దెనుఁగునను, సంస్కృతాంధ్రభాషామిశ్రమములగు-'అవసరపడి, భయపడి, అవమానపాటు భంగపాటు, నీకారణము, నీ తదర్థము, హంసపిండు, వాడిమయూఖముల్' మొదలగు మిశ్రమసమాసములను బెక్కింటిని దేశీయపదములతోఁ గలిపి తనభారతమునఁ జేర్చియున్నాఁడు. ఇటీవలి యాంధ్ర వైయాకరణులు కొంద ఱట్టి ప్రయోగములు తప్పు లని చెప్పుదురుగాని, నన్నయప్రయోగములే తెనుఁగు వ్యాకరణములను వ్రాయుటకు గతియగుచుండ, నాతనిప్రయోగములు తప్పనుటకు వీరికాధార మేమి? పూర్వకవి ప్రయోగముల ననుసరించియే కదా వ్యాకరణము లేర్పడుట.

సంస్కృతవ్యాకరణ విరుద్ధముగ నన్నయ ప్రయోగించి, నది తప్పనవలయును. నన్నయ ప్రయోగములలో 'ముష్టాముష్టి ధారుణీ'శబ్దములు, సంస్కృతవ్యాకరణదుష్టము లందురు.అందు

'ముష్టాముష్టి' ప్రయోగము నవీనవ్యాకరణజ్ఞుల మతము కాదని యు, ప్రాచీనుల మతమనియు 'సిద్ధాంతకౌముదీ' వ్యాఖ్యాత యగు 'మనోరమాకర్త' వ్రాసియున్నాఁడు. 'ధారుణి' శబ్దము మాత్రము నేఁటివఱ కెవ్వరును సాధువని సాధింపరైరి. ఇట్టివి కాళిదాసాదుల గ్రంథములలోను బెక్కులున్నవి. అది లెక్క లోనిది కాదు.

---

## నన్నయభట్టమహాకవి

—: 0 :—

నన్నయమహాకవి గ్రంథకరణమునఁ దెనుఁగు వారికి మార్గదర్శకుఁ డైనట్లు, కవిత్వధోరణికిని మార్గదర్శకుఁ డైనాఁడు. ఆతనికవితాగమనము భావగంభీరయుక్తమై 'గంధగజ గమనముఁ' బోలియుండును. అందువలననే, ఎఱ్ఱనామాత్యుఁ డిట్లనినాఁడు.

ఉ. ఉన్నతగోత్రసంభవము • నూర్జిత సత్త్వము భద్రజాతిసం
పన్నము నుద్ధతాన్యపరి•భావి మదోత్కటము న్న రేంద్రపూ
జోన్నయనోచితంబు నయి•యొప్పెడు నన్నయభట్టకుంజరం
బెన్న నిరంకుశోక్తగతి • నెందును గ్రాలుటఁ బ్రస్తుతించెదన్

అట్టి నన్నయ కవితావనిత యొక్క గమనమును రెండుమత్తేభ ములచే దిక్ప్రదర్శనముగాఁ జూపెదను.

మ. మదమాతంగ తురంగ కాంచన లసన్మాణిక్య గాణిక్య సం
పద లోలింగొనవచ్చియిచ్చి ముదమొప్పం గాంచి సేవించిర
య్యుదయాస్తాచలసేతుశీతనగమధ్యోర్వీపతుల్ సంతతా
భ్యుదయు న్ధర్మజుఁదత్సభాస్థితు జగత్పూర్ణప్రతాపోదయున్
సభాపర్వము. 1 ఆ.

ఇందు కావ్యమునకు 'రసమాత్మ' యని చెప్పువారి పక్ష
మున 'అద్భుతరసము' కలదు. భారతసామ్రాజ్యలక్ష్మి పూర్వా
పరసముద్రమధ్యస్థమై, సేతుశీతాచలపర్యంతము సంపూర్ణముగ
నెప్పుడును 'నేచక్రవర్తికిని' లోఁబడి యుండలేదు. నేఁటి బ్రిటీషు
వారి భారతసామ్రాజ్యలక్ష్మియు,తద్విగ్రహముఁ జూడ, సంపూ
ర్ణ శోభితయున వీలుకాదు; ఈరాజ్యలక్ష్మియందు, నేపాళము,
గాంధారము' చేరక గ్రహణపుమొఱ్ఱలు కలదానివలె నున్నది.
'ఫ్రెంచి, పోర్చుగీసు' కాలనీలు శరీరమునందలి వివర్ణపుమచ్చలం
బోలి యున్నవి. నన్నయ చెప్పిన ధర్మజుని రాజ్యలక్ష్మి, సర్వాం
గ సుందరోపేతగాఁ జెప్పఁబడుటచే నపూర్వమై, అద్భుతరసము
చిప్పిలుచున్నది.

ఔచిత్యమె కావ్యమున కాత్మ యనువారి పక్షమున
నిందు మణిమయసభయందు, జగత్పూర్ణప్రతాపోదయుఁడై
యుండెఁ గాన ధర్మజునకు, మదమాతంగాదులఁ గానుకలుగా
నొసఁగి సర్వదేశప్రభువులు సేవించుటయను పాత్రౌచిత్యము పరి
పూర్ణమైయున్నది.

గుణము కావ్యమునకుఁ బ్రధానమనువారిపక్షమున, నిందు సొంపైన పదబంధము కలిగి శ్లేషగుణమున్నది.

'రీతి' యె కావ్యమున కాత్మయనువారిపక్షమున నిందు 'వైదర్భి' రీతి కలదు.

అలంకారము లుండినఁ గాని కావ్యమునకు శోభ లేదను వారి పక్షమున నిందు 'వృత్త్యనుప్రాసము' అను శబ్దాలంకారమును, 'ఉదాత్తము' అను నర్థాలంకారమును గలవు.

వేయునేల, కావ్యమున కెవ్వరెవ్వ రేవి ప్రధానములై యుండవలె నందురో యట్టియంశములన్నియు నీపద్యమున శోభించుచున్నవి. కావుననే యిది యుద్వితీయమగు పద్యమందురు.

నన్నయమహాకవి, ఎట్టియంశములు కవిత్వమునం దుండవలెనో, తనగ్రంథాదిని రాజనరేంద్రుని సభలోని కవులఁ గూర్చి యిట్లు చెప్పియున్నాఁడు.

" మృదుమధుర రసభావ భాసుర నవార్థవచన రచనా విశారదులైన మహాకవులు "

కవిత్వమునందలి పెలక్షణము లన్నియు నీపద్యమునం బూర్ణముగ నున్నవి. తాను చెప్పినయంశము లన్నిఁటిని కవి యిందుఁ జూపియున్నాఁ డేమొ ?

—• మఱియొక మత్తేభము. •—

మ. వివిధోత్తుంగ తరంగఘట్టన చల • ద్వేలావనైలావలీ
లవలీలుంగ లవంగ సంగతలతా•లాస్యంబు లీక్షించుచున్

ధవళాక్షుల్ సని కాంచి రంత నెమరం • దత్తురదేశంబునం
దవదాతాంబుజ పేనపుంజ నిభనంయ్యాశ్వోత్తమున్ దవ్వులన్.

ఆది. 2. ఆ.

కవిని 'శిల్పి'నిగాఁ దలంచియే తిక్కనమహాకవి 'నే నుభయభాషాప్రౌఢిఁ బాటించు శిల్పమునం బారగుఁడన్' అని' నిర్వచనోత్తరరామాయణమునఁ' జెప్పియున్నాఁడు. నన్నయకవి యను మహాశిల్పి, పైపద్యమున నెట్టిశిల్పముం జెక్కెనో చూడుఁడు.

ఏలకతీఁగెలు మొదలగునవి లవంగాదివృక్షములఁ జుట్టుకొనియుండ నచటనున్న సముద్రమునందలి పెద్దకెరటముల తాకుడుచేఁ బెతీఁగలు నాట్య మాడుచుండ 'కద్రువ, వినత' యను నిద్దఱుసుందరాంగనలాతీవల నాట్యములఁ జూచుచు నడచుచుండ నెదురుగఁ గొంతదూరమున 'పద్మాద్యావర్తములు' కలిగి, మృదు వైనశరీరముగల తెల్లనిగుఱ్ఱ మొండు కాన్పించెను.

అను నొకచిత్తరువును మహాకవి యిందుఁ జూపి యున్నాఁడు.

చిన్న ఫలకమువంటి యీామత్తేభపద్యమున నిన్నిశిల్ప భేదములఁ జూపిన నన్నయశిల్పియొక్క 'ఉలి' సున్నితమై లోతుగ చిత్రించునది యని తలంపవలసియున్నది.

ఇందు 'భయానక, శృంగారరసముల' భావశబలత తోఁ

గూడ 'వృత్త్యనుప్రాస, ఉపమాలంకారముల' నిమిడ్చియు న్నాఁడు. శ్లేషగుణ మున్నది.

పైపద్యములోని శిల్పమునే భావభేదముతో 'తిక్కన మహాకవి' యెట్లు విపులముగాఁ జిత్రించెనో కనుఁడు.

సీ. చుంచులఁ జిగురాకు ♦ జించి యాడెడు నలి
నెలిగించు గండుఁగో ♦ యిలలసొంపు
నలరుఁ దేనియఁ గ్రోలి ♦ యన్ను సోలంబుల
మురియుతేటుల నును♦మ్రోఁతయింపుఁ
దమిఁ బండ్లరసమాని ♦ తమలోనఁ జెలఁగుచుఁ
బలికెడు రాచిల్క ♦ పదుపురంగుఁ
గొలఁకుల కెలఁకులఁ ♦ గూడి క్రీడించుచుం
డెడు సంచతండంబు ♦ నడబెడంగుఁ

తే. దరఁగఁ దేలుచుఁ బూఁదీవఁ ♦ దగులఁబడుచు
వచ్చు చిరుగాలి సోఁకును ♦ మెచ్చిమెచ్చి
తగిలి కొనియాడుచును విన ♦ తయును గద్రు
వయును మున్నిటిచేరువ ♦ వనమునందు.

వ. మెలంగుచుండి రటయెడ.

చ. కరువునఁ బోసికో విధుని♦కాంతి సుధాబ్ధితరంగఁ దెచ్చిగం
డరఁ బొనరించిగో హరుజ ♦ టాస్థలికిం దొడవైన యేటిపె
న్నురువునఁ జేసిరో యన మ♦నోజ్ఞసితచ్ఛవి నుల్లసిల్లు సుం
దర తురగోత్తమంబు దవు♦దవ్వులఁ గాంచిరి చారులోచనల్

ఆను. 1 ఆ.

నన్నయ రచించిన 'కద్రూ వినతలు' సముద్రతీరవిహార మున నుచ్చైశ్శ్రవముఁ జూచుటయే, 'తిక్కన' తనయాను శాసనికపర్వములోని 'సుపర్ణోపాఖ్యానమున' సముద్రతీరమునం దలి వనమునఁ గద్రూ వినతలు విహరించుటయు, నుచ్చైశ్శ్రవ ముఁ జూచుటయు వర్ణించియున్నాఁడు. *

నన్నయశిల్పి చిత్రఫలకము చిన్నదైనను నందు (మత్తేభము) సూక్ష్మముగా విశేషభావములఁ జెక్కియున్నాఁడు. తిక్కనశిల్పి యొకపెద్దఫలకమును, మఱియొక చిన్నఫలకమును (సీస, చంపకమాలాపద్యములు) గూర్చి పెద్దదానియందు మున్నిటిచేరువవనములో 'గండుఁగోయిలలు చిగురాకులఁ ద్రుంచుచు నెలిగించుట, తుమ్మెదలు, పూఁదేనెలఁ గ్రోలి మత్తునొంది సంతోషముతో మృదువుగాఁ బాడుట, ఇంపైన రంగుగల చిలుకలానందముతోఁ బండ్లరసముఁ గ్రోలి తమలోనె చెలఁగుచుఁ బలుకుచుండుట, హంసలు సొగసుగ నడచుచు, కొలఁకులకెలఁకులఁ గూడి క్రీడించుచుండుట, వాని నన్నింటిఁ జూచుచు, కెరటములనుండి వచ్చు చిరుగాలి తాకుడును మెచ్చుచు విహరించుచుండు కద్రూవినతలను జిత్రించినాఁడు.

---

* అనుశాసనికపర్వములో 'సుపర్ణోపాఖ్యానము' తెనుఁగున ముద్రింపఁబడిన సంస్కృతభారతమునఁ గాని, ఔత్తరాహప్రతులలోఁ గాని లేదు. దాక్షిణాత్యప్రతులలోఁ గలదు. ఆప్రతులలోఁ గూడ మున్నిటిచేరువ వనవర్ణనము కాన్పింపదు; నన్నయవర్ణనముఁ జూచియే దానిని విపులీకరింపఁదలఁచి తిక్కన యట్లు వ్రాసియున్నాఁడు.

చిన్న ఫలకమున, 'చంద్రకాంతిని' ముద్దచేసి కూర్చిరా? గంగానదియందలి నురుగును మూసకట్టి చేసిరా? యనునట్లుండు సుందరమైన యుచ్చైశ్శ్రవమును 'కద్రూ, వినతలు' చూచుటను శిల్పించి యున్నాఁడు. నన్నయపద్యములో 'అళి, శుక, పిక, హంసలు లేవు. తిక్కనపద్యములో 'పెద్దవగుసముద్రకెరటములు, లతానాట్యములు, గుజ్జుమ్రుపైసుమలు' లేవు.

నన్నయపద్యములోని 'శ్లేష' గుణముఁబోలె నిందు 'ప్రసాద' గుణము కలదు. అందు భావశబలతవలె నిందుశ్శృంగారరసము కలదు. అం దుపమానాలంకారముఁబోలె నిందు 'భ్రాంతి' మదలంకారము కలదు. నన్నయ చిన్నపద్యమున విశేషాంశములఁ జూపియున్నాఁడు. తిక్కన రెండుపద్యములలో విశేషభావములఁ గూర్చియున్నాఁడు. నన్నయది సంస్కృతపదజాలము, తిక్కనది యాంధ్రపదవిసరము—నన్నయ కవిత, గజగమన యైనట్లు తిక్కనకవిత 'కలహంసయాన' యైనది. ఏది సుందరము రెండును భేద మెక్కడ? చదువరుల హృదయములలోనే

శిల్పి, యొక్కెడ నొకవిధముగు భావములఁ జిత్రించి యాభావములనె మఱియొకచోటునఁగూడ సమయానుసారముగఁ గూర్చి చిత్రించును.

"అమరావతి స్తూపమున 'గోతమీపుత్రశాతకర్ణి' చక్రవర్తియొక్క యౌవనమునందలి శృంగారలోలతయు, ఆతఁడె

'నాగార్జును' నుపదేశముచే స్వస్త్రీలతోఁగూడ భక్తుఁ డగుటయు, నొక 'గజము' మెరగల తెల్లనిశిలపైఁ జెక్కఁబడెను.* ఆ భావములనె 'భట్టిప్రోలు' స్తూపమునందును, నాశిల్పియె, నల్లని శిలపైఁ జెక్కియున్నాఁడు. ♦

అట్లే·తిక్కన శిల్పియుఁ దొలుత 'అళి, పిక, శుక, హంసల' చేష్టితములను శ్రీరాము నుద్యానవనమునఁ జిత్రించి, పిమ్మట దానినె కీచకు నుద్యానవనమునఁ గూడ నవస్థాభేదములతోఁ గూర్చియున్నాఁడు) చూడుఁడు__

## శ్రీరాముని యుద్యానవనవిహారము

సీ. తీఁగె యుయ్యెల లెక్కి ♦ తూఁగి యూఁచుచుఁ గూడి
పాడెడు మత్తాళి ♦ బాలికలను
బలుకులతోడన ♦ యలవడఁ దొడఁగియు
నేరని కీరకు ♦ మారికలను
నింపారు లేఁదూడు ♦ లేరి పిల్లలకుఁ బె
ట్టుచునున్న హంసకు ♦ టుంబినులను
ఫలరస మొండొంటి ♦ కెలమిఁ జెంచులనించు
తఱిఁ జొక్కు కోకిల ♦ దంపతులను

---

* ఈశిల యొటులనో బందరు జాతీయకళాశాలకుఁ జేరి మ్యూజియము పాలున జాగ్రత్త చేయఁబడెను.

♦ భట్టిప్రోలు స్తూపమునకు సమీపమున నున్న యొక దేవాలయ ముఖద్వారమునఁ దాపటము చేయఁబడియున్నది.

తే. జూచిచూచి యొండొరులకుఁ ♦ జూపిచూపి
చెలుల కెఱిఁగించి కొనియాడి ♦ చెప్పిచెప్పి
చిత్రహారి విహారసం ♦ సేవఁ దగిలి
యుల్లసిల్లిరి వనితయు ♦ వల్లభుండు.

నిర్వచనోత్తరరామాయణము. 8 ఆ.

కీచకుని యుద్యానవనవిహారము

సీ. ఇంపైన ప్రియకాన ♦ నిచ్చి నిల్చినమధు
వాదట నానుమ ♦ త్రాళి విభుని
జొట్టుపల్ పచరించి ♦ చుట్టు గ్రుమ్మరి మనో
రమ నియ్యకొలుపు మ ♦ రాళవిభుని
ఫలరస మొండొంటి కెలమిఁ జెంచుల కిచ్చు
మెయిన చొక్కెడు శుక ♦ మిథునములను
గమిఁబాసి తలిరుజొం ♦ పమునకు మెయిమెయి
దాఁకంగఁ జను పిక ♦ దంపతులను

తే. జూచిచూచి యుల్లంబున ♦ నేచి కోర్కె
లడరఁ జిడిముడిపడు ప్రమాను ♦ పడు వెడంగు
పడు వెనుంబడుఁ దల్లడఁ ♦ బడు దురంత
చింతబారికి నగపడు ♦ సింహబలుఁడు.

విరాటపర్వము-2 ఆ.

ఇంక నొకటిరెండు నన్నయ తిక్కనల పోలికలఁ జూతుఁడు:—

## నన్నయ

వ. ఇ ట్లేకతంబ యేకవస్త్రయై యోడనెక్కి వచ్చువారి నిరీక్షించుచున్న 'సత్యవతిం' జూచి యామునివరుండు దానియందు మదనపరవశుండై దానిజన్మంబుఁ దనదివ్యజ్ఞానంబున నెఱింగి యయ్యోడ నెక్కి దానితో నొక్కట చనిచని.

సీ. చపలాక్షి చూపుల ♦ చాడ్పున కెడ మిచ్చుఁ
జిక్కనిచనుఁగవఁ ♦ జీరఁగోరు
నన్నువ కౌఁదీఁగ ♦ యందంబు మది నిల్పు
జఘనచక్రంబుపైఁ ♦ జలుపు దృష్టి
యభిలాష మేర్పడ ♦ నట్లుండగాఁ బల్కు
వేడ్కతో మఱుమాట ♦ వినఁగఁ దివురు
నతిఘన లజ్జావ ♦ నత యగు నక్కన్య
పైఁ బడి లజ్జయుఁ ♦ బాపఁ గడఁగు

ఆ. నెంతశాంతు లయ్యు ♦ నెంతజితేంద్రియు
లయ్యుఁ గడు వివిక్త ♦ మయినచోట
నతులగోష్ఠిఁ జిత్త ♦ చలన మొందుదు రెందుఁ
గాముశక్తి నోర్వఁ ♦ గలరె జనులు.

ఆది. 3. ఆ.

పై యంశము 'పరాశరమహర్షి' సత్యవతితో నేకతము యోడ నెక్కినపుడు గల్గిన చిత్తచాంచల్యముతోఁగూడిన భావో

ద్రేకవర్ణనము. గీతమున నట్టిమహాస్త్రి యారీతిని వర్ణించుటకు హేతువును 'అర్థాంతర'న్యాసముతో నింపుగ సమర్థించియున్నాఁడు.

తిక్కన

చ. అని యని యుగ్గడించు ధృతి♦యల్లలనాడినఁ దల్లడించుఁ బై
కొను తలఁ పోరగించు మదిఁ♦గోర్కులుపేర్చిన నప్పళించు నె
ట్టన తెగ నగ్గలించు నచ♦టన్ జనులం బరికించు బుద్ధిదూ
లినవెన నెంతయుం గళవ♦ళించు మనోజవికారముగ్నఁడై.

. . . . . . . . . . . . . . .

సీ. తన్వంగి మవ్వంపుఁ ♦ దనులత నెసఁగెడు
నునుఁగాంతి వెల్లువ ♦ మునుఁగఁ బాఱఁ
గిసలయహస్తకెం ♦ గేల నేసారు క్రొ
మ్మించను లేమెండ ♦ మిగులఁ బర్వఁ
గమలాస్య ముద్దుమొ ♦ గంబు మెఱుఁగుల లే
మొత్తంబు పరిచుట్టు ♦ ముట్టికొనఁగ
ధవళాక్షి తొంగలి ♦ తఱచు ఱెప్పలచెన్ను
కప్పను చీకటి ♦ గవియుదేర
తే. బెగ్గలం బంతకంతకు ♦ నగ్గలింప
నొదవు చెమటతోఁ జిత్తంబు సెదరి యొందు
మెలఁగఁ దలఁ పేది యాసింహ ♦ బలుఁ డనంగు
పట్టి యాడెడు జంత్రంబు ♦ పగిది నుండె.

విరాటపర్వ. 2. ఆ.

ఇం దేవరివర్ణన మింపై యున్నది? భేద మెక్కడ? నన్నయ సంస్కృతపదభూయిష్ఠముగా గాని తెనుఁగున బాగుగఁ గవిత్వముఁ జెప్పలేఁ డనువారి మతము నాతనిసీసపద్యము త్రోసివేయుచున్నది.

ఇంక నొకటి.

నన్నయ.

ఉ. ధారుణిరాజ్యసంపదమదంబునఁ గోమలిఁ గృష్ణఁ జూచి రం
భోరు నిజోరుదేశమున నుండఁగఁ బిల్చిన యిద్దురాత్ము, దు
ర్వార మదీయబాహుపరివర్తితచండగదాభిఘాత భ
గ్నోరుతరోరుఁ జేయుదును యోధనమున్ గరణాంతరంబునన్.

సభాపర్వము. 2. ఆ.

ఇది ద్యూతసమయమున దుర్యోధనుఁడు ద్రౌపదిని దన తొడపైఁ గూర్చుండుమని సన్నఁ జేయుఁ జూచి భీముఁ డనిన పరుషోక్తులు—

తిక్కన.

శా. గంగానందనుఁగూర్చి ద్రోణుపని సక్కంజేసి కౌరవ్యపీ
రాంగము ల్దునుమాడి తత్ప్రబలసైన్యం బెల్ల మాయించి యు
త్తుంగ కౌంతేయుల కిమ్మహీవలయమున్ దుర్దాంత చం
చద్భుజాసంగస్ఫూర్జిత చక్రవిక్రమకళాసంక్రీడ నొప్పారెదన్.

భీష్మపర్వము. 2 ఆ.

ఇది భీష్ముని మూఁడవనాఁటియుద్ధమున నర్జునుఁడు డస్సియుండ, సమస్తపాండవసైన్యంబులు పరువిడ కృపకృతవర్మాశ్వత్థామ సైంధవాదు లాతనిపైఁబడినప్పుడు శ్రీకృష్ణుఁడు సాత్యకితో ననిన భీషణవాక్యములు.

'వీర, రౌద్ర, రస' పోషకమును దీర్ఘసమాసయుక్తమునగు 'ఓజో' గుణము రెండుపద్యములలోను నెట్లు స్ఫుటమై యున్నదో కనుఁడు.

పైని వ్రాయఁబడిన మూఁడంశములలోను నన్నయ తిక్కనలు మూలము ననుసరింపక స్వేచ్ఛాకల్పనములనే మూలముకంటె నింపుగఁ జేసియున్నారు. ఇంక నొక్కయంశమున మాత్ర ముభయుల పోలికలను జూపి యీయంశమును ముగింతును.

నన్నయ.

క. వెలయంగ నశ్వమేధం
బులు వేయును నొక్కసత్య ♦ మును నిరుగడలం
దుల నిడి తూఁపఁగ సత్యము
వలనన మొలుసూపుగౌర ♦ వంబున పేర్మిన్.

ఆది. 4-94.

తిక్కన.

తే. వాజమేధముల్ వేయొక్క ♦ వలనఁ బెట్టి
యలఘుసత్యంబు దక్కటి ♦ వలని యందు

నిల్పి తులఁ దూఁపఁగా నత్య • నిష్ఠలోని
యర్థమున కెత్తువచ్చె న • య్యధ్వరములు

ఆను. 2-43.

ఇందు మొదటిపద్యము లోకమున నెక్కుడు ప్రచారమున నున్నది. అందలి 'ములుసూపు' ప్రయోగమౌచిత్యవిశేషముఁ దెల్పును. నన్నయ తిక్కనకంటెఁ దక్కువవాఁడు కానందుననే,యాతఁడు నన్నయనుఁగూర్చి 'ఆంధ్రకవిత్వవిశారదుండు విద్యాదయితుం డొనర్చె మహితాత్ముఁడు నన్నయభట్టు దక్షతన్' అని ప్రశంసించెను. 'నన్నయ, తిక్కనల' భేదము, అట్లాంటిక్కు, పసిఫిక్కు, మహాసముద్రముల భేదము వంటిది.

నన్నయ సంస్కృతభాషాప్రౌఢిమ.

నన్నయనాఁటికి, తెనుఁగుభాష యున్నతస్థానమున నుండనందునను నేఁటియాంగ్లభాషవలె నాఁడు సంస్కృతమున నాదరము హెచ్చుగనుండుటచేతను, నాతఁడు సంస్కృతభాషనే పెద్దసమాసములతోఁ గూర్చినను, సులభముగ నర్థమగురీతిని సొంపుగ బ్రయోగించియున్నాఁడు. కొన్ని పద్యములలో 'డు' మొదిప్రత్యయములఁ దీసివేసి 'సు' బాదులఁ జేర్చిన, నవి సంస్కృతశ్లోకము లగును. అందుల కొకపద్యమును నిదర్శనముగఁ జూపెదను.

క. విమలాదిత్యతనూజుఁడు
విమల విచారుఁడు కుమార • విద్యాధరుఁ డు

త్తమచాళుక్యుఁడు వివిధా
గమవిహితశ్రముఁడు తుహిన • కరుఁ డురుకాంతిన్.

ఆ. 11. 1. అ.

శ్లో. విమలాదిత్యతనూజో
విమలవిచారః కుమార విద్యావాన్
ఉత్తమచాళుక్యో వివిధా
గమవిహితశ్రమ స్తుహినకరోరు కాంత్యా॥

పైపద్యములోని సంస్కృత మేమియుఁ గష్టము లేకయే తెనుఁగువలె నర్థ మగుచున్నది ఇట్లే నన్నయ తెనుఁగునను నింపుగఁ గవిత్వముఁ జెప్పువాఁడె. అందువలననె తిక్కన 'ఆంధ్రకవిత్వవిశారదుఁడు' అనుట కలిగెను.

అతఁ డాదికవి కాఁడని యనేకులు, 'వేములవాడ భీమన్న, రంగనాథుఁడు, నన్నెచోడుఁడు' మొదలగువారి నాతనికిం బూర్వులనుగాఁ జేయఁ దివిరిరి గాని నన్నయ యందఱిని మించి నేఁటివఱకు నగ్రస్థానముననే నిలిచియున్నాఁడు.

---

## తిక్కనసోమయాజి.

నన్నయమహాకవి, ఆరణ్యపర్వమును గొంత యాంధ్రీకరించి యేకారణముననో విరమించెను. పిమ్మట (క్రీ. త. 1063) మరల తెనుఁగుదేశము కలహములచే నల్లకల్లోలము

నొందినది. పశ్చిమచాళుక్యప్రభువగు 'ఆఱవవిక్రమాదిత్యుఁడు' తెనుఁగుదేశము నాక్రమించి కొంతకాలము పరిపాలించెను. ఆతని పరిపాలనములోనె జైనమత మీదేశమునకు వలస వచ్చి నెలకొని యేకోత్తరాభివృద్ధి నొందినది. తూర్పుచాళుక్యులు క్రమముగా నీయాంధ్రదేశమును వదలి 'చోళు' లైరి. పశ్చిమమున 'వీరశైవము' దక్షిణమున 'విశిష్టాద్వైతము' పుట్టి యచటి జైనమతౌన్నత్యమును గొంత నివారించినవిగాని, ఓరుగంటి సామ్రాజ్యమున జైనము వృద్ధినే పొందినది. వైదికమతము మళ్లుమొగముఁ బట్టెను.

ఇట్టి 'దేశోపద్రవ, మతోపద్రవ' కాలములలో, వైదికమతోద్బోధకమగు మహాభారతము నాంధ్రీకరింప నెవరికి బుద్ధి పొడమును? ఆంధ్రకవులా యుపద్రవకాలమునను లేకపోలేదు. 'పాల్కురికి సోమనాథుఁడు, వేములవాడ భీమకవి, మంచెన, బద్దెన, నన్నెచోడుఁడు' మొదలగు కవులెందఱో పుట్టి కొన్ని గ్రంథములఁ జేసిరి. కాని, మహాభారతము నాంధ్రీకరింప వారికి సాహసము కలుగలేదు. ఇట్లు నన్నయకుఁ బిమ్మట రెండుశతాబ్దములు కడచెను.

పిమ్మట నాంధ్రవాఙ్మయాబ్ధికిఁ బూర్ణచంద్రుఁడో నా తిక్కనమహాకవి 'నెల్లూరు' పురమున నుదయించెను. ఆతఁడు వేదవేదాంగవేది "ఫలవదర్థావబోధ పర్యంతం స్వాధ్యాయో౽ధ్యేతవ్యః" అను ప్రాచీనోక్తి ననుసరించి యజ్ఞముఁ జేసి సోమ

పవిత్రీకృతవాగింద్రియము కలవాఁడయ్యెను. అంతమాత్రమె కాదు. నన్నయ, అవిరళజపహోమతత్పరుఁడైనట్లే, యీతఁడును 'సతత స్వాహా స్వధా దిశబ్దద్వయ సంస్కృత సత్కృతశత మఖముఖనిలింప పితృవరుఁ'డయ్యె. ♦ఇంతమాత్రమె కాదు. నెల్లూరు మండలమునకుఁ బ్రభు వగు 'మనుమసిద్ధిభూపాలు'నకు, మంత్రియయ్యె. ఆయుద్యోగ మాతనితండ్రి తాతలనుండియు సాంప్రదాయసిద్ధమగు నుద్యోగమే. ఆతని పితృవ్యపుత్రుఁడగు ఖడ్గ తిక్కన' మహావీరుఁడనుగాథలు జగద్విదితములై నవిగదా! ఆకుటుంబములోని స్త్రీలును వీరవనితలే యఁట!

తిక్కన, పండితుఁడే కాక సంస్కృతాంధ్రభాషలలో ననర్గలముగఁ గవిత్వముఁజెప్పు మహాశక్తి సంపన్నుఁడు. ఖడ్గ తిక్కన కత్తి నెంతచులుకుగఁ ద్రిప్పఁగలఁడో యీకవి గంటము నంతకంటెను మిన్నగఁ ద్రిప్పఁగలవాఁడు.

మంత్రిత్వమును జేయుచునే తిక్కనతనప్రభువగు మనుమసిదికి 'నిర్వచనోత్తరరామాయణము'నంకితముఁ జేసియున్నాఁడు. మనుమసిద్ధిరాజ్యము చిన్నదైనను, దేశపుఁబొలిమేరలయందా శత్రువులతోఁ బెక్కుయుద్ధములు సంభవించుటచే మంత్రియగు తిక్కనయు, నాయుద్ధములలో రాయబారములునడపి, యుద్ధములఁ బొల్గొనుట తటస్థించుచుండును గదా! *

---

♦ చూ. దశకుమారచరిత్ర. షష్ఠ్యంతములు.

* మనుమసిద్ధికి 'కర్ణాటక సోమేశ్వరుఁడు, రక్కసగంఢఁడు,

'అక్కన్న, బయ్యన్నల'తో నైన యుద్ధమున మనుమసిద్ధి రాజ్యచ్యుతుఁడు కాఁగా, 'తిక్కనమంత్రి' తనప్రభువు పక్షమున, త్రిలింగదేశ'సమ్రాట్టగు 'గణపతిదేవచక్రవర్తి' కడకు రాయబారిగఁ బోయి యట విద్యచేతను, మంత్రాంగశక్తిచే తను జకవర్తిని మెప్పించి. చక్రవర్తిచే 'మనుమసిద్ధి'శత్రులఁ గొట్టించి యాతనిచేఁ దిరిగి మనుమసిద్ధికి రాజ్య మిప్పించెను. తానును నెనిమిదిగ్రామములను బొందిచిన్న జమీందారయ్యెను. ప్రభువగు మనుమసిద్ధిచే ననేకబహుమతులను గౌరవములను బొందెను. కృతులఁ జేసి, కృతులఁ బొంది, కృతికర్తల నాదరించి సుకృతి యయ్యెను. వైదికముగ-లౌకికముగ నెన్నివిధములగు నుత్కృష్టకార్యములఁ జేయవలెనో,ఎన్ని గౌరవముల నందవలెనో, యన్నిటిని బొందెను. అట్టి వైభవ మేయాంధ్రకవికిఁ గల్గెను ?

ఎన్ని యుత్కృష్టగుణములు మహాపురుషున కుండవలెనో, ఎట్టిప్రతిభ మహాకవి కుండవలెనో, అవన్నియుఁ దిక్కన సోమయాజిలో మూర్తీభవించి యున్నవి. అందువలననె యీ మహాపురుషుఁడు మహాభారతముపై దృష్టి సారించినాఁడు. నన్నయ ఫక్కిఁ దెలిసికొనినాఁడు; నన్నయవలె నాంధ్రీకరింపఁ దలపెట్టినాఁడు. అపుడు నన్నయనాఁటికుండిన సంస్కృతభాషా

---

మహారాష్ట్రసామంతుఁడు, అక్కన్న బయ్యన్నలు' అనువారలతోఁ బోరులు కలిగెను.

ప్రభావము, వైదికమతాతిశయము, దేశమున లేదు. తనకు సన్నిహితమైన ద్రావిడదేశమున 'శైవ, వైష్ణవ'మతోద్బోధకములగు గ్రంథములు ద్రవిడభాషలో మితిమీఱి పుట్టుచున్నవి. జైనులు కర్ణాటకభాషలో ననేకగ్రంథములఁ జేయుచున్నారు. 'పాల్కురికి సోమనాథాది'కవులు 'జాను తెనుఁగు' అనుపేరితో నాంధ్రమున శైవమతోద్బోధకములగు గ్రంథములను వ్రాసి యున్నారు. నన్నెచోడాదులు 'ఆంధ్రకవిత్వము' అనిపేరు పెట్టి యు'ద్రవిడ, కర్ణాటక' పదముల నందు నియమము లేకుండఁగఁ జేర్చుచున్నారు. కాన, తిక్కనమహాకవి, యెంతవఱకు దేశీయ పదములఁ బ్రయోగింప సాధ్యమగునో యంతవఱకుఁ జేర్చుకొని, సంస్కృతమును గూడఁ దఱచుగ మేళవించి విరాటపర్వమునుండి భారతము నాంధ్రీకరింపఁ దొడఁగెను. * తిక్కనగంటముయొక్క యదృష్టమో నా, దానికిఁ దొలుత హృదయాహ్లాదకథాసంవిధానముఁగల, విరాటపర్వమె రంగస్థల మయ్యెను. ఆతని గంటము నిరర్గళముగ సంచరించెను. కాని, యీమహాభారతము నెవరికిఁ గృతిసేయవలెను ? అని కవి వితర్కించెను. ఆకాలమున జైనమతము విజృంభించి యున్నది. జైనుల, యిరువదినలుగురు 'తీర్థంకరులు' దేశమున భిన్నభిన్నరూపములఁ గొలువఁబడుచుండిరి. మతసమరసముకై పెక్కంద్రుమహా

---

* అరణ్యపర్వశేషమును తిక్కన పూర్తి చేయక పోవుటకైన కారణము లింతకుఁబూర్వమే వ్రాయఁబడెను.

మహాను లు యత్నించుచుండిరి. శ్రీరామానుజులవారు తొలుత శైవక్షేత్రమగు 'తిరుపతిని' వైష్ణవక్షేత్రముగఁ జేసిరి. తిరుపతి వేంకటేశ్వరవిగ్రహమున శివచిహ్నమగు జటాజూటము, విష్ణు చిహ్నములగు శంఖచక్రములు గలవు. ఇట్టి యర్చారూప ములు 'బాదామి, హాటహారము, పూనా' మొదలగుచోటు లను గలవఁట! ఇట్టి 'శివ, కేశవ' చిహ్నములు, జైనుల యి రువదిమూఁడవతీర్థంకరుఁడగు 'పార్శ్వనాథుని' యందును గలవు. ఈ దేవతాద్వంద్వార్చనములను బుద్ధిమద్రేసరుఁడగు తిక్కన పరికించినాఁడు. దేవున కేది ప్రీతి యనుకొనినాఁడు? ఒకప్పు డాకవి.

శ్లో॥ కి మస్థిమాలాం కిము కౌస్తుభం వా
పరిష్క్రియాయాం బహుమన్యసే త్వం
కిం కాలకూటం కిమువా యశోదా
స్తన్యం వద స్వాదు తవ ప్రభో మే॥

తా॥ ఓప్రభువా! నీవు అస్థికలమాలిక నలంకరించుకొనుట గౌర వ మనుకొందువా? లేక కౌస్తుభమణిని ధరించుట గౌరవ మనుకొనెదవా; నీకు కాలకూటవిషము రుచికరమా? లేక యశోదయొక్క స్తన్యము రుచికరమా?

అని శైవవైష్ణవచిహ్నములతో నాకాలమున నారాధిం పఁబడు, దేవదేవుని నుతింపఁ గొన్నిదినముల క్రిందిరీతిని స్వ ప్నము కలిగెను.

సీ. కరుణారసము పొంగి • తొరఁగెడుచాడ్పున
శశిరేఖ నమృతంబు • జాలువాఱ
హరినీలపాత్రిక • సురభిచందన మున్న
గతి నాభిధవళపం • కజము మెఱయ
గుఱియైన చెలువున • నెఱసినలోకర
క్షణ మన గరళంబు • చాయ దోఁపఁ
బ్రథమాద్రిఁ దోఁతెంచు • భానుబింబము నా ను
రమ్మునఁ గౌస్తుభ • రత్న మొప్ప

తే. సురనదియును గాళిందియుఁ • బొరసినట్టి
కాంతిపూరంబు శోభిల్ల • శాంతమూర్తి
నాసనంబు నానందమ • గ్నముగఁ జేయ
నెలమి సన్నిధిసేసె స • ర్వేశ్వరుండు. విరాటపర్వ. 1 ఆ.

ఇంచుమించు తిక్కనసోమయాజికి స్వప్నమునఁ గాన్పించిన రూపకల్పనములతోనె, జైనమతస్థులగు 'మానతుంగ, సత్యసేన, దేవనంది, వాదిరాజ, హేమచంద్ర, జినప్రభ సూరి' మొదలగుకవులు, తీర్థంకరులను స్తుతించిరి. వారు నుతించిన స్తవములలో దేవుఁడు, శ్రీనివాసుఁడు, వృషభధ్వజుఁడు శ్యామాఽశ్యామాంగధారుఁడు, ఫణిభూషణుఁడు,విషాపహారి, మొదలగు విశేషణముల నుంచి నుతించియున్నారు.* తిక్కనవర్ణ

* పైకవుల గ్రంథములు 'కావ్యమాల' యొక్క సప్తమగుచ్ఛమున గలవు.

నముతో నించుమించు సమానమైన 'జినప్రభసూరి' యొక్క 'పార్శ్వనాథ' స్తవమునుండి యొక శ్లోకము నుదాహరించుచున్నాను.

శ్లో॥ సంసారాంభోధివేలా! జడనిబిడమతిధ్వాంత విధ్వంసహంసః
శ్యామాశ్యామాంగధామా! శఠకమఠతపోఘుర్మనిర్బాధపాథః
స్ఫారస్ఫూర్జత్ఫణీంద్రప్రగుణఫణమణిద్యోతిరుద్యోతితాశా
చక్రాశ్చక్రధ్వజ స్త్వం జయ జిన! విజితద్రవ్యభావారివార॥

జినప్రభసూరి.

తా॥ జయింపఁబడిన ద్రవ్య శత్రుభావములుగల యోజినుఁడా! నీవు సంసారసముద్రమునకుఁ జెలియలికట్టవై, జనులయొక్క జడబుద్ధి యను చీఁకటిని బోఁగొట్టు సూర్యుఁడవై, నలుపు తెలుపు కలిసిన శరీరకాంతి కలవాఁడవై, దుర్మార్గుఁ డగు 'కమఠుఁడు' అనువాని తపస్సుయొక్క వేఁడిమికి నీరైనవాఁడవై * ప్రకాశించుచు బుసకొట్టుచున్న ఫణీంద్రునియొక్క గొప్పదగు పడగపైఁగల మణులకాంతిచే వెలుఁగుచున్న దిక్చక్రము గలవాఁడవై, చక్రధ్వజుఁడవై సర్వోత్కృష్టుఁడవుగా నుండుమా !

పై శ్లోకమున ఫణీంద్రధారణము శివచిహ్నమును, చక్ర

* కమఠుఁడను నొక ధూర్తతాపసి చేయు ఘోరతపస్సును పార్శ్వనాథుఁడు నివారించెనని జైనుల గ్రంథములఁ గలదఁట!

ధ్వజము కేశవచిహ్నమును, శ్యామాఽశ్యామాంగ ముభయ సమ్మేళనచిహ్నము నై యున్నవి.

తిక్కనసోమయాజి భారతములోని యాశ్వాసా ద్యాశ్వాసాంతములలో నొనర్చిన హరిహర స్తవభావములు చాలవఱకుఁ బైని చెప్పిన 'హేమచంద్రాది' కవుల జిన స్తవభావములఁ బోలి యున్నవి.

జైనమతము, అవైదికమతము. వేదకర్మములను జైనులు నిరసింతురు. భక్తియే వారికిఁ బ్రధానము. అందువలననే తిక్కనకు స్వప్నమున సాక్షాత్కరించిన దేవుఁడు తిక్కనతో నిట్లనినాఁడు:—

ఉ. వైదికమార్గనిష్ఠ మగు • వర్తనముం దగ నిర్వహించుచు
న్భేదములేని భక్తి మది • నిర్మలవృత్తిగఁ జేయుచుండ మ
త్పాద నిరంత స్మరణ • తత్పరభావము కల్మి నాత్మ స
మ్మోదముఁబొందఁ గావ్యరస • ముం గొనియాడుచు నుండు
దెప్పుడున్. విరా. 1 ఆ.

పై పద్యములో వైదికమతమున సంచరించు నీవు భేదము లేని బుద్ధితో నున్నావనుటలో 'అద్వైతమతము' అనునర్థము గాఁ గొందఱు చెప్పుదురు. కాని, వైదికమతము, అద్వైతమునకు వేఱైనది కాదు. అద్వైతమున నిష్కామకర్మము,జ్ఞానము

ములే ప్రధానములు. భక్తి నామమాత్రము. అద్వైతము వైదిక కర్మములను సమర్థించియే యున్నది. ఇట భేదములేని బుద్ధి యనఁగా 'వైదిక, అవైదిక' మతములయందు భేదములేని బుద్ధి యని యభిప్రాయము.

మఱియు 'హరి, హరులు' విరాట్టుయొక్క 'సత్త్వ, తమో' గుణావతారులు, దేవతలు 'విరాట్టు' యొక్క గుణములని, యుపనిషత్తులు చెప్పుచున్నవి. * ఒక్కవ్యక్తియందు రెండుధర్మము లుండుట జైనమత మని, బ్రహ్మసూత్రభాష్యకర్త లగు శంకరాదులు దానిని నిరసించిరి. ♦ ఇక్కడ వ్యతిరేక ధర్మములు గల 'సత్త్వ, తమో' గుణములు 'హరిహరనాథుని' యం దారోపించుట యద్వైతమతవ్యతిరేకము.

అందువలననే యభేదబుద్ధి గల 'తిక్కనమహాకవి' ప్రారంభముననే జైనమతఖండనము గల 'సనత్సుజాతీయము'ను, పెక్కుచోటుల 'దేహాత్మవాద' నిరసనము గల భగవద్గీతలను తెనిఁగింప లేదు. 'అశ్వమేధపర్వమున' బ్రాహ్మణగీతలలోని 'యజ్ఞపశువిశసనముఁ' గూర్చి సంస్కృతమునఁ బశువిశసన ముచిత మని సమర్థింపఁ, దిక్కన దానికి వ్యతిరేకముగాఁ బశువిశసనముకంటె సాత్త్వికతపస్సె యుచితమని వ్రాసియున్నాఁడు.‡

* చూ. బృహదారణ్యకోపనిషత్తు. శాకల్యప్రశ్నలు.

♦ చూ. శంకర, రామానుజ, మధ్వ'భాష్యములలోని జైనాధికరణము.

† ఆంధ్రభార. అశ్వ. 2 ఆ. 65 మొదలు 77 కడకు.

మఱియు, జైనులు, పురుషుఁడు తాఁ జేసిన సుకృత దుష్కృతములు పూర్తిగ ననుభవింపఁ దగినవియే కాని, దుష్కృతమునకుఁ బ్రాయశ్చిత్తము లే దందురు. వైదికమతమునఁ గొన్ని సుకృతకార్యములచే దుష్కృతములు తొలఁగు నని చెప్పఁబడియున్నది. ఇట్లుండ తిక్కనసోమయాజి, సంస్కృతమున దుర్యోధనుఁడు 'రణ'నిహతుఁ డగుటచే శాశ్వతస్వర్గము నొంద నని యుండ మూలవిరుద్ధముగా ని ట్లాంధ్రీకరించెను.

క. రారాజు నాకనరకో
దార సుఖాత్యంత దుఃఖ • ధామంబులఁ బెం
పారియు హీనత నొందియుఁ
గౌరవకులనాథ ! పిదపఁ • గలియం దొందెన్.

స్వర్గారోహణపర్వ.

కొందఱు 'భగవద్గీతలు, సనత్సుజాతీయము, ఉత్తర గీతలు' వేదాంతరహస్యము గలవిగాన వాని నాంధ్రీకరింప లే దందురు. భగవద్గీతాదుల,నాంధ్రీకరించుటకంటె వేదమంత్రముల నాంధ్రీకరించుట సనాతనమతమునకు విరుద్ధము. దాని ననుసరించియే, 'నన్నయ, ఎఱ్ఱాప్రగ్గడలు' తమయాంధ్రీకరణమున వైదికమంత్రముల నాంధ్రీకరింప లేదు. తిక్కన యట్లు కాక, ఉపనిషత్తులలోని మంత్రభాగముల నెట్లాంధ్రీకరించెనో చూడుఁడు:—

ఆ. * హరి సహస్రశీర్షుఁ • బరము సహస్రాక్షు
వేదమయు సహస్ర • పాదు† నలఁతు
లైనవారికంటె • నలఁతుఁ బెద్దలకును
జాలఁ బెద్దయగు ద • యాళుఁ గొలుతు.

తే. §వదనబాహూరుపదము లె • వ్వాఁడు విప్ర
రాజవైశ్యశూద్రులకు సంప్రభవదేశ
ములుగ వెలుఁగొందు నమ్మహా • మూర్తి విభవ
దీప్తవర్ణాత్మకుని బ్రణు • తింతు విష్ణు.

శాంతిపర్వము. 2 ఆ.

ఇట్లని చెప్పుట హరిహరనాథుఁ డద్వైతబ్రహ్మము కాక నాఁటికాలమున దేశమున నారాధింపఁబడు నొకయర్చామూర్తి యని చెప్పుటకే. తిక్కయజ్వ, నాఁడు దేశమునం దుండిన 'జైన, శైవ, వైష్ణవ' మతములకు సమరసముఁ గలిగించుటకే హరిహరనాథరూపముగల దేవు నారాధించి కృతకృత్యుఁడయ్యెను. తిక్కనకవితలోఁగల యిట్టి మత సమరస భావము లెన్నియో కలవు. ప్రకృతివర్ణనములఁ జేయుటలో నాతఁ డెట్లు మూలము నతిక్రమించెనో, మతాంశములఁ గూడ నతఁడు

* "సహస్రశీర్షా పురుషః సహస్రాక్షః సహస్రపాత్."

† "అణోరణీయాన్ మహతో మహీయాన్"

§ "బ్రాహ్మణోస్య ముఖమాసీత్, బాహూ రాజన్యః కృతః
ఊరూయదస్యతద్వైశ్యః పద్భ్యాగ్ం శూద్రో అజాయత.
తైత్తిరీయోపనిషత్తులు.

మూలము నతిక్రమించెను. ఇట్లు నన్నయకూడ వైదికమతో ద్బోధకములగుపట్టులలో మూలాతిక్రమణముఁ జేసెను. ఇవి యు మహాకవుల లక్షణములే—

ఇపుడు సనాతనధర్మమునఁ బ్రవర్తించు స్మార్తబ్రాహ్మణులు చేయు 'పంచాయతన' దేవతార్చనములలోనుండు * 'ఆదిత్య, అంబిక, విష్ణు, గణనాథ, మహేశ్వర' రూపములు మతసామరస్యమునకై కల్పింపఁబడినవియే. అవైదికమతములగు 'జైన, బౌద్ధ, శైవ' మతములు వైదికమతములో, నదులు మహాసముద్రమున లీనమైనట్లు లీనమై, సనాతనమతము, లేక హిందూమతము, అనుపేరు కలదైనది.

... ... ... ...

## తిక్కన మహాకవి కవిత్వము

—:0:—

తిక్కనకవిత, సమయానుసారమగు 'ఓజః, ప్రసాద' గుణములతోఁగూడి సరసమై పాత్రౌచిత్యముగ జాతీయోక్తుల నొంది శోభించును.

ఆతఁడు, మంత్రి, దండనాథుల, వంశపువాఁడగుట చేతను, స్వయముగ రాయభారములను నడుపుటచేతను, రాయ

* శ్లో 1 ఆదిత్య మంబికాం విష్ణుం గణనాథం మహేశ్వరం॥

ళారములను వర్ణించుపట్టులను, 'వీర, రౌద్ర, భయానక' రస ములతోఁగూడిన యుద్ధవర్ణనములయందును, మూలమును మించి స్వేచ్ఛగ నింపుగ నాతనిగంటము తాండవమాడును. ఉద్యోగపర్వమునఁ గొన్నియెడల మూలభిన్నముగఁ దిక్కన యాంధ్రీకరించె నందురు. సత్యమే; కాని, యచట ముఖ్య గాథలకు భిన్నముగఁ జెప్పలేదు సమయము ననుసరించిన నీతు లనే యతఁడు చెప్పెను. పాత్రౌచిత్యమునే పాటించెను. నన్న యకవితయందును నిట్టి యౌచిత్యము కలదు. తిక్కనకవిత యందో, ఆయౌచిత్య మతిశయించెను. అందులకు 'నన్నయ, తిక్కనల'కవిత లొక్కయంశముననే యెట్లు సమయానుసార ముగఁ బ్రవర్తించినవో చూపెదను.

ద్యూతజితులై పాండవులు పదిరెండేఁడులు వనమున నుండి యొక్కయేఁ డజ్ఞాతవాసమున నుండ నిశ్చయించుకొని యర ణ్యమున కేఁగినపుడు దానిఁ దెలిసి, శ్రీకృష్ణాది యాదవులు, ధృష్టద్యుమ్నాది పాంచాలురు, పాండవులఁ జూడ వచ్చి ధర్మ రాజాదుల నోదార్చిరి. అపుడు ద్యూతపరాభవఖిన్న యగు ద్రౌపది కన్నీరుఁ గార్చుచు శ్రీకృష్ణుకడకు వచ్చి యిట్లనెను.

నన్నయ

సీ. పార్థివప్రభుఁడైన ◆ పాండుమహీపతి
కోడల నయి యుద్ధ ◆ కుశలులైన

పాండుతనూజుల • భార్యనై పూజ్యుఁడ
వైన నీ సఖియనై • యధికశక్తిఁ
బరఁగు ధృష్టద్యుమ్ను • భగినినై ధృతరాష్ట్రి
పట్టిచే సభఁ దలఁ • బట్టి యీడ్వఁ
బడి పాపకర్ముచేఁ • బరిధాన మొలువంగఁ
బడి దారుణంబైన • పరిభవంబు

ఆ. పడితి నట్టి నన్ను • పాండవుల్ సూచుచు
నుండి రొరులపోలె • నుక్కు దక్కి
యాపగా తనూజుఁ • డాదిగాఁ గలవృద్ధ
బంధుజనులు చూచి • పలుకరైరి.

క. శరణనినవారి గరుణా
కరు లయి రక్షించు పురుష • కారాన్వితులే
శరణని యఱచిన నాలిం
పర భీమార్జునుల బాహు • బల మేమిటికిన్.

అరణ్యపర్వము i ఆ.

ఇచటఁ బాండవు లింకను బదమూఁడేండ్లవఱకు వనమున నుండ నిశ్చయించుకొనుటచేతను, స్వల్పకాలమునకుఁ బూర్వమె పరాభవింపఁబడిన దగుటచేతను, జాలిపుట్టునట్లే ద్రౌపది తనపరాభవము చెప్పినది. నన్నయ, ద్రౌపదిని కరుణరసపాత్రనుగాఁ జిత్రించియున్నాఁడు.

ఈయంశమే యుద్యోగపర్వమున పాండవులు సంధిచేసికొని రమ్మని శ్రీకృష్ణుని బ్రోత్సహించి కౌరవులకడ కంపునపు డట్లే సంధికై యత్నింతు నని శ్రీకృష్ణుఁ డన పరాభవదుఃఖమె కాక, అరణ్యవాసకష్టములను గూడ ననుభవించిన దగుటచే ద్రౌపది కరుణను విడిచి, వీరత్వముతో నుడువు సమయము కలదు. పదుమూఁడేండ్లనాఁడు తనపరాభవ మేకారణముచే నైన నపనయించుకొనఁగలనేమొ యనునాశ ద్రౌపది కుండును. ఇపు డాయాశ యడుగంటఁ బోవుచున్నది. సంధియైనఁ దన పరాభవ మెట్లు పోవును ? కాన, ద్రౌపది పూర్వమువలె నుడువ వీలులేదు. కాన, తిక్కన తనప్రతిభచే వేఱుగ నాపాత్రమును సృష్టించినాఁడు.

తి క్క న

తే. ధర్మనందను పలుకులు ♦ తనకు హృదయ
తాప మొనరింప మోమున ♦ దైన్య మొంద
నున్న పాంచాలి యిట్లని ♦ యొయ్యఁ బలికెఁ
గనలి శౌరితో గద్గద ♦ కంఠి యగుచు.

* * * *
* * * *

చ. వరమునఁ బుట్టితిన్ భరత♦వంశముఁ జొచ్చితి నందు పాండు
భూవరునకుఁ గోడ లైతి జన♦వంద్యులఁ బొందితి నీతివిక్రమ
స్థిరులగు పుత్రులం బడసి♦తిన్ సహజన్ములప్రాపుఁ గాంచితిన్
సరసిజనాభ ! యిన్నిటఁ బ్ర♦శస్తికి నెక్కినదాన నెంతయున్.

వ. అదియునుం గాక:—

ఉ. నీవు సుభద్రకంటెఁ గడు♦నెయ్యము గారవముందలిర్ప సం
భావనసేయు దిట్టిననుఁ ♦ బంకజనాభ! యొకండు రాజసూ
యావభృథంబునందు శుచి♦యై పెనుపొందిన వేణివట్టి యీ
యేవురుఁ జూడఁగా సభకు♦నీడ్చెఁ గులాంగన నిట్లొనర్తురే?

ఉ. ఆసభ కేకవస్త్రయుగు ♦ నట్టిననుం గొనివచ్చి నొంచు దు
శ్శాసనుఁ జూచుచుం బతు ల♦సంభ్రములై తగుచేష్టలేక నా
యాసలుమాని చిత్రముల♦యాకృతి నున్నయెడ న్ముకుంద!
విశ్వాసముతోడ నిన్ గొలువ ♦ వచ్చె మనం బదియుం
దలంపవే?

చ. అరయమిఁజేసి కోడలన♦కప్పుడు దాసిగఁ జేసె నమ్మహా
పురుషునిపాలికిం బతులు ♦ వోవగ పీరలతోన యేను జై
చ్చెరఁజని కోటరంబుఁ దగఁ♦జేయుదునో యటుగాక పోఁడిమై
వరవుడమోపి చేయుదునో♦వారికి మాధవ!నిశ్చయింపుమా

వ. అని యుగ్గడించి:—

ఉ. ద్రోవది బంధురంబయిన♦క్రొమ్ముడి గ్రమ్మవిప్పి వెంద్రుకల్
దావల చేతఁబూని యసి♦తచ్ఛవిఁ బొల్చుమహాభుజంగమో
నా విలసిల్లి వ్రేలఁగ మ♦నంబునఁ బొంగు విషాదరోషముల్
గావఁగలేక బాష్పములు ♦ గ్రమ్మఁగ దిగ్గనలేచి యార్తయై.

వ. గోవిందు ముందటం బెట్టి యిట్లనియె:—

క. ఇవి దుస్ససేను వ్రేళ్ళం
దవిలి సగము ద్రెవ్విపోయి ♦ దక్కినయవి, కౌ
రవులకడఁ దీరుమాటల
యవసరమునఁ దలఁపవలయు ♦ నచ్యుత ! వీనిన్.

సీ. ఈవెంట్రుకలు పట్టి ♦ యీడ్చిన యాచేయి
దొలుతగాఁ బోరిలో ♦ దుస్ససేను
తను వింతలింతలు ♦ తునియలై చెదరి రూ
పఱియున్నఁ గని యుడు ♦ కాఱుఁగాక
యలుపాలఁ బొనుపడు ♦ నట్టి చిచ్చే యిది
పెనుగద పట్టిన ♦ భీమసేను
బాహుబలంబును ♦ బాటించి గాండీవ
మనునొక విల్లెప్పు ♦ డును వహించు

ఆ. కట్టి విక్రమంబు ♦ గాల్పనే యిట్లు బ
న్నములు వడిన ధర్మ ♦ నందనుండు
నేను రాజరాజు ♦ పీనుంగుఁ గన్నారఁ
గానఁబడయ మైతి ♦ మేని కృష్ణ.

ఉ. నెట్టన యట్టియల్క మది ♦ నిల్పితి రక్కసతాల్మిఁ జిచ్చొడిం
గట్టినయట్లు పెట్టియును ♦ గాలము దీనికి నాఱుటెన్నఁడుం
బుట్టదు దుష్టనిగ్రహము ♦ పూని జగంబులు గాచునట్టితోఁ
బుట్టువు నీవు తేజమునఁ ♦ బొల్చిన భర్తలు గల్గ నచ్యుతా!
పదుమూఁడేండ్లనుండి కష్టావమానముల పాలైన యీ

ద్రౌపది నన్నయ ద్రౌపదివలెఁ గరుణరసాలవాలము కాదు. వీర రసపూరిత. ఈసమయము దాఁటినయెడలఁ దనయవమానము పోవుమార్గము లేదు. కావున నామెవాక్యములు సమయోచితములై యున్నవి. ఇందు, తిక్కన సంస్కృతభారతములోని కొన్నియంశములను, వదలియుఁ గొన్నిటి నింపుగఁ బెంచియు ద్రౌపదీపాత్రమును సమర్థించియున్నాఁడు.

ఇదియే, కవియొక్క 'ఉపజ్ఞ'. తిక్కనలో నిట్టియుపజ్ఞ మిగుల శోభించిన ఘట్టము లెన్నియో భీష్మాది యుద్ధపర్వము లైదింటను గలవు.

తిక్కన తెనుఁగునే యెక్కుడుగఁ బ్రయోగించె ననియు సంస్కృతమును బాటింప లేదనియుఁ గొందఱు చెప్పుచున్నారు. అది సరికాదు. ఆతఁడు 'ఉభయభాషాప్రౌఢిఁ బాటించు శిల్పమునం బారగుఁడ' ననియే చెప్పుకొని యున్నాఁడు. ఆయుభయభాషలను సమముగఁ బ్రయోగించి రచించినయంశము నొకదానిని మాత్రము, భీష్మపర్వములోని శ్రీకృష్ణుఁడు భీష్మునిపై విజృంభించుఘట్టమునుండి వ్రాయుచున్నాను.

భీష్ముఁడు మూఁడవనాఁటియుద్ధమునఁ బాండవసేనతోఁగూడ నర్జునుని డయ్యునట్లు చేసి, శ్రీకృష్ణునిగూడ నొప్పింప నర్జునుఁ డేమియుఁ జేయలేక నివ్వెఱపడియుండె. అది చూచి 'కృప కృతవర్మాశ్వత్థామలు, భూరిశ్రవస్సైంధవ చిత్రసేనులు' నొక్కపెట్టున నర్జునునిపైఁ బడిరి. అపుడు శ్రీకృష్ణుఁడు తాన

యుద్ధమున భీష్మాదులఁ దునుముదునని పలుకుచు, చక్రమును ధరించి భీష్మునిపై నేఁగునప్పటియంశము—

తే. అవని గంపింప లలితపీ ♦ తాంబరంబు
చెఱఁగు దూలఁ జక్రాంశులు ♦ తుఱఁగలింప
సింహానాదంబు గోత్రధరం ♦ జితభయంక
రాననంబునఁ జెలఁగంగ ♦ నడరెఁ బెలుచ.

శా. అంహోమర్దనుఁ డాజనార్దనుఁడు మా ♦ ద్యద్భీష్మకుంభీ
ద్రుపై|సింహోల్లాసవిలాసియై కవియు ను ♦ త్సేకంబు నా
టోపమున్|రంహస్స్ఫూర్తియు దీప్తమూర్తియును సం ♦ రం
భంబు జూడన్ జగ|త్సంహారోన్ముఖుఁడైన రుద్రుగతి రౌ ♦
ద్ర ప్రక్రియం బొల్చెనన్.

చ. పులిఁ బొడఁగన్న లేళ్లగమి ♦ వోలె సుయోధను నగ్రసైని
కుల్| దలఁకి కలంగి నివ్వెఱఁగు ♦ దన్కుసఁ జేష్టలు దక్కి
చిత్రరూ|పులక్రియ నుండి రక్కురువి ♦ భుండును మాఱు
దలంపలేని కొం|దలమునఁ బొందు డెందమున ♦ దానును
రూపఱి యుండె వెల్లనై.

ఉ. అప్పుడు భీష్ముఁ డెంతయుఁ బ్రి ♦ యంబున నిట్లను సం
భ్రమంబులే| కప్పరమేశుతో నిట కృ ♦ తార్థుని జేయుదె
నీవు వచ్చి న|న్నిప్పుడు నీకుఁ బోలినటు ♦ లెల్లను జేయు
దుగాని వేగర|మ్మొప్పదె నాకు నిట్టి తెఱ ♦ గుజ్జ్వలఫుల్ల
సరోజలోచనా !

భీష్మపర్వ 2 ఆ.

పైనాలుగుపద్యములలోను మొదటిరెండింటిని సంస్కృత పదములతోను, తక్కిన రెండింటిని నాంధ్రపదములతోను నెట్లు సిండించి వీరరసస్ఫూర్తిని గలిగించెనో చూడుఁడు.

ఈచిత్రమున శ్రీకృష్ణుని రౌద్రత్వమును, దుర్యోధనాది కౌరవుల భీరుత్వమును, భీష్ముని మహావీరత్వముతోఁ గూడిన భక్తిని, కన్నులకుఁ గట్టినట్లు సోమయాజి చిత్రించియున్నాఁడు. వీర రసాతిశయముగ వర్ణించుటలోఁ దిక్కనకు సాటియగు మహాకవి యెవఁడును లేఁడు. అతని కతండె సాటి.

ఇట్టివిశేషసృష్టిం జూచియే యెఱ్ఱనమహాకవి—

మ. తనకావించినసృష్టి తక్కొరులచే ♦ తం గాదునా నేముఖం
బునఁ దాఁ బల్కినఁ బల్కు లాగమములై ♦ పొల్పొందు నా
వాణినిత్తను నీతం డొకరుండ నాఁ జను మహా ♦ త్మాప్తిం గవి
బ్రహ్మనా! వినుతింతుం గవి తిక్కయజ్వ నఖిలో ♦ ర్వీదేవ
తాభ్యర్చితున్.

హరివంశము.

అనినాఁడు—

తిక్కనయొక్క శ్రీకృష్ణ విజృంభణఘట్టముఁ జూచియె బమ్మెర పోతనామాత్యుఁడు భక్తిరసస్ఫూర్తిగ, భీష్మస్తవమున నిట్లు చిత్రించెను.

సీ. కుప్పించి యెగసినఁ ♦ గుండలంబులకాంతి
గగనభాగం బెల్లఁ ♦ గప్పికొనఁగ

నుఱికిన నోర్వక ♦ యుదరంబులో నున్న
జగముల వ్రేఁగున ♦ జగతి కదల
చక్రంబుఁ జేపట్టి ♦ చనుదెంచు రయమునఁ
బైనున్న పచ్చని ♦ పటము జాఱ
నమ్మితి నా[?]ావు ♦ నగుఁబాటుసేయకు
మన్నింపు మని క్రీడి ♦ మరలఁ దిగువఁ

తే. గరికి లంఘించు సింహంబు ♦ కరణి మెఱసి
నేఁడు భీష్మునిఁ జంపుదు ♦ నిన్నుఁ గాతు
విడువు మర్జున ! యనుచు మ ♦ ద్విశిఖవృష్టిఁ
దెరలి చనుదెంచు దేవుండు ♦ దిక్కు నాకు.

భాగ. ప్రథ. 223.

## కీచకవధ—శృంగారరసము

—:o:—

ఇప్పటి పండితులలోఁ గొందఱు విరాటపర్వములోని కీచక కథాసందర్భము మిగుల సొంపైన యౌచిత్యమునొంది శృంగార రసముతోఁ గూడియున్న దందురు.

కాని, యా ద్రౌపదీ కీచకకథాఘట్టములో, కవి మూలము నతిక్రమించి చేయుటయే గాక, 'రసాభాసము' అను దోషము సోఁకునట్లు రచించియున్నాఁడనవలసియున్నది. తెనుఁగున, కావ్యనిబంధనములఁ జెప్పు గ్రంథము లేరెందుమూఁడుమాత్రమె

కలవు గాని, యవి సంస్కృతమున మితిమీఱి యున్నవి. వానిలో (1) పండితరాయుని 'రసగంగాధరము' (2) క్షేమేంద్రుని 'ఔచిత్యవిచారచర్చ' (3) విశ్వనాథకవిరాజుయొక్క 'సాహిత్య దర్పణము' (4) విద్యానాథుని 'ప్రతాపరుద్రీయము' వన్నెకెక్కినవి. వారు కావ్యమునందలి 'రసాభాసా'దికముగూర్చి మిగులఁ జర్చించియున్నారు. అందు 'పండితరాయలు'

* 'అనుచిత విభావాలంబనము రసాభాసము' అనెను.

విభావము అనఁగా, రసోత్పాదనకారణము. అది ఆలంబన విభావ మనియు, ఉద్దీపనవిభావ మనియు రెండువిధములు. సమానప్రేమ గల స్త్రీ పురుషులవృత్తము ఆలంబన విభావము. యౌవనాదికము, ఉద్దీపనవిభావము. అట్టియంశములు గల స్త్రీ పురుషుల, విప్రలంభ, సంయోగముల, వర్ణనమే శృంగారరస వర్ణనము.

అట్లుకాక, స్త్రీ పురుషులలో నొక్కరికె యనురాగ ముండినఁగాని, యౌవనాదికము లేకయుండినఁగాని, వర్ణింపఁబడు శృంగారవర్ణనము అనుచిత విభావ మగుటచే రసాభాసము నాఁబడు.

ఇట 'ద్రౌపదీ, కీచకుల'లో కీచకునకె యనురాగ ముండెను గాని, ద్రౌపదికి లేదు. అందువలన 'ఆలంబనవిభావము'

---

* "అనుచితవిభావాలంబనత్వం రసాభాసత్వం"

రసగంగాధరము.

లేదు. మఱియు, కీచకుఁడు వలచునాఁటికి ద్రౌపది కలువది యేండ్లు దాఁటుటచే * యౌవన మనఁబడు 'ఉద్దీపనవిభావము' లేదు. ద్రౌపది వృద్ధ యగుటచేతనె ధర్మజుఁడు తమ్ములతో నజ్ఞాతవాసారంభమున నీమెను దల్లివలెఁ జూడవలె నని చెప్పి నట్లు సంస్కృతమునఁ గలదు. ఏఁబది యేండ్లకు మించినస్త్రీని 'లోల' యనియు, నామెయందు శృంగారనాయికగా నుండు నవస్థ యుండదనియు, 'కొక్కోకము' మొదలగు కామశాస్త్ర గ్రంథములు చెప్పుచున్నవి. కాన, నిట ద్రౌపదీనిష్ఠమగు శృంగారవర్ణన మనుచితము. మఱియుఁ బరకీయ (ఇతరునిభార్య) యందలి విరాళినభివర్ణించుట యనౌచిత్యమని 'సాహిత్యదర్పణ' గ్రంథకర్త యగు విశ్వనాథకవిరాజుయొక్క మతము. రసాభాస భేదముఁ గూర్చి యుదాహరణముగా నిచ్చిన 'పండితరాయుల, శ్లోకము నొకదానిని, ఆరీతినె, కీచకుని విరాళిని వర్ణించిన తిక్కనకవియొక్క పద్యము నొకదానిని జూపుచున్నాను.

శ్లో. వ్యత్యస్తం లపతిక్షణం క్షణ మధో మౌనం సమాలంబతే
సర్వస్మి న్విదధాతి కిం చ విషయే దృష్టిం నిరాలంబనాం

---

* ద్రౌపది స్వయంవరమునాఁటికి యువతిగానె యాదిపర్వమున వర్ణింపఁబడుటచే నించుమించుగ నిరువదేండ్లది. ద్రౌపదీస్వయంవరానంతరము పాండవులు ద్రుపదపురమున నొక్కయేఁడును, హస్తిపురిలో నైదేండ్లును, ఇంద్రప్రస్థమున నిరువదిమూఁడేండ్లును, వనమునఁ బండ్రెండేండ్లును, నజ్ఞాతమున నొక్కయేఁడును (20 + 1 + 5 + 23 + 13 = 62) నుండుటచే ద్రౌపదికి నఱువదేండ్లు దాఁటినవి.

శ్వాసం దీర్ఘమరీకరోతి న మనా గంగేషు ధత్తే ధృతిం
నైవేదేహీకమనీయతా కబలితో హాహాంత లంకేశ్వరః॥

తా॥ రావణుఁడు సీతాసౌందర్యముచేఁ గబళింపఁబడినవాఁడై క్షణకాలము తడఁబాటుగా సంభాషించును. పిమ్మట నొక్క క్షణము మౌనమును వహించును. అన్నివిషయములను జూచియుఁ జూడనట్లుండును. పెద్దనిట్టూర్పు విడుచును. ధైర్యమును వహింపఁడు—

ఇది రావణుని విప్రలంభశృంగార రసాభాసము. ఇఁక, కీచకుని విప్రలంభశృంగార రసాభాసముఁ జూడుఁడు:—

సీ. వామాక్షి రుచిరలా ♦ వణ్యంబు భావించుఁ
దన్వంగిరూపు చి ♦ త్తమున నిలుపుఁ
గంబుకంధర చెన్ను ♦ కైవడిఁ దలపోయు
నంగనసౌకుమా ♦ ర్యముఁ దలంచు
భామిని సహాజవి ♦ భ్రమ మెదఁ గీలించుఁ
బడఁతిచెయ్వులు మదిఁ ♦ బట్టుకొలుపు
మానిని గరువంపు ♦ మాటపొం దూహించు
దళితాబ్జముఖి తెన్నుఁ ♦ దనము మెచ్చు
తే. నడరి కోర్కులు చిఱ్ఱుము ♦ ఱ్ఱాడ వెడఁగు
పడిన యుల్లంబుపట్టునఁ ♦ బరుపఁ దనకు
వశము గాకున్న నెంతయు ♦ వంతఁ బొందుఁ
జింత యొనకంబు నడిఁగొని ♦ చిక్కువఱుప.

విరా. 2 ఆ.

ఇట్లతివేలముగా నింకను, తిక్కనకవి వర్ణించియున్నాఁడు. కాన, నిది శృంగార రసాభాసమె కాని, శృంగార రసము కాదు.

మహాభారతమున శృంగార రసాభాసమున కెడమిచ్చు వట్టులు, 'కచ-దేవయాన' 'దమయంతీ-కిరాత' 'సీతా-రావణ' 'ద్రౌపదీ-సైంధవ' గాథలలోఁ గలవు. కాని,యాఘట్టములలో 'నన్నయ, ఎఱ్ఱన' కవులు 'ఔచిత్యము'ను బాటించిరి. తిక్కన మహాకవియు నీ కీచకగాథలలోఁ దప్ప 'శచీ, నహుష, ఉత్తరా దిక్కు, అష్టావక్రుల' గాథలలోను, ఔచిత్యముఁ దప్పలేదు. తిక్కన భారతాంధ్రీకర ణారంభమున విరాటపర్వమును గావ్య ఫక్కికగాఁ జెప్పు నత్యుత్సాహముతో శృంగారరసవర్ణనముకై యట్లు మితిమీఱి కీచకవిరహాదులను వర్ణించియుండును.

ఇట్టివి. కాళిదాసాదులు, కుమారసంభవాదులఁ జేసి రని 'క్షేమేంద్ర, విశ్వనాథకవిరాజులు' తమ యలంకారగ్రంథ ములలోఁ జర్చించియున్నారు.

కాన, నీకీచకగాథలోని శృంగార రసాభాసమును, కాళి దాసాదుల లోపములవంటిదే.

---

# ఎఱ్ఱాప్రగ్గడకవిత

—:♦:—

'అట్లాంటిక్కు'మహాసముద్రముం బోలు నన్నయవాఙ్మయాబ్ధిని, 'పసిఫిక్కు'మహాసముద్రముం బోలు తిక్కన వాఙ్మయాబ్ధిని, హిందుమహాసముద్రముం బోలిన ఎఱ్ఱన వాఙ్మయాంబుధి కలిపి సమీకరణ మొనర్చినది.

ఎఱ్ఱన వాఙ్మయాంబుధి చిన్నదైనను, రత్నాకరము. దీనియందు 'వజ్రాల దీవులు, పగడపు లంకలు, ముక్తాకరములు, బంగరు గనులు, చెఱుకుపంటలు'గల తావులవంటి వున్నవి.

ఇందులకు 'రామోపాఖ్యాన, సావిత్రి' చరిత్రాదులె యట్టివని చెప్పవచ్చును. నన్నయయొక్క 'ధారాశుద్ధి, భావగాంభీర్యములు' తిక్కనయొక్క 'ప్రసాదగుణ, భావస్ఫుటీకరణములు' ఎఱ్ఱనామాత్యుని కవితయందు మిళితమై, ధారావంచకమున నడచు జాత్యశ్వపురీతిని వహించును. నన్నయ తిక్కనల కవిత్వపు పోలిక లీతనికవితలో నుండుటవల్లనే యీమహాకవి, ఆంధ్రకవితా వనితావంశవృక్షమునకు మూఁడవపురుషుఁడుగా నెన్నఁబడి యున్నాఁడు.

నాఁటికాలపు పరిస్థితు లెట్లాతని భారతాంధ్రీకరణమునకుఁ దోడ్పడెనో చూడుఁడు:—

## ఎఱ్ఱనామాత్యునినాఁటి దేశపరిస్థితి.

తిక్కన చివరదశలోనె, ఓరుగంటిప్రభుత్వముచే జైనమత మాంధ్రదేశసీమాంతములకు నిస్సారిత మైనది. * గణపతిదేవ చక్రవర్తియు, నాతనిపుత్రిక రుద్రమదేవియు నేలినపిమ్మట రెండవప్రతాపరుద్రుఁడు రాజ్య మేలుచుండఁగా, ఢిల్లీచక్రవర్తి యగు 'అల్లాయుద్దీన్ ఖిల్జీ' తనసేనానాయకుఁ డగు 'మాలిక్కాఫరు'చే నాంధ్రదేశపు పరిసరములు నున్న 'దేవగిరి, బల్లాల' రాజ్యములను ధ్వంసము చేయించి 'ఓరుగంటి' రాజ్యముపైఁ గూడఁ బెక్కుదండయాత్రలం జేయించెను. ఢిల్లీలో 'ఖిల్జీ' వంశమునుండి 'తుఘలక్' వంశమునకుఁ బ్రభుత్వము సంక్రమించినను, వారును 'ఓరుగంటి' రాజ్యముపై కన్నువేసియే యుండిరి. పిమ్మట 'కాకతీయసామ్రాజ్యమును, గయజుద్దీన్ టోగ్లాకు'యొక్క వాహినులు ముంచివేసినవి. ఆంధ్రదేశమున'కాకతీయ'సామ్రాజ్యము విచ్ఛిన్న మైనది. (క్రీ.శ.1323) ఆమహాదేశోపద్రవకాలములోనను, 'మారన, భాస్కరుఁడు, రంగనాథుఁడు' మొదలగు మహాకవు లెందఱో పుట్టి వేర్వేఱు గ్రంథము

---

* గణపతిదేవ చక్రవర్తి కాలము కొంత గడచినపిమ్మట, వీరశైవోద్రేకముచే జైను లాంధ్రదేశమునుండి వెడలఁగొట్టఁబడిరనియు, జైనుల ముప్పదియాఱు గ్రామములు దహింపఁ బడిన వనియు, కొందఱు జైనులు శైవమతమును బుచ్చికొనిరనియు, ఇప్పటి యాంధ్రదేశములోని కోమట్లు, కొందఱు కంసాలురు, అట్టి మతాంతరులగు జైనులే యనియు, ఆంధ్రులచరిత్ర వల్లను, కథలవల్లను దెలియ నగుచున్నది.

లను రచించిరే కాని, భారతములో నాంధ్రీకరింపఁబడక మిగిలిన 'వనపర్వభాగము' నాంధ్రీకరించుటకు సాహసింపరైరి. ఇంతలో 'అనపోతనాయఁడు, పోలయ వేమారెడ్డి, కాపయనాయఁడు, హరిహర బుక్కదేవరాయలు' ఆంధ్రదేశమునుండి మహమ్మదీయులం దరిమి వేర్వేఱు రాజ్యములను స్థాపించిరి. హిందూమతమునకుఁ గొంతయాధారము కలిగెను. విజయనగర ప్రభు వగు 'బుక్కదేవరాయల' పాలనముననే వైదికమతము పునరుద్ధరింపఁబడినది. 'మాధవ విద్యారణ్యులు' జగత్ప్రసిద్ధి నొందిన వేదభాష్యములను వ్రాసిరి. అపుడె మనయెఱ్ఱనామాత్యుఁడును, పంచమవేదములోని 'వనపర్వశేషము' నాంధ్రీకరించెను. పోలయ వేమారెడ్డి యెట్లు హిందూమతమునకుఁ బ్రోత్సాహమొసఁగెనో చూడుఁడు—

సీ. అగ్రహారములు వి ♦ ద్యాతపోవృద్ధ వి
ప్రుల కిచ్చి యజ్ఞక ♦ ర్తలుగ నునిచెఁ
గోమరారఁ జెఱువులు ♦ గుళ్ళుఁ బ్రతిష్ఠించి
లోకసంభావ్యంబు ♦ లుగ నొనర్చె
నిధులు నల్లిండ్లను ♦ నిలిపెఁ దోఁటలు సత్ర
ములు చలివెందురుల్ ♦ వెలయఁ బెట్టె
హేమాద్రి పరికీర్తి ♦ తామిత్రవతదాన
నివహంబు లన్నియు ♦ నిర్వహించెఁ

తే. జేసెఁ జేయుచునున్నాఁడు • సేయనున్న
వాఁడు పునరుక్తకృతి శుభా • వలుల నెల్ల
నలరు శ్రీవేమవిభున క • య్యలరు పేర్మి
వశమె వర్ణింపఁ దద్భాగ్య • వైభవంబు.

హరివంశము 1 ఆ.

ఇట్టి 'యిష్టాపూర్త' క్రియలు జరుపు, పోలయ వేమా రెడ్డిచే నాదరింపఁబడుచుండి 'శంకరయతి' శిష్యుఁ డగుటచే తన 'ఎఱ్ఱన'మహాకవి పంచమవేదభాగము నాంధ్రీకరింపఁ దొడఁగెను.

దోషరహితము, సగుణము, సాలంకృతము, నర్థగాంభీర్యయుక్తము, సరసము, నౌచిత్యయుక్తము నై, హృదయాహ్లాద మగునట్టి యాతనికవితాశైలి యెట్లుండునో 'హరివంశ, నరసింహ'పురాణములను, అరణ్యపర్వశేషములోని యితరభాగములను, విడిచి, 'సూక్ష్మములోన మోక్షముఁ జూపె'నన్నట్లు చిన్నదగు రామోపాఖ్యానమునను యాతఁడు చూపిన కావ్యకలను వ్రాసెదను.

మహాకావ్యమునందు 'అష్టాదశ' (18) వర్ణనము లుండవలయు ననియు నందుఁ గొన్ని తక్కువైనను మహాకావ్యత్వమునకు లోపము కలుగదనియు, అలంకారశాస్త్రజ్ఞులు నుడువుదురు. చూడుఁడు:—

గీ. ఇంకఁ గావ్యప్రభేదంబు ♦ లేర్పరింతు
వరుస నష్టాదశ విశిష్ట ♦ వర్ణనములు
గలుగవలయు మహాకావ్య ♦ తిలకమునకు
నెలమిఁ దన్నామధేయంబు ♦ లెట్టి వనిన.

క. పురసింధు నగర్త్వన శశి
సరసీవన మధు రతిప్ర ♦ సంగ విరహాముల్
పరిణయ తనయోదయ నయ
విరచన యాత్రాజి దౌత్య ♦ విభు వర్ణనముల్.

గీ. ఇందు నొకకొన్ని కడమైన ♦ నెంచిచూడ
నదియు నవని మహాకావ్య ♦ మనఁగఁ బరఁగు
... ... ... నరసభూపాలీయము 2 ఆ.

పై కావ్యత్వనిరూపకవర్ణనము నెంతవఱకు సెట్టిన స్ఫుటీకరించెనో చూడుఁడు:—

—: (1) పురవర్ణనము :—

ఉ. ఆలవణాబ్ధిమధ్యమున ♦ యందుఁద్రికూటనగంబుమీఁద ను
త్తాలవిశాలహేమమణి ♦ ధామ సముజ్జ్వలమైన లంకయన్
ప్రోలొగిఁ గంటి నెంతయు న♦పూర్వము దద్విభవంబు దేవ!
యాచో్చ లలితాంగి నాగసితిఁ♦జొచ్చి యనేకవిచేష్టితంబులన్

ఈలంకాపురీవర్ణనము సంస్కృతమున లేకుండినను శంభుదాసుఁ డింపుగ ధారాశుద్ధితో నతిశయోక్తితో వర్ణించియున్నాఁడు.

—♦ (2) సముద్ర వర్ణనము ♦—

స్రగ్ధర. లీలం గల్లోల మాలో♦ల్లిఖిత గగనమై♦లీన నానాకుళీర
వ్యాళోగ్రగ్రాహ మీనా♦వళుల నెసఁగి దుర్వార♦వా
రోఘగంభీరాలంఘ్యప్రౌఢ వేగం♦బగుచు బహుత
రా♦యామవిస్తారమై బి। ట్టాలోకింపంగ నుగ్రం♦బగు
జలనిధి నం♦తంతటం గంటి మంతన్.

మూలమున స్వల్పముగా నున్న సముద్రవర్ణన మిందు పెంచి వ్రాయఁబడెను.

—♦ (3) పర్వత వర్ణనము ♦—

సంస్కృతమున "తావృష్యమూక మభ్యేత్య బహుమూల ఫలద్రుమమం" అనిమాత్రమె యుండ,

వ. "ముందట నతిబహుళ బలాహకవ్యూహ సన్నాహ సము
న్నతంబులైన యభంగోత్తుంగ శృంగ సముదయంబుల నఖిల
గగన క్రోడపీడనంబు సేయుచున్నదాని ఋష్యమూక శైలం
బుఁ జేరి."

అని పర్వతవర్ణన కుతూహలమునఁ బెంచియున్నాఁడు.

—♦ (4) ఋతు వర్ణనము ♦—

సంస్కృతమున వర్షర్తువర్ణనము లేకుండినను 'పరిబంధ పరమేశ్వరుఁ' డిట్లు వర్ణించియున్నాఁడు.

మ. ఉరుఘర్మౌఘ విఘాతసంవిహిత వి♦శ్వోల్లాసమై సంచల
త్సరసాంభోద నినాద తూర్యరవమై♦ చంచద్బలాకాగరు

ద్భరలీలానవచామర స్ఫురణమై • పర్జన్యసామ్రాజ్య మొ
ప్ప రమామందిరమై యుదగ్రశిఖినీ•పింఛాతపత్రంబులన్.

పై పద్యమున నన్నయకవిత నెట్టిన ప్రతిఫలింపఁ జేసి
కొని యున్నాఁడు.

—• (5)ఉద్యానవనవర్ణనము •—

మూలమునందు 'లంకోద్యానాని' అనువాక్యముఁ బుర
స్కరించుకొని, తెనుఁగున—

క. తాలై లాగురు చందన
సాల తమలామ్రనింబ • జంబూ జంబీ
రాలంకృత లంకావన
జాలంబుల విడిసె వృక్ష • చరసైన్యంబుల్.

—• (6) వి ప్ర లం భ ము •—

: : శ్రీ రా ముఁ డు : :

ఆ. అమనోజ్ఞరత్న • మక్కున గదియించి
పులక లెగయఁ గొంత • ప్రొద్దు విభుఁడు
జానకీకుచాగ్ర • సంగమసుప్తుఁడై
నట్లు యుండె ముకుళి • తాక్షుఁ డగుచు.

—• సీ తా దే వి •—

సీ. కన్నీరు జడిఁగొని • క్రమ్మఁ బ్రా కెక్కిన
కమ్రకపోలభా • గములు గలిగి

యవశమై యొఱఁగిన ♦ యంగవల్లిక పొంత
నున్న భూమీరుహం ♦ బూఁత గాఁగ
వెడలు నిట్టూర్పుల ♦ వేఁడిమిఁ బడిన న
య్యధరపల్లవము గా ♦ రాకుఁ బోలఁ
దలఁపుల సందడి ♦ దండడించిన తాల్మి
గదిరి శిరఃకంప ♦ గతులఁ బెరయ

ఆ. నున్న పుణ్యమూర్తి ♦ నుత్తమసౌందర్య
నవనతాస్య నార్త ♦ యైనదానిఁ
గని విదేహతనయ ♦ గా నెఱింగితి నేను
హా! రఘుప్రవీర! ♦ యనుచు నడల.

ఇది హనుమంతుఁడు రాముతోఁ దాను లంకలో సీతం జూచి నప్పు డామెయున్నయవస్థ. ఈవర్ణనము సంస్కృతములోని దానికంటె మూఁడురెట్లెంపుగఁ బెంచి వ్రాయఁబడెను.

ఈసీతావర్ణనము నన్నయ తిక్కనల 'దమయంతీ, ద్రౌపదుల' వర్ణనములకుఁ దీసిపోదు.

### (7) దౌత్యము.

అంగదుని రాయబారమును గవి మూలమునకు మెఱుఁగుఁ బెట్టుచుఁ జెప్పియున్నాఁడు.

శా. లంకాద్వారము దుర్నివారముగ ను♦ల్లాసంబునం జొచ్చి ని
శ్శంకుండై సురశత్రుసైనికసహ♦స్రంబుల్ దనుం జూచి యా
శంకంబొందఁగ లీలమైఁ జని సుహృ♦త్సంఘంబుగొల్వన్ని రా

తంకుం డై గొలువున్న దెత్యుఁ గని యుద్యన్మూర్తియై యి
ట్లనున్.

క. ఇనకులతిలకుఁడు బాణా
సన విద్యాగురుఁడు రామ ♦ చంద్రుఁడు నీతో
నను నిట్లనుమని పనిచెను
వినుము తదీయోక్తి భంగి ♦ విస్పష్టముగాన్.

సీ. అనపరాధులఁ గాన ♦ నాంతరమ్ముల నున్న
పేదతాపసులఁ జం ♦ పితి పలువుర
నమరుల యిల్లాండ్ర ♦ నతిముతిఁ జెఱపట్టి
తఖిలలోకములకు ♦ నలఁతసేసి
తిదియెల్ల నొకతల ♦ యేపునీరగ నన్నుఁ
జెనకుట యొకతల ♦ సెప్పనేల
బలిమియొప్పఁగ మించి ♦ బంటవై వెడలుము
కయ్యంబునకు నట్లుఁ ♦ గాకయున్న

ఆ. శరణుఁ జొచ్చి నాకు ♦ జానకి నొప్పింపు
మొందువెంటఁ బ్రదికి ♦ యుండఁ దీర
దస్మ దుగ్రశర శ ♦ తాశీవిషంబుల
కెరయ నీదు ప్రాణ ♦ మింత నిజము.

క. మనుజుండ నైన నాతెఱఁ
గనుమానము వాయఁ జూడు ♦ మాహావ భూమిన్
నిను రాక్షసులను నాఘం

బును నడఁపక యేను రిత్త • వో నిచ్చెదనే.

ఇందు వీరరసము స్ఫుటీకృత మగుచున్నది.

—• (8) ప్రయాణము. •—

శ్రీరాముని యుద్ధయాత్ర యిట్లు వర్ణింపఁబడెను.

మ. ప్రభ నొప్పారి యనుంగుఁ దమ్ముఁడు మహా • భాగుండు
సౌమిత్రి వీతభయుండై కొలువం గపీంద్రబలసం • తానం
బుతో నుద్ధతిన్। శుభలగ్నంబున రాఘవుండు గదలెన్ • సు
గ్రీవ సాహాయ్యసంప్రభవోత్సాహ మెలర్ప దర్పితరిపు•ప్రా
లేయతిగ్మాంశుఁడై.

ఉ. ఆహరివీరవాహినుల • కన్నిటికిన్ మొగమై మరుత్సుతుం
డాహవదోహలుం డమరె • నంగద నీల నలాది వీరు లు
త్సాహముమీఱ నయ్యెయిదె • సం దగు కావలియై సమ
గ్రసన్నాహమహోగ్రతం జనిరి • నాకవిరోధి వధాభిలా
షులై.

ఈయుద్ధయాత్ర మూలమునను నిట్లే కలదు.

—• (9) యుద్ధము. •—

ఈరామోపాఖ్యానమునఁ బెక్కుచోటులను యుద్ధవర్ణనము లున్నవి. అందు మచ్చుకై యొక్కస్థలమునఁ గలదాని చూపెదను.

—• రావణ జటాయువుల యుద్ధము. •—

ఉ. 'ఓరి దురాత్మ! యీయబల • నోడక యేటికిఁ బట్టినాఁడ
వంభోరుహనేత్ర విడువు; మేటు • వోయినఁ బ్రాణముఁ

గొండః నింక నుగ్రారి విభేది విక్రము జ ♦ టాయు నెఱుం
గవె' యంచు దర్ప దుర్వారుఁడు వీఁకఁ దాఁకె సుర♦వర్గ
విభేదను నద్దశాననున్.

మ. ఘనపక్షాహతులం బ్రకాండపరిఘా ♦ ఘాతంబులం దీవ్రశా
తనఖోచ్ఛేదములం బ్రదీప్తశరవే ♦ ధక్రీడలంగ్రూరచం
చునిపాతంబులఁ బ్రౌఢకుంతముఖ వి♦స్ఫోటంబులం దత్ఖగేం
ద్రనిశాటేంద్రులపోరుసాధనసమ♦త్వస్ఫూర్తినొప్పెంగడున్.

చ. పటుతరపక్షిపక్షముఖ ♦ పాదనఖప్రవిఘాత ఖండిత
స్ఫుటితశరీరుఁడై బహుళ ♦ శోణితధారలు మేనఁ గ్రమ్మఁగాఁ
దటసముపాంతనిర్గళిత ♦ ధాతురసారుణ సాంద్రనిర్ఝరో
త్కటకులశైలలీల దశ ♦ కంఠుఁడు నిల్చె నకుంఠితస్థితిన్.

పైమూఁడుపద్యములలోను యుద్ధవర్ణనమున కుండఁ
దగిన 'ఓజోగుణము, గౌడీరీతియు' సముల్లసితములై యున్నవి.
రెండవపద్యములోని రావణజటాయువులకుఁ గల సాధన
సమత్వస్ఫూర్తి సంస్కృతమున లేదు.

## —♦ (10) సరోవరవర్ణనము. ♦—

సీ. కమనీయ కమలినీ ♦ కల్హారదళకేస
రాన్వితజలముల ♦ నర్ఘ్యవిధియుఁ
దరళతరంగహ ♦ స్తములఁ బాద్యంబు ను
న్మదచక్రసారస ♦ మధుప హంస
రుతులఁ బ్రియోక్తులు ♦ రుచిర వానీర ని

వేళనచ్ఛాయల ♦ విశ్రమంబు
మందసంచారిత ♦ మారుతంబుల నురు
తాపనోదనమును ♦ దగిలి యెపుడు
ఆ. నాచరించుచును స ♦ మంచితాతిథిజన
సేవనమునఁ ‧దనదు ♦ జీవనంబు
ఫలము నొంద నొప్పు ♦ పంపాసరోవరం
బెదురఁ గాంచి రన్న ♦ రేంద్రసుతులు.

ఇది పంపాసరోవరవర్ణనము. పథికులైన రామలక్ష్మ ణులకు నాతిథ్య మిచ్చు నౌచిత్యము నిందు కవి చూపెను. మూలమునందు స్వల్పముగా నున్నదానిని తెనుఁగున సాలంకృత గాఁ జేసెను.

—♦ (11) నాయకాభ్యుదయము. ♦—

సీ. అభినవపద్మ ద ♦ ళాక్షు నక్షీణ వి
స్తృతవక్షు నాజాను ♦ దీర్ఘబాహు
మధురస్మితానను ♦ మదగజగమను నా
రూఢయావను నభి ♦ రూపతేజు
శ్రీరమణీయుఁ బ్ర ♦ సిద్ధయశోరమ్యు
నిఖిల విద్యాగమ ♦ నిపుణచిత్తు
నింద్రసమాను జి ♦ తేంద్రియు ధర్మజ్ఞుఁ
బౌరబాంధవజన ♦ ప్రార్థనీయు

ఆ. దుష్టనిగ్రహైక ♦ ధుర్యు విశిష్టసం
రక్షణాభిలోలు ♦ రామభద్రుఁ
గులపవిత్రుఁ బెద్ద ♦ కొడుకుఁ గనుంగొని
రాజవరుఁడు గరము ♦ రాగ మెసఁగ.

ఇది శ్రీరాముని దశరథుఁడు యౌవరాజ్యాభిషేక మొనర్పఁదలఁచునాఁటి కా రామునియొక్క గుణాదివర్ణనము.

—♦ (12) మంత్రాలోచనము. ♦—

వ...అంత రాఘవుండు రవితనయుం జూచి యిట్లనియె.

క. మనబల మిది యతిబహుళము
వననిధియును దుస్తరంబు ♦ వానరవర ! యి
వ్వననిధి గడచునుపాయము
మన కొక్కటి నిశ్చయింపు ♦ మా!తగుబుద్ధిన్.

తే. అని విచారించు నెడఁ గొంద ♦ అధిపుఁ జూచి
జడధి బలితంపుఁ దెప్పలఁ ♦ గడతు మనిరి
ఘనపుఁ గలములు సమకట్టి♦ కడతు మనిరి
కొంద అంతయు విని రఘు ♦ నందనుండు.

సీ. అల్లన నగుచు ని ♦ ట్లనియె మీచెప్పుటల్
దగిన యుపాయంబు ♦ లగున యయిన
నగణితంబైన యీ ♦ హరిసైన్యముల కెల్లఁ
గలములుఁ దెప్పలు ♦ వలయు నన్ని
సమకట్టు టరయ న ♦ శక్యంబు శతయోజ

నంబులపర పైన ♦ యంబురాశిఁ
గలములఁ దెప్పలఁ ♦ గడచువో, రిపుకోటి
మెడరునఁ బైఁబడి ♦ పొడువకున్న

ఆ. అదియుఁగాక యల్పు ♦ లగువణిగ్జనముల
యోజ శూరతతికిఁ ♦ దేజ మగునె ?
కాన నాదుమతము ♦ గా దివ్విధంబు నా
మనసు నిశ్చయంబు ♦ వినుఁడు మీరు.

చ. వ్రతము ధరించి నిష్ఠ నుప♦వాసవిధిం గొలుతున్ సముద్రునా
కీతఁడు ప్రియంబుతోడఁ దెరు ♦ విచ్చుట యింతన కల్గెనేని
మేలితరునిఁగా ననుందలంచె ♦ నేని సమానుపరోషవేషదీ
పితశరవహ్ని నిజ్జలముఁ♦జిల్చెదఁ బేల్చెద నొక్క వ్రేల్మిడిన్.

—♦ (13) వనవిహారము. ♦—

ఉ. తేనెలు గ్రోలిగ్రోలి కడుఁ♦దియ్యని కమ్మని పండు లింపుసొం
పూనఁగ నాని మూని పర♦పొందిన నీడలు మెచ్చి మెచ్చిమం
దానిల శైత్యసౌరభస♦మగ్రతకుం గడుఁ జొక్కిచొక్కి యు
ద్యానమునందు మారుతసు♦తప్రముఖుల్ విహరించితృప్తులై

ఇది సీతం జూచి వచ్చు హనుమదాదుల 'మధు'వన విహారము. మూలాతిక్రమణ మగుచు నిది కావ్యకలను బోషించుచున్నది.

అష్టాదశవర్ణనములలోఁ బదుమూఁడువర్ణనము లిందు స్ఫుటముగా నున్నవి. (1) పురోత్పత్తి. (2) జలక్రీడ, యను

రెండును సూచితములు మాత్రమె. (1) చంద్రోదయ సూర్యోదయ (2) వివాహ (3) రత్యుత్సవముల కిందు కవికి సంబంధము కలుగనందున వర్ణింపలేదు అయినను కావ్యత్వమునకు లోపము కలుగలేదు।

ఎఱ్ఱనామాత్యుఁడు 'అష్టాదశ' వర్ణనముల సంబంధముతోనే రామోపాఖ్యానమున 'కావ్య' కలను బోషింపలేదు. 'వాక్యంరసాత్మకం కావ్యం' అను నాలంకారి కోక్తి నిగూడ ననుసరించియున్నాడు.

రామోపాఖ్యానము వీరరసాత్మకమైన కావ్యమైనను నందందు 'శృంగార, వీర, కరుణ, రౌద్ర, శాంతాది' రసముల నింపుగ వర్ణించి యున్నాఁడు. సీతారాముల విప్రలంభశృంగార వర్ణన మిదివఱకె యుదాహరింపఁబడినది. మఱికొన్ని రసములను వర్ణించిన పట్టులనుగూడ విజ్ఞాతముగఁ జూపెదను.

కరుణరసము.

రావణ వధానంతరము సీతను 'అవింధ్యుఁడ'ను దైత్యుఁడు రాము కడకుఁ దెచ్చుసందర్భ మిట్లుకలదు.

చ. అతి మలినాంగి జీర్ణమలినాంబరధారిణి నంతతాశ్రు పం
కిత విలసత్కపోలఁబరికీర్ణ జటాయిత కేశభార నా
యతఘనదుఃఖదూషితఁ బ్రియాంగనఁగన్గొని యప్రియాత్ముఁడై। నుతచరితుండుదద్దయుమనోవ్యథసేయుచు నింతి కిట్లనున్.

దుఃఖకరమైన చెఱనుండి విడువఁబడి కన్నుల నీరుఁగార్చుచు మలినాంగిగానున్న సీతను జూచి నుతచరితుఁడగు రాముఁ డప్రియాత్ముఁడగుట కరుణగాక మఱేమగును. సంస్కృతమున నింతకరుణ కాన్పింపదు.

అద్భుతరసము.

మ. పఱచున్ దవ్వుగఁ జేయలంతినిలుచున్ ♦ బట్టీకయాసాసలం
బిఱువోవుంబొదలందు డిందుఁబొడమన్ ♦ బిట్టులి వేఁదాఁటు
గ్రమ్మఱి చూచుం జెవిఁదార్చినిల్చు మలయున్ ♦ మట్టాడి
కొమ్ముడాడువే మఱినట్లుండుఁ దృణంబు మేయు మలయున్ ♦
మాయామృగం బిమ్ములన్.

ఇది మారీచుని మాయామృగవేషము. మృగచేష్టితములను ప్రబంధపరమేశ్వరుఁడిం దద్భుతముగ వ్యక్తీకరించియున్నాఁడు.

వీ ర ర స ము.

కుంభకర్ణాదులు మృతినొంద విచారించు రావణుతోడ ఇంద్రజిత్తు పలికిన వీరాలాపములు——

చ. వగవగనేల దైత్యకుల♦వల్లభ యేఁగలుగంగ నిమ్మెయిన్
జగముల నీదు శత్రులకు ♦ శౌర్యము సెల్లునెవ్వత్రవై రిలో
నగు సురకోటియేపడఁచి ♦ యప్రతిమోన్నతి నున్ననాకుఁ
గ్రోఁ। తిగములనోర్చుటెంతపని ? ♦ ధీరతనన్ గృపబంపు
మాజికిన్.

ఉ. కూడిన కొండముచ్చులను ♦ గోత్రతుల నుగ్రతముట్టి
కినుక జెం। డాడెద నుజ్జ్వలోగ్రవివి♦ధాంబకజృంభితదిఙ్ముఖం

డన్నై। యూడెద వీరనృత్యము రయంబునఁ బార్థివసూను
లిద్దఱం। గ్రీడయుఁ పోలెఁగట్టి, పెడకేళ్లోగిఁగట్టెదఁ బట్టితెచ్చె
దన్.

శాంతరసము.

చిత్రకూటముననున్న రాముని భరతుఁడు చూచినప్పు
డు రాముఁడున్న శాంతరీతి.

మ. కనియెంగోమల నీలమేఘ సుభగాకారున్ జటావల్కలా
జినధారున్ సితభూతి భూషితుని రాజీవాక్షుఁ గల్యాణకీ
ర్తనుఁగాకుత్స్థకులప్రదీపకుని సీతాలక్ష్మణోపేతు స
న్మునిలోకార్చితు సత్కృపాభరణు రామున్ రాజచూడా
మణిన్.

ఇట్టి యుదాహరణముల నెన్నిటినో యీ రామోపా
ఖ్యానముననె ప్రబంధ పరమేశ్వరుఁడు కావ్యత్వమును నిరూపిం
చుటకై చేర్చెను. అందు కథాచ్యుతి కాకుండగ, వర్ణనము
న మూలాతిక్రమణముఁగూడ గొన్ని యెడల నాతఁడుచేసెను.
ఇది,నన్నయ తిక్కనల రీతి ననుసరించియే చేయఁబడెనని తలఁప
నగుచున్నది. ఇట్టి ప్రతిభ నన్నయ తిక్కనలకుఁ గాక పురా
ణాంధ్రీకర్తలగు నితర కవులలో నంతగాఁ గాన్పింపదు. అందు
వలననె యీతఁడు ప్రబంధ పరమేశ్వరుఁడయ్యెను.

ఎఱ్ఱనామాత్యుని రామాయణాంధ్రీకరణము.

ఎఱ్ఱన రామాయణమును, ప్రబంధముగాఁ జేసినట్లు
హరివంశమున నాతఁడు వ్రాసికొనుటయేగాక, విప్రనారాయణ
చరిత్రనువ్రాసిన చెదలవాడ మల్లన్న, జక్కనామాత్యుఁడు,

పింగళి సూరన్న, మొదలైనవారును వ్రాసియున్నారు. ఎఱ్ఱన నాఁటికె సంపూర్ణముగ భాస్కర, రంగనాథ, రామాయణములు వ్రాయఁబడియుండ నెఱ్ఱన యేల రామాయణము నాంధ్రీకరింపవలసివచ్చెను? అని కొందఱు చెప్పుచున్నారు. కాని 'భాస్కర, రంగనాథ' రామాయణములు వాల్మీకిరామాయణగాథలతోఁగూడ దేశమునఁ బ్రచారముననుండు నితరగాథలను దమగ్రంథములలో నిఱికించుటచేతను, వాల్మీకిరామాయణముఁ గూడ నాంధ్రభారతముఁబోలె కథలలో మూలాతిక్రమణము కాకుండఁగ నాంధ్రీకరింపఁదలఁచి యెఱ్ఱన రామాయణము నాంధ్రీకరించి యుండును. ఆగ్రంథ మీకాలమునఁ గాన్పింపకుండుట యాంధ్రభాషయొక్క దురదృష్టము. అది 'లండను'లోని స్టేటాఫ్ సెక్రటరీగారి లైబ్రరీలో బరిశోధింపకుండనున్న తెనుఁగు పుస్తకములలోనో, ♦ పారీసు, బర్లిన్, లైబ్రరీలలోనున్న తెనుఁగు పుస్తకములలోనో యుండవచ్చును.

ఎఱ్ఱన రామాయణములోని రెండుపద్యములను శ్రీ కం. వీరేశలింగము పంతులుగారు కవుల చరిత్రలో నుదాహరించియున్నారు. ఈక్రింది పద్యముకూడ నెఱ్ఱన రామాయణములోనిదే.

ఉ. త్రెవ్వెడు గంటులం గురువు♦దేఱెడు నెత్తురు రాకమున్న, యే
నొవ్వియు నే వికారము మ♦నోగతిఁ జెందకమున్న, సాయకం

---

♦ఇండియా ఆఫీసు లైబ్రరీలో నాలుగువందలవఱకు తెనుఁగు వ్రాఁత గ్రంథములున్నవట. వీనికై యొకప్పుడు కీ॥ శే॥ కే. వి. లక్ష్మణరావు గారు ప్రయత్నించియున్నారు.

బవ్వలఁ బోకమున్న, మకుటాగ్రవిఘట్టన రాణమొప్పఁగా
నువ్వున నుప్పతిల్లె, నసుగోద్వహుమూర్ధచయంబు గ్రక్కు-
నన్.

ఇది రావణవధ ఘట్టములోనిది.

## —• హరివంశాంధ్రీకరణము. •—

ఇంచుమించుగ 'ఎఱ్ఱనామాత్యుని' కాలముననె 'విజయనగర' రాజ్యమున, బుక్కభూపతిచే గౌరవింపఁబడు 'నాచనసోమనాథుఁడు'ను హరివంశము నాంధ్రీకరించెను. దానిలో నిప్పుడు 'ఉత్తరహరివంశమె' దృష్ట మగుచున్నది. ఎఱ్ఱన హరివంశోత్తరభాగముకంటె సోముని యుత్తరహరివంశము రసవత్తరమని కొందఱితలంపు. ఇం దభిప్రాయభేదములు కలవు. జనసామాన్యము, పురాణగాథలను విన నిష్టపడుదురు. భారతాదులనువలె యెఱ్ఱన హరివంశమును గ్రామములలోని పెద్దలు ప్రాచీనకాలమునుండియుఁ దత్తద్గ్రామస్థ పండితులచేఁ బురాణముగాఁ జెప్పించుచుండువారు. కారణ మేమన నెఱ్ఱన హరివంశ మించుమించు సంస్కృత హరివంశగాథలను విడువక యింపుగ భారతమువలె రచింపఁబడుటచేతనె సోముని హరివంశము ప్రబంధశైలి కలదగుటచేతను, సంస్కృత హరివంశములోని గాథలను బెక్కింటిని వదలి రచింపఁబడుటచేతను, జనసామాన్యము దాని నంతగాఁ బాటింపలేదు. ప్రబాధత్వమున నది కొందఱికి మిన్నగానె యుండును గాని, జనసామాన్యమున కది యందుబాటులోనుండు శైలి కలది గాదు.

నాచనసోమునియుత్తరహరివంశ మాశ్వాసములు

కలిగి (1492) పద్యములు కల దగుచుండగా, ఎఱ్ఱన యుత్తర హరివంశము పదియాశ్వాసములు గలిగి (2430) పద్యములతో నింపుగ విపులీకరింపఁబడెను. ఇట్లెఱ్ఱన్న విపులీకరించినను గొందఱికింకను నెఱ్ఱన, సంస్కృత హరివంశగాథలను సంపూర్ణముగ నాంధ్రీకరింపలేదనియే తలంచిరి. అట్లు తలఁచిన యొక ప్రభువు, ఉత్తరహరివంశగాథలలో, వేఱుగఁ గొన్నిటి నాంధ్రీకరింపఁజేసి యెఱ్ఱనామాత్యుని పుస్తకములోఁ జేర్పించెను.

## * నేమాని భైరవావధాని హరివంశము

ఈతఁ డిప్పటికి రమారమి రెండువందలేండ్లకుఁ బూర్వమున, విశాఖపట్టణపుజిల్లాలో నుండువాఁడు. ఈకవి ఎఱ్ఱన హరివంశములో, 'పారిజాతాపహరణాది' గాథ లాంధ్రీకరింపలేదని, 'కోటగిరి శ్రీనివాసభూపతి' కోరికచేఁ నాగాథలను మూఁడాశ్వాసములుగ రచించి 'ఎఱ్ఱనామాత్యుని హరివంశభాగమునఁ గలిపిన వ్రాతప్రతు లొకటిరెండు కలవు. భైరవావధాని హరివంశభాగము, ఎఱ్ఱన్న యుత్తరహరివంశమున, నాలవయాశ్వాసమునకుఁ బిమ్మట, 5, 6, 7 ఆశ్వాసములుగాఁ జేర్పఁబడెను. అనఁగా నెఱ్ఱన యుత్తరహరివంశమున నైదవయాశ్వాసము దీనిలో నెనిమిదవయాశ్వాస మగుచున్నది.

భైరవావధాని తాను హరివంశభాగము నాంధ్రీకరించుట నిట్లు సమర్థించియున్నాఁడు.

---

* ఈతని పుస్తకము నాచే నాంధ్రసాహిత్యపరిషత్కార్యాలయమున కీయఁబడెను.

చ. వరగుణశాలి కోటగిరి • వంశభవుండగు శ్రీనివాసభూ
వరుఁ డతిభక్తితోడ హరి • వంశ కథాశ్రవణైకచిత్తుఁడై
యరయుచుఁ బారిజాత • హరణాదికథావళి లేకయున్నచో
సురుచిరదృష్టిచేత, ననుఁ • జూచి దయామతితోడ నిట్లనెన్

గీ. ఎఱ్ఱనార్యుండు తెలిఁగింపఁ • జేల నొక్క
తెలుఁగుఁ జేసిన పిదపను • దొలఁగె నొక్క
యీకథలు నీవు తెలుఁగింపు • మింపుమీఱఁ
బ్రకట నేమాని భైరవ • సుకవి చంద్ర.

... ... ... ... ... ...

వ. అని పలికి తాంబూలాంబర జాంబూనదా గ్రహారాది ప్రదానంబుల నాదరించినఁ బ్రహృష్టాంతరంగుండనై ......

ఆశ్వాసాంతగద్య మిట్లు కలదు.

గద్యము. ఇది శ్రీమత్కల్యాణ గౌరీచరణ సరసిజషట్పదాయమాన మాన సోభయ కవితా సార్వభౌమ బిరుదాంక వేంకట భట్టారక పౌత్ర సూర్యనారాయణ సోమయాజి సత్పుత్ర నితుందిలసగోత్ర పవిత్ర నేమాని భైరవావధాని ప్రణీతంబైన హరివంశంబునందు... ఆశ్వాసము—

భైరవావధాని 'ఉత్తరాపరిణయముఁ' జేసెనట! ఈతని వంశజులు 'దిమిలి' సీమలో నిపుడును గలరు—

పైకారణములచేతనె 'సోముని' హరివంశముకంటె నెఱ్ఱన హరివంశము గ్రామసీమలలో నెక్కుడు ప్రచారము నొంది పురాణముగాఁ జెప్పఁబడుట, ప్రాచీనకాలమునుండియు నాచారముగ వచ్చుచున్నది.

# రామోపాఖ్యానము.

(మహాభారతాంతర్గతము)

## ఎఱ్ఱాప్రెగ్గడ మహాకవి.

---

శ్రీ లలితమూర్తి! సుమహా
చ్చాళుక్యవరేణ్య పుణ్య ♦ చారిత్ర! విచి
త్రాలంకారోజ్జ్వలకవి
తాలాపకలాప! సంత ♦ తాస్మేరమతీ! 1

* తే. ద్రుపదనందనఁ గ్రియఁ గడు ♦ దుఃఖపడిన
నృపవధూటియు నాయట్ల ♦ నియతశోక
వనధినిర్మగ్నుఁడైనభూ ♦ వరసుతుండుఁ
గలఁడె వినఁ జూడ ననఘ! యే ♦ కాలమునను. 2

వ. అనిన నతనికి నత్తపోనిధి యిట్లనియె. 3

---

* పాండవులరణ్యమునందుండు కాలమున నొకనాఁడు వారు వేఁటకై పోవ సైంధవుఁడు పాండవుల యాశ్రమమునకువచ్చి యొంటరియైయున్న ద్రౌపది నెత్తికొనిపోవుచుండఁగ ధర్మరాజాదులాశ్రమమునకువచ్చి యాసంగతిని దెలసి సైంధవునివెన్నాడి వానితో ఘోరముగాఁబోరి. వానిని బరాభవించి ద్రౌపదిని దిరిగి యాశ్రమమునకుం దెచ్చిరి. ఆకాలముననే వారి యాశ్రమమునకువచ్చిన మార్కండేయుని ధర్మజుఁడు పూజించి సైంధవుఁడు చేసినచేష్ట నామునికిం జెప్పినపిమ్మటఁ జెప్పంబడినయంశ మీ రామోపాఖ్యానము.

క. "కడు దుఃఖము నొందితి నని
యుడుగక యిటు వగచె దేల♦ యుర్వీశ్వర! నీ
పడుటేటిది రఘురాముఁడు
గడఁగి యిడుమ వడఁడె తొల్లి♦ కాఁడడవులలోన్. 4

ఉ. ఆవిభుకాంత గాదె జన♦కాత్మజ? రావణుచే గృహీత యై
పోవదె? వానరప్రకర♦ముల్ వెసఁ దోడుగ నేఁగి యాధరి
త్రీవిభుఁ డబ్ధి గట్టఁడె? వ♦ధింపఁడె దివ్యశరంబులన్ దశ
గ్రీవునిఁ గ్రమ్మఱంజనియు♦ కిల్బిషరాజ్యవిభూతి నొందఁడే?" 5

— ధర్మజునకు మార్కండేయుఁడు రామాయణకథ సెప్పుట :—

వ. అనిన విని ధర్మజుండు "మునీంద్రా! రాముం డెవ్వనివం
శంబునవాఁడు? రావణుం డెవ్వనితనయుండు? ఏ నిమిత్తంబున
సీతాపహరణంబు సేసె? రామ రావణులకు సంగ్రామం బెట్లు
వర్తిల్లెం జెప్పవే?" యని రామాయణకథాశ్రవణకుతూ
హలియై యడిగిన నమ్మహీపతికి నమ్మహాముని యిట్లనియె. 6

క. "విను మిక్ష్వాకుకులంబున
జనియించె నజుండు నాఁ బ్ర♦శస్తచరితుఁ డా
తని కొడుకు దశరథుఁడు ముద
మున నాతఁడు పెండ్లియయ్యె♦ మువ్వురుసతులన్. 7

వ. అందుఁ గౌసల్యకు రాముండును, కైకేయికి భరతుండు
ను, సుమిత్రకు లక్ష్మణ శత్రుఘ్నులును జనియించి; రండు

రామునకు విదేహరాజనందన యైనసీత ప్రియాంగన యై
యొప్పె; నింక రావణుజన్మంబు సెప్పెద వినుము. 8

ఉ. అఖిలలోకకర్త • యగువిరించికిఁ బుల
స్త్యుండు నాఁగ మానసుఁడు దనూజుఁ
డుద్భవించె; నతని • కుదయించె వైశ్రవ
ణాభిధానుఁడై స • యాత్మజుండు. 9

వ. ఆవైశ్రవణుండు దనతండ్రి యగు పులస్త్యుని విడిచి, తాత యగు చతుర్ముఖునకుం దపంబు సేసి, నలకూబరుం డను కొడుకును, లోకపాలకత్వంబును, ధనేశ్వరత్వంబును, లంక యను పురంబును, శంకరుతోడి సఖ్యంబును వరంబులుగాఁ బడసి మహావిభూతితో వర్తిల్లుచున్నం గని యలిగి పులస్త్యుండు నిజశరీరంబునం దర్ధంబున విశ్రవసుండనువాని సృజియించి, 'యావైశ్రవణున కహితంబు సేయు'మని పనిచిన నెఱింగి కిన్నరేశ్వరుండు విశ్రవసుపాలి కరుదెంచి 'మహాత్మా! యేను నీకుం బుత్త్రుండ నయ్యెద, నాకుం గరుణింపు'మని యతనిం బ్రసన్నుం జేసి నృత్తగీతవిద్యావిశారద లయిన రాక్షసస్త్రీలం బుష్పోత్కటయు, మాలినియు, 1 పాకయు ననువారి ముగ్గుర నవ్విప్రవరునకుఁ బరిచారికలంగా నిచ్చిన. 10

1 రాక, అని సంస్కృతమునఁ గలదు.

క. పురుషుని సయ్యుపతులు నోం
డారులం గడవంగ విలస•ద్రూపచారుసమా
చరణాప్రీణభంగులఁ
బరితోషితుఁ జేసి రాత•పస్వివరేణ్యున్. 11

వ. ఇట్లు ప్రీతుండై యతండు వారలకుఁ బుత్త్రదానంబు సేసిన
నందుఁ బుష్పోత్కటకు రావణకుంభకర్ణులును, మాలినికి
విభీషణుండును, రాకకు ఖరుండును శూర్పణఖ యను
కన్యయు మిథునంబై ప్రభవించి; రక్కుమారులు నలువు
రకుఁ దజ్జనకుండు జాతకర్మాది సంస్కారంబు లొనరించి
సగౌరవంబుగాఁ బెనిచి యుపనీతులం జేసె నందు. 12

ఉ. ఆతతతేజుఁ డున్నతభు•జాగ్రుఁడు లోకభయంకరుండు వి
ఖ్యాతపరాక్రముండు దశ•కంఠుఁడు నతితీవ్రరోషమానసుం
డాతనియట్ల దుర్మదమ•యాత్ముఁడు క్రూరుఁడు కుంభ
కర్ణుఁడున్ । భీతివిదూరుఁ డార్యుఁడు వి•భీషణుఁ డుత్తమ
చిత్తుఁ డారయన్. 13

క. ఖరుఁడు ఖరతేజుఁ డవనీ
సురపరిభవకారి మాంస•శోణితభుజుఁ డు
ద్ధుర చిత్తుఁడు, శూర్పణఖయు
దురితచరిత ధర్మకర్మ•దూషిత యొప్పన్. 14

వ. ఆరాక్షసకుమారులు దండ్రివలన నఖిలవేద వేదాంగ, ధను
ర్వేదపారగులై గంధమాదనగిరియందు సుఖం బుండి యొ

క్క నాఁ డతనికిఁ బ్రొక్కు వచ్చువాని నధికవిభవసమన్వితు
నైశ్రవణుం జూచి తత్ప్రభావంబు దపోలబ్ధం బగుట విని
జాతమత్సరు లయి తారును బితామహు నుద్దేశించి తపం
బు సేయం దొడంగిరి; తత్ప్రకారంబు విను. 15

తే. మండువేసవిఁ బంచాగ్ని ♦ మధ్యమున, ఘ
నాగమంబున బయలను, న♦త్యంతతుహిన
సమయమున నీటియందు, ని♦శ్చలత నిలిచి
దశముఖుఁడు వాయుభక్షుఁడై ♦ తపమొనర్చె. 16

మ. నియతాహారుఁడు నిర్జితేంద్రియుఁడు నై ♦ నిష్కంపవృత్తిన్
మహానియముండై ప్రమదంబుల్ చరించె నధికే♦చ్ఛం గుం
భకర్ణుండు, ధైర్యయుతుండై ఘనుఁడు విభీషణుండును
ప♦ర్ణాహార 1వృత్తిన్ జపాధ్యయనాసక్తిఁ దపంబుసేసె
మది సత్యాంతంబు సంశుద్ధితోఁ. 17

వ. ఖరుండును శూర్పణఖయు వారికిం దగినపరిచర్యలు సేయు
చుండె; నంత సహస్రవర్షంబులు నిండినం బంక్తివదనుండు
దనమస్తకంబొక్కటి ఖండించి మండెడు నగ్నియందు వేల్చె,
మఱియు వేయేండ్ల కొక్కటిగాఁ దలలు దొమ్మిదియుం
దఱిగి వేల్చి ధైర్యంబు దఱుఁగక పది యగు తలయును
వ్రేల్ప నమకట్టినఁ బితామహుండు ప్రత్యక్షంబై వారించి

1 యుక్తిఁ.

ఛానిశిరంబు లెప్పటియట్ల కలుగ నొసంగి 'యమరత్వంబు
దక్క నొండు నీ కభిమతం బగునది యెయ్యది యైనను
నడుగు' మనుటయు నన్నిశాచరుండు. 18

శా. "దేవా! యేను సమస్తదేవపితృదైతేయాహి గంధర్వ ర
క్షోవిద్యాధర యక్షజాతులకు నక్షోభ్యుండఁ గాఁ బ్రీతితో
నీవిశ్వంబునఁ గామరూపగతి నాత్మేచ్ఛావిహారుండఁ గా
నీవే!" నావుడు, వాని కవ్వర మజుం డిచ్చెం గృపా 1
లోలతన్. 19

—: బ్రహ్మ రావణకుంభకర్ణవిభీషణులకు వరంబు లిచ్చుట. :—

వ. "మనుష్యజాతి యొక్కండు దక్క, నీ చెప్పిన యంతటివల
నను నీకు మరణభయంబు లే"దని పలికి పరమేష్ఠి కుంభ
కర్ణుంజూచి "వరం బడుగు" మనిన, వాఁడును దైవోప
హతుండై తనకు నాత్యంతికంబైన నిద్ర యడిగిన "నట్ల
యగున"ని విభీషణున కభిముఖుం డగుటయు నతండు కృ
తాంజలియై జలజాసనుఁ బ్రస్తుతించి. 20

క. "పరమాపద యైనపుడును,
దురితంబులు నామనంబు దొడరమియును, భా
సుర మగు బ్రహ్మాస్త్రంబును

1 లోలుండై

గరుణింపవె!" యనిన నిచ్చ♦కమలజుఁ డనియెన్:

కం. "నిరతము రాక్షస 1భవనముఁ
బొరసియు నీవిట్లు ధర్మబుద్ధి వగుట య
చ్చెరు విది గావున నీకును
దిరముగ నమరత్వ మిచ్చి♦తిం గృప వత్సా." 21

వ. అని పలికి పితామహుం డంతర్హితుండయ్యెఁ దదనంతరంబ. 22

మ. వరగర్వోన్నతుఁడై దశాననుఁడు దు♦ర్వారోద్ధతిన్ దాడిపై
నరిగెం గిన్నరనాథుపై నతఁడు కా♦ర్యంబాత్మనూహించి సం
గరసన్నద్ధుఁడు గాక కింపురుష య♦క్షశ్రేణితోఁ గూడఁ దా
నరిగెన్ లంకఁ బరిత్యజించి రభసో♦ద్యత్పుష్పకారూ
ఢుఁడై. 23

వ. ఇట్లతండు గంధమాదనంబునకుం జనునెడ వెన్నడిం దగిలి దానవుండు వానిమానంబులో [illegible] మానంబు నపహరించినం గని యక్షేశ్వరుండు "గరు[illegible] నన్ను నవమానించితివి గావున నివ్విమానంబు నీకు గతు [illegible]లయ్యెడు" మని శపించె నంత. 24

కం. రాక్షసలక్ష్మీమహిమకు
రక్షకుఁడుగఁ బంక్తిముఖుని♦రాక్షసమా[illegible]
దక్షు నభిషిక్తుఁ జేసిరి
రాక్షస బేతాళవరులు♦రాగం బెసఁగన్ 25

---

1 భావము.

వ. వాఁడును బలదర్పమోహితుండై కడంగి యింద్రాదిదేవ తల నోడిచి, తత్పదంబు లాక్రమించి, యీను మిగిలి జగ ద్రావణంబు సేయుటంజేసి రావణుం డనుపేరం బ్రఖ్యాతి వహించి సకలభూతభయంకరుండయ్యె; నట్టియెడ దేవర్షు లును రాజర్షులునుంగూడి చని తత్ప్రకారం బగ్నిదేవునకుం జెప్పిన నతండు వారిం దోడ్కొని వారిజాసనుపాలికిం జని యిట్లనియె. 26

ఉ. "ఘోరిభుజుండు విశ్రవసుపుత్త్రుఁడు పంక్తిముఖుండు దర్పదు । ర్వారుఁడు రాక్షసేంద్రుఁడు భవద్వర 1శక్తి నవధ్యుఁడై మహా । ఘోరముగాఁ ద్రిలోకములకుం గడు బీడ యొనర్పఁ జొచ్చె, వృ । త్రారి పురోగమత్రి దశులందఱుఁ గింకరులైరి వానికిన్. 27

ఉ. దానవుచేతఁ గష్టపడి దైన్యము నొందుట కోర్వ లేక నీ పైనపదాంబుజంబు లభయంబని చేరితి: మింక మమ్ము నె ల్లైనఁ గృపార్ద్రమానసుఁడవై తగఁ జేకొనవయ్య! మాకు ది । క్కైనను గాకయున్నఁ గమలాసన! నీవకద య్య! యెయ్యెడః." 28

వ. అనినఁ బరమేష్ఠి వారల కిట్లను; "నీకార్యంబునకు నేను మున్న తగిన యుపాయంబు నిశ్చయించి నారాయణుం

---

1 గర్వముచే నవధ్యుఁడై

ప్రార్థించితి నద్దేవుండు మనుష్యభావంబున నవతరించి
యారాక్షసు వధియించువాఁడయ్యె; నింద్రాదిసురులునుం
దమతమ యంశంబులంజేసి ఋక్షవానరజాతులయందు జని
యింపం గలవారు; మీకు భయంబు వల"దని యగ్ని
ప్రముఖు లైనయమ్మహామునులసమ్ముఖంబున దుందుభి
యనుగంధర్వకామినిం బిలిచి, "నీవు కుబ్జరూపంబున మం
థర యనుపేర భూలోకంబున నుద్భవించి నీనేర్చువిధంబున
దేవకార్యంబులు నిర్వహింపు" మని పనిచి వారిం వీడ్కొ-
లిపెఁ; బదంపడి దివిజుల యంశావతారంబులంజేసి. 29

మ. గురుశైలోన్నతగాత్రు లుద్ధతభుజో♦గ్రుల్ వజ్రపాషాణక
ర్కరు లర్కప్రతిమానతేజులు గుణా♦కల్పుల్ మహాకల్పభీ
కరకాలాంతకకల్పు లాజినిపుణుల్ ♦గర్వోన్నతుల్ ఋక్షవా
నరవీరుల్ జనియించి రెల్లయెడలన్ ♦నాగాయుతప్రాణులై.

క. అని విని యుధిష్ఠిరుం డ
మ్మునివరుతో "ననఘ! ధర్మ♦మూర్తిని నారా
ముని నేల యరణ్యంబున
కనిచెను దశరథుఁడు చెపుమ! ♦ యక్కథ యెల్లన్." 31

వ. అని యడుగుటయు, మార్కండేయుం డిట్లనియె; "దశర
థుండు నిజసుకృతపాకంబునం జేసి రామప్రముఖు లైన
కొడుకుల నలువురం గని త్రైలోక్యరాజ్యంబు సంప్రాప్తం,

బయివయుట్లు సంతసిల్లె; నక్కుమారులు క్రమంబున నుప
నీతులు సఖలవేదవేదాంగవినీతులు యథాక్రమపరిణీతులు
నై విలసిల్లి రంత. 32

సీ. అభినవపద్మద♦ళాక్షు నక్షీణవి
స్తృతవక్షు నాజాను♦దీర్ఘబాహు
మధురస్మితానను ♦ మదగజగమను నా
రూఢయౌవను నభి♦రూపతేజు
శ్రీరమణీయుఁ బ్రసి♦ద్ధయశోరమ్యు
నిఖిలవిద్యాగమ♦నిపుణచిత్తు
నింద్రసమాను జి♦తేంద్రియు ధర్మజ్ఞుఁ
బౌరబాంధవజన♦ప్రార్థనీయు

ఆ. దుష్టనిగ్రహైక♦ధుర్యు విశిష్టసం
రక్షణాభిలోలు ♦ రామభద్రుఁ
గులపవిత్రుఁ బెద్ద♦కొడుకుఁ గనుంగొని
రాజవరుఁడు గరము ♦ రాగ మెసఁగ. 33

వ. యౌవరాజ్యపదంబునకు నతని నభిషేకం బాచరింపం గోరి
యాప్తమంత్రిజనసమ్మతంబునఁ బురోహితనిరూపితం బైన
శుభదినంబున నక్కార్యంబునకు సమకట్టునెడ, భరతుదాది
మంథర యనునది యమందగతిం గైకేయిపాలికిం జని యి
ట్లనియె. 34

ఉ. "అక్కట! నీదెసం బతికి ♦ నాఁడెకూరిమి యయ్యొ మా
యా పుం। జ్యోత్స్నలు నీవు నిక్కముగఁ ♦ జూచి మనంబున
మోసపోయి తా। టక్కరి కోసలాత్మజయె♦డం బ్రియుఁ
డై యదె తత్తనూజు నిం। పెక్కఁగ యౌవరాజ్యమున♦
నిప్పుడు పట్టము గట్టఁ బూనెడున్. 35

ఆ. ఘడమితేనిమదికి ♦ నెడ మైతి నీ వింక
నేమి సెప్పఁ గలదు ♦ వామనయన!
కడఁగి నిన్నుఁ గొడుకుఁ ♦ 1 బెడపడ వైచి యా
సవతికొడుక యేలు ♦ నవని 2యింక." 36

క. అనిన నుదరిపడి కేకయ
తనూజ గడు సంభ్రమమునఁ ♦ దక్షిణమ నరేం
ద్రునిపాలికిఁ జని యేకత
మున నిట్లనుఁ బ్రణయపూర్వ♦ముగ నాతనితోన్. 37

క. "ధరణీశ! తొల్లి నాకుం
గరుణించినవర మొకండు ♦ గల దది మదిలో
బరికించి యిప్పు డొసఁగుము
చిరముగ సత్యవ్రతంబు ♦ సెల్లింపు తగన్." 38

వ. అనిన నతఁ డయ్యుత్తివం గనుంగొని "యవధ్యుల వధియిం
చుటయును, వధ్యులం గాచుటయును, బ్రాహ్మణధనంబులు

---

1 బెడవాడఁద్రోచి 2 యెల్ల

దక్క నన్యులధనం బపహరించుటయును, నభీష్టధనంబు
నిచ్చుటయును మొదలుగా నతిదుష్కరంబు లైనవాని
నైనను భవత్ప్రియార్థంబు సేసెద; నెయ్యది సెప్పు"
మనినఁ బ్రీత యై భరతమాత యిట్లనియె. 39

తే. "యౌవరాజ్యపదంబున ♦ యందు భరతు
నధిప! యభిషేక మొనరింపు; ♦ మడవి కోన
నోలసి పదునాల్గువర్షంబు ♦ లుండ నాన
తిమ్ము రాముని; సురవర ♦ మ్మిదియు నాకు." 40

క. అనవుడు వీనులు గొఱవిం
గొని చూఁడిన యట్టు లైనఁ ♦ గువలయపతి పె
ల్చన పిడు గడిచినక్రియఁ జే
తసరహితుం డగుచు ధరణి ♦ తలమునఁ బడియెన్. 41

వ. అంతయు నెఱింగి రాఘవుండు 'నిజజనకుండు సత్యప్రతి
జ్ఞుండు గావుత!' మని యాక్షణంబ సీతాసమేతుండై వనం
బునకు వెడలె; నతనిపిఱుందన లక్ష్మణుండును జనియెఁ
దదనంతరంబ. 42

—: దశరథుండు రామవిశ్లేషముచే సురలోకగతుం డగుట. :—

క. రాముఁడు సనుట విని మహో
ద్దామం బగుశోకవహ్ని ♦ దరికొనఁగను 'హా!

రామ! గుణధామ!' యని 1యని
భూమీశ్వరుఁ డసువియోగ♦ముం బ్రాపించెన్. 43

వ. ఇట్లు దశరథుండు సురలోకగతుం డగుటయుఁ, గైకేయి దనకొడుకు రావించి "భూవల్లభుండు దేవభావంబు నొందె, రాముండును వనంబున కరిగె, నింక నర్హుండవు నీవ కావున నఖిలమహీరాజ్య రక్షణంబు సేయు" మనిన, నక్కుమారుండు క్రోధశోకదందహ్యమానమానసుండగుచుఁ దల్లి కిట్లనియె. 44

సీ. "దురితంబు లెన్నండుఁ ♦ బొరయక వెలుఁగొందు
కమలాప్తకులమునఁ ♦ గసటు గలిపి
పరమధర్మాత్మకుఁ ♦ బురుహూతసన్నిభుఁ
బతి మ్రింగికొని కృపఁ ♦ బాఱవైచి
యాయతబాహుఁ దే♦జోయుక్తు మాయన్నఁ
బటుధైర్య నడవుల♦పాలు వఱిచి
2 జీవితహంత వై ♦ త్రోవంగరానిదు
ష్కీర్తి నాయాదలఁ♦గీలుకొల్పి

ఆ. శ్రీకి 3 నెడలి సకల♦లోకంబు 4 చేతను
దిట్టు గుడిచి కోర్కి♦దీర్చుకొంటి

1 యా. 2 జీవిత్రై కాఠ్రివై, (తా) జీవితహంత్రివై 3 నెడిటి
4 లందును.

పాపజాతురాల♦యీపాతకం బేమి
సేయు? దింక నేమి♦సేయువాఁడ?" 45

వ. అని దుఃఖించి భరతుండు దండ్రికి నుచితక్రియలు నిర్వర్తించి యనంతరంబ సమస్తమంత్రిసామంతభూసురపౌరజానపద సహితుండై కదలి, మువ్వురు దల్లులను వసిష్ఠవామదేవులనుం బురస్కరించుకొని తానును శత్రుఘ్నుండును రామానునయార్థంబు చిత్రకూట శైలంబున కరిగి యుండు. 46

మ. కనియెం, గోమలనీలమేఘసుభగా♦కారున్ జటావల్కలా
జిన ధారున్ సితభూతిభూషితుని రా♦జీవాక్షుఁ గల్యాణకీ
ర్తను[1]ఁ గాకుత్స్థకులప్రదీపకుని సీ♦తాలక్ష్మణోపేతు స
న్మునిలోకార్చితు సత్కృపాభరణు రా♦మున్ రాజచూ
డామణిన్. 47

వ. కని యంతంత నాక్రందనపరుం డగుచుం జని తదీయ చరణంబులపయిం బడి పితృమరణప్రకారం బంతయుం నెఱిఁగించి "దేవా! సకల సామ్రాజ్యధురీణుండవై మమ్ముం దఱ ననుశాసింపవే!" యని యఖిలజన సహితంబుగా నతసిం బ్రార్థించిన. 48

క. గురువాక్యరతుండై కా
దరచిత్తుం డై నయయ్యుదాత్తచరితుఁ డై

1 మార్తాండకులేంద్రుఁడు 'సందర్భము.

ష్పురుషున నొంచఁబడఁ డయ్యెను
సరసమహీరాజ్య సమను♦శాసనమునకున్. 49

వ. భరతుండును రాముచేతఁ బ్రత్యాఖ్యాతుండై తదీయపాదుకంబుల గొని చని వాని నర్చించుచు నందిగ్రామంబునందు వసియించి రాజ్యానుసంధానంబు సేయుచుండె; నిట రాఘవుం డయోధ్యా సమీపం బగుటంజేసి క్రమ్మఱ భరతాగమనంబు శంకించి చిత్రకూటంబు వాసి, శరభంగుపాలికిం జని యతనిచేత సత్కృతుండై దండకారణ్యంబు సొచ్చి, యందు గోదావరీతీరంబున ననుజ వధూసహితంబుగా గృతనివాసుండై యున్నంత, దశగ్రీవుచెలియలు శూర్పణఖ సనుదెంచి వారికి నపకారంబు సేయ మొనసినం గినిసి యారాజపుత్త్రులు దత్కర్ణనాసికావైకృతం బొనరించినం బదంపడి. 50

ఉ. శూర్పణఖానిమిత్తమున♦శూరు లనేకులు రక్కసుల్ మ
హా । త్సర్పితరోషులై బహుళ♦సైన్యయుతంబుగ నెత్తి
వచ్చుడున్ । దర్పితవైరిభంజనుఁ డుదారుఁడు రాఘవుఁ
డస్త్రవిద్య నే । ర్పేర్పడఁ గేలిఁబోలె సమ♦యించె రణాం
గణభూమి నందఱన్. 51

వ. ఇట్లు ఖరదూషణాదులందొట్టి పదునాలుగువేల రాక్షసులం జంపి దండకారణ్యంబు విగతకంటకంబు గావించె; నంత శూర్పణఖయు రయంబున రావణుపాలికిం జని తచ్చరణం

బులపయిం బడి యేడ్చినం, జెలియలి కైన వైకృతం బే
ర్పడం జూచి యన్నిశాచరనాథుం డిట్లనియె. 52

సీ. "ఎఱిఁగి యెఱింగి నేఁ ♦ డెవ్వఁడు నిశితవి
స్ఫారశూలాగ్రంబు♦పయికి నుఱికెఁ?
దలయంపియం దగ్గి♦దరికొల్పి యెవ్వండు
నేఁడు నెమ్మది శయ్య♦నింపఁ జూచె?
నుగ్రవిషానలం♦బుమియు చున్నయహీంద్రుఁ
గడఁగి నేఁ డెవ్వండు♦గాలఁ దన్నె?
హుంకారఘోరమై♦1యుదరు బెబ్బులి మీస
లుఱక యెవ్వాఁడు నేఁ♦డూఁచికొనియెఁ

తే. 2 నిన్ను నెవ్వఁ డకట!♦నేఁ డిట్లు గడు భంగ
పఱిచెఁ జెపుము నాకుఁ♦బద్మనయన!
యాయువును సిరియుఁ దను♦నవసంబులయ్యె నేఁ
డెవ్వనికొ తలంప♦నిజ్జగమున." 53

క. అని పలుకునప్పు డాతని
ఘనతరముఖ నేత్రనాసి♦కా4రంధ్రములం
దనవరత కోపపావక
జనితశిఖావితతు లక్క♦జంబుగ వెడలెన్. 54

1 ఒదరు (లేక) ఒదవు. 2 వాఁడు మత్ప్రతాప వైశ్వానరార్చులం బొలియఁ దీక్షణంబు శోభమునఁగ। 3 నపాయంబులయ్యె. 4 కర్ణములన్.

వ. శూర్పణఖయు నతనికి రాఘవులున్న తెఱంగును, నిజపరి
భవంబు దత్కృతం బగుటయు, ఖరదూషణాది రాక్షసవధ
యునుం జెప్పిన విని, ధనదానుజుం డాక్షణంబ పుత్రసంరక్ష
ణంబునం దాప్తజనంబుల నియోగించి సన్నద్ధుండై యొ
క్కరుండ వెలువడి త్రికూటకాలపర్వతంబులు గడచి సము
ద్రతీరంబునం బరమేశ్వరనిధానంబైన గోకర్ణస్థానంబునకుం
జని, యచ్చటం దొల్లి రామువలనం బ్రాప్తపరాభవుండై
ప్రవ్రజనంబు నొంది తపంబు సేయుచున్నవానిం దనపూ
ర్వామాత్యు మారీచుం గనిన, నతండును బ్రియసంభ్ర
మంబులతోడ నతనిం బూజించి కుశలం బడిగి 'భవదాగ
మన నిమిత్తం బేమి?' యని యడిగిన నసురేశ్వరుం
డిట్లనియె. 55

ఉత్సా. "వినవె? రాముఁ డనఁగ నొకఁడు • విపులదర్పహృద
యుఁడై । మనఖరుండు లోనుగా స•మగ్రశౌర్యు
లైనయ । ద్దనుజవరులఁ దునిమి యిపుడు•దండకస్థలం
బునం । దొనర నిర్భయత్వ మొప్ప • నున్నవాఁడు
మేటియై. 56

ఆ. వానిఁ బరిభవింప•వలయు, నవ్వనికి సా
హాయ్యకం బొనర్పు• మనఘ! నాకు"

గవిన నధికభయస♦మావిష్ట హృదయుండై
యమరవైరి కీట్టు♦లనియె నతఁడు. 57

చ. ''ఎఱుఁగవు [1] గాక! రాఘవును♦దీర్ఘభుజాబలరూఢి నాజిలో
నుఱక తదీయబాణరయ♦మోర్వ వశంబె? పినాకికైన [2] ను
క్కఱ మఱినీకు నిత్తెఱఁగుఁ♦గా దన కేఖలుఁ డొక్క
బుద్ధిగాఁ | గఱపినవాఁడు? నేటునకుఁ♦గాలము సేరెనొ? కా
క యిమ్మెయిన్. 58

ఆ. రాముతోడఁ [3] దొల్లి♦రణమునఁ గడు భంగ
మొంది కాదె దైన్య యుక్తి నిట్లు
దపస్వినైతి; నేఁడు♦తగ దమ్మహాత్ముని
యందు వైరబుద్ధి♦యధిప! నీకు.'' 59

వ. అనినం గలుషించి లంకేశ్వరుండు వానిం జూచి, ''నాపను పు సేయనైతివేని నిన్నిప్పుడ కృతాంతగోచరుం జేయుదు''ననిన వాఁడును దనమనంబున 'వీనిచేతం జచ్చుటకంటెను రాఘవకృతంబైనమరణంబు మే' లని తలపోసి, ''మహాత్మా! నీకు హితంబు గోరి చెప్పితి; నిది యిష్టంబు గాదేని భవదీయశాసనంబు గైకొని చేసెదం బనుపు'' మనినఁ బౌలస్త్యుం డిట్లను. ''నీవు రత్నమయతనూరుహంబగు కనక మృగంబవై చని జానకిం బ్రలోభింప వలయు; సీతాచోదితుండై రాముండు నిన్నుం బట్ట సమకట్టి నీ

1 నీవు 2 అక్కఱయుగ 3 తోడరి.

చేఁగ నతిదూరంబు గొనిపోవంబడు; నప్పు డేను దద్భామిని
సంహరించెదఁ; బ్రియావిరహదుర్మనస్కుండై యతండు
చెడి పోవు'' ననిన నట్ల కాక యని మారీచుండు, 60

—:. మారీచుఁడు మాయామృగంబై చనుదెంచుట. :—

క. కనకమృగరూపమునఁ జని
యినవంశ్యుఁడు సతియు నున్న♦యెడ 1 మెలఁగుటయుం
గని జానకి కౌతూహల
మునఁ బ్రియుఁ బ్రార్థించె హరిణ♦పుంగవుఁ బట్టన్. 61

ఆ. ధరణి సుతయు విధియుఁ♦దన్నుఁ బ్రేరేపంగ
వివశబుద్ధి యగుచు♦నవనివిభుఁడు
మృగముఁ బట్టఁ దివిరె♦మృగనేత్ర 2 కావ స
ద్వినుతబలు సుమిత్రి♦తనయు నునిచి 62

క. అసదృశ కార్ముకధరుఁ డై
మసలక యామృగము వెనుక♦మర్దితరిపుఁ డిం
పెసఁగంగ నరుగఁ దొడఁగెను
వెస రుద్రుఁడు యజ్ఞమృగము♦వెనుకొనుమాడ్కిన్. 63

వ. అట్టి యవసరంబున. 64

---

1 పొలయుటయు 2 కాపు.

మ. పఱచున్ ధన్వగఁ, జేయలంతి నిలుచుం, • బట్టీక 1 యాసా
సలం । బిఱుబోవుం, బొదిలంగు డిందుఁ, బొడమున్ • బిట్టు
లిఁగ్గవే దాఁటుఁ, గ్రి । మ్మఱితి చూచుం, జెవి దాఁచ్చు
నిల్చు, మలయున్ • మట్టాడు 2 గ్రోడాడు, నే । మఱిన
ట్లుండుఁ, దృణంబు 3 మేయు, మలయున్ • మాయామృగం
బిమ్ములన్.

వ. ఇట్లతి దూరంబుగా నెలయించి యలయించిన, నది రాక్షస
మాయగా నూహించి రాఘవుం డమోఘబాణంబు దొడిగి
తడయక యమ్మృగంబు నేసిన. 65

క. వాలమ్ము దాఁకి యొఱలుచు
నాలోనన రామునెలుఁగు • నట్టియెలుఁగు గా
"హా! లక్ష్మణ! సీతా!"యని
కూలి కపటమృగము దన్నికొనుచుం జచ్చెన్. 66

తరువోజ. ఆయెలుఁ గేగ్పడ • నవనీతనూజ
యాలించి తల్లడం • బడరు చిత్తమున
"హోయన్న! లక్ష్మణ! • యొలసి మాయన్న
యుగ్రరాక్షసబాధ • నొందంగఁ బోలు!
నాయతభుజ! వింటె? • యమ్మహాభాగుఁ
డత్యంత దుఃఖార్తుఁ • డై నన్నుఁ జేరెఁ;

---

1 ఆసావగా 2 క్రోడా[illegible] ([illegible]) గోరాడు 3 అను

బో యి వే 1 కావు వి♦ స్ఫురితపుణ్యైక
భూమణోదార! యు♦వ్వఁగమరత్నఁబు.'' 67

వ. అనిన నతం డమ్మానిని కిట్లనియె. 68

ఆ. ''అబల! వెఱన కుండు ♦ మఖిలలోకములను
రాఘవేశ్వరునకు ♦ రణములోన
నెదురఁ గలఁడె శూరుఁ ♦డెవ్వఁడు నతనికి
నెట్టియెడల దురిత ♦ మేల పొందు? 69

క. ఇనవంశోత్తముఁ డిప్పుడ
చనుదెంచుఁ బ్రియుంబు నొందు ♦ జలజానన!'' నా
విని జానకి లక్ష్మణునెడ
జనితాశంక యయి క్రోధ ♦ సంభ్రాంతమతిన్. 70

సీ. ''సీతలం పెఱుఁగుదు ♦ నీ కేల వలవని
జాలి నీ కిట్లేల ♦ సంభవించె?
నతిఘోరశస్త్ర వి♦పాట్లు లయుం దొంటల
వేగంబ ప్రాణముల్ ♦ విడుతుఁ గాక!
యే నేల నిను వరి ♦ యింతు? దెబ్బలి కాంత
యక్కట నక్కఁ పొం♦దానువడునె?''
యని యిట్లు నత్పురు♦షాగ్రణిని ఘాద్ర్మిత్రిఁ
[illegible] ♦ వల్కుటయును

1 కావవే పుణ్యగుణైక భూమణోదారునవ్వఁగమరత్నంబు.

ఆ. చెవులు మూసికొనుచుఁ ♦ జిత్రంబు గలఁగ ల
క్ష్మణుఁడు దక్షిణాంబ♦మహితశౌర్యుఁ
డతులబాణచాప♦హస్తుఁడై తనయన్న
ననిసచొవ్వనంద ♦ చనఁ దొడంగె. 71

వ. అయ్యవసరంబున, దశాననుండు. 72

మ. కమనీయం బగుజన్నిదంబు శిఖయుం ♦ గౌపీనమున్ ధా
తువ । స్త్రము దండంబును గుండియుం గుశపవి♦త్రింబుం
గఢాణ్ వృద్ధభా । వము సంధిల్లఁ ద్రిదండి వేషధరుఁడై ♦ వ
చ్చెం బథిశాంతి దే । హమునం దోఁపఁగ సీతయున్నెడకు
నా♦యాదక్షుఁ డక్షీణతన్. 73

తే. వాని నిక్కంపు మునియకా ♦ వగచి రాము
వనిత గడుభక్తిఁ బూజించి ♦ వన్యఫలము
లొసఁగుటయు, వానిఁ జేకొన ♦ నొల్ల కసుర
మదన వివశుఁడై యిట్లను ♦ మగువఁ జూచి. 74

మత్త. "ఏను దానవనాయకుండ, స♦హీనసత్త్వుఁడ, రావణా
ఖ్యానిరూఢుఁడ, లంక నాఁగ జ♦గత్ప్రసిద్ధము మత్పురం
బానతాంగి! మదీయవల్లభ ♦ వై 1 భజింపఁగ రాదె ది
వ్యానుభోగము లిష్టచేష్టిత♦హారి యౌవనలీలలన్. 75

క. ఎక్కడిరాఘవుఁ డక్కట!
తక్కువయగుపేదమనుజుఁ ♦ దగిలి వనమునం

1 భుజింపఁగ

బెక్కుడుములఁ బడఁ దగునే?
తక్కుము మది నింక నొందు♦దలఁపులు తరుణీ! 76

వ. అనిన విని వైదేహి భయకంపితదేహ యగుచు నతని
కిట్లనియె. 77

సీ. ఇట్లాడ నర్హమే? 1 యే నేడ? నీ వేడ?
నక్షత్ర తారాగ♦ణంబు తోడ
నాకసం బంతయు ♦ నవనిపైఁ గూలిన
వసుమతి వ్రస్సిన ♦ వనధు లెల్ల
నింకినఁ జంద్రది♦నేశ్వరు లన్యోన్య
2 విపుల తేజంబులు ♦ వీడువడిన
నే నేల యన్యుని ♦ నెడలోనఁ గామింతుఁ?
గరిణి యేనాఁట సూ♦కరముఁ గలయు

ఆ. మహితకమలమధుర♦సాస్వాదన
పరవశాత్మ యైన♦భ్రమరకాంత
రిత్తబుద్ధి నకట! ♦ రేఁగుపువ్వులరసం
బాను నెట్లు? బేల♦వై తిగాక." 78

—: రావణుఁడు సీత నెత్తికొని లంకకుఁ బోవుట. :—

వ. అని పలుకుచు నొయ్యనొయ్యన తొలంగం జనిన, సద్దురా

1 ఏనేల నీవేల 2 విషయకాలంబులు.

త్తుఁ డతిభయంకరంబుగా జంకించి యమ్మగువం బట్టికొని గగనంబున కెగసి లంకాపురాభిముఖుండై యరుగఁ దొడంగిన, నయ్యింతి యెంతయుం దలరి యిట్లని విలాపంబు సేసె. 79

ఉ. "దేవతలార! యోధరణి♦ దేవతలార! జగత్త్రయో
న్నతుం | డై వెలుఁ గొందు రాముని కు♦లాంగన జానకి
నేను; నన్ను మో | హోవిలుఁ డొక్కరక్కసుఁ డ♦నర్గ
ళుఁడై కొనిపోయెదుం గృపం | గావరె! పుణ్యముక్ య
శముఁ ♦ గాగ కొనరే యిదె మీకు మ్రొక్కెదన్. 80

క. అని యేడ్వఁగఁ దద్వచనము
లనఘుఁడు గిరి గహ్వరాంత♦రాలయగతుఁడై
విని యరుణసుతుఁడు తేజో
ఘనుఁడు జటాయు వనుపక్షి♦గారుణ్యమునన్. 81

క. ఎఱకలు గలకులశైలము
తెఱఁగు 1 మెయిన్ రయము మెఱయ♦దివికి నెగసి బె
ట్టుఱుము జలధరము క్రియ ను
క్కఱి భువనం బెల్లనద్రువ♦నార్చుచుఁ గడిమిన్. 82

ఉ. "ఓరి దురాత్మ! యీయబల ♦ నోడక యేటికిఁ బట్టినాఁడ?
వం | భోరుహనేత్ర విష్ణు; మొటు♦వోయినఁ బ్రాణముఁ
గొందుఁ నింక ను | గ్రారి విభేది విక్రము జ♦టాయు నె

1 వెఱగు మేఁయ రయము మెఱయ

లుంగవే?" యంచు దర్పదు । ర్వారుఁడు వీఁక దాఁకె
సుర♦వర్గ 1 విభూతను నద్దశాననున్. 83

మ. ఘనపక్షాహతులం బ్రకాండ పరిఘా♦ఘాతంబులం దీవ్రశా
తనఖోచ్ఛేదములం బ్రదీప్తశరవే♦ధక్రీడలం గ్రూరచం
చునిపాతంబులఁ బ్రౌఢకుంతముఖవి♦స్ఫోటంబులం దత్ఖగేం
ద్ర నిశాటేంద్రులపోరు సాధనసమ♦త్వస్ఫూర్తి నొప్పెం
గడున్. 84

చ. పటుతరపక్షపక్షముఖ♦పాదనఖప్రవిఘాతఖండిత
స్ఫుటితశరీరుఁడై బహుళ♦శోణితధారలు తేనఁ గ్రమ్మఁగా
దటసము పాంతనిర్గళిత♦ధాతురసారుణసాంద్ర నిర్ఝరో
త్కటకులశైలలీల దశ♦కంఠుఁడు నిల్చె 2 నకుంఠితస్థితిన్. 85

వ. తదనంతరంబ. 86

క. తెలిసి గని దానవేశ్వరుఁ
డుఱక కృపాణమున నాఖ♦గోత్తము నెఱకల్
నఱికినఁ గూలె నతం డిల
నఱవఱలై పవనహాత 3 మ♦హాభ్రమపోలెన్. 87

వ. ఇట్లు జటాయువుం గూల్చి రావణుం డధికరయంబున నరు
గునెడ జానకి దనకు దిక్కెవరు లేమిఁ జేసి నిరాశయై యొ

1 నిషూదను (లేక) విమానను 2 అకుం... 3 మహాభ్రమువోలెన్.

4

క్క శైలశృంగంబునందుఁ గొందఱువానరులు మెలంగు
చున్నం గని, తనకట్టిన పుట్టంబుకొంగు సించి 1 భూషణం
బులు ముడిచి తత్ప్రదేశంబున వైచెం బంక్తివదనుండును
లంకాపురంబునకుం జని యం దశోకవనమధ్యంబున నాసు
మధ్య నునిచి తదీయరక్షణార్థంబు రాక్షసీనివహంబు ని
యోగించె; నిట రాఘవుండు మాయామృగంబు వధియిం
చి మగుడంజనుదెంచువాఁడు దనకెదురుగా వచ్చులక్ష్మణుం
గని 'రాక్షసగోచరం బైనవనంబున జానకి నొంటి యునిచి
వచ్చి తప్పు సేసి' తని పలుకుటయు, సుమిత్రానందనుండు
ధాత్రీతనయ దన్ను నవమానించి పలికినతెఱంగు సె
ప్పిన. 88

మధురాక్కర. కనకమృగ మట్లు దను దవ్వు•గాఁ దిప్పి తెచ్చుటకు
వనజముఖ నేకతమ శూన్య•వనమునయం దునిచి
వెనుక ననుజుండు వచ్చిన•విధమునకు మదిలోన
వనఘుఁ డెంతయు వగచుచు • నరిగె నాశ్రమమునకు. 89

వ. అట్లు నని చేతనారహితంబైన శరీరంబునుంబోలె సీతావి
హీనంబై యున్న పర్ణగృహంబు గనుంగొని రాఘవుండు
మూర్ఛితుండై లక్ష్మణ 2 ప్రయుక్తంబునఁ గొండొకవడి
కిఁ దెలివొందె; నంత నయ్యన్నయుం దమ్ముండును దత్ప్ర

1 లూడ్చి 2 ప్రయత్నంబున.

దేశంబులయందు సుందరిం దడవుచుం జనువారు ముం
దట. 90

తే. కులిశపాతభంగుర మైనకులనగంబు
కరణిఁ బడి యున్న గృధ్రంబుఁ గాంచి బుద్ధి
నదియు రాక్షసమాయ యగునని తలంచి
యేయ సమకట్టుటయు విహగేంద్రుఁ డెలిఁగి. 91

క. "ఓయయ్యలార! యేను జ
టాయు వనం బరఁగుపక్షి 1 నరుణతనయుఁడన్
మీయయ్య దశరథక్షితి
నాయకునకుఁ బ్రియసఖుండ" నా వుడు వారల్. 92

వ. డాయ నరుగు దెంచుటయు, నతండు వారితో రావణుండు వైదేహిం గొనిపోవుటయుఁ దదర్థంబై తాను నద్దనుజుం దొడరి పెనంగుటయుం జెప్పి, రావణుం డరిగిన దెస నెఱిఁగించి 2 విగతజీవుం డయ్యె; నయ్యిరువురు నవ్విహగుతేనికి నతిగౌరవంబున నగ్నిసంస్కారాదికరణీయంబులు నిజజనక నిర్విశేషంబుగా నాచరించి దక్షిణాభిముఖులై చని చని. 93

చ. ఉరమున యందుఁ గన్నులుఁ బృథూదరదేశమునందు
నోరుఁ బ్రస్ఫురితభుజద్వయంబుఁ గులభూమిధరోన్నత

---

1 నరయుఁడునన్నున్ 2 పరమాత్మునపరాకారంబగు నయ్యాది [illegible] పురుఁడయ్యె.

భావముం గఠం । బరుదుగ నుగ్రమైనవిక్ర♦తాకృతితోడ
నశేషసత్త్వభు । స్మరుఁ డగు చున్నవానిఁ బుటు♦సత్త్వుఁ
గబంధునిఁ గాంచి రచ్చటన్. 94

ఆ. అక్కబంధుఁ డాతు♦పార్థివై లక్ష్మణుఁ
బట్టికొనియె బాహు♦బల మెలర్ప;
నతఁడు గను విషణ్ణుఁ♦డై "యన్న! నను జూడు"
మనుచు రాముఁ జూచి ♦ యనియె మఱియు. 95

—: శ్రీరాముఁడు కబంధుఁ డను రాక్షసుం జంపుట. :—

సీ. "మహాసి[illegible]స్త్ర ♦ మహిమ వాయుటయును
బ[illegible]మరణంబు నా♦భీలవిపిన
భూములఁ గడుదుఃఖ♦మునఁ జరించుటయు వై
దేహి గోల్పడి వగఁ ♦ దిరుగుటయును
దుదిఁ బోయి యే నిట్టు ♦ దొడరి యీదానవు
వాతఁ జిక్కుటయును ♦ వగవ నీకుఁ
బైపయిఁ జెక్కులా♦పదలయ్యె నక్కట!
ధరణీశ! నీవు నా♦ధరణిసుతయుఁ

ఆ. గలసి పూజ్యరాజ్య♦గౌరవంబున వెలుఁ
గంగ నెలమిఁ జూడఁ ♦ గాన నైతి
నేను దలఁప నెట్టి♦హీనభాగ్యుండనో"
యనుచు దనుజుఁ డార్తి ♦ నడలుటయును; 96

తే. విగత సంభ్రముఁ డై రామ◆విభుఁడు గడఁగి
“యన్న! లక్ష్మణ! యోడకు◆మన్న! యేను
గలుగ నీ కేల యాపద ◆ గలుగ నేర్చు?”
ననుచు గ్రక్కున నిశితమ◆హాసి వెఱికి. 97

వ. ఆరక్కసుఁ డాచేయి దునియ వ్రేసిన లబ్ధమోక్షుండై లక్ష్మణుండు ప్రకటసైంహికేయ దంష్ట్రావిముక్తుం డయిన తిగ్మభానుండునుంబోలెఁ బ్రదీప్తుం డయి తీక్ష్ణకౌక్షేయకంబునఁ దనయు దక్షిణబాహుఖండనంబు సేసి పార్శ్వద్వయంబు భేదించిన నాక్షణంబ కబంధుండు దివ్యరూపధరుం డగుటయుం గని రాఘవుండు విస్మితుండై. 98

క. “ఈవనమునందు రాక్షస
భావంబున నున్ననీకుఁ ◆ బ్రకటితదివ్య
త్వావాప్తి యైనకారణ
మేవిధ?” మనుటయును నాతఁ ◆ డిట్లని చెప్పెన్. 99

వ. “ఏను విశ్వావసుం డనుగంధర్వుండ: బ్రహ్మశాపంబునం జేసి రాక్షసత్వంబు నొంది మీవలన శాపమోక్షంబు వడసితి; రావణుం డను రక్కసుండు జానకిం గొనిపోయి లంకానగరంబున నునిచినవాఁడు; మీకు హితోపదేశంబు సేసెద; నిట పోవంబోవఁ బంపాభిధానం బయిన సరోవరంబు గలదు; దానియావల ఋశ్యమూకంబను శైలంబునందు వాలిసహోదరుండు సుగ్రీవుం డను వానరుండు సచివ

చతుష్టయసహితుండై యుండు; నతనితోడ సఖ్యంబు సేయుము; దానం జేసి నీకుఁ గార్యసిద్ధి యగు''నని పలికి గంధర్వుండు వారి వీడ్కొని నిజేచ్ఛం జనియెఁ; దదనంత రంబ యట చనిచని. 100

సీ. కమనీయకమలినీ♦కహ్లారదళకేస
రాన్వితజలముల ♦ నర్ఘ్యవిధియుఁ
దరళ తరంగహ♦స్తములఁ బాద్యంబు ను
న్మదచక్రిసారస♦మధుపహంస
రుతులఁ బ్రియోక్తులు ♦ రుచిరవానీర ని
వేశనచ్ఛాయల ♦ విశ్రమంబు
మందసంచారిత♦మారుతంబుల నురు
తాపనోదనమును ♦ దగిలి యెప్పుడు

ఆ. నాచరించుచును స♦మంచితాతిథి జన
సేవనమునఁ దనదు ♦ జీవనంబు
ఫలము నొంద నొప్పు ♦ పంపాసరోవరం
బెదురఁ గాంచి రన్న♦రేంద్రసుతులు. 101

వ. ఆసరోవరతీరంబునం గౌసల్యానందనుండు 1 దత్తద్విషయ విశేషోల్లాసంబులవలనం బ్రొత్తయై చిత్తజానలంబు దరికొని చేతోవృత్తంబు నెరియింపం దొడంగినఁ, దాల్మి దొలంగి జానకిం బేర్కొని యాక్రందన వచనవివశుం డగుట

---

1 తత్త్వయోగాది విశేష విషయోల్లాసంబుల వలన.

యు నతనికి లక్ష్మణుం డిట్లనియె. 102

ఉ. "పురుషవరేణ్య! యిట్లు మిము • బోఁటులకుం జనునయ్య!
యాపదల్ । వారసినచోఁ గలంగుట ప్ర•భుత్వ మెలర్పఁగఁ
దాల్మి యూఁది దు । స్తరతర మానసవ్యథలు • దల్గుము
సంభృతపౌరుషుండ వై । యరయుము దేవి యున్న యె
డ • యారసి కార్యము 1 దీర్పనేర్పునన్. 103

ఆ. అధిప! శిష్యుఁడను స•హాయుండ భృత్యుండ
నైన యేను గల్గ•నాత్మ నీకు
నేల వగవ?" యని మహీపతిచిత్తంబు
నలఁత దీండుపఱిచె • ననరజుండు. 104

వ. తదనంతరంబ యయ్యిరువురుం బంపాసరోవరంబునం గృత
స్నానులయి దేవపితృతర్పణంబులు సేసి చని, ముందట
నతిబహుళబలాహక వ్యూహ సన్నాహసమున్నతంబులైన
యభంగోత్తుంగ శృంగసముదయంబుల నభోంగణక్రోడ
పీడనంబు సేయుచున్న దాని ఋశ్యమూకశైలంబుఁ జేరి
తదుపకంఠప్రదేశంబున విశ్రమించి యున్నంత. 104

సీ. ఆరాజపుత్త్రుల • నాయూథ తేజుల
వీరుల నున్నతో•దారభుజులఁ
గనుఁగొని సుగ్రీవుఁ • డనఘుఁ డగ్గిరిశృంగ
మునసుండి తానును • దనసచివులుఁ

1 తీర్పనేర్పడన్.

జింతించి వారివృ♦త్తాంతము నెఱుఁగంగ
నంతతోత్సాహు ధీమంతు శౌర్య
వంతు నుత్తము హిమ♦వంతుఁ దుఁబోని య
త్యంత సుస్థిరు హను♦మంతుఁ బనిచె;

ఆ. నతఁడు నఱిఁగి నృపతి♦సుతుల తెఱం గెల్ల
నెఱిఁగి, వనచరేంద్రు ♦ నెఱుఁగఁజెప్పి
యుగ్రతేజుఁ డైన♦సుగ్రీవుతోఁ జెల్మి
యొనర సంఘటించె ♦ మనుజపతికి. 106

వ. సుగ్రీవుండును మున్ను సీతాపరిత్యక్తంబై తమముందట బడిన దారుగ్గైకొని సంగ్రహించియున్న భూషణనిచయంబు రామునకు నివేదించినం జూచి, యతండు సముత్సుకుండై వానికి వానరైశ్వర్యంబు ప్రతిశ్రుతంబుసేసి తదీయశత్రుండైన వాలిం జంపఁ బ్రతిజ్ఞ సేసెఁ; గపీశ్వరుండును జానకిం దెచ్చుటకు సహాయ్యంబుగా నొడంబడియె; నంతట నందఱుం గూడికొని వాలినివాసంబై నకిష్కింధానగరంబున కరిగి; రప్పుడు భానుసూనుండు. 107

క. వాలి గృహద్వారంబున
వాలి, మదం బెసఁగ నార్చి ♦ వారక బాహా
స్ఫాలనము సేయుటయు విని
వాలి మహారోషదుర్ని♦వారోద్ధతుఁ డై. 108

వ. సమరసన్నాహం బమర వెలువడం బోయినఁ, దదీయవల్ల
భ యగు తార యతని వారించి యిట్లను; "నేఁటిచందంబు
సూడ సుగ్రీవుండు బలవత్సహాయుండై వచ్చినవాఁ; డది
యెట్లనిన, దశరథనందనుండైన రాముండు రావణుచేత
నపహృతదారుం డయి నిజసహోదరుం డగులక్ష్మణుండును
దానును సుగ్రీవసహాయత్వం బపేక్షించి యతనికార్యం
బు దీర్పం బూనె నని వింటి; నదియునుంగాక, మహాబలు
లయినమైందవద్వివిదులు నతిలోకపౌరుషుం డయినహను
మయుఁ బ్రసిద్ధబుద్ధి యగుజాంబవంతుండును వానికి మం
త్రులై యుండుదురు గావున, నీవిప్పుడు గయ్యంబునకుఁ
బోక నాకిష్టంబు గా"దనిన నవ్వానచరవీరుండు. 103

క. ఆవనిత వచనములు సు
గ్రీవ విషయ పక్షపాత • 1 కృత్రిమములు గా
భావించి యాదరింపక
తా వెడలె ననూనబాహు•దర్పం బెసగన్. 110

వ. ఇట్లు వెడలి కట్టెదుర నున్నసుగ్రీవుం జూచి యిట్లనియె. 111

—: వాలి సుగ్రీవుల యుద్ధము :—

తే. "ఓరి! దుష్టాత్మ! యే నిట్లు • పోరఁ బెక్కు
మాఱు లెగువంగ సిగ్గఱి • పాఱుచుండు

1 కృత్యంబులుగా

నట్టి నీ కున్న యునికిన ♦ యిట్టులముగ
నిట్టిబీర మెక్కడనుండి ♦ 1 పుట్టె నీకు? 112

వ. అనినం బ్రహసిత ముఖుం డగుచు నబ్బలిముఖుం డిట్లనియె. 113

క. "అలిని రాజ్యముం గోల్పడి
యాలంబునఁ దూల పోయి ♦ యక్కట! బ్రదు కిం
కేలా యని తెగువమెయిన్
2 వ్రాలి రణము సేయ నమరి ♦ వచ్చితి నీతోన్. 114

తే. చక్కఁ గన్గొంక ముందటిచంద మొందఁ
గలదె? తొంటి సుగ్రీవుండు ♦ గాఁడు నేఁడు;
నిన్నుఁ బోరిపుచ్చి కానిపో♦నేర్చు నెట్లు?
ననుచు నుగ్రుఁడై యవ్వీరు ♦ నార్చి 3 కవిసె. 115

వ. ఇవ్విధంబున. 116

ఉ. భూ 4 వినుతప్రభావులు ప్ర♦భూతబలోద్ధతు లుగ్రవైరి తే
జోవిజయుల్ నిరంతరయ♦శోజయకాంక్షులు భూరిభూరు
హా । గ్రావనఖాయుధుల్ బలిము♦ఖప్రవరుల్ గడుఁ బొంగి
వాలిసు । గ్రీవులు దాఁకి రొండొరుల♦కృతిప్రమరోషకషా
యవక్త్రులై. 117

మ. తరుసంఘంబులు పూన్చి యొండొరుల ను♦ద్యద్బాహువులై
వేఁయ ని । ష్ఠురవక్షస్థలపాతవేగవిరళ♦స్తోకంబులై పోవ,

1 పుట్టెఁజెపుమ. 2 వ్రాలిమొనసి రణముసేయ 3 తాఁకె 4 వినుత.

న । త్త్రురుసంఘంబులు వెండియుం గడఁగి మా♦ద్యల్లీల
నుయ్యద్దఱుం । బురుషానేకశిలాప్రయోగముల నొం♦సం
జొచ్చి రన్యోన్యమున్. 118

క. అతులిత శిలావితానం
బితరేతర తనువిపాత♦హేలాసంచూ
ర్ణిత మగుటయు వారలు పటు
గతిఁ గవిసిరి । బాహుయుద్ధ♦కౌతుకమతులై. 119

ఉ. ఒండొరుఁ బట్టుచుం దిరుగుచు♦చొండొరుఁ దాయుచు
న్వ్రేయుచున్ మహో । ద్దండత నొండొరుం 2 దోలఁ
గఁ♦దాఁకుచు నీఁగుచు లోఁగుచుం జలం । బొండొరు 3
మీఱు చొంతొరుల ♦ యుద్ధతి సైఁపక వీఁకఁ బోరి
రా । ఖండలభానుసూను ల♦విఖండిత చండభుజాప్రకాండ
తన్. 120

శా. 4 దేహోత్సాహ మెలర్ప నుత్థితమదాం♦ధీభూతులై యా
హవో । త్సాహవ్యగ్రులు విగ్రహంబు మిగులన్♦సంరంభ
శుంభద్గతిః । 5 బాహాబాహిఁ బెనంగ నప్పు డమరెం♦
బ్రోద్ధద్విపద్వంద్వ హే । లాహస్త ద్వయగాఢకర్షణరణో♦
ల్లాసంబు విస్పష్టమై. 121

---

1 యుద్ధకేళి 2 తెరల (లేక) తరల 3 మీఱునొండొరుల 4 దేహో
త్సేక 5 బాహాబాహులఁబోరునప్పుడు.

వ. మఱియు నన్యోన్యదంతనఖముఖ విఖండిత శరీరులై హరివీరులు రుధిరధారలఁ దడిసి పుష్పితంబు లగునశోకంబులుం బోలె నొప్పి చలంబులు మెఱయం బెనంగు నెడం దుల్యబలరూపవిక్రములై యున్న యయ్యన్నదమ్ముల నిరువుర నేర్పడ లక్షింపనేరక లక్ష్మణాగ్రజుండు 1 విలక్ష్యహృదయుండై వీక్షించుచున్న నాంజనేయుండు రాఘవునకు నభిజ్ఞానార్థంబుగా నొక్కపల్లవదామంబు సుగ్రీవు నఱుతం బెట్టఁ దదనంతరంబ రాఘవుం డమోఘబాణంబు దొడిగి వాలి యురంబు వగుల నేసినం బడి యవ్వానరుండు దశరథనందను నిందింపుచుఁ బ్రాణవియోగంబు నొందె నిత్తెఱంగున.

ఆ. వాలిఁ జంపి, యతని♦వనిత సుగ్రీవుని
వశము సేసిఁ నిఖిల♦వనచరేంద్ర
పదవియందు నెమ్మిఁ♦బట్టంబుఁ గట్టె వి
స్ఫారయశుఁడు రామ♦భద్రుఁ 2 డెలమి. 123

వ. ఆ వనచరుండును రామునకుఁ గృతాంజలి యై "దేవా! యీఘర్మసమయశేషంబును ఘనసమయంబునుం గడపి మఱి సీతాన్వేషణంబునకు నుత్సహించుట లెస్స" యని యయ్యిరువురకును మాల్యవత్కూటంబున నివాసంబుఁ గావించి తానును గిష్కింధాపురంబున నుండె నంత. 124

---

1 విలక్షు 2 అతని

మ. ఉరుఘర్మాఘువిఘాతసంవిహితవి♦శ్వోల్లాస మై సంచల
త్సరసాంభోదనినాదతూర్యరవ మై ♦ చంచద్బలాకాంగరు
ద్భరలీలానవచామరస్ఫురణ మై ♦ పక్షన్యసామ్రాజ్య మొ
ప్పె రమామందిర మై యుదగ్రశిఖినీ♦పింఛాతపత్రంబులన్.

వ. ఆసమయంబున నక్కడ; 126

క. దానవనాయకుచెఱఁ బడి
జానకి యురిఁ బడినహరిణి♦శాబము పోలెన్
మానిని సంతతభర్తృ
ధ్యానవివశ యగుచు నుండెఁ ♦ దాపం బెసఁగన్. 127

వ. అమ్మగువకాపున్న దనుజాంగనలు త్ర్యక్షియు, లలాటాక్షియుఁ, ద్విస్తనియు, నేకపాదయు, దీర్ఘజిహ్వయు, నజిహ్వయుఁ, ద్విజటయు, నేకలోచనయు మొదలయినవారు పెక్కండ్రు వికృతాకారంబులతోడ నయ్యబలం బరివేష్టించియహర్నిశంబును 1 మరక యదల్చువారును బెలుచం దిట్టువారును ఖరోష్ట్రనిస్వనంబులు సెలంగ వెఱపించువారును "త్రిభువనాధిపతియైనమనదశగ్రీవు వొల్లని యీదుష్టమానుషిం బట్టి చెండి కండలు దిందుమనువారును నైయున్న, నయ్యగ్గలి గళద్బాష్పయు గద్గదకంఠియు నగుచు నారాక్షసస్త్రీల కిట్లనియె. 128

1 ఏమఱక.

తే. "అమ్మలార! మీరాడలసిన • యట్లు చేయుఁ
డింక నేఁటికిఁ దడయుంగ • నేను రాముఁ
దప్ప నొండొకపురుషుఁ జిత్తమునఁ దలఁప
నింత నిజము నాకును జీవితేచ్ఛ లేదు."

వ. అనిన నజ్ఞానకితెగువ రావణున కెఱింగింపఁ గొందఱు సనిరి; మఱియు సంతతప్రియవాదినియు, ధర్మజ్ఞయు నైనత్రిజట యనురక్తసి రామాంగనం జేరంజని యిట్లనియె. 130

—• త్రిజట తనస్వప్నవృత్తాంతము సీతతోఁ జెప్పుట. •—

సీ. "అమ్మ! నీ కెంతయు • హర్షంబుగా నొక
వార్త నే నెఱిఁగింతు • వనజవదన!
నామాట నిజముగా • నమ్ముము వినవె య
వింధ్యంబు నా నొక్క • వృద్ధదైత్యుఁ
డనఘుండు రామహి • తాన్వేషి యై నీకు
నాశ్వాస మొనరింప • నబల! నన్నుఁ
బనిచెను; విను, నిన్నుఁ • బాసిన పిదప ల
క్ష్మణుఁడును దాను సే • మమునఁ గలసి

ఆ. యఖిలవానరేంద్రుఁ • డైనసుగ్రీవుతోఁ
జెలిమి సేసి యిపుడు • శీఘ్రముగను
వీరవరుఁడు నిన్ను • విడిపించుపనికి నై
యొదవి యుత్సహించి • యున్నవాఁడు. 131

వ. రావణునకు రంభానిమిత్తంబయిననలకూబరుశాపంబుగలదు గావున నీయందు బలాత్కారంబు సేయరాదు; నీకు వీని వలనిభయంబు వలదు; మఱి యిద్దురాత్మునకుం జేటు దెలుపునట్టి దుస్స్వప్నంబుఁ గలిగె; నది యాకర్ణింపుము.

క. ఖరములఁ బూనినరథమున
విరిసిన వెండ్రుకలు వెంట ♦ వ్రేలఁగ దశకం
ధరుఁడు బహుళతైలాప్లుత
శరీరుఁ డై దక్షిణంబు ♦ సన గలఁ గంటిన్. 133

తే. అతనిచుట్టును గుంభక♦ర్ణాదు లెల్ల
నరుణమాల్యానులేపను ♦ లై వికీర్ణ
పతితకేశు లై నగ్ను లై ♦ పరఁగఁ బ్రేత
పతిదిశకు నేఁగుగతి గానఁ ♦ బడియె నాకుఁ 134

ఉ. చారుసితోష్ణవారణ ల♦సత్సితమాల్యసితాంగరాగుఁడై
ధీరగుణోత్తరుం డధిక♦ధీనిలయుండు విభీషణుండు వి
స్ఫారసితాద్రిశృంగమున ♦ భవ్యుఁడు మంత్రిచతుష్టయా
న్వితుం । డై రమణీయలక్ష్మిఁ బొలు♦పారఁగ నేఁ గలఁ
గంటి నుగ్మలీ! 135

చ. తనసితకీర్తి విశ్వవసు♦ధాగగనాంతరపూరితంబుగా । ఘన
భుజుఁ డున్నతద్విరద♦కంధర 1 సుస్థితుఁ డై ముదంబుతో

---

1 సుస్థిరుఁడై

హనుజుఁడు దాను రాఘవకు • లాగ్రణి సన్మధుపాయనం బొ
నర భుజింపఁగంటి; వికచోత్పలలోచన! నిక్కమింతయున్.

క. పులిచేత వ్రేటువడి మైఁ
గలయఁగ నెత్తురులు గ్రమ్మఁ • గా నేడ్చుచు ని
మ్ముల నుత్తరాభిముఖి వై
కలుషితగతి నరుగ నిన్నుఁ • గనుఁగొంటిఁ గలన్. 137

క. నాకల నిక్కల యయ్యెడు
శోకింపకు మమ్మ! యింక • సుందరి! పుణ్య
శ్లోకు 1 జితలోకు నతులవి
వేకుం బ్రియుఁ బొందఁ గలుగు • వేగమ నీకున్." 138

ఆ. అనినఁ ద్రిజటపలుకు • లవి నిక్కములు గాఁగ
వగచి సీత గొంత • వనట దక్క
యాసతోడ నుండె; • నట దశవదనుండు
సీతఁ దలఁచి వివశ • చిత్తుఁ డగుచు. 139

వ. తాను దేవదానవగంధర్వాది 2 భూతవర్గంబులనెల్ల జయించి
యుం గందర్పదర్పంబు వారింప నోపక యాక్షణంబ దివ్య
మాల్యాంబరాభరణభూషితుం డై సంచారశీలం బై నకల్ప
పాదపంబునుంబోలె నొప్పియుఁ, దనయొప్పు సీతకుఁ బిత్ర
వనంబునందలి వటభూరుహంబుసొంపునుంబోలె నతిభీషణం
బగుచు నుండ నశోకవనమధ్యంబు సొత్తెంచి రోహిణీసమీ

1 జితకోకు. 2 సంఘంబులనెల్ల.

ధంబునకు వచ్చుతోనె శ్రుతుందుముంబోలె జానకిం జేరం జను
దెంచి ప్రణయపూర్వకంబుగా నిట్లనియె. 140

క. ఏల మదిరాక్షి! పలుకవి
జాలిం బడి నవసిదవు లనుదయ్యాపమ్మాలీ
లాలంకృత వై నను గృప
నేలికొనం జె దగదె ! సేయు నాకేటి నింకన్. 141

చ. అనిమిషయక్షరాక్షసులయచ్చరకన్నెదవన్నగాసురాంగన
లఁ గరంబు చిత్తమునఁ గైకొన కే నరరాగలోలతన్ నిను
మది నాదరించుటిది నీదగుభాగ్యము గాదె? యింత
యున్ వనిత! యెఱుంగ వైతి, గరువంపు విచారము
లేల నీయెడన్? 142

ఉ. రాముఁ డనంగఁ జేత్రియును రాజ్యముఁ గోల్పడి కాన
లోన దుఃఖామయమగ్నుఁ డై నరుఁ డల్పమనుష్యుఁ
డు; వానిపైఁ గడుం జేముడిసేయుచున్ వగవుఁ బెల్లునఁ
జిత్తము దల్లడిల్లఁగా నీమెయి నుండు నీయునికి యేసుఖ
మందు లతాంగి! చెప్పుమా! 143

వ. ఏను సకలలోకేశ్వరుండ; నాకుం గింకరులై పదునాలుగు
కోట్లు నిశాచరభటులును, నిరువదియెనిమిదికోట్లు రాక్షస
లును, నెనుబదియాఱుకోట్లు యక్షులును వరిల్లుదురు.

1 కాద 2 లేదు.

నిఖిలధనాధ్యక్షుండును యక్షేశ్వరుండు నా యగ్రజుండు. బ్రహ్మసమానుండగు విశ్రవసుండు మదీయజనకుండు; కుబేరునకు వినోదపాత్రంబులైన గంధర్వాప్సరోగణంబులు నన్ను సేవించుఁ; బంచమలోకపాలుం డని నన్నుఁ ద్రిభువనంబులుఁ గీర్తించు. భక్ష్యభోజ్యాదివస్తువులును సురేశ్వరగృహంబునం దెట్లట్లు నాగృహంబున నక్షయంబు; లిట్టినా విభవం బింతటికిని మదీయజీవితంబునకు నధీశ్వరి వై సుఖంబున 1 భోగింపు" మనిన విని వైదేహి క్రోధశోకవ్యాకులహృదయ యగుచు వానిదెసం జూడక యొక్క తృణాంకురం బుపలక్షించి యిట్లనియె. 144

"అకట! పరాంగన ♦ నబలఁ బతివ్రతఁ
బరికింపఁగా మర్త్య♦భామ నేను,
రాక్షసుండవు నీవు; ♦ రాగంబు మది నించు
కయు లేనినాదుసం♦గమమునందుఁ
గలిగెడు నట్టిసౌ♦ఖ్యం బెంత? యదియును
గాక, యాద్యుం డైనకమలగర్భు
పౌత్రుండ నని లోక♦పాలతుల్యుఁడ నని
హరసఖుం డైనధ♦నాధినాథు
భ్రాత నని భవత్ప్ర♦భావంబు సెప్పితి,
విట్టి నీవు ధర్మ ♦ మెఱిఁగి దురిత
వర్తనంబు విడువ♦వలదె? సిగ్గేది యి

---

1 [illegible]పంపుము

ప్పగిదిం బెల్లిదములు • వలుకం దగునె ?” 145

వ. అని పలికిన జానకి యుత్తరీయసంవృతవదనయై యతికరుణంబుగా నేడ్చినం, దద్దురాత్ముండును వెండియుం గొన్ని దుర్వచనంబులు పలికి యనంతరంబ యంతర్ధానంబు నొందె; నవ్వెలందియు నశోకవనంబున రాక్షసీరక్షితయై యుండె; నని మార్కండేయుండు ధర్మరాజునకు నిర్దేశించిన తెఱంగు వైశంపాయనోక్తంబైన యాఖ్యానంబు విఖ్యాతమాధుర్యమనోహరంబుగా. 146

క. విమలఖ్యాతగుణోన్నత !
విమలాదిత్యాత్మజన్మ•విలసత్కమలా
రమణీకరకమలోజ్జ్వల
విమలాంబుజరేణురాగ • విలసితవక్షా ! 147

వనమయూరము. భూసురకదంబసుర•భూరుహ ! వికాసో
ద్భాసితకృపారసవి•పాక ! సుగుణైకో
ల్లాసహర హారమృగ•లాంఛనమృణాళీ
హాసినవకీర్తివిస•రాకలితలోకా ! 148

గద్య. ఇది శ్రీశంకరస్వామిసంయమీశ్వరచరణసరోరుహ
ధ్యానానందసౌందర్యధుర్య శ్రీసూర్యసుకవిసంభవ
శంభుదాసలక్షణాభిధేయ యెఱ్ఱయనామధేయ
ప్రణీతంబైన అరణ్యపర్వశేషమునందలి
రామోపాఖ్యానంబునందలి
పూర్వభాగము.

# రామోపాఖ్యానము.

(మహాభారతాంతర్గతము)

ఎఱ్ఱాప్రెగ్గడ మహాకవి.

శ్రీకర ! సోమాన్వయర
త్నాకరహిమధామ ! ధాత్రీకాంచితవినయో
త్సేక ! భువనైకవీర ! మ
హాకావ్యరసప్రయోజనారూఢమతీ ! 1

—రాముఁడు లక్ష్మణుని సుగ్రీవునొద్దకుఁ బంపుట.—

వ. అక్కథకుండు శౌనకాదిమహామునులకుం జెప్పె, నట్లు పరమతపోనిలయుండయిన మార్కండేయుఁడు పాండవేయులతో మఱియు నిట్లనియె. అంత మాల్యవత్కందరమందిరుండై సదశరథాగ్రనందనుండు నవకందళితసుందరంబులును జనకనందినీవియోగదుస్సహంబులు నగుఘనసమయదివసంబుల నెట్టకేనియుం గడపి నిరతిశయసాంద్రచంద్రాతపస్నపనశీతలసమీరవాహ్యమాన వినిద్రకుముదకేదారసౌరభ్యనిర్భరంబులు నతిదీర్ఘయామంబులు నైనశారదయామినులపసయింపవోవక రోషకషాయితుఁడై సౌమిత్రిం జూచి యిట్లనియె. 2

సీ. "మాచితే లక్ష్మణా ! ♦ సుగ్రీవుకొఱగాదె
యుమ్మెయిఁ దనవగ ♦ యడఁచి మానము
కపిరాజ్య మిచ్చినఁ ♦ గైకొని యింద్రియ
సుఖముల నెంతయుఁ ♦ జొక్కి నేఁడు
మానవిభుఁ దలఁపఁడు; ♦ మనతోడఁ బల్కిన
సమయంబుఁ జెల్లింపఁ ♦ జనఁడె తనకుఁ ?
గడఁ గృతఘ్నత సేసెఁ ♦ గపికులాధముఁడు; నీ
వనఘ ! కిష్కింధకు ♦ నరుగు మిపుడ;

ఆ. అద్దురాత్ముఁ గృపణు ♦ నాత్మీయకార్యత
త్పరుని నధికరాగ♦పరవశాత్ముఁ
దోడరి వాలి చనిన♦త్రోవనే యనిచి రా
మ్మెల్ల తడయ మనకు ♦ నింక నిచట ? 3

ఆ. నీవు ననకమున్న ♦ నెఱితోడ మహాకార్య
మునకుఁ దగినయత్న♦ములు ఘటించి
యుండెనేని వాని ♦ నొం డేమియుం జేయ
వలదు; తోడితెమ్ము ♦ నార్యశౌర్య !" 4

చ. అనుఁడుఁ దదాజ్ఞఁ బూని ♦ యతఁ డాతతకార్ముకహస్తుఁ
డై రయమొప్పఁ బురిఁ జనియెం గపీశ్వరుని♦ప్రోలికి; వాఁడును
సంభ్రమంబుతో [illegible] ♦ సద్వి
నయముగ మ్రొక్కి యర్ఘ్యపాద్య [illegible]
[illegible] వానికిన్. 5

వ. చెప్పిన విని, భయకంపితగాత్రుం డగుచుఁ గపిమిత్రపు
త్రుండు సుమిత్రాపుత్రున కిట్లనియె; "అయ్యా! నే
నేల కృతఘ్నుండ నగుదు? జానకి నన్వేషించుటకునై బల
వంతులు బుద్ధిమంతులు నగువానరుల ననేకుల నలుదెసల
కుం బనిచితి. వారును సకలవనశైలసాగరగ్రామనదీసహి
తం బైన భూచక్రంబునం దెల్ల రోసి యొక్కమాసంబు
లోనం గ్రమ్మఱి వచ్చువారై సమయంబు సేసిపోయి; రింక
నైదుదినంబులు గొఱంత యుంతియు; నటమీఁద వైదే
హివార్తఁ గొనుచు దేవరం గొలువ వచ్చువాఁడనై యున్న
వాఁడ" ననినం బ్రీతుండై లక్ష్మణుండు. 6

క. వానిం దోడ్కొని చని యా
భూనాథునిఁ గానిపించి ♦ పొందుగఁ దత్కా
ర్యానుష్ఠానవిశేషము
దా నెఱిఁగించుటయు విభుఁడు ♦ దద్దయు నలరెన్. 7

వ. పదంపడి కొన్నిదివసంబులకుఁ బూర్వపశ్చిమోత్తరదిక్కుల
కుం జనిన వనచరు లరుగుదెంచి రాఘవుం గని "దేవా!
సకలసాగరమేఖలావలయితం బైనభూవలయం బంతయు
వెదకితిమి. మీదేవిం బొడ గాన" మని చెప్పిన నతండు
దుఃఖితుం డయి 'దక్షిణదిశకుఁ బోయినవానరులవలన
వైదేహివార్తం గెలుంగుదు' నను నాసం జేసి ప్రాణంబులు
ధరించి యుండె; నంత నెండియు నొక్కమాసంబు సెల్లినఁ

గొండఱు వనచరులు పఱతెంచి సుగ్రీవుం గని యిట్లనిరి. 8

సీ. నీవును వాలియు ♦ నేఁడును నాఁడు1ను
బ్రియమునఁ బాటించు ♦ పెద్దతోఁట
మధువనం బదె నేఁడె ♦ మనయంగదుండును
హనుమంతుఁడును మొద ♦ లైనవారు
బలువిడిఁ జొరఁబడి ♦ ఫలము లానెదరు త
ద్రక్షకు లగుమమ్ము ♦ రయముమీఱ
భంగించి" రనవుడు ♦ భానునందనుఁ డాత్మ
"నంగదప్రముఖులు ♦ యామ్యదిశకుఁ

తే. జనిన వారలు గావున ♦ జనకపుత్త్రిఁ
గనినయది గాఁబోలు! ♦ గాక యిట్లు
సేయ వెఱవరె? పతికార్య♦సిద్ధి సలుపు
జనుల కీచన వెఁదును ♦ జనునకాదె?" 9

వ. అని యూహించి తత్ప్రకారంబు రఘుపతికిఁ జెప్పె నంత.

ఉ. తేనెలు గ్రోలి గ్రోలి కడుఁ ♦ దియ్యని మ్రాఁకుల పండు లింపు
సొంపుఁగ నాని యాని పర♦పాఁదనకీలు మెచ్చి మెచ్చి
మం । దానిల శైత్యసౌరభస ♦ మగ్రతఁ గడుఁ జొక్కి
చొక్కి యుద్యానమునందు మారుతిసుతప్రముఖుల్ విహా
రించి తృప్తులై. 11

వ. అందఱుం గూడుకొని చని సుగ్రీవలక్ష్మణ సహితుండై
యున్న జననాథుం గని దండప్రణామంబులు సేసినం గారు

1 సనయంబుఁ బాలించు - నట్టితోఁట.

త్స్థానల ప్రదీపకులరు వారల ముఖవర్ణవిశేషంబు లుపల
క్షించి సీతం గనినవారకా నిశ్చయించె; నప్పు డత్యంత
మతిమంతుం డయిన హనుమంతుండు రాఘవునకుఁ గృ
తాంజలియై యిట్లనియె. 12

క. "దేవిఁ బొడగంటి నేను; ధ
రావల్లభ! శైలసరిద♦రణ్యనగరపా
రావారకలిత మగువను
ధావలయము వెదకి వెదకి ♦ దక్షిణపుదిశఁ. 13

—: హనుమంతుఁడు రామునితో సీతం జూచినవృత్తాంతంబు చెప్పుట:—

తే. అవధరింపుము దేవ! మే♦మందఱమును
నేకముఖమునఁ దొలితొలి ♦ యిందు నందు
వరయుచును బోయి యొక్కెడ ♦ నతివిశాల
మైన భూవివరము గంటి ♦మద్భుతముగ. 14

వ. కని దానిం బ్రవేశించి నిరంతరతిమిర సంవృతంబును బహు
కీటసంకులంబును నైనమార్గంబున ననేకయోజనంబులు
నడచిన ముందట నక్రపరికాళం బైన పురంబు గానంబడి
యె; నం దొక్క తాపసాంగన యుండె నమ్మ సాదరించి
తరవేరు పరిభాషలతి యనియును నప్పురంబు మయునిపురం
బనియును జెప్పి మధురంబు లయిన భక్ష్యభోజ్యంబు లొ
సంగినం దృప్తులమై తదుపదిష్టమార్గంబున మహీవివరంబు

నిర్గమించి సహ్యదర్దురశైలంబులు గడచి మలయశైలశిఖ
రం బెక్కిరి. 15

స్రగ్ధర. నీలంగల్లోల 1 మాలో♦ల్లిఖితగగనమై♦లీననానా
కుళీర । వ్యాళోగ్రగ్రాహమీనా♦వళుల నెసఁగి దు♦ర్వా
వారోఘగంభీ । రాలంఘ్యప్రౌఢవేగం ♦ బగుచు బహుళ
రా♦యామవిస్తారమై ది । ట్టాలోకింపంగ నుగ్రం♦బగుజల
నిధి నం♦తంతటం గంటి మంతన్.

క. కని యిది రత్నాకర మి
వ్వననిధి సీమమునఁ గల్గు♦వసుమతిలోనన్
జనకసుత వెదకి కానమ
చన దివ్వారాశి దాఁటి ♦ చన నెవ్వరికిన్. 16

ఉ. భూమితనూజఁ గాన మని ♦ పోయి రఘూద్వహుతోడఁ
జెప్పి య । భ్యామిపుచిత్త మాతురతఁ ♦ బొందఁగఁ జేయు
టకంటెఁ జూడఁ గా । నీమెయిఁ జావు మేలు మన♦కేల
విచారము లింక? నంచు నం । దేము గడంగి యందఱ
ము ♦ నేకతమం బగునిశ్చయంబుతోన్. 17

వ. అనశనవ్రతంబు సంకల్పించి నియతచిత్తులమై యుండి రాఘ
వకార్యార్థంబై తెగినజటాయువు గృతార్థుం డయ్యెఁ; మన
ము నట్టిపుణ్యలోకంబు వడయుద మని పలుకుచున్నయెడ.

---

1 భాగోల్లిఖిత

క. గిరిశృంగ తుంగ విగ్రహుఁ
డురుతరసత్త్వుఁడు విహంగ♦మోత్తముఁ డం దొ
క్కరుఁ డొయ్యన మాయున్నెడ
కరుదుగఁ జనుదెంచి విగళి♦తాశ్రుం డగుచున్. 19

సీ. "అయ్యలార! జటాయు ♦వని పల్కెదరు మీర
లెవ్వరు సెప్పరే? ♦ యేను వాని
కగ్రజుండ; ననూరు ♦ నాత్మజన్ముల మేము;
సంపాతి నాపేరు; ♦ సమ్మదమున
నేనును దమ్ముఁడు ♦ నినమండలమునకు ..
జనువేడ్క నొకనాఁడు ♦ చదలి కెగసి
చనఁ జనఁ దీవ్రాంశు♦సంతాపమునఁ జేసి
కమరె నా ఱెక్కలు; ♦ గమర వయ్యె

తే. ననుజుపక్షమ్ము; లే నిమ్మ♦హాచలమున
నాఁటఁగోలె సెచ్చుటికిఁ జ♦నంగ నేర
కున్నవాఁడ; నాతమ్ముఁడె♦ట్లున్నవాఁడొ?
యెఱుఁగ నెఱిఁగింపరే! నాకు ♦ నిష్టమెసఁగ." 20

వ. అనిన నేమతనికి భవదీయవృత్తాంతంబును రావణుండా
దేవిం గొనిపోవుటయుఁ దదర్థంబు రావణుతో జటాయువు
సమరంబు సేసి యీల్గుటయుఁ జెప్పిన విని దుఃఖితుండై
సంపాతి యస్మదీయ ప్రవర్తనం బేర్పడ నడిగి మాకిట్లనియె:

ఉ. "రావణు నే నెఱుంగుదుఁ బ♦రాక్రమదుస్సహుఁ, డన్ని

శాచరుం । జీవనరాశిమధ్యమున ♦ నిచ్చటికిఁ శతయోజ
నంబులన్ । భూవిదితంబు లంక యను♦ప్రోలు తదీయనివా
స, మచ్చటఁ । భూవరుదేవి గాన నగుఁ ♦ బొం డరయుం
డు కృతప్రియత్నులై." 22

క. అని యతఁడు సనిన నందఱ
మును సాగరతరణకార్యమునకు నుపాయం
బొనరఁ దలపోయునెడ 1 నొ
య్యనయుత్సాహంబు సేయఁ డయ్యె నొకండున్. 23

మ. జననాథోత్తమ! యేను బూని భవదా♦జ్ఞాలీలచెల్వంబు మ
జ్జనకుం డైన సమీరదేవుకృపయున్ ♦ సత్త్వోన్నతుం జే
యఁగా । ఘనవాస్తుంగతరంగ సంగతమహా♦ 2 గ్రాహోర
గాత్యుగ్రద । ర్శనమై పేర్చుపయోధి దాఁటితి జనా♦శ్చ
ర్యైక సంపాదినై. 24

ఉ. ఆలవణాబ్ధిమధ్యమున ♦ యందుఁ ద్రికూటనగంబుమీఁద
ను । త్తాలవిశాల 3 హేమమణి♦ధామ సముజ్జ్వల మైన
లంక యన్ । 4 ప్రోలొకింటి; నెంతయు న♦పూర్వము
దద్విభవంబు దేవ! య । చ్చో లలితాంగి నారసితిఁ♦ జొ
చ్చి యనేకవిచేష్టితంబులన్. 25

వ. అరసి యొక్కెడ రావణాంతఃపురంబయిన యశోకవనంబు
నందు. 26

1 నేరని 2 గ్రాహగ్రహ 3 సాల 4 ప్రోలినితి

సీ. కన్నీరు జడిగొని ♦ క్రమ్మఁ బాఱఁ గెక్కైన
కమ్రకపోలభా♦గములు గలిగి
యవశమై యొఱగిన ♦ యంగవల్లిక పొంత
మున్న భూమీరుహం ♦ బూఁత గాఁగ
వెగలు నిట్టూర్పుల♦వేఁడిమిఁ 1 బడిన న
య్యధరపల్లవము గా♦రాకుఁ బోలఁ
దలఁపుల సందడి ♦ దండడించినతాల్మి
2 గదిరి శిరఃకంప♦గతుల బెరయ

ఆ. నున్న పుణ్యమూర్తి ♦ నుత్తమసౌందర్య
నవనతాస్య నార్త ♦ యైనదానిఁ
గని విదేహాతనయఁ ♦ గా నెఱింగితి నేను;
'హా! రఘుప్రవీర!' ♦ యనుచు నపల 27

క. వినయమున దేవిఁ జేరం
జని యభివాదనము సేసి ♦ "జానకి! రఘునం
దనుదూత నేను; మారుత
తనయుఁడ; వానరుఁడ; నిన్నుఁ ♦ దడవ నిచటికిన్. 28

వ. అరుగుదెంచితి; రామలక్ష్మణు లత్యంతకుశలంబున నున్నవారు. వానరేశ్వరుం డయినసుగ్రీవుండు వారితో సఖ్యంబు సేసి తత్కార్యంబు దీర్పం బూనె; నింక మసలక నీహృదయేశ్వరుండు చనుదెంచు నూఱడిల్లుము. 29

1 బిగిలిన (లేక) కలిగిన (లేక) జిలికిన 2 కరలు

క. రక్కసుఁడ గాను జుమ్మీ!
నిక్కము వానరుఁడ నేను; ♦ నీమదిలోనం
దక్కు మనుమాన'' మనవుడు
నొక్కింత దలంచికొని స♦ముత్సుక యగుచున్. 30

వ. ఆదేవి నా కిట్లనియె; "నన్నా! నిన్నెఱింగితి, నది యెట్లనిన. రామహితాన్వేషి యగువాఁ డవింధ్యుం డనువృద్ధరాక్షసుండు మున్న యింతయుం ద్రిజటచేత నా కెఱిఁగించె; నతనిపలుకులు దప్పవు. రాఘవుండు సుగ్రీవసహాయుండయి యునికి గలిగినది గావున నింకఁ దడయక యవ్వీరవరుం దోడ్కొని వచ్చి నాకుం బ్రియంబు సేయుము. నీకుఁ గార్యసిద్ధి యయ్యెడు; మరుగు''మని తనశిరోభూషణం బయిన యీరత్నంబు మీకు నభిజ్ఞానార్థంబుగా నాచేతికిచ్చి మఱియుఁ జిత్రకూటచరితంబైన కృతకవాయసకథయునుం జెప్పి వీడ్కొలిపిన నేను లంకాపురదాహంబు సేసి యిట దేవర కింతయు విన్నవింప వచ్చితి''నని చెప్పి హనుమంతుండు జానకీహృదయంబు మూర్తిమంతంబైనపగిది నున్న యమ్మహామణి రాజచూడామణికి సమర్పించిన. 31

ఆ. అమ్మనోజ్ఞరత్న ♦ మక్కునఁ గదియించి
పులక లెగయఁ గొంత ♦ ప్రొద్దు విభుఁడు
జానకీకుచాగ్ర ♦ సంగమసుఖ్యుఁడై
నట్లు యుండె ముకుళి ♦ తాక్షుఁడగుచు. 32

వ. ఇట్లు రాఘవుండు సీతావృత్తాంతంబు విని తత్సమాగమ
కుతూహలవ్యగ్రుండై సుగ్రీవుం జూచి "దండున కాయి
తంబు సేయు"మనినఁ 'బ్రసాదం'బని యతండు నలుది
క్కులం గల వానరనాయకులం బిలువం దొడంగిన. 33

—: వానరవీరులు నానాదేశంబులనుండి సుగ్రీవునొద్దకు వచ్చుట :—

క. శతకోటిద్వయహరిపరి
వృతుఁడై చనుదెంచి రతుల ♦ వీరులు ధీరో
ద్ధతులు గజుఁడు గవయుఁడు వి
శ్రుతముగ రఘుపతికిఁ దోడు ♦ సూపిరి గడఁకన్. 34

క. అఱువది కోటులు గపివరు
లుఱక జగత్త్రయము వొకట ♦ నువ్వెత్తుగొనం
దఱిగొన్న యట్లు నడవఁగ
నెఱసి కుముదుఁ డరుగుదెంచి ♦ నృపవరుఁ గనియెన్. 35

ఉ. కోటిసహస్రసేన 1 తగఁ ♦ గొల్వఁగ వానరసేనకెల్లఁ దా
మేటి మహాబలుండు నిర ♦ మిత్త్రుఁడు మిత్త్రసహాయుఁడై
నలిన్ । వీటికి సుబ్బుగాఁ జటుల ♦ వేగ 2 సముచ్ఛ్రిత
పుచ్ఛగుచ్ఛవి । స్ఫోటితదిగ్విభాగుఁ డగు ♦ చుం జనుదెంచె
సుషేణుఁ డత్తఱిన్. 36

1 తను 2 సముంచిత.

క. గణుతింప రాని వానర
గణములతో దధిముఖుండు ♦ కాకుత్స్థకులా
గ్రణికిఁ బ్రియంబుగ వచ్చె ధ
రణిభాగము వాహినీస♦రణచలితముగాన్. 37

ఆ. శతసహస్రకోటి ♦ సంఖ్యల యెలుగులు
గొలువ జలదనీల ♦ ఘోరమూర్తి
జాంబవంతుఁ డతుల ♦ 1 సత్త్వుఁడేతెంచె నా
భూపవరుని కార్య♦మునకుఁ బూని. 38

వ. మఱియు ననేకు లనేక సహస్ర సంఖ్యల బలంబులతోడం జనుదెంచి; రిట్లు గూడిన కపివీరులు వివిధాకారు లపారబల శౌర్యసారు లతిఘోరంబుగాఁ బేర్చి నిగుడుచు మగుడుచుం దాఁటుచుఁ బాఱుచుం దిరుగుచు సురుగుచు మలయుచుఁ బొలయుచు మఱియుఁ గిరిగుహాలయంబులందును దరువనంబులందును సరిదుపాంతంబులందును నానందంబున విహరించు చుండిరి; తదనంతరంబ. 39

మ. ప్రభ నొప్పారి యనుంగుఁ దమ్ముఁడును మహా♦భాగుండు
సౌమిత్రి వీ । తభయుండై కొలువం గపీంద్రబల సం♦తా
నంబుతో నుద్ధతిన్ । శుభలగ్నంబున రాఘవుండు గద
లెనే ♦ సుగ్రీవసాహాయ్య సం । ప్రభవోత్సాహ మెలర్ప
దర్పితరిపు♦ప్రాలేయతిగ్మాంశుఁడై. 40

1 సత్త్వుఁడై చనుదెంచె.

ఉ. ఆహారివీరవాహినుల ♦ కన్నిటికిన్ మొగమై మరుత్సుతుం
డాహవదోహాళుం డమరె ♦ నంగదనీల నలాదివీరు లు
త్సాహము మీఱ నయ్యయి దెసం దగుకాపలియై సమ
గ్రస । న్నాహమహోగ్రతం జనిరి ♦ నాకవిరోధివధాభి
లాషులై. 41

వ. ఇట్లు నడచి యెడ నెడం బ్రభూతవన్యఫలజలాశయంబులగు బ్రదేశంబుల విడియుచుం గపిసైన్యంబు గతిపయదినంబులను దక్షిణోదధితీరంబు సేరి, రెండగువారాసియుంబోలె ఘూర్ణిల్లుచుండె; నంత రాఘవుండు రవితనయంజూచి యిట్లనియె. 42

క. 1 మనబల మిది యతిబహుళము
వననిధియును దుస్తరంబు ♦ వానరవర! యి
వ్వననిధిఁ గడచు నుపాయము
మన కొక్కటి నిశ్చయింపుమా! తగుబుద్ధిన్. 43

తే. అని విచారించు నెడఁ గొంద ♦ ఱధిపుఁ జూచి
'జడధి బలితంపుఁ దెప్పల ♦ గడత' మనిరి;
'ఘనపుఁగలములు సమకట్టి ♦ కడత' మనిరి
కొంద; ఱంతయు విని రఘు♦నందనుండు. 44

సీ. అల్లన నగుచు ని♦ట్లనియె "మీచెప్పుటల్
దగినయుపాయంబు ♦ లగున, యయిన

1 మనబలమును నతి బహుళము.

నగణితంబైనయీ♦హరిసైన్యముల కెల్లఁ
గలములుఁ దెప్పలు ♦ వలయునన్ని
సమకట్టు టరయ న♦శక్యంబు; శతయోజ
నంబులపర పైన♦యంబురాశిఁ
గలములఁ దెప్పలఁ ♦ గడచుచో రిపుకోటి
యెడరునఁ బైఁబడి ♦ పొడువకున్నె?
ఆ. అదియుఁగాక యల్పు♦లగు వణిగ్జనముల
యోజ శూరతతికిఁ ♦ దేజమగునె?
కాన నాదుమతము ♦ గా దిద్విధంబు నా
మనసునిశ్చయంబు ♦ వినుఁడు మీరు. 45
చ. వ్రతము ధరించి నిష్ఠ నుప♦వాసవిధిం గొలుతుఁ సము
ద్రు; నా । కితఁడు ప్రియంబుతోడఁ దెరు ♦ విచ్చుట
యంతస కల్గనేని మే । లితరునిఁ గా ననుం దలఁచె♦నేని
సమానుషరోషవేషదీ । పితశరవహ్ని నిజ్జలముఁ ♦ జీల్చె
దఁ బ్రేల్చెద నొక్కవ్రేల్మిడిన్." 46

—: రాముండు దర్భశయనుండై సముద్రుం బ్రార్థించుట. :—

వ. అనిపలికి దశరథాగ్రసూనుండు దానును దమ్ముండును నుపవసించి దర్భశయనులై జలధీంద్రు నుపాసించుచున్నంత సముద్రుండు సకలజలచరపరికరపరివారుండై రాఘుప్ర

నకుం బొడసూపి, "యయ్యా! నీవలనఁ బ్రీతుండ నైతి; నీ కెయ్యది ప్రియంబు సేయుదుఁ జెప్పు"మనిన, నతండు "నాకు లంకపై నరుగం దెరువిచ్చునది, యీవినాఁడు సూర్యనిభంబు లయిన మదీయదివ్యాస్త్రంబుల నిన్ను శోషింపం జేయుదు"ననిన విని సరిత్పతి రఘుపతి కిట్లనియె.

సీ. "జననాథ! నీకార్య [illegible] ంబు
[illegible]?
వినుము నావాక్య [illegible]
[illegible]
నిల నెల్లవాఁడును ♦ [illegible] స్త్ర
బలమున [illegible] ♦ దలఁచు [illegible]
మీయందుఁ గనిపిరుఁ ♦ [illegible] యతమతి విశ్వ
కర్మసూనుఁడు శిల్పి♦కర్మవిదుఁడు

ఆ. నలుఁడు నాఁగ నొకఁడు ♦ గలఁడు వాఁ డొలసి నా
యందుఁ దరులు గిరులు ♦ నొంపనైన
నవి ధరింతు నేను; దివిరి నీ కదిసేతు
వుగఁ గడంక నరిగి ♦ పగఱ గెలువుము." 48

వ. అని యతని నొడంబఱిచి సముద్రుండు సనుటయు, సమ్మహీపతి నలుఁ బొవించి సేతుబంధనంబు సేయ నియోగించిన ననేకవానరసహస్రంబులు నలుదిక్కులకుం బఱచి గిరిశిఖ

1 శేఁదఱువిత్తు సేని.

రంబులుఁ 1 దరువికరంబులు విఱిచి తెచ్చి యిచ్చుచుండ నన్నలుండు మున్నిటయందు శతయోజనాయామంబును దశయోజన విస్తారంబునుం గా నతిదృఢంబగు సేతుబంధనంబు నిర్మించె; నయ్యవసరంబున. 49

ఆ. అన్నతోడ నలిగి • యాప్తులుఁ దాను వి
భీషణుండు వినయ•భూషణుండు
నెమ్మి నరుగుదెంచి • నృపశిరోమణి రాము
శరణుఁ జొచ్చె భక్తి•భరితుఁ డగుచు. 50

క. ఆరాక్షసనృపభునియా
కారము నింగితముఁ జూచి • కాకుత్స్థకులో
2 ద్ధారుఁ డతని నతిధార్మికుఁ
గా రూపించి ముద మొప్పఁ • గైకొనె కరుణన్. 51

ఉ. వానికి దానవేంద్రుని•భవనంబు సమస్తము నిచ్చువాఁడు
గాఁ | బూని [illegible] సేసి కృపా•పుణ్యుఁడు లక్ష్మణుతోడ
చెల్మియున్ | వానికి నిచ్చి చెచ్చెర న•వారితవానరసైన్య
యుక్తుఁడై | వానిఁ బురస్కరించుకొని • వారిధి దాఁటి
మహోగ్రలీలతోన. 52

వ. ఇట్లు చేసి [illegible] బొచరించి త్రికూట [illegible] ను శిబిరంబులు నుఖు [illegible] 53

1 తిమువులు 2 [illegible]

క. తాళై లాగురు 1 చందన
సాలతమాలామ్రపింఛ♦జంబూజంబీ
రాలంకృతలంకావన
జాలంబుల విడిసె వృక్ష♦చరసైన్యంబుల్. 54

వ. తదనంతరంబ రావణచారు లయిన శుకసారణు లనువార
లు వానరాకారంబులు దాల్చి శిబిరంబునం గుప్పిమ్మరుచు
న్న నెఱింగి, విభీషణుం డారాక్షసులం బట్టించి రామునకు
సమర్పించిన. నతండు వారికి నిజసైన్యంబంతయుం జూప
నిరూపించి విడిచిపుచ్చుటయుం జని యయ్యిరువురు నమ
స్కరించి గని కపిసైన్యంబు దుర్జయంబనియు రామలక్ష్మ
ణుల తేజోమూర్తి విశేషంబులును నెఱింగించిన నతండు
దాని సరకు సేయక సమరంబునకు మోహరించి. 55

సీ. బద్ధశిలాయంత్ర♦బహుళమై యుత్తాలి
తాట్టాలకాభీల ♦ మై యుదగ్ర
కేతుపతాకాగ్ర♦కీర్ణమై తోమర
ముద్గరాజాతక♦ముసలశూల
శరశతఘ్నీముఖ♦సాధనోపేతమై
యుగ్రవిగ్రహ 2 ధీర ♦ యోధవీర
సంకులంబై హయ♦స్యందన వేదండ
చండమై సముదిత♦సప్తసాల

ఆ. నై యలంఘ్యపరిఖ ♦ మై తృణకాష్ఠజ
లాదివస్తుభరిత ♦ మైనలంక
కధికరక్షఁ జేసి ♦ యుపరిమాదంబున
నుండెఁ బ్రజగీప ♦ నుదితబలుఁడు. 56

వ. ఇట రాఘవుండును సుగ్రీవసహితుండై యుండి యంగదుం
జూచి "నీవు రావణుపాలికిం జని యతనికిం దగిన తెఱం
గున బుద్ధిగాఁ జెప్పి జానకి విడుచుట మేలని చెప్పు" మని
పనిచినం బనిపూని యవ్వీరుండు. 57

శా. లంకాద్వారము దుర్నివార 1 ముగ నుల్లాసంబునం జొ
చ్చి ని । శ్శంకుండై సురశత్రుసైనిక సహస్రంబుల్ దనుం
జూచి యా । శంకం బొందఁగ లీలమైఁ జని సుహృత్సం
ఘంబు గొల్వన్ నిరా । తంకుండై కొలువున్న దైత్యుఁ గని
యుద్యన్మూర్తియై యిట్లనున్. 58

—: అంగదు రాయబారము. :—

క. "ఇనకులతిలకుఁడు బాణా
సన విద్యాగురుఁడు రామచంద్రుఁడు నీతో
నను నిట్లను మని పనిచెను
వినుము తదీయోక్తిభంగి ♦ విస్పష్టముగాన్. 59

1 గమునన్

సీ. అనపరాధులఁ గాన♦నాంతరమ్ముల నున్న
 వేదతాపసులఁ జం♦పితి పలువుర,
నమరుల 1 యిల్లాండ్ర ♦ నతీముణి జెఱవట్టి,
 త్రిజగల్లోకములకు ♦ నలఁత సేసి,
తిరియెల్ల నొకతల, ♦ యొప్పుమీఱఁగ నున్నఁ
 జెనకుట యొకతల, ♦ చెప్పనేల ?
బలిమిఁ గొప్పఁగ మంచి♦బంటవై వెడలుము
 కయ్యంబునకు; నట్లు♦గాక యున్న
ఆ. శరణుఁజొచ్చి నాకు ♦ జానకి నొప్పింపు;
మొందువెంట బ్రదికి ♦ యుండఁ దీఱు;
దస్మదుగ్రశరశి♦తాశీవిషంబుల
కెరయ నీదుప్రాణ ♦ మింత నిజము. 60
క. మనుజుండనైన నాతెఱఁ
గనుమానము వాయఁ జూడు ♦ మాహవభూమిన్
విను! రాక్షసులను నామం
బును నడఁపక యేను రిత్త♦పోనిచ్చెదనే?" 61
వ. అనిపలుకు చున్నయంగదు పరుషభాషణంబులకు రోషించిన యసురపతి కన్నెఱంగి, నలువురురక్కసులు గ్రక్కున నవ్వాలినందనుం బొదువం బట్టిన, బిట్టెగసి హర్మ్యశిఖరంబుపైకి దాఁటుటయుఁ దదాక్షేపవేగంబున నన్నిశాచరులు

1 ఈలువు-టాండ్రను

ధరణీతలంబున జర్జరితశరీరుఁడై పడె. 1 హరిపీఠుం డచ్చోటు
నుండి శిబిరమధ్యంబునకు లంఘించి భూనాయకునకుఁ దనపోయి
వచ్చినతెఱంగు విన్నవించెం దదనంతరంబ రాఘవనృపసుమ
తంబున. 63

మత్త. తాలసాలశిలాగ్రహస్తు లు♦దగ్రగోత్రమహీధరో
త్తాలదేహు లనేకవర్ణులు ♦ దారితాఖిల దిఙ్ముఖా
ఖిలవాలశిఖాగ్రు లుగ్రగ♦భీరసత్త్వులు వానరుల్
గాలకల్పులు పేర్చి సంతన♦కట్టి రాహవకేళికిన్.

క. పరువడి మొత్తములై బం
ధురఘోషం బెసఁగఁ బొంగి ♦ తోఁతెంచుహరీ
శ్వరబలము నందు ఘనసా
గరవీచికాసరేఖ ♦ గానఁగ నయ్యెన్. 64

మత్త. కోటఁ బన్నినఘోరదానవ♦కోటిఁ జుల్కనఁ దోలి య
క్కోట 2 నల్గడలన్ మహోగ్రతఁ ♦ గూలఁ 3 ద్రోచి
సమున్నమ । త్కూట తోరణయంత్రకేతన ♦ గోపురా
ట్టక సంహతుల్ । వీటతాటము సేసి రక్కపి♦వీరు లొక్క
ట మాత్రతోన్. 65

---

1 హరిపీఠుండు నవరత్నమయంబగు తదీయాస్థాన మండపంబున శిఖ
రంబు రాక్షసనాశహేతుసంభూత మహోల్కయుంబోలెఁ బడఁదన్ని
యాక్షణంబచ్చటనుండి 2 ఎల్లెడలు౯ 3 తాఁచి.

వ. మఱియుఁ బ్రాకారంబుపై నున్నగదాపరిఘకుంతప్రముఖం
బులు గైకొని లంకామధ్యంబున దైవం దొడంగిన నాబా
లవృద్ధంబగు పౌరలోకంబు హాహాకారవ్యాకులంబై కలం
గం బడియె, నంత రావణచోదితు లైనదానవులు నానాకో
టి సహస్రసంఖ్య లరిగి 'యెక్కడెక్కడ' యని తలపడి
కపిసముదయంబులం దోలి యెప్పటియట్ల ప్రాకారంబుఁ
గైకొని నిల్చి రప్పుడు. 66

క. మును మర్కటబలముచే
ననయంబును గపిలవర్ణ♦మైనది మగుడన్
దనుజబల సంవృతంబై
ఘనపటలచ్ఛాయఁ గోలు ♦ 1 కర మొప్పారెన్. 67

క. వనచరసేనలు దెరలిన
నినవంశోత్తములు నృపతు ♦ లిద్దఱుఁ గయ్య
మ్మునకు గడంగుటఁ గ్రమ్మఱ
గొనకొని కపిసేన యెల్లఁ ♦ గోటకుఁ గవిసెన్. 68

వ. ఇట్లు గవిసిన బ్రాకారరక్షకు లైనరాక్షసవీరులు వారలం
జేరనీక శిలాశూల పరశుతోమరాలాతకుంతప్రముఖంబుల
ప్రయోగించినం గయికొనక వనచరులు వృక్షశిలాప్రకరం
బులు వఱగించుచుం గడంగి ప్రాకారంబుఁ బ్రాకుటయు,
నయ్యిరు దెఱంగులవారికిం గోలాకేసి యగుసమరం

1 కడునొప్పారెన్.

బయెఁ; బదంపడి రావణుండు వనుపఁ 1 బర్వతుండును ప్రఘసుండును ఖరుండును గ్రోధవశుండును బ్రిరుజుండు ను ననురాక్షసు లేవు రనేకరాక్షస పిశాచసేనాపరివృతుల యి పురంబు వెలువడి మాయ గావించి యదృశ్యాకారు లై కపిసైన్యంబు నొప్పింపం దొడంగినం గని. 69

ఉ. దారుణ విక్రముండు రిపు♦దర్పవిభేది మహాస్త్రవేది మా
యారణకోవిదుండు గడు ♦ నల్గి విభీషణుఁ డేఁగుదెంచి యు
ద్వీరులమాయయుం జలము ♦ వ్రేల్మిడిలోఁ గుదియించి
వీరకే । ళీరసికుండు వారి నవ♦లీలమొయిం దునుమాడె
నందఱన్. 70

క. ఆతనిశరపాతంబుల
చేతం గడు నొచ్చి దైత్య♦సేన సగము ధా
త్రీతలపతితం బయ్యె వి
భీతిఁ బఱచి పురము సొచ్చెఁ ♦ బెఱసగము వెసన్. 71

క. అది యెల్ల విని దశాననుఁ
డుదితక్రోధుఁ డయి మంత్రి♦యుతముగ వెడలెన్
మదగజ ఘోటకసైనిక
పదభర 2 భగ్నావనీవి♦భాగుం డగుచున్. 72

---

1 బర్హణుండును బ్రిజంఘుండు ఖరుండును గ్రోఘనుండును వృత్రుండు
2 భుగ్నా

వ. ఇట్లు వెడలి యభేద్యంబగు నౌశనసవ్యూహంబు సంఘటిం
చి వనచరబలంబుపయి నడచినం గని రాఘవుండును బార్హ
స్పత్యవ్యూహంబు దీర్చి పేర్చి యెదురుకొనియె; నాసేనలు
రెండు నకాండక్షుభితసాగరయుగళంబు తెఱంగు దోఁప
నొండొంటిం గవిసె; నప్పుడు రాముండు రావణుతోడం
దలపడియె; లక్ష్మణుం డింద్రజిత్తును, సుగ్రీవుండు విరూపా
క్షునిఁ, దారుండు నిఖర్వటుం దాఁకి రిట్లిరువాఁగునకును
దేవాసురులకుంబోలె నాభీలసమరం బయ్యె నందు. 73

క. సౌమిత్రి నిశితవిశిఖ
స్తోమంబుల నసురపతిసు ♦ తుండుం బొదివెను, సం
గ్రామమునకుఁ దొలఁగక యతఁ
డామనుజోత్తముని ముంచె ♦ నాశుగవృష్టిన్. 74

ఉత్సాహ. అమరవైరివిభుఁడు దశర ♦ థాగ్రసుతుఁడు నేపునన్
సమరసత్ప్రతాపకోప ♦ జాజ్వలచ్ఛరీరులై
తుములబాణపటలవృష్టిఁ ♦ దొప్పదోఁగి యిర్వురుం
దమక మేది తమక తమక ♦ తనిసి రాహవంబునన్. 75

వ. తదనంతరంబ. 76

క. ఆరావణుండు నిజదో
స్సారంబున రాముబాహు ♦ సారం బతిదు
ర్వారం బగు టేర్పడఁ గని
వీరారంభంబుకడఁక ♦ విడిచి రయమునన్. 77

క. మగిడి నగరంబు సొచ్చిన
పగిడి నిశాచరబలంబు ♦ పెల్లగిలుటయుఁ
విగతభయుండు ప్రహస్తుఁడు
డగఁ గోల్తల సేసె నత్యు♦దగ్రస్ఫురణన్. 78

ఉ. అతనిఁ గాంచి తద్బలము ♦ లన్నియుఁ గ్రమ్మఱ నాహ
వోత్సవ | స్థితములై కడంగుటయుఁ ♦ చేర్చి విభీషణుఁ
డుగ్రవానర | వ్రాతసమన్వితంబుగ న♦వారణ మార్గ్గని
నన్ మహారణం | బాతత మయ్యె సైన్యనివ♦హంబులు
రెంటికి నద్భుతంబుగన్. 79

వ. అంత.

—: ప్రహస్త ధూమ్రాక్షుల యుద్ధము. :—

మ. కృతహస్తుండు ప్రహస్తుఁ డాహవకళా♦కేళీవిదగ్ధుండు ద
ర్పితుఁడై తాఁకె విభీషణుం గడఁకమైఁ, ♦ బెం పారి నారిద్ర
ఋన్ | శిత 1 భవోగ్రమ నూరపత్త్రవిశిఖ♦ప్రేణీశతచ్ఛ
న్నులై ధృతి నొప్పారిరి చిత్రవారిధర పం♦క్తిచ్ఛన్నశైలా
కృతిన్. 80

చ. కదిసి ప్రహస్తుఁ డార్చి పరి♦ఘంబు రయంబున నెత్తి భీకరో
న్మదితరిపాస్త్ర తాడనము♦మాద్యద దలిర్చఁగ వేసె నీసునన్
నదయుత రావణానుజుని; 2 నాతఁడు వేగ్రటున కిందుకించత

1 శల్య 2 అతని

యుం । గదలక హేమకూటగిరి • కై వడి నిల్చి యుదీర్ణకో
పుఁడై. 81

మ. శతఘంటా [illegible] ంబును జగ • త్సంహారఘోరానలో
ద్ధితకీలాస [illegible] 1 మెఱయ శ • క్తిం బూన్చి మంత్రిం
చి యు । [illegible] వెసం • దత్ప్రాగ్ర
సంపాతపా [illegible] కూలె వాఁడు శతకో • టి 2
చ్ఛిన్నశైలాకృతిన్. 82

వ. ఇట్లు ప్రహస్తుండు పడినం దత్సైన్యంబులు విముఖంబు లగుటయు, ధూమ్రాక్షుండు రోషతామ్రాక్షుం డగుచు నతి నిబిడబలాహకానీకభీకరంబై కాలుకొను చున్న నిశాచర చక్రంబుతో నురులం బఱతెంచినం జలించి బలీముఖబలంబులు దుర్బలంబులై తొలఁగినం జూచి యాంజనేయుం డజయ్యుండై నిల్చినం బెల్చన యెప్పటియట్ల యూథపతులుం గూడుకొని రప్పుడు. 83

సీ. అనిలతనూజధూ • మ్రాక్షరక్షితసైన్య
3 యుగ్మంబునకు నయ్యె • యుగ్రసమర;
మందు నిష్ఠురచర • ణాఘాతముల ద్రొల్లు
నరదంబులునుఁ శిలా • పాతులఁ దూలి
మొఱలు నేనుంగులుఁ • నుత్తాల తరుపాతిఁ
దెగ్గుఘోటకములుఁ, • దీవ్రనఖర

[illegible]

దంతక్షతంబుల ♦ దళితాంగులై నేలఁ
బడి తన్నుకొను వీర♦భటులు నగుచు

ఆ. నధికశౌర్యసారు ♦ లగుకపివీరుల
చేత నొచ్చి దైత్య♦సేన భీతిఁ
బఱచెఁ, గొంత బెండు♦వడియుండెఁ, గొంతధూ
మ్రాక్షువెనుక కొదిఁగె ♦ నంతఁ గొంత. 84

మహాస్రగ్ధర. కని ధూమ్రాక్షుండు విశ్వ♦గ్రసనరసలస♦త్కాల
మేఘంబపోలెన్ । ఘన గర్జాఘోష మొప్పం ♦ గడఁగి శర
శతా♦కల్పితాసారవర్ష । ర్వ్యనవీరారంభుఁ డైనన్ ♦ సకల
హరిచమూ♦సంఘముల్ విహ్వలంబై । చన దూలెం గూలె
లాపుం ♦ జలములు జెదరన్ ♦ సంగడిన్ విచ్చె నొచ్చెన్.

తే. ఆతని యుద్ధతి సైఁపక ♦ యనిలసూతుఁ
డనిలవేగుఁడై పఱతెంచి ♦ యార్చి తాఁకెఁ;
బ్రథన మయ్యిద్దఱకు నుగ్ర♦భంగి నమర
పతికి 1 వృత్రునకుం బోలెఁ ♦ బ్రకట మయ్యె. 86

క. పరిఘంబులు గదలును బె
క్కురుదుగ రక్కసుఁడు వైచె ♦ సమ్మారుతిపై
నురుగండశైలములు ఘన
తరువులు హరివరుఁడు గురిసె ♦ దానవు మీఁదన్. 87

వ. ఇట్లు [illegible] కొంతసేపునకు. 88

---

1 [illegible] వృత్రుని 'ఇంద్రశత్రోర్వర్ధస్వ' అని కలదు]

స్రగ్ధర. లంకాలుంటాకుఁ డుద్య♦ల్లఘుతరగమనో♦ల్లాసియై డా
సి వీఁకం । బొంకం బేపారఁ జంచ♦న్నఖరచితమహా♦భూ
రుహంబెత్తి వ్రేసెం । గికంన్ ధూమ్రాక్షు; వాఁడుం♦ గె
డసెను వదనో♦ 1 ద్గీర్ణకీలాలధారా । పంకప్రాగ్భాగమ
గ్నా♦పఘనవిఘటిత♦ప్రాణుఁడై యాహవోర్విన్. 89

వ. ఇత్తెఱంగున ధూమ్రాక్షుండు దెగినపిదపఁ గపివరసైనికు
లార్చి హనుమంతుని ననేకభంగులం బ్రస్తుతించుచు రజని
చరులం గనుకనిఁ దోలినం దూలి యందఱుం బఱచి పు
రంబు సొచ్చి దనుజేంద్రునకుం బ్రహస్తధూమ్రాక్షుల
మరణప్రకారంబు తెలియంజెప్పినఁ బ్రకటబాష్పనిశ్వాసవి
ర్ణవదనుం డగుచుఁ బంక్తివదనుండు. 90

క. కలవా రెల్లను మడిసిరి,
కలిగియు 2 లేఁ డయ్యెఁ గుంభ♦కర్ణుఁడు, వీనిం
దెలుపుదునా! యేను గాడుకుం
జల తొడపక రిపులతోడ సరిఁ 3 బెనఁగుదుమో? 91

వ. అని వితర్కించి యప్పటికిఁ గుంభకర్ణ ప్రబోధంబు గార్యం
బుగా నిశ్చయించి తదీయశయ్యాగృహంబునకుం జని వా
నిం దెలుపం బరిజనంబులం బనిచిన. 92

సీ. భేరీమృదంగగం♦భీరనాదంబులుఁ,
గాహళఘంటికా♦కలకలములు,

---

1 ఉత్కీర్ణ 2 లేకయుగు 3 పెనఁగుదునో

దారుణసింహనా♦దంబులు నొనరింపఁ,
గడఁబెద్దవడికి నం♦గము గదల్చి,
1 యొదిగిలి, కనువిచ్చి, ♦ హా యని బిట్టావు
లించి, కొండొక దేఱి, ♦ లేచి, నిల్చి,
కలయఁ జూచుటయును ♦ గట్టెదురన యున్న
యన్న నవ్వుచుఁ దన♦యనుఁగుదమ్ముఁ

ఆ. జూచి యనియె "నిట్టి♦చోద్యంపునిద్రలుఁ
గలవె యేరికిని జ♦గంబులోన?
నెవ్వ రేమి చైరొ ♦ యెఱుఁగవు 2 తమ్ముఁడ!
యిప్పుడు మనకు నైన♦ యెసరు వినవె?

వ. దశరథనందనుం డైనరాముండు నాచేత నపహృతభార్యుం డై కలుషించి యనేకవానర యూథంబులం గూర్చుకొని వచ్చి వనధిబంధించి మనవీటిపై విడిసి మమ్మెల్లను నేలకుం గోలకుం దెచ్చుచున్నవాఁడు. ప్రహస్తాదివీరులు వానిచేతం బెక్కండ్రు సిక్కిరి. నీవకాక వాని జయింప నన్యుండు శక్తుండు గాఁడు; గావున లెమ్ము. గ్రిష్ఠనం బగతుపై నడచి పొడిచి గెలువుము. దూషణానుజులు వజ్రవేగప్రమాథులు నీకుం దోడ్పడియెద"రనిన "నట్ల కాక" యని కుంభకర్ణుండు విహితపరికరబంధుండై [illegible] లైనపరిజనంబులతోడం గూడి వెల్వడి నడతెంచిన. 94

---

1 ఒదిగిలి 2 ధన్యుఁడవు

―: కుంభకర్ణుఁడు యుద్ధంబు సేయుట. :―

లయగ్రాహి. దారుణ దవానల ♦ భారుణ శిరోరుహాగ
భీరఘనకర్బురశ♦రీరుఁ బటురోష
క్రూరనయనాంతగళి♦తోరుతరవహ్ని రణ
ఘోరముఖదంతవల♦యారభసదంశో
ద్గారిరుధిరాధరు న♦దారభుజసారణ వి
దూరితదిగంతుఁ బద♦ఘారవిసమక్ష్మా
భారుఁ ద్రిజగద్విజయ♦ఘోరబలు సద్దనుజ
వీరుఁ గని యచ్చెరువు♦గూరఁ గపివీరుల్

క. రక్కసుఁడును దనమదిలో
నక్కపివీరులను జీరి ♦ కైనఁ గొనక పే
రుక్కున రఘుకుల వీరుల
దిక్కునకుం 1 గవియుదెంచెఁ ♦ దీవ్రస్ఫురణన్. 96

మ. వడి నడ్డం బరికట్టి నెట్టన హరి♦వ్రాతంబు పెన్ద్రుమాకులం
బిడుగుల్వోని మహోద్ధతాశ్మముల నా♦భీలంబుగా దైత్యు
బి। ట్టడువన్ వైవఁగఁ జొచ్చెఁ, గొండలు బలా♦త్కారం
గ వే డాసి డం। దడి తత్కాయము సించి రుగ్రనఖ♦దం
తన్యాస సంక్రీడలన్. 97

---

1 [illegible]

ఉ. కన్నుల నిద్ర 1 దేఱఁగ నా ♦ కంపితుఁడై యతఁ 2 డేపి సేసి
నం । దన్ను నెఱుంగ కొక్క మొగిఁ ♦ దత్కపిసైన్యచ
యంబుఁ బోరఁ బే । రన్నుశ్రమింగ జొచ్చి విల ♦ యాగ
మసంభృతదర్పరోషవే । గోన్నతలీలఁ గాలుఁడు జ ♦ నో
త్కరమున్ గ్రసియించుచాడ్పునన్. 98

వ. ఇట్లు బల చండబల వజ్రబాహులు లోనుగాఁ బెక్కండ్రు
యూథపతులను బహుసహస్రసంఖ్యలవానర యూథంబును
మ్రింగియు, గొదగొని వచ్చుచున్న యన్నిశాచరుని మా
ర్కొన నోడి తారప్రముఖు లైనబలీముఖులు నలువంకలం
జెదరిపఱచిన. 99

మ. కని సుగ్రీవుఁడు బిట్టదల్చుచును వే ♦ గం శార దైత్యేం
ద్రు మా । ర్కొని సాలంబున వానిమూఁదలఁ గడున్ ♦
ఘోరంబుగాఁ బూన్కి వ్రే । సిన, నావ్రేటున నిద్ర దేఱి
కడకం జేదోయి సారించి య । మ్మనుజాశుండు గపీంద్రుఁ
బట్టి రభసోన్మాదంబుమై నార్చుచున్. 100

క. పట్టువడిన సుగ్రీవుని
గట్టెదురం గాంచి యెద్ధి ♦ కలుషితమతి యై
దట్టుఁడు, లక్ష్మణుఁ డసురన్
బిట్టేసెం బిడుగుఁబోని ♦ పృథుబాణమునన్. 101

1 వ్రేలఘునకంపితుఁడై 2 ఎంత

సీ. ఉరవడి యాశరం ♦ బుచ్చిపోవుటయును
గడు నొచ్చి యాకుంభ♦కర్ణుఁ డలిగి
వెస వాలితమ్ముని ♦ విడిచి తోరపుశిలఁ
గొనుచు నుక్కున రాము♦కూర్మితమ్ము
దెసఁ బాఱుతెంచిన ♦ ధీరుండు సౌమిత్రి
భల్లయుగ్మమునఁ ద♦ద్బాహుయుగము
నఱికె మాయాబలో♦న్నతుఁడు దైత్యుఁడు చతు
ర్బాహుఁడై తోఁచిన, ♦ భానుకులుఁడు

ఆ. చేతు లెల్లఁ దునిమె ♦ శితభల్లముల; వాఁడు
మఱి యనేకహస్త♦మస్తకాంఘ్రి
భాసుఁ డైనఁ గినిసి ♦ బ్రహ్మాస్త్ర మేసినఁ,
గూలె నసుర కొండ ♦ గూలినట్లు. 102

వ. ఇట్లు కుంభకర్ణుండు దెగటారినం జూచి దూషణానుజులు వజ్రవేగుండును బ్రమాథియు రాఘవానుజుం దలపడి నిబిడబాణౌఘనిమగ్నుం జేయుటయు, నతండును వారి నతి బహుళం బగుశరజాలంబునం బొదివినఁ గయ్యం బొక్క ముహూర్తంబు చూపఱకు రోమహర్షణం బై చెల్లెఁ; దద నంతరంబ. 103

చ. అనిలసుతుండు నీలుఁడు న♦యుం డెసఁగం బఱతెంచి య
మ్మహాదనుజులమీఁద నేపున ను♦దగ్రనగాగ్రయుగంబుఁ

బూన్చి వైచినఁ గడు రూపఱం 1 జెదరి ♦ చెప్పఁగఁ జూపఁగ
లేక పోయి ర ♦ దనుజులు; వానరోత్కరము ♦ దద్దయు ను
బ్బున 2 నార్చి రెంతయున్. 104

క. ఆకులపడి నలుదెసలం
గాకులకైవడిఁ బెదరి కడు వెఁగడుపడి రక్షో
నీకములు లంకయెనిమిది
వాకిళ్లం దూఱెఁ బౌర♦వర్గము దలఁకన్. 105

క. అంతఁ దనకూర్మితమ్ముం
డంతకుఁ గూడుటయు దూత♦నానుజమృతివృ
త్తాంతంబును విని యెంతయు
వంతఁ దలరి యలచెఁ బంక్తి♦వదనుఁ డవశుఁడై. 106

వ. అయ్యవసరంబున నాముక్తకవచుండును నాబద్ధతూణీరుండును ప్రచండకోదండపాణియుఁ గృపాణబాణబాణాసనాది వివిధసాధనోపేతసన్నిహితస్యందనుండును బురందరహృదయసాగరమందరుండును నైనమేఘనాదుండు దండ్రిం జేరం జనుదెంచి వినయంబున నిట్లనియె. 107

చ. "వగవఁగ నేల? దైత్యకుల ♦ వల్లభ! యేఁ గలుగంగ
నిమ్మెయిన్ జగముల నీదుశత్రులకు ♦ శౌర్యము చెల్లునె
వృత్రవైరి లోనగుసురకోటియే పడఁచె ♦ తీయవత్రిమా-

1 చదిసి 2 ఆర్చ్యనర్తు [illegible]

స్ఫూర్తి యున్ననాకుఁ గ్రోఁతిగముల నోర్చు టెంతపని? ♦ ధీ
రత నట్టి గృపఁ బంపు మాజికిన్. 108

శా. కూఁటీన ... చ్చులను ♦ గ్రోఁతుల నుగ్రత మట్టి
కిన్కఁ జెండాడెద నజ్జ్వలోగ్రవివి♦ధాంబక[1]జృంభితదిఙ్మ
ఖుండనై! మాఁడెద పీరన్మృత్యము ర♦యంబునఁ బార్థివ
సూను లిద్దఱం। గ్రీడయపోలెఁ గట్టి పెడ ♦ [2]కేళ్లోగిఁ గ
ట్టెదఁ; బట్టి తెచ్చెదన్. 109

వ. అనినం జెలివొంది మందోదరీసుందరుండు ప్రియనందనున
కిట్లనియె. 110

సీ. "నీపరాక్రమలీల ♦ నిక్క మే నెఱుఁగనే?
పుత్త్రి! నీభుజబల♦స్ఫురణమునన
కాదె నా కీర్తి♦ఖ్యాతియు సిరియును
గలిగె? గీర్వాణసం♦ఘంబుతోడఁ
గూడ నయ్యింద్రుని ♦ గోని వచ్చి నాబంటుఁ
గా నొనరింపవే ♦ గర్వ మెసఁగ?
మాయావిదుండవు, ♦ మహితదివ్యాస్త్రవి
శారదుండవు నీవు; ♦ సంగరమునఁ

ఆ. బగతు రెల్ల వెగడు♦పడఁగ దృశ్యాదృశ్య
దుర్నిరూపభంగిఁ ♦ దొడరి చిక్క
పఱచు నీమహోగ్ర♦బాణపాతంబులు

1 [illegible] ) [illegible] 2 కేలుగ

దశరథాత్మజులకుఁ ♦ దరమె పోర్వ ? 111

ఆ. సకలశత్రుచయము ♦ నిశ్శేషముగఁ జంపి
యనఘ ! సమరనిహతు ♦ లైన యస్మ
దీయజనులఋణము ♦ దీర్పుము; మసలక
పోయి రమ్ము; 1 వేగ ♦ పాడెచి గెలుము. ” 112

వ. అని కౌఁగిలించుకొని వీడుకొల్పిన, నింద్రజిత్తు నత్వరుండై యరదం బెక్కి లంకాపురంబు వెలువడినం గని వనచరానీకంబు లార్చుచు నెదురు నడచుటయు, నతండు దాని నించుకయు సరకుగొనక కరతలం బెత్తి లక్ష్మణునిం బిలిచిన.

—♦ ఇంద్రజిత్తు లక్ష్మణునితో యుద్ధంబు సేయుట. ♦—

క. విని యాతండును మార్వ
నినదంబున గగనధారుణీమధ్యం బె
ల్లను మ్రోయ మత్తగజముం
గనిన మృగేంద్రుండుపోలెఁ ♦ గడఁగెం బెలుచన్. 114

వ. అంత. 115

ఉ. శైత్రులు గోత్రభూమిధర♦దారులు 2 సాగరథీరు లుల్లస
చ్చిత్రధనుఃకళాసిగు లఁ♦జేయులు భూరిజయార్థు లక్ష్మ సా
మిత్రియు మేఘనాదుఁడు న♦మిత్రవిభేదులు దాఁకి రార్చి లో
[illegible] ప్రధన♦శాతుకవేగితచిత్తవృత్తులై. 116

---

2 సాగరధీరులు

క. మచ్చరము మీఱ నొండొరుఁ
1 జిచ్చఱపిడుగులను బోని ♦ శితవిశిఖములం
బెచ్చెర బోరఁగ విలునే
ర్పచ్చటఁ దుల్యంబ యయ్యె ♦ నయ్యిద్దఱకున్. 117

క. తనకంటె నపుడు రావణ
తనయుం డని మీఱఁ జూచి ♦ తా నాతనికం
టెను మున్న రాఘవానుజుఁ
డనుపమశర 2 కీల నతిశ♦యంబుగ మెఱయున్. 118

క. అంతఁ బటుతోమరంబుల
నెంతయు 3 వెస నృపతిసూనుఁ ♦ డింద్రజి వైవన్
సంతతశరముల నన్నిటి
నింతింతలు శకలములుగ ♦ జేసె నతండున్. 119

వ. అట్టియెడ నంగదుండు గడంగి లక్ష్మణునకుం దలకడచి యు
మందవేగంబున మందోదరీనందనుం గపిసి ఘనమహీరు
హంబునఁ దన్మస్తకంబు వ్రేసినం జలింపక నిలింపపతివైరి
నిశితప్రాసంబు వాసవపౌత్రుం జూప నెత్తుటయు, లక్ష్మ
ణుండు దానిం దునియ నేసిన నయ్యసురుండు గదాదండం
బుఁ దిర్చి యంగదు 4 వక్షంబు వ్రేసినం దొలంగక చెలంగి
వాలిసూనుండు సాలవృక్షంబున నారాక్షసురథంబు రథ్య

1 చిచ్చఱ 2 కీల 3 నృపతనయుఁడసుర యొలమిన్ వైవన్ 4 సవ్య
పార్శ్వంబు

సారథిసహితంబుగాఁ జదియ నడిచెఁ; నప్పు విరథుం డగుచు
యుద్ధోచ్చటన యంతస్థ్సానంబు నొంది గగనగతుం డగుచుఁ;
బడంబడి. 120

క. "ఎవ్వలన నుఱుకునో? యతఁ
డెవ్వరి నెటు సేయు నొక్కొ • యిం" దనుచుఁ గడున్
నివ్వెఱపడి కపిసేనలు
గ్రొవ్వఱి సెడం బంక్తి నదను • కొడము కద్దతుఁడై. 121

చ. ఉఱుముచు 1 నంత్యకాలచరి • తోగ్రబలాహకాలి నోఁడఁ
గాఁ | -దఱచగు ఘోరపుంబిడుగుఁ • దండము వోవ శరా
తాన ముక్కఁ-ఱఁ దొరఁగించుచుం గపిబ • లావళిఁ ద్రుంచి
కలంచి నేపునన్ | నెఱఁకులు నొంచి బాణముయ • సీరధి
మించె గెపుడ ప్రవీరులన్. 122

క. నరాయూధసు నంతర్ద్వాత
కాయుఁ బురందరవిరోధిఁ • గానత్స్థులు గ్రో
ధాయస్తు లగుచు నేసిరి
ధీయుక్తులు శబ్ద 2 భేది • దివ్యాస్త్రములన్. 123

వ. వానికి నలిగి సుగ్రీవాదివానరులు న్ప్రేషితోన్మేషంబులు
గైకొని యాకసంబున కెగసిన నద్దానవుం డు వారి నందఱ
వెఱచఱవ నేయుటయుఁ, జేవ సెడి మగిడి పుడమి కెఱఁ
గిరి. వాఁ డంత నిలువక వాఁడితూపులు నఱపి రాములక్ష్మ

1 అంతకాలజనితో గ్ర (లేక) అంతకాలజనితోగ్ర 2 వేధి

ణులఁ గరంబు నొప్పించినం 1 జెయ్యేది యుయ్యన్నయుం
దమ్ముండును గపిబలంబు లడల ధరణీతలంబునకు నొరగి
విలయకాలపతితు లయిన సూర్యేందులచందంబున నున్నం
గని సింహనాదంబు సేసి, 124

మ. పరమోదాత్తులఁ బార్థివోత్తముల శుంభద్విక్రమారంభు
లఁ । సురసంకాశులఁ గోసలప్రభుల సంస్తోకప్రభోద్దాము
లన్ । వరలాభోన్నతుఁ డన్నిశాచరుఁడు గర్వం బొప్ప
దుర్వారని । ర్భరనాగాస్త్రముచేం దదాహవమహిన్ బం
ధించె నయ్యుద్ధభూమిన్. 124

వ. తదనంతరంబ సుగ్రీవసుషేణజాంబవత్ప్రముఖు లయినకపి
వీరులు రామలక్ష్మణు లున్నయెడకుం జనుదెంచి యెయ్యె
దియునుం జేయునది నేరక దుఃఖితు లగుచుండ, విభీష
ణుండు వారి నాశ్వాసించి బ్రహ్మాస్త్రప్రయోగంబున నా
రాజకుమారులకు బంధమోక్షణంబు గావించె. సుగ్రీవుం
డు విశల్యకరణి యనునౌషధంబున వారల విశల్యదేహు
లం జేసె; నిట్లు ప్రబుద్ధులై రాఘవులు గ్రమ్మఱఁ గయ్యం
బునకుం గడంగి; రప్పుడు రావణానుజుండు రామునకుఁ
గృతాంజలియై యిట్లనియె. 126

సీ. "నరనాథ! కిన్నరనాథునిపనుపున
శ్వేతుండు నాఁగఁ బ్రసిద్ధుఁడైన

---

1 చేయునది లేక

గుహ్యకుఁ డిదె మీకుఁ ♦ గాని వచ్చె దివ్యతో
యంబు; లీజలముల ♦ నంబుజాక్ష !
నయనపద్మక్షాళ♦నము 1సేయుఁ; డిప్పు డ
దృశ్యభూతము లెల్లఁ ♦ దెల్లముగను
గానంగఁ బడు" నన్నఁ ♦ గైకొని రాఘవుం
డనుజసహాయ స♦మన్వితముగ

ఆ. నట్ల చేసి కనియె ♦ నంబరమధ్యసం
చారుఁ గృతవిపక్ష♦సంప్రహారు
నింద్రజాలశీలు ♦ నింద్రజి ద్రణాలోలు
రావణాగ్రతనయు ♦ రహితవినయు. 127

వ. ఆరక్కసుండునుం దనచేసినపౌరుషంబు ప్రతిహతం బగుటకు విస్మయం బంది మగిడి హోమకార్యంబును దోడంగం బోయిన నెఱింగి, విభీషణుండు లక్ష్మణుం జూచి “ యిన్నీచునకు హోమసమాప్తి యయ్యెనేని యెవ్వరికిఁ గెలువ నశక్యంబు; వీనివెన్నడిందగిలి తెగటార్పు” మనిన నతండు.

ఆ. ఆర్చి వెనుకఁ దగిలి ♦ యశనికల్పము లైన
శరము లేయుటయు 2 ని♦శాటవరుఁడు
గినిసి వడి నెదిర్చి ♦ కీలించె లక్ష్మణు
నంగకముల నుజ్జ్వ♦లాంబకముల. 129

1 చేయుమిప్పుడు 2 నిశాచరుండు

వ. ఇట్లు దలపడి యవ్వీరు లిరువురు నిశాచర వనేచరబలంబులు రణంబుడిగి వెఱఁగుపడి తమపోరు సూచుచుండ నుద్దండ వేదండయుగళంబుపోలిక నాభీలశార్దూల ద్వయంబుకరణి, నసహ్యసింహయమళంబు లై వడి నతి ఘోరయుద్ధంబుసే యం దొడంగిరంత. 130

కం. వడి నొక్కపెట్ట లక్ష్మణుఁ
డడరించె నిశాతశరము ♦ లారక్కసుపైఁ;
గడఁగి యతఁడు నాతనిపై
నెడవక నాఁటించెఁ గలయ ♦ నెనిమిదియమ్ముల్. 131

ఆ. వాఁడితూపు లొండల ♦ వడి 1 నాఁటుటయు, నేపు
త్రోడ పరుషరోష ♦ ధూమకేతుఁ
డతిశయిల్లి రాఘ♦వానుజుండురుచాప
శింజినీరవంబు ♦ సెలఁగఁ గదిసి. 132

—: ఇంద్రజిత్తు లక్ష్మణునిచేతఁ జచ్చుట :—

మ. శితభల్లద్వితయంబునం గడువెనం ♦ జేదోయి ఖండించి
ఖం । డితగోత్రాచల తుంగశృంగ శతకో♦టిస్ఫారఘోరా
నల । ద్యుతిసాంద్రం బగుశాతభల్ల మొకటం ♦ ద్రుంచెం
గనత్కుండలా । న్వితమై యొప్పునిశాచరేంద్రశిరమున్ ♦
వీరక్రియాదక్షుఁడై. 133

1 తాకుటయు నెచ్చి తోన కలుషరోషధూమకేతు వతిశయిల్లి

ఆ. భగ్నశాఖమైన ♦ పాదపంబునుబోలె
నిల్లు సంగరమున ♦ నింద్రజిత్తు
వడినఁ జూచి దైత్య♦బలములు భయమంది
వఱఁచెఁ; జెలఁగి యార్చెఁ ♦ బ్లవగబలము. 134

క. తనయుని మరణం బేర్పడ
విని దశకంధరుఁడు శోక♦వివశుండై బో
రన బాష్పము లొలుకఁగ హా!
యనుచుం బడినోళ్లుఁ దెఱచి ♦ యఱచెం బెలుచన్. 135

క. శోకంబు సైఁపలేక య
శోకవనంబునకు నరిగి ♦ సురశత్రుఁడు రో
షాకులుఁడై జానకిఁ బు
ణ్యాకారం జంపఁ జంద్ర♦హాసము వెఱికెన్. 136

వ. అప్పుడు వయోవినయవృద్ధుం డైన యవింధ్యుం డతని వా
రించి యిట్లనియె. 137

చ. "ఇది దగునే? దశానన! మ♦హేంద్రుఁడు లోనగు దేవతా
తతిం । గదనములో జయించి త్రిజ♦గంబులఁ బేర్గని
యున్ననీవు ని । ముద్రిత వధింతునంట గదు ♦ మోస♦ము
గాదొకో? మోపుదేని నే । పొదవఁగ రాఘవున్ గెలువు;♦
ముగ్ధలిఁ జంపినఁ బెంపు గల్గునే?" 138

వ. అనినం దద్వచనంబుల నుపశమితరోషుం డయి దోషాచ
రేశ్వరుండు సమరసన్నాహం బమర రథం బెక్కి వెడలి

బీరంబు సొంపార నఖిలసేనా సహితంబుగాఁ బురంబు
వెల్వడి నడతెంచె నంత. 139

శా. సుగ్రీవాది సమస్తవానరులుఁ బ్ర♦స్ఫూర్జన్మహావిగ్రహ
వ్యగ్రాకారతఁ జేర్చి భూరుహశిలా♦వ్రాతంబులం దాల్చి
వా । లాగ్రవ్యాచలనంబు లొప్ప దశకం♦ఠాగ్రసరోదగ్ర
దై । త్యగ్రామంబు నెదిర్చినన్ సమర మ♦త్యంతోగ్ర
మయ్యెన్ వడిన్. 140

వ. ఆసమయంబున నఖిలమాయాకుశలుం డైన దశముఖుండు
మాయ గావించిన. 141

క. ఆరావణు దేహంబున
ఘోరగదాశక్తిఖడ్గ♦కోదండధరుల్
వీరులు సహస్రసంఖ్యల
వారలు జనియించి రసుర♦వరు లుద్ధతులై. 142

వ. వారినందఱఁ గౌసల్యానందనుండు సాంద్రశరజాలంబుల న
వలీలం దునిమి తూఁటాడిన, నమ్మేటిరక్కసుండు మఱియు
నుఱక మాయ ప్రయోగించి రామలక్ష్మణప్రతిరూపంబు
లనేకంబు లుత్పాదించుటయు, నయ్యన్నయుం దమ్ముండు
ను వెఱఁగుపడియునుం జిడిముడిపడక యమ్మాయారూపం
బు లన్నియుం దునిమి తదనంతరంబ. 143

చ. అభినవభానుబింబరుచి♦రాకృతియుక్ హరియుగ్యముక్ మ
హా । శనదురానదంబును వి♦రాజితకేతనమై జయంతికా

ప్రభమును నైనతేరు సుర♦పాలకుపంపునఁజేసి రాఘవ
ప్రభునకుఁ దెచ్చి మాతలి స♦భక్తికుఁడై క్రియ మెుప్ప
నిట్లనున్. 144

మ. "ధరణీనాథ ! సురేంద్రుతే రిది మహా♦దైత్యేంద్రులం
దోల్లి యీ । యరదం బెక్కి యనేకులం దునిమె జం♦భా
రాతి ఘోరాజి; నీ । యరదం బెక్కి వధింపు మీవును మ
దీ♦యస్ఫారసారథ్యని । ర్భరభంగిన్ దశకంధరుం ద్రిభువ
నీ♦భంగోన్నమత్కంధరున్." 145

మ. అనినన్ మాతలి నాదరించి, యరదం ♦ బారాఘవుం డెక్కి
యుక్కున మీఁతెన్ రిపుకోటిమీఁద విలస♦త్కోదండమా
ర్వీమహా । స్వనభిన్నాఖిలదిగ్విభాగుఁ డగుచున్ ♦ 1 శా
తాస్త్రధారాభిషే । చనపూతప్రతివక్షసైన్యుఁ డగుచున్
♦ సంరంభదుర్వారతన్. 146

ఉ. అత్తఱి రావణుండు విల♦యానలధుస్సహామూర్తియై నరేం
ద్రోత్తముమీఁదఁ దేరు గడు ♦ నుగ్రగతిం బఱపించి సం
తతోద్వృత్తశరప్రవాహపరి♦వీతదిశాముఖుఁ డైనఁ జూచి
పేరుత్తల మంది రాతసిన♦ముద్ధతికిన్ 2 దివినుండి నిర్జరుల్.

వ. ఇట్లు దలపడి రామరావణు లతిఘోరంబుగాఁ బోరం దొ
డంగి; రంతఁ బంక్తివదనుండు నిబిడజ్వాలం బగుశూలంబు
రాఘవుమీఁదం బ్రయోగించిన, నతండును నడుమన దానిఁ

1 శస్త్రాస్త్రధారాభిషే[illegible] 2 [illegible]

దునియలు సేసిన, నీసునం బెరిఁగి సురవైరి మఱియును దరతరంబ శతసహస్రసంఖ్యలు గలశూలంబులు భిండివాలంబులుఁ దోమరంబులు శరంబులుం బఱఁగించి యంబరం బెల్ల నస్త్రమయంబు గావించిన, నఖిలభూతంబులును హాహాకారవ్యాకులంబు లయ్యె; నసురసైన్యంబున భేరీప్రముఖతూర్యనినదంబులు సింహనాదంబులు సెలంగె; నంతఁ గొండొకసేపునకు రావణప్రయుక్తం బైనశస్త్రప్రదహనం బంతయు నిరంతరవిశిఖధారాసారంబునం గబళించి రామజలధరంబు గంభీరసంరంభంబునం బొదలుటయు సకలప్లవంగసముదయంబును బ్రహర్షకోలాహలం బయ్యెఁ బదంపడి.

—♦ శ్రీరాముఁడు రావణాసురుని సంహరించుట. ♦—

సీ. కమనీయకనకపుం♦ఖప్రభాభాసియుఁ
దీక్ష్ణముఖంబును ♦ దివిజయక్ష
మునిసిద్ధసాధ్యన♦మస్యావహంబు నై
విలసిల్లుబాణ మ♦వ్వీరవరుఁడు
గైకొని బ్రహ్మాస్త్ర♦కలితమంత్రాభియు
క్తంబు గా నొనరించి ♦ కార్ముకమున
సంధించి జగములు ♦ జయపెట్టఁ జెచ్చెరఁ
దివిచి యేయుటయును, ♦ దీవ్రభంగి
ఆ. గడఁగి యాశరంబు ♦ గల్పాంతదహనంబ

పోలెఁ బంక్తికంఠుఁ ♦ బొదివి నీఱు
గా నొనర్చె సూత ♦ ఘనరథరథ్యస
మన్వితముగ నొక్క ♦ మాత్రలోన. 149

వ. అప్పు డంబరంబున దివ్యతూర్యనాదంబులు సెలంగం గలంగి యసురులెల్లఁ దొలంగిరి. గంధర్వగానంబులు నప్సరోనర్తనంబులుఁ బ్రవర్తిల్లె; నింద్రాదిదేవోత్తము లన్నరదేవోత్తముం బ్రస్తుతించుచుం బ్రమోదంబు నొందిరి. 150

క. ఏకోత్సవంబు లయ్యెఁ ద్రి
లోకంబులు, నఖిలలోక♦లుంటాకుఁడు ఘో
రాకారుఁడు దశవదనుఁడు
గాకుత్స్థనిశాతశరము♦ఖంబునఁ బడినన్. 151

ఉ. అంత వసంతకీర్తి శర♦ణాగతరక్షణశాలి రాఘవుం | డెంత
యు వేడ్కతోడ నసు♦రేంద్రుపదంబున నవ్విభీషణుఁ | సం
తతపుణ్యుఁ బుణ్యజన♦సంతతివర్ధనుఁ గట్టెఁ బట్ట, మత్యం
తదయాంతరంగుఁడు కృ♦తాహితభంగుఁడు దానుఁ ద
మ్ముఁడున్. 152

వ. తదనంతరంబ యవింధ్యుండు విభీషణసహితుండై జానకి నుచితయానంబున నునిచికొని రామదేవుపాలికిం దెచ్చి “ దేవా! దేవిం బరిగ్రహింపు ” మని విన్నవించుటయు నతండు. 153

చ. అతిమలినాంగి జీర్ణమలి♦నాంబరధారిణి సంతతాశ్రుపంకిల
విలసత్కపోలఁ బరి♦కీర్ణజటాయితకేశభార నాయతఘన
దుఃఖధూషితఁ బ్రి♦యాంగనఁ గన్గొని యప్రియాత్ముఁడై
నుతచరితుండు దద్దయు మ♦నోవ్యథసేయుచు నింతికిట్లనున్.

సీ. "అధికదుష్టాచారుఁ ♦ డైనదశాననుఁ
డింతకాలముఁ దన♦యింటఁ బెట్టి
కొని యున్ననిన్నుఁ గై♦కొనిన నన్మచ్చరి
త్రమునకుఁ దొడరదే ♦ ధర్మహాని?
పరిభవంబునకు నై ♦ ప్రతికారముగ నైతిఁ
గూల్చితిఁ గాని నీ♦కొఱకుఁ గాదు;
మెలఁత! నీచరితంబు ♦ మే లైనఁ గీ డైనఁ
గానిమ్ము నిన్ను ని♦క్కముగ నొల్లఁ;

ఆ. బఱగఁ గుక్కపాతఁ ♦ బడినహవ్యముభంగి
యయ్యె నీతెఱంగు ♦ నరయ నిపుడు;
గాన యిచటఁ దడయఁ ♦ గాదు చెచ్చెర నీకు
నిష్ట మయినకడకు ♦ నేఁగు మతివ!" 155

ఆ. అనినఁ జెవులఁ గొఱవి ♦ గొని మాఁడిన ట్లైనఁ
జాల్మి పెల్లగిల్లఁ ♦ దరళనయన
మొదలు నఱక నొఱగు ♦ కదళిచందంబున
నెలఁత దల్లడమున ♦ నేల వ్రాలె. 156

క. వెలుఁగుపడి పూర్వభాగము
దళుకంగిన వెలువెల్లనై వదనములు ప్రాగ్దిం
దెలఁ గేది తచ్చపడి క
త్తతఁ దత్పరిజనము లెల్లఁ దద్దయు వంతన్. 157

తే. పదఁతి యల్లన మతికొంత వడికిఁ దెలిసి
యలసమూర్తియై దండడి నశ్రు లురలఁ
గేలు మొగిడించి వసుమతీపాలుఁ జూచి
మొలుఁగు గుత్తుకఁ దగులంగ నిట్టు లనియె. 158

క. "నినుఁ గీడు వారయకుండఁగ
జనులకు నానిక్క మెక్క జననాయక ! నే
ననలంబుఁ జొచ్చి వెడలెదఁ
గనుఁగొను మిచ్చనవు నాకుఁ గరుణింపు దగన్. 159

ఉ. నాదగుబుద్ధి నీదుచరణస్మరణంబ యొకర్చుఁ గాని యొం
డేదియు నెన్నఁడుం దలఁప ; దిట్టిద 1 యొండొకచంద
మైన నిమ్మేదినియుం గృశానుఁడు సమీరుఁడు శీతకరుం
డు నర్కుఁడుం ! గా దన కీర్తనంబ ననుఁ గాల్పరె ? వే
ల్పులు పెట్ట సైఁతురే ? " 160

వ. అని పలుకుటయు నప్పుడు పృథివ్యాదిభూతంబు లెలుంగు

1 ఇంకొక

లు వెలుంగ నెల్లవారును వినం దమతమనామంబు లెఱిం
గించి యిట్లనిరి. 161

క. "విను, ముత్తమురాలు సుమీ!
జననాయక! జనకతనయ; ♦ సందేహపడం
బని లేదు; మాకుఁ దెల్లము.
జనులకు మము మొఱఁగ రాదు ♦ సకలక్రియలన్."

వ. అనిన యనంతరంబ సకలసురమునిగణసహితంబుగాఁ బితా
మహుండు సనుదెంచి రాఘవుచేత నమస్కృతుం డై యి
ట్లనియె; "నయ్యా! నీవు సకలభూతదుస్సహుం డైనరా
వణుం బరిమార్చి లోకహితంబు సేసితివి; వినుము. నల
కూబరుశాపంబునం జేసి దశగ్రీవునకుఁ బరస్త్రీలయందు
బలాత్కారంబు సెల్లదు గావున, నీధర్మపత్ని యొండొక్క
దురితంబునుం బొరయదు. నీవు నిర్విచారుండ వై యప్పతి
వ్రతం బరిగ్రహించి నెమ్మదిఁ బురంబున కరుగు" మని
పలికి, యతనికిఁ బ్రియంబుగాఁ దత్సమరనిహతు లైనవా
నరులఁ బ్రాప్తజీవులం గాఁ జేసి పరమేష్ఠి సనియెఁ; బురం
దరసారథియును దాశరథి వీడ్కొని హరిసహస్రయుక్తం
బయినరథంబు గైకొని నాకలోకంబున కరిగె నంత. 163

మ. అవిరోధంబున జానకీసహితుఁ డై ♦ యాబద్ధరత్నప్రభా
నవపుష్పం బగుపుష్పకం బనువిమా♦నంబెక్కి యర్కాన్వ
య । ప్రవరుం డిమ్ముల నేఁగె సమ్మదభర♦ ప్రాగ్భారవా

రాకరప్లవమానుం డగుచుం బురంబునకుఁ బాని ♦ ప్రశ్రీ
ంశేషోన్నతిన్. 164

ఇట్లరిగి భరతాదిబంధుజనంబులు నఖిలపరిజనంబులు నభినందింప వసిష్ఠవామదేవాదివిహితం బైనయభిషేకశోభనంబు వహించి, రాముండు సుగ్రీవ విభీషణాది సుహృజ్జనంబులను ఋక్షవానరబలంబులను బ్రకటబహుమానవిశేషంబుల నాదరించి వీడ్కొలిపి యభిమతభోగంబుల నిరంతత్యాగంబులఁ బ్రభూతయాగంబులఁ బ్రసిద్ధుం డయి బహుసహస్రవత్సరంబులు వసుమతీరక్షణం బాచరించె; నిది రాఘవు
చరిత్రంబు. 165

వారక యిట్లు పూని వన♦వాసనిరంతరదుఃఖమున్ మహా♦
వైరికృతాపకారదుర♦వస్థయు నోర్చి శుభంబు నొందఁడే!
యారఘురామునట్ల వసు♦ధాధిప! నీవును దుఃఖమింతయున్
సైరణసేసి పొందెదవు♦ సర్వమహీవలయాధిరాజ్యమున్."

ద్య. ఇది శ్రీశంకరస్వామిసంయమీశ్వరచరణసరోరుహ
ధ్యానానందసౌందర్యధుర్య శ్రీసూర్యసుకవినంభవ
శంభుదాసలక్షణాభిధేయ యెఱ్ఱయనామధేయ
ప్రణీతంబైన యరణ్యపర్వశేషంబు
నందలి రామోపాఖ్యానంబు
సర్గంబును సమాప్తము.

**UNIVERSITY OF HYDERABAD**
**LIBRARY**
T **HYDERABAD (A. P.)**

*Cl. No.* 294.5922 *Acc. No.* 28923
V55R **DATE DUE**

DURATION OF LOAN—Not later than the last date stamped below, failing which fine as per Library Rules will be charged.

| | | |
|---|---|---|
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |

UNIVERSITY OF HYDERABAD, LIBRARY

T Acc. No. 28923

Call No. 294.5922 V55R

Author [illegible]

Title [illegible]

UNIVERSITY OF HYDERABAD
LIBRARY
HYDERABAD (A. P.)

1. Books / Journals should be returned on the due date.

2. Borrowers are responsible for every book / journal taken by them and will be expected to pay for any book / journal damaged, defaced or lost.

**Help to keep the book fresh and clean**